27-4Pg1exHMNWJQE.qxdO/P:27-4Pg1exHMNWJQE.qxd 1/1/02 6:45 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

శ్రీకాకుళం

fb.com/vaartha Digital

Published from Srikakulam ,Visakhapatnam, Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupati, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem

27-4-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 86 పేజీలు: 16 వెల: 6.50

భారత్, న్యూజిలాండ్ మధ్య స్వేచ్ఛా వాణిజ్యం

రష్యా ఎరువుల ప్లాంట్‌పై ఉక్రెయిన్ దాడి

5లో



ఆదివారం అనంతపురంలో ఓ బంకు వద్ద బారులు తీరిన వాహనదారులు

## పెట్రోలు నో స్టాక్!

### బంకుల వద్ద బోర్డులు చూసి బావురుమంటున్న వాహనదారులు

### ఎన్టీఆర్ జిల్లాలోని 100 బంకుల్లో తీవ్రకొరత

### ట్యాంకర్ల కోసం ఎదురు చూపులు

**విజయవాడ,ఏప్రిల్ 26,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని వివిధ జిల్లాలోకల పలుచోట్ల డీజిల్ కొరత నెల కొంది.దీంతో పలు బంకులు మూతపడుతున్నాయి. విజయవాడలో డీజిల్ కొరత వల్ల విని యోగదారుల ఆందోళన చెందుతున్నారు. పెట్రోల్ బంకుల వద్ద వినియోగదారులు బారులు >>2

# ఇంధన సంక్షోభంలేదు



### పెట్రోలు బంకుల మూసివేతపై సిఎం చంద్రబాబు సమీక్ష

### సరఫరాలేక 10శాతం బంక్‌లు మూతపడినట్లు అధికారులు వెల్లడి

### తక్షణ చర్యలు తీసుకొని సమస్య పరిష్కరించాలని సిఎం ఆదేశం

**అమరావతి, ఏప్రిల్ 26 ప్రభాతవార్తప్రతినిధి:** ఇంధనం కోసం ఒక్క సారిగా పెట్రోలు బంకులపై వత్తిడి పెంచనవసరంలేదని ఏపీ సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. డిజిల్‌కు కొరత ఏర్పడుతుందనే భ యాన్ని ప్రజలు వదిలిపెట్టాలన్నారు.అవసరాలకు సరిపడ ఇంధనం అందించే దిశలో ప్రభుత్వం ప్రయత్నిస్తుందని స్పష్టంచేసారుజ. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ సరఫరా కొరతతో బంకుల మూసివేతపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష చేశారు. ముంబై నుంచి ఉదయం అమరావతికి బయలుదేరే ముందు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తో పాటు ఉన్నతాధికారులతో సీఎం టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాల వారీగా ప్రస్తుత పరిస్థితిని అధికారులు సీఎంకు వివరించారు. రాష్ట్రంలో మొత్తం 4,510 అవుట్ లెట్స్ (పెట్రోల్ బంకులు) ఉండగా పెట్రోల్, డీజిల్ కొరత కారణంగా దాదాపు 421 బంకులు మూతపడ్డాయని తెలిపారు. సరఫరా గతం కంటే 10 శాతం పెరిగినా ప్యానిక్ కొనుగోళ్ల కారణంగా అనేక బం కుల్లో రద్దీ కనిపిస్తోందని అధికారులు తెలిపారు. సాధారణ రోజుల్లో రోజుకు 6,330 కిలో లీటర్ల పెట్రోల్, 9048 కిలో లీటర్ల డీజిల్ అమ్మకాలు జరుగుతాయని, అయితే కొరత ఉందనే ఆందోళనతో కొనుగోళ్లు భారీగా పెరిగాయని అధికారులు తెలిపారు. శనివారం రోజు 10,345 కి.లీ పెట్రోల్, 14,156 కి.లీ డీజిల్ అమ్మకం జరిగినట్లు అధికారులు వివరించారు. సాధారణ అమ్మకం కంటే ఒక్క సారిగా 50 శాతం అమ్మకాలు పెరగడంతో బంకుల్లో నిల్వలు అయిపోతున్నాయని అధికారులు వివరించారు. ప్యానిక్ కొనుగోళ్ల కారణంగా సరఫరా పెరిగినా వినియోగదారులు అనే చోట్ల బారులు తీరి కొనుగోళ్ల కోసం ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఆక్వా రంగంలో డ్రమ్‌లలో కొనుగోళ్లు జరుపుతారని, వారికి పెట్రో ఉత్పత్తులు విక్రయించే విషయంలో సమస్య తలెత్తుతోందని అధికా రులు తెలిపారు. దీనికి పరిష్కారం చూపేందుకు కలెక్టర్లు, ఫిషరీష్ శాఖ అధికారులు వెంటనే కార్యాచరణ అమలు చేయాలని సీఎం అధికారులను అదేశించారు. ప్రభుత్వ శాఖలు తీసుకున్న చర్యలు, సమస్య పరిష్కారంపై సాయంత్రంలోగా తనకు నివేదిక ఇవ్వాలని సీఎం అధికారులను అదేశించారు.

#### డీజిల్, పెట్రోల్ కొరత లేదు: మంత్రి నాదెండ్ల

**విజయవాడ:** రాష్ట్రంలో డీజిల్, పెట్రోల్ కొరత లేదని,ఈ విషయంలో పుకార్లను నమ్మవద్దని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహార్ స్పష్టం చేసారు. వినియోగదారులు ఈ విషయంలో ఆందోళన పడవద్దని హెచ్చరించారు,రాష్ట్రంలో డీజిల్, పెట్రోల్ పరిస్థితిపై మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్లు, ఆయిల్ కంపెనీల ప్రతి నిధులు పాల్గొన్నారు. రాష్ట్రంలో డీజిల్, పెట్రోల్ కొరత లేదు. సరఫరాలో వచ్చిన చిన్నపాటి లోపాలు వల్లే బంకులు మూతపడు తున్నాయి. ఇంధనానికి ఎలాంటి లోటు లేదు, ఆందోళన అవసరం లేదు. సమాచార, ప్రసార మాధ్యమాల్లో ఎప్పటికప్పుడు వివరాలు తెలపాలి. క్షేత్రస్థాయిలో ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే పరిష్కరించుకోవాలి. పలు చోట్ల కొందరు వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. చట్ట విరుద్ధంగా బ్లాక్ మార్కె టింగ్‌కు పాల్పడితే కఠినంగా చర్యలు. వాహనదారుల్లో భయాందోళ >>2

## ఐరోపా పర్యటనకు మాజీ సిఎం జగన్



**విజయవాడ,ఏప్రిల్ 26,ప్రభాతవార్తప్రతినిధి:** వైఎస్సార్‌సీపీ అధినేత, ఆంధ్ర ప్రదేశ్ మాజీ ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి యూరప్(విదేశీ) పర్యటనకు బయలుదేరారు. తన కుటుంబ సభ్యు లతో కలిసి యూరప్‌లోని పలు దేశాలను సందర్శించేందుకు ఆయనకు సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం అనుమతిని ఇచ్చింది. వాస్తవానికి ఈనెల 20వ తేదీ నుంచే పర్యటన ప్రారంభం కావాల్సి ఉన్నప్పటికీ కొన్ని అనివార్య కారణాల వల్ల ఐదు రోజులు ఆలస్యంగా అంటే శనివారం (ఆదివారం తొలి గంటలు) అర్ధరాత్రి దాటిన తరువాత ఆయన బెం గళూరు విమానాశ్రయం నుంచి విదేశాలకు ప్రయాణమయ్యారు. కోర్టు ఇచ్చిన గ్రీన్ సిగ్నల్ ప్రకారం మే 15వ తేదీ వరకు ఆయన యూరప్‌లో గడపనున్నారు. ఈ పర్యటనలో జగన్మోహన్ రెడ్డిడ్రెస్సింగ్ స్టైల్ అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. సాధారణంగా ఏపీలో రాజకీయ కార్యక్రమాల్లో ఉన్నప్పుడు వైట్‌షర్ట్, ఖాకీ లేదా గోధుమ >>2

## సైబర్ సెక్యూరిటీ శిక్షణలో మంత్రులు

### కొనసాగుతున్న సింగపూర్ పర్యటన

**విజయవాడ ఏప్రిల్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీ మంత్రుల పర్యటన సింగపూర్‌లో ఆరో రోజు కొనసాగుతోంది. టేబుల్ టాప్ ఎక్సర్‌సైజ్ విధానంపై మంత్రులకు శిక్షణ కార్యక్రమి నిర్వహించారు. క్లిష్ట పరిస్థితుల్లో సమస్య వస్తే బృందంగా స్పందించే విధానంపై చర్చించారు. సైబర్ సెక్యూరిటీ ,డేటా లీక్, భద్రతా లోపం, పాత్రల కేటాయింపు, సమస్యల పరిష్కారం, నిర్ణయాలు తీసుకోవడంపై మంత్రులకు శిక్షణ ఇచ్చారు. లోపాలను ఎలా గుర్తించాలన్నదానిపై మంత్రులకు డాక్టర్ ప్రవీణ్ కుమార్ వివరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అచ్చెన్నాయుడు, వంగలపూడి అనిత, అనగాని సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఆసియాకు గేట్‌వే విశాఖి



విశాఖలో ఏర్పాటు కానున్న మెగా డేటా సెంటర్ ఉహాచిత్రం

### 1.35లక్షల కోట్లతో మెగా డేటా సెంటర్

### గూగుల్ ఆధ్వర్యంలో భారీ సాంకేతిక కేంద్రాలు

### ఎఐ హాబ్‌కు 28న సిఎం చంద్రబాబు భూమిపూజ

**విజయవాడ,ఏప్రిల్ 26,ప్రభాతవార్తప్రతినిధి:** ఐటీరంగంలో అద్భుతాలు సాధిస్తున్న గూగుల్ రూ.లక్షా 35 వేల కోట్లతో విశాఖలో ఏర్పాటు చేస్తున్న మెగా డేటా సెంటర్, ఏఐ హబ్‌కు ముఖ్యమంత్రి చంద్ర బాబు ఈ నెల 28న భూమి పూజ చేయనున్నారు. విశాఖలో గూగుల్ ఏర్పాటు చేసేది కేవలం డేటా సెంటర్ కాదు! అదో ఏఐ మెగా హబ్! ఇక్కడ డేటా సెంటర్‌తో పాటు వివిధ సంస్థలకు ఏఐ ఆధారిత కంప్యూటింగ్ సేవలు అందించే మౌలిక వసతులు, భారీ ఎత్తున డేటా స్టోరేజీ, అత్యంత వేగవంతమైన కమ్యూనికేషన్ సదుపాయాలు వంటివి ఏర్పాటవుతాయి. ఇది ఓ ఇంటిగ్రేటెడ్ ప్రాజెక్టు. సముద్ర గర్భంలో వేసే కేబుళ్లతో అభివద్ధి చేసే ఇంటర్నేషనల్ సబ్‌సీ గేట్‌వేతో వివిధ దేశాలతో అనుసంధానం ఏర్పడుతుంది. గూగుల్ క్లౌడ్ ఏఐకి సంబంధించి మొత్తం ఆసియాకే విశాఖ గేట్‌వేగా మారనుంది. ఏపీ సమాచార,పౌరసంబంధాల శాఖ, సీఎంవో ద్వారా లభించిన వివరాలను అనుసరించి విశాఖ, అనకాపల్లి జిల్లాల పరిధిలో గూగుల్ సంస్థ ఒక గిగావాట్‌కుపైగా సామర్థంతో మూడు చోట్ల డేటా సెంటర్లు ఏర్పాటు చేస్తోంది. వీటి కోసం రాష్ట్ర ప్రభుత్వం తర్లువాడతో 266.6 ఎకరాలు, అడవివరంలో 160 ఎకరాలు, అనకాపల్లి జిల్లా రాంబిల్లి వద్ద 174.80 ఎకరాలు కేటాయించింది. 2028 నాటికి ఈ మూడు డేటా సెంటర్లను పూర్తి చేయాలన్నది గూగుల్ లక్ష్యం. తొలిదశలో తర్లువాడలో ఏర్పాటు చేస్తున్న డేటా సెంటర్‌కు సీఎం చంద్రబాబు ఈ నెల 28న శంకుస్థాపన చేస్తున్నారు. వైజాగ్ మెగా డేటా పార్క్ లిమిటెడ్ పేరుతో ఏర్పాటు చేస్తున్న ఈప్రాజెక్టుకు అదానీ సంస్థ మౌలిక వసతుల భాగస్వామిగా ఉంది.గూగుల్ మెగా డేటా సెంటర్ ప్రకటనతో యావత్ ప్రపంచం దృష్టిని విశాఖ ఆకర్షించింది. డేటా సెంటర్‌తో విశాఖ రూపురేఖలు మారిపోతాయని స్వయంగా గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ 2025 అక్టోబర్‌లో అమెరికాలోని సిలికాన్ వ్యాలీలో జరిగిన ఓ కార్యక్రమంలో పేర్కొన్నారు. గూగుల్ డేటా సెంటర్ ఐటీ, టెక్నాలజీ రంగంలో విశాఖకు పెట్టుబడులు తరలిరావడానికి, ఆ ఎకోసిస్టమ్ ఏర్పడేందుకు, పెట్టుబడిదారుల్లో నమ్మకం పెంచేందుకు పటిష్ఠమైన దారులు పరచనుంది. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు ప్రకటన తర్వాత రిలయన్స్, బ్రూక్‌ఫీల్డ్ సంస్థలు కూడా విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటుకు ముందుకొచ్చాయి. మరిన్ని ఐటీ ,ఏఐ, క్లౌడ్, సెమీకండక్టర్ కంపెనీలు విశాఖకు తరలివచ్చేందుకు గూగుల్ డేటా సెంటర్ దోహదం చేస్తుందన్నది నిపుణుల అభిప్రాయం. గూగుల్‌తో పాటు దాని ఆధారంగా ఏర్పాటయ్యే కంపెనీల్లో కలిపి లక్షా 88 వేల దాకా ఉద్యోగావకాశాలు వస్తాయని అంచనా. అటు డేటా సెంటర్ల నిర్మాణ సమయంలో మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్ వంటి రంగాలకు చెందిన నిపుణులు, నిర్మాణరంగ కార్మికులకు అందరికీ కలిపి సుమారు 60 వేలమందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నది నిపుణుల ఆలో చన. ఏఐ మోడల్ డెవలప్‌మెంట్‌కు కావాల్సి న >>2



ఆదివారం విద్యుత్ ఉపకేంద్రం శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసి చైర్మన్ కొనకళ్ళ తదితరులు

## నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్

### -మంత్రి కొల్లు రవీంద్ర

**హనుమాన్‌జంక్షన్ (కృష్ణా), ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** రాష్ట్రవ్యాప్తంగా గృహావసరాలకు, పారిశ్రామిక అవసరాలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పలు చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర ఎక్సైజ్ శాఖామంత్రి కొల్లు రవీం ద్ర తెలిపారు. కృష్ణా జిల్లా కేంద్రమైన మచిలీపట్నం బచ్చుపేటలో రూ.6.30కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణానికి ఆర్టీసి చైర్మన్ కొనకళ్ళనారాయణతో కలిసి ఆదివారం ఉదయంమంత్రి శంకుస్థాపన >>2

# ఉడుకుతున్న భారతం



### మూడురోజులు తీవ్రస్థాయి వడగాడ్పులు

### కొన్ని ప్రాంతాలలో ఉష్ణోగ్రత 45° దాటేప్రమాదం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 26:** ఉత్తర భారతావనితోపాటు దేశవ్యాప్తంగా పలు ప్రాంతాలలో రానున్న మూడు రోజులు సాధారణం కంటే గరిష్టస్థాయిలో పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని భారతవాతావరణ శాఖ (ఐఎమ్‌డి) అంచనా వేసింది. ఢిల్లీ, ఛత్తీస్‌గఢ్, హర్యానా, చండీగఢ్, మధ్య ప్రదేశ్, పంజాబ్, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్, విదర్భలోని కొన్ని ప్రాంతాలలో వడగాలుల పరిస్థితుల కోసం పసుపు హెచ్చరిక జారీ చేసింది. అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, మేఘాలయ, ఉపహిమాలయ, పశ్చిమ బెంగాల్, సిక్కింలో అక్కడక్కడ తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఉత్తర అంతర్గత కర్ణాటకలో ఉరుములు, వడగళ్ల వానలు కురిసే అవకాశం ఉంది. వాతావరణ సంస్థ ప్రకారం, బీహార్, గంగానది పశ్చిమ బెంగాల్, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ మరియు కాశ్మీర్, లడఖ్, జార్ఖండ్, కేరళ,మాహే, మరాఠ్వాడా, ఉత్తరాఖండ్, ఒడిశాలోని కొన్ని ప్రాంతాలలో కూడా ఉరుములు, మెరుపులు సంభవించే అవకాశం ఉంది. బీహార్, కోస్తా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, గుజరాత్, గంగానది పశ్చిమ బెంగాల్, కేరళ, మాహే, కొంకణ్, గోవా, మణిపూర్‌లోని కొన్ని ప్రాంతాలలో వేడి, తేమతో కూడిన వాతావరణ పరిస్థితులు నెలకొని ఉంటాయి. ఐఎండి ప్రకారం, రాబోయే 2రోజులలో ఢిల్లీ, హర్యానా, చండీగఢ్, పంజాబ్, ఉత్తర ప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలలో రాత్రిపూట వెచ్చని వాతావరణం ఉంటుంది. ఏప్రిల్ 27 నుండి 30 మధ్య వాయువ్య, తూర్పు, ఈశాన్య భారతదేశంలోని కొన్ని ప్రాంతాలలో ఉరుములతో కూడిన వర్షాలు కురుస్తాయని >>2



### ట్రంప్ విందులో

## కాల్పుల కలకలం

2లో

### వాషింగ్టన్ హిల్టన్ హోటల్‌లో అలజడి

### సురక్షితంగా బయటపడిన అధ్యక్షుడు

### అది రాజ్యాంగంపై జరిగిన దాడి: ట్రంప్

## కూలిన ఆర్వోబి డెకింగ్



### గాజువాక సమీపంలో దుర్ఘటన

### ఏడుగురికి గాయాలు

**గాజువాక,ఏప్రిల్ 26,ప్రభాతవార్త:** నిర్మాణంలో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జ్ (ఆర్వోబీ) డెకింగ్ ఒక్కసారిగా కుప్పకూలడంతో ఏడుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమయంలో ఎక్కువ మంది కార్మికులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. గాజువాక సమీపంలోని తుంగలం వద్ద ఆదివారం జరిగిన ఈ ప్రమాదం తీవ్ర కలకలం స్రుష్టించింది.స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం గాజువాక పోలీస్టేషన్ పరిధి జీవీఎంసీ 69వ వార్డు తుంగలం >>2

# కృత్రిమ కొరతపై కేసులేవి!

**ప్రభాతవార్త, ఏప్రిల్ 26, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా బ్యూరో :** వినియోగానికి సరిపడా డీజిల్ నిల్వలు ఉన్నాయంటూ అధికారుల భరోసా ఒకపక్క, నో స్టాక్ బోర్డులు, పంపు రిపేర్లు అంటూ బంకు యజమానుల తమాషా మరోపక్క వెరసి సామాన్యులకూ రైతులకు చుక్కలు చూపిస్తున్నారు. ఇరాక్ యుద్ధ నేపథ్యంలో నెలకొన్న పరిస్థితులు ప్రపంచమంతా దాని ప్రభావం చూపిస్తున్నాయి. ప్రధానంగా ఇరాన్, మిడిల్ ఈస్ట్ దేశాల చమురు మీద ఆధారపడ్డ దేశాల్లో చమురు కొరతలు ఉన్నాయని అంతర్జాతీయ వార్తల ద్వారా తెలుస్తోంది. ఈ క్రమంలో భారతదేశంలో కూడా చమురు కొరత తీవ్రంగా ఉందని జరుగుతున్న పరిస్థితుల దృష్ట్యా ఒప్పుకోక తప్పదు. అసలే వేసవికాలం.. పైగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో వరి కోతలు మధ్యలో ఉన్న పరిస్థితులు, పూర్తికాని ధాన్యం మాసూళ్ళు,



### నిల్వలు ఉన్నాయంటున్న అధికారులు

### బ్లాక్ మార్కెట్టుకు తరలిపోతున్న డీజిల్

### రైతులకు నాయకుల భరోసా ఎక్కడ!

వరి కోత యంత్రాలు ధాన్యాన్ని మిల్లులకు చేరవేసే ట్రాక్టర్లు, ట్రక్కులు, ఆక్వా రైతులు తమ చెరువుల్లో చేయాల్సిన నీటి సరఫరా, కృత్రిమ ఆక్సిజన్ సృష్టించడానికి ఇంజన్లు ఉపయోగించే పనులు, నివాసిత ప్రాంతాల్లో జనరేటర్ల అవసరం, ఇవి కాక నిత్యవసర వస్తువుల రవాణా వంటి తప్పనిసరి కార్యకలాపాలకు ఉపయోగించే డీజిల్ ప్రస్తుతం సామాన్యులకు, రైతులకు అందు బాటులో లేకపోవడం ఆందోళన కలిగిస్తుంది. ఒక ప్రక్క రోజువారి వినియోగానికి అవసరమైన డీజిల్ నిల్వలు అన్ని ప్రాంతాల్లో ఉన్నాయని జిల్లా స్థాయి అధికారులు భరోసా ఇస్తున్నప్పటికీ వాస్తవ పరిస్థితుల్లో అందుకు భిన్నంగా ఉన్నాయి. శుక్రవారం వరకు అరకొర స్థాయిలో డీజిల్ అందించినప్పటికీ శనివారం నుంచి జిల్లా స్థాయిలో 80 శాతంపెట్రోల్ బంకుల్లో డీజిల్ నిల్వలు లేవని బంకు >>2



అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌పై కాల్పులు జరిపిన కోల్ థామస్ అలెన్

# ట్రంప్ విందులో కాల్పుల కలకలం

**వాషింగ్టన్, ఏప్రిల్ 26:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాల్గొన్న ఓ కార్యక్రమంలో కాల్పులు జరగడం, ఆ వెంటనే ఇరాన్‌తో కీలకమైన శాంతి చర్చలను ఆయన రద్దు చేయడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. వాషింగ్టన్‌లోని హిల్టన్ హోటల్‌లో శనివారం జరిగిన వైట్‌హౌస్ కరెస్పాండెంట్స్ అసోసియేషన్ వార్షిక విందులో ఈ కాల్పుల ఘటన చోటుచేసుకుంది. ఈ దాడి నుంచి ట్రంప్ సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటన ఇరాన్‌పై యుద్ధంలో విజయం సాధించకుండా తనను ఏమాత్రం ఆపలేదని ట్రంప్ స్పష్టం చేశారు. ఇది ఇరాన్‌తో దాదాపు రెండు నెలలుగా జరుగుతున్న యుద్ధానికి సంబంధించిన ఘటన కాదని తాను భావిస్తున్నట్లు తెలిపారు. 31 ఏళ్ల కోల్ థామస్ అలెన్ అనే వ్యక్తి ఈ దాడికి పాల్పడినట్లు గుర్తించారని, నిందితుడు పలు ఆయుధాలతో భద్రతా పాయింట్ వైపు దూసుకొచ్చాడని ట్రంప్ వివరించారు. ఒక సీక్రెట్ సర్వీస్ ఏజెంట్‌పై కాల్పులు జరపగా, బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్ అతడిని కాపాడిందని తెలిపారు. ఈ ఘటనతో విందును రద్దు చేశారు. మరోవైపు ఇరాన్‌తో శాంతి చర్చల కోసం పాకిస్థాన్‌కు వెళ్లాల్సిన తన రాయబారుల పర్యటనను కూడా ట్రంప్ రద్దు చేశారు. తనపై జరిగిన కాల్పుల సంఘటనను అమెరికా రాజ్యాంగంపై జరిగిన దాడిగా డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఘటన గురించి ట్రంప్, ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాష్ పటేల్ వివరాలను వెల్లడించారు. నిందితుడి వద్ద అనేక ఆయుధాలు ఉన్నాయని ట్రంప్ చెప్పగా ఘటనా స్థలంలో ఒక లాంగ్ గన్, తుపాకీ షెల్స్ లభ్యమైనట్లు కాష్ పటేల్ ధృవీకరించారు. నిందితుడి వద్ద ఉన్న ఆయుధాల గురించి మరిన్ని వివరాలు ప్రస్తుతం అందుబాటులో లేవని చెప్పారు. ఈ ఘటనపై ట్రంప్ స్పందిస్తూ తాను ఎంతో పదునైన ప్రసంగాన్ని సిద్ధం చేసుకున్నానని, ప్రస్తుత పరిస్థితులవల్ల తదుపరి కార్యక్రమంలో తన ప్రసంగం చాలా ప్రశాంతంగా ఉంటుందని తెలిపారు. తాను ప్రసంగించడానికి సర్వసన్నద్ధంగా ఉన్నానని, కానీ భద్రతాకారణాల దృష్ట్యా వచ్చేసారి చాలా సాదాసీదాగా వ్యవహరిస్తానని ట్రంప్ చెప్పారు. ఈ విపత్కర పరిస్థితులు ఎదురైనప్పటికీ, భవిష్యత్తులో తాము ఒక గొప్ప కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆయన అన్నారు. వైట్ హౌస్ కరస్పాండెంట్స్ అసోసియేషన్ డిన్నర్ వేదికపైనే ఉండాలని తాను గట్టిగా ప్రయత్నించానని, కానీ భద్రతాబలగాల సూచన మేరకు వెనక్కి తగ్గాల్సి వచ్చిందని చెప్పారు. ఈ కాల్పుల ఘటన ప్రథమ మహిళ మెలానియా ట్రంప్‌ను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని అన్నారు. భద్రతా సిబ్బంది అత్యంత వేగంగా స్పందించిన తీరును ఆయన అభినందించారు. సీక్రెట్ సర్వీస్ అద్భుతంగా స్పందించిందని, కాల్పులు జరిపిన వ్యక్తిని సీక్రెట్ సర్వీస్‌కు చెందిన కొందరు అదుపులోకి తీసుకున్నారని ట్రంప్ వెల్లడించారు. ఘటనలో పారదర్శకత, స్పష్టత కోసం తాను విడుదల చేయమని ఆదేశించిన ఒక టేప్‌ను ఇప్పుడే అధికారులు విడుదల చేశారని తెలిపారు. త్వరలోనే కరస్పాండెంట్స్ డిన్నర్ మీట్‌ను తిరిగి నిర్వహిస్తామని చెప్పారు.

# థాకరే శివసేనలో లుకలుకలు.. మరో చీలిక సంకేతాలు..



**ముంబై, ఏప్రిల్ 26:** మహారాష్ట్ర మాజీ సీఎం, శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ థాక్రే మరో చీలిక ఎదురొంటుందన్న సంకేతాలు పార్టీఅగ్రనే తలకు అందుతున్నాయి. ఆయన పార్టీకి చెందిన కొందరు ఎంపీలు బీజేపీ నేతలతో సమావేశం కావడం అనుమానాలను పెంచుతోంది. మరాఠ్వాడా ప్రాంతంలో ఆ పార్టీకి చెందిన ప్రముఖ నేత, మూడుసార్లు లోక్‌సభ ఎంపీగా ఎన్నికైన సంజయ్ జాదవ్, ముంబైలోని ఉద్ధవ్ థాక్రే నివాసమైన మాతోశ్రీలో జరిగిన ముఖ్య సమావేశానికి గైర్హాజరయ్యారు. అలాగే సేనా భవన్‌లో ఏర్పాటు చేసిన పార్టీ కార్యవర్గ సభ్యుల మరో సమావేశానికి కూడా ఆయన హాజరు కాలేదు. దీంతో సంజయ్ జాదవ్ గైర్హాజరు పార్టీ వర్గాల్లో ఆందోళనలు రేకెత్తించింది. అప్పటి నుంచి ఆయన అందుబాటులో లేరని పార్టీ వర్గాలు తెలిపాయి. శివసేన (యూబీటీ)కి చెందిన హింగోలి నియోజకవర్గం ఎంపీ నాగేష్ పాటిల్ అష్టికర్, యవత్మల్‌వషీం నియోజకవర్గం ఎంపీ సంజయ్ దేశ్‌ముఖ్ కలిసి ఇటీవల కేంద్ర మంత్రి ప్రతాపరావు జాదవ్ ఢిల్లీలో ఇచ్చిన విందుకు హాజరయ్యారు. ఆ తర్వాత కొన్ని రోజులకే కేంద్ర హోంమంత్రి అమిత్ షాను సంజయ్ జాదవ్ ఢిల్లీలో కలిసినట్లు వార్తలు వచ్చాయి. దీంతో ఏదో రాజకీయ మంతనాలు జరుగుతున్నాయన్న ఊహాగానాలకు మరింత బలం చేకూరింది.

మరోవైపు శివసేన (యూబీటీ) అగ్రనాయకత్వం, ఆ పార్టీ ఎంపీల మధ్య సమన్వయం లేనట్లు తెలుస్తున్నది. దీని పట్ల కొందరు ఎంపీలు ఆందోళన వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ పేలవ ప్రదర్శనకు ఇది కారణమని వారు భావిస్తున్నారు. ఈ క్రమంలో కొందరు ఎంపీలు ఇతర పార్టీల వైపు చూస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. తాజాగా ఈ ముగ్గురు ఎంపీలు బీజేపీలో చేరతారన్న ప్రచారం జోరందుకుంది. ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలో జరిగిన తిరుగుబాటు శివసేనను చీల్చిన మాదిరిగా నాలుగేళ్ల తర్వాత శివసేన (యూబీటీ)లో మరో చీలిక రావచ్చన్న అనుమానాలు పెరిగిపోయాయి.



# నాయకత్వ మార్పుపై హైకమాండ్ నిర్ణయానికే కట్టుబడి ఉంటాం..

## ఎయిర్‌పోర్టులో మీడియాతో డికెశివకుమార్

**బెంగళూరు, ఏప్రిల్ 26:** నాయకత్వ మార్పు అంశంపై కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నిర్ణయానికి తాను, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కట్టుబడి ఉంటామని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మరోసారి స్పష్టంచేసారు. పార్టీ నాయకత్వం సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుంటుందనే నమ్మకం తనకుఉందని అన్నారు. ఢిల్లీ నుంచి ఆదివారంనాడు బెంగళూరు విమానాశ్రయానికి చేరుకున్న డీకే కొద్దిసేపు మీడియాతో మాట్లాడారు. మే 4న నాలుగు రాష్ట్రాలు, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం కర్ణాటకలో నాయకత్వ మార్పు, మంత్రివర్గ విస్తరణ జరుగుతుందనే ఊహాగానాలు పెరిగాయి. గత రెండు రోజులుగా హస్తినలో డీకే ఉన్నారు. ఢిల్లీ పర్యటనలో అధిష్టానంతో జరిపిన చర్చలపై మీడియా ప్రశ్నించగా, సమయం వచ్చినప్పుడు మీకే తెలుస్తుందని, ఇప్పటికి చెప్పేదేమీ లేదని అన్నారు. పార్టీలో అంతర్గత విభేదాలున్నట్టు సీనియర్ మంత్రి సతీష్ జార్కిహోలి పేర్కొనడంపై అడిగినప్పుడు అలాంటిదేమీలేదని డీకే సమాధానమిచ్చారు. ప్రభుత్వం మూడేళ్ల పాలన పూర్తి చేసుకున్న తరుణంలో నాయకత్వ మార్పు జరిగే అవకాశాలపై అడిగినప్పుడు, ఈ అంశాన్ని తాను ఎప్పుడూ ప్రస్తావించలేదని, అధిష్టానం ఏ నిర్ణయం తీసుకున్నా తాను, ముఖ్యమంత్రి కట్టుబడి ఉంటామని చెప్పారు. మే 15న తన పుట్టినరోజున ఎవరూ రోడ్లపై బ్యానర్లు పెట్టడం కానీ, అడ్వర్‌టైజ్‌మెంట్లు కానీ ఇవ్వవద్దని డీకే కోరారు. రోడ్లపై ఎలాంటి ఇబ్బందులు కలిగించ వద్దని పార్టీ కార్యకర్తలను, అభిమానులకు విజ్ఞప్తి చేశారు. ఫ్లెక్సీలు పెట్టేవారిపై కేసులు పెట్టాలని, జరిమానాలు విధించాలని అధికారులను ఆదేశించనున్నట్టు చెప్పారు.

## రోడ్డుపై చెల్లాచెదురుగా నోట్లకట్టలు..

**లక్నో, ఏప్రిల్ 26:** ఒక రోడ్డుపై కరెన్సీ నోట్లు చెల్లాచెదురుగా పడి ఉండటాన్ని కొందరు వ్యక్తులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈలోపు ఆ రోడ్డుపై పడిన సుమారు రూ.4 లక్షల డబ్బును సేకరించారు. ఉత్తర ప్రదేశ్‌లోని షామ్లీ జిల్లాలోని మీరట్‌కర్నాల్ జాతీయ రహదారిలో బైక్‌పై వెళ్తున్న వ్యక్తి బ్యాగు నుంచి నోట్ల కట్టలు రోడ్డుపై పడ్డాయి. సుమారు అర కిలోమీటరు వరకు రూ.500, రూ. 200 నోట్లు చెల్లాచెదురుగా కనిపించాయి. దీనిని గమనించిన ఒక వ్యక్తి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో పోలీసులు అక్కడకు చేరుకున్నారు. రోడ్డుపై చెల్లాచెదురుగా పడి ఉన్న నోట్లను సేకరించారు. వాటిని లెక్కించగా రూ.4 లక్షలుగా తేలింది.

# ఇంధన సంక్షోభంలేదు

>> నలతో సరఫరా చైన్ దెబ్బ తినకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఆయిల్ డిపోల్లో జిల్లా అధికారులు నిత్య పరిశీలన చేయాలి. ప్రైవేటు ఆయిల్ కంపెనీల డిపోలు, అవుట్‌లెట్‌లనూ తనిఖీలు చేయాలి. భయాందోళనతో గొడవలు జరగకుండా పోలీసులతో సమన్వయం చేసుకోవాలి." అని మంత్రి నాదెండ్ల తలిపారు. ఇబ్బందిసమయంలో కంపెనీలు సమర్థంగా పనిచేయాలని కొరత సృష్టించి వినియోగదారులకు అసౌకర్యం కలిగించడం తగదని మంత్రి నాదెండ్ల తెలిపారు. ఎక్కడా సరఫరాలో సమస్యలు లేకుండా చూడాలని సరఫరా విషయంలో కొన్ని ఇబ్బందులు తలెత్తాయని చెప్పారు. అధిగమించాల్సిన బాధ్యత కంపెనీలపై ఉందని చమురుకంపెనీల డిపోల వద్దకు వెళ్లి జేసీలు తనిఖీ చేయాలని ఆదేశించారు. సరఫరాలో ఎక్కడా ఆలస్యం లేకుండా పర్యవేక్షించాలని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.

# పెట్రోలు నో స్టాక్!

>> తీరారు. ఎన్టీఆర్ జిల్లాలో డీజిల్, పెట్రోల్ స్టాక్ రావడంతో వినియోగదారులు బారులు తీరారు. ఎన్టీఆర్ జిల్లాలోని 100 బంకుల్లో నో స్టాక్ బోర్డులు ఏర్పాటు చేశారు. తిరువూరు, కంచికచర్లలోని బంకుల వద్ద కొరతతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నందిగామ, మైలవరం వద్ద ఇంధన కొరతతో వినియోగదారుల ఇబ్బందులు పడుతున్నారు. మైలవరం మండలంలోని 7 బంకుల్లోనూ డీజిల్ కొరత నెలకొంది. చమురు కంపెనీల నుంచి సరిపడా ట్యాంకర్లు రాక, పెట్రోల్ బంకు యజమానులు ఆందోళన చెందుతున్నారు. ధరలు పెరుగుతాయనే కారణంతో కొన్నిచోట్ల నో స్టాక్ బోర్డులు పెట్టారు. ఇంధన కొరత వ్యవసాయ, రవాణా రంగాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. పెట్రోల్ నిల్వలు సమృద్ధిగా ఉన్నా డీజిల్ కొరత వేధిస్తోంది. వాహనదారుల నుంచి వరి, ఆక్వా రైతుల వరకు డీజిల్ కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి గోదావరి జిల్లాల్లో వరి కోతలు జోరుగా సాగుతున్నాయి. ఈ సమయంలో డీజిల్ దొరక్క రైతులు ఇబ్బందిపడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని బంకుల్లో స్టాక్ లేక కోత యంత్రాలు షెడ్లకే పరిమితమయ్యాయి. ప్రస్తుతం వరి కోతలు ముమ్మరంగా సాగుతున్న సమయంలో కోత యంత్రాలకు అవసరమైన డీజిల్ అందుబాటులో లేకపోవడంతో వరి కోతలను మధ్యలోనే నిలిపివేసే పరిస్థితి ఏర్పడింది. ఆటోలు కూడా పక్కన పెట్టేశారు. యానాంకు సరఫరా అవుతున్న ఒకటి రెండు ట్యాంకర్లు డీజిల్ కోసం రైతులు పెట్రోల్ బంకులు వద్ద పడికాపులు కాస్తున్నారు. ఆయిల్ కంపెనీలు అనుసరిస్తున్న కొత్త విధానాలే ఈ సంక్షోభానికి కారణమని డీలర్లు అంటున్నారు. గతంలో ఒక్కో బంకుకు పూర్తి ట్యాంకర్‌ను నింపే ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఇప్పుడు 4 వేల లీటర్ల ట్యాంకర్‌ను 4 బంకులకు సర్దుబాటు చేస్తోందని చెబుతున్నారు. సరఫరా సంస్థలు నిల్వలు లేవని చెప్తున్నాయని ఆ ఒత్తిడి తమపై పడుతోందని, వాహనదారులకు డీజిల్ అందించలేక పోతున్నామని డీలర్లు వాపోతున్నారు. ఆక్వా రంగాన్ని ఇంధన కొరత దెబ్బతీస్తోంది. రొయ్యల చెరువుల్లో ఆక్సిజన్ కోసం ఏరియేటర్లు తిరుగుతుంటాయి. కరెంటు లేని సమయంలో డీజిల్ జనరేటర్లే వీటికి ఆధారం. డీజిల్ దొరక్క రొయ్యల పంటలు దెబ్బతింటున్నాయని రైతులు తలలు పట్టుకుంటున్నారు. బస్సులు, లారీలు, ట్రక్కులు, ఆటోలు కార్ల యజమానులు డీజిల్ కొరతతో ఇబ్బందిపడుతున్నారు. సరఫరా లేదంటూ కొన్ని బంకుల వద్ద నో స్టాక్ బోర్డులు పెట్టారు. వారం రోజులుగా తిరుగుతున్నా డీజిల్ దొరకడం లేదని వాహనదారులు వాపోతున్నారు.

అనంతపురం జిల్లా తాడిపత్రిలో పెట్రోల్, డీజిల్ కొరతతో వాహనదారులు ఇబ్బం దులకు గురవుతున్నారు. పట్టణంలోని పలు బంకుల వద్ద నో స్టాక్ బోర్డులు దర్శనమి స్తున్నాయి. డీజిల్ లేక ఆటోలు, భారీ వాహ నాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. కొన్ని బం కుల్లో అరకొరగా పెట్రోల్ సరఫరా చేస్తున్నారు. దీంతో గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. ఇంధన కొరతతో నిత్యావ సరాల రవాణాకూ ఇబ్బందులు తలెత్తుతు న్నాయి. అధికారులు స్పందించి తక్షణం డీజిల్, పెట్రోల్ అందుబాటులోకి తేవాలని వాహనదారులు, ఆటో డ్రైవర్లు కోరుతున్నారు.

## తిరుమలలో ఇంధన కొరత రానివ్వం: టిటిడి

**తిరుమల,ఏప్రిల్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో ఇంధన కొరత రానీయకుండా చూస్తామని భక్తులకు టీటీడీ స్పష్టం చేసింది. ఆదివారం తిరుమలలోని హెచ్.పి, మరియు ఐఓసీఎల్ పెట్రోల్ బంకుల్లో పెట్రోల్ అయిపోవడంతో మధ్యాహ్నం సదరు బంకుల్లో నోస్టాక్ బోర్డులను పెట్టడం జరిగింది. సాయంత్రానికి హెచ్.పి. పెట్రోల్ బంక్ కు ట్యాంకర్ చేరుకోవడంతో ఇంధనం అందుబాటులోకి వచ్చింది. రేపు ఉదయానికి ఐఓసీఎల్ పెట్రోల్ బంక్‌కు కూడా ట్యాంకర్ చేరుకుంటుందని తెలియజేసారు. టీటీడీ అదనపు ఇఒ సి.హెచ్.వెంకయ్య చౌదరి తిరుమలలోని పెట్రోల్ బంకుల్లో ఇంధన కొరత రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని డీలర్లను కోరారు. కోరడం జరిగింది.

# కృత్రిమ కొరతపై కేసులేవి!

>> యాజమాన్యం చెబుతున్నారు. ఇందుకు గుర్తుగా నో స్టాక్ బోర్డులు, కొన్నిచోట్ల పంపు రిపేర్లు అని బోర్డులో దర్శనమిస్తున్నాయి. వాస్తవానికి పెట్రోలు నిల్వలు ఉన్నప్పటికీ డీజిల్‌తో పాటు పెట్రోల్ కూడా బ్లాక్ మార్కెట్కు తరలించే ఆలోచనతో చాలాచోట్ల బంకులను మూసివేశారు. ఇంత జరుగుతున్నా ఇంతవరకు కృత్రిమ కొరత సృష్టించి డీజిల్ను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న పెట్రోల్ బంక్ యజమానులపై ఒక్క కేసు కూడా నమోదు కాకపోవటం విశేషం. పెట్రోలియం ప్లానింగ్ మరియు ఎనాలసిస్ సెల్ గణాంకాల ప్రకారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల్లో రోజువారీ వినియోగం సుమారు 10 లక్షల లీటర్లు ఉంటుందని అంచనా. ఈ జిల్లాల్లో సుమారు 300 పెట్రోల్ బంకులు ఉన్నాయి అయితే వీటిలో ఒక్క పశ్చిమగోదావరి జిల్లాలోని 165బంకులు డీజిల్ సరఫరా చేస్తున్నాయి. ఆక్వాసాగు, వరికోతలు, ఇతర రవాణా వినియోగం కారణంగా డీజిల్ అవసరం ఎక్కువగా ఉంది. విశేషమేమిటంటే కంపెనీలు కోటా ప్రకారం డీజిల్ సరఫరా చేస్తున్నప్పటికీ డిమాండ్కు తగ్గట్టుగా డీజిల్ అందుబాటులో లేదు ఇది ప్రధానంగా రబీ పంట కోతలు, ఆక్వా సాగు కారణంగా డిమాండ్ పెరుగుతుంది.

ప్రస్తుత డీజిల్ కొరత కారణంగా హార్వెస్టర్లు, ట్రాక్టర్లు, థ్రెషర్లు వంటి యంత్రాలు పొలాల్లోనే నిలిచిపోతున్నాయి. ధాన్యం మిల్లులకు చేరే పరిస్థితులు సన్నగిల్లుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కోతలు ఆలస్యం అయితే పంట పాడవుతుంది లేదా పంట నాణ్యత తగ్గుతుంది. ఆక్వా రంగంలో ఈ నష్టం అధికంగా ఉంటుంది. లక్షలు ఖర్చుతో చేసే ఆక్వా సాగు చెరువుల్లో ఏరియేటర్లు ద్వారా నీరు రొటేట్ చేయడం వంటివి చేయకపోతే ప్రధానంగా రొయ్యలు చనిపోతాయి. క్రమంలో ఆక్వా రైతులు డీజిల్ కొరతపై తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

లారీలు, ట్రక్కులు, ఆటోలు, ట్రాక్టర్లు, కార్లు వంటి వాహనాలు డీజిల్ కోసం గంటల తరబడి క్యూలో నిలబడుతున్నాయి. రవాణా ఆపరేటర్లు వాహనదారులు ప్రస్తుత పరిస్థితులను ఎదుర్కోలేక బ్లాక్ మార్కెట్ వైపు చూస్తున్నారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి పెట్రోల్ బంకులను ఆస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నా, వినియోగదారులను ఇబ్బందులకు గురిచేయవద్దని హెచ్చరిస్తున్నప్పటికీ పరిస్థితులు మారడం లేదు. ఇదే పరిస్థితిలో మరొక వారం రోజులు కొనసాగితే లక్షల కోట్లు నష్టం వాటిల్లడం ఖాయం అయ్యేలా ఉంది. పశ్చిమాసియా యుద్ధం కారణంగా అంతర్జాతీయ క్రూడ్ ఆయిల్ ధరల పెరుగుదల, ఆయిల్ కంపెనీల సరఫరా నియంత్రణ, అరువు ఇచ్చే ఆప్షన్ రద్దు కావడం వంటి పరిస్థితుల వల్ల నెలకొన్న చమురు కొరతపై వాస్తవాలు గ్రహించి అత్యవసర వినియోగానికి డీజిల్ అందించినట్లయితే నష్ట నివారణ తగ్గించుకోవచ్చని మేధావులు అభిప్రాయ పడుతున్నారు.

# నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్

>> చేసారు. ఈసందర్భంగా జరిగిన సభలో రవీంద్ర మాట్లాడుతూ అత్యంత అధునాతన పరిజ్ఞానంతో తక్కువ స్థలంలో దీనిని ఇండోర్ ఉపకేంద్రంగా నిర్మాణం జరుగుతుందని, విద్యుత్ సరఫరా చేసే వైర్ల స్తానంలో భూగర్భంలో కేబుళ్ళు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మచిలీపట్నంలో 74వేలగృహ కనెక్షన్స్ ఉండగా, గ్రామీణ ప్రాంతంలో 30వేలు ఉన్నాయని, 3,500 ఆక్వా చెరువులకు కనెక్షన్స్ ఉన్నాయని, ఈఉపకేంద్రం ఏర్పాటు చేయటం ద్వారా ఈకనెక్షన్స్‌కి లోవోల్టేజీ సమస్య పరిష్కారం అవుతుందన్నారు. 2014లో టిడిపి అధికారంలోకి వచ్చేనాటికి 23మిలియన్ యూనిట్ల లోటు ఉందని, చంద్రబాబు చేపట్టిన సంస్కరణల ఫలితంగా లోటు నుండి మిగులు విద్యుత్‌కి వెళ్ళగలిగామన్నారు. అప్పట్లో ప్రభుత్వం చేసుకున్న పిపిఏలను తరువాత వచ్చిన జగన్ ప్రభుత్వం రద్దుచేయటంతో రాష్ట్రంలో ఎక్కువ ధరకు విద్యుత్‌ను కొనుగోలు చేయాల్సిన దుస్థితి దాపురించిందన్నారు. దీని ఫలితంగా రూ.1.25లక్షలకోట్లు విద్యుత్‌సంస్థలకు నష్టం వచ్చిందని వివరించారు. ఈభారం ప్రజలపై వేసిని జగన్ ప్రభుత్వం 10సార్లు విద్యుత్‌చార్జీలు పెంచారని గుర్తుచేసారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అన్నిటిని గాడిన పెట్టి దేశంలోనే తొలిసారిగా విద్యుత్ ట్రూడౌన్ చేసి ప్రజలకు విద్యుత్‌చార్జీలు తగ్గించినట్లు మంత్రి వివరించారు. అనకాపల్లిలో రూ.5వేలకోట్లతో రెన్యూ ఎనర్జీ సంస్థ సోలార్‌ప్యానళ్ళు తయారు చేసే పరిశ్రమను ఏర్పాటు చేస్తుందన్నారు. పి.యం సూర్యఘర్ పథకం ద్వారా రాయితీపై గృహాలకు సోలార్‌వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు ప్రోత్సహిస్తున్నామని, ప్రతిఒక్కరూ ఈపథకంలో చేరి విద్యుత్ చార్జీలు తగ్గించుకోవాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఎస్ఈ రవీంద్రబాబు, డిసియంఎస్ అధ్యక్షులు బండి రామకృష్ణ, రాష్ట్రమైనార్టీ ఆర్దికసంస్థ డైరెక్టర్ హాసీం బేగ్ తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ- తిరుపతి తిరుమల ఎక్స్‌ప్రెస్‌లో పనిచేయని ఏసీలు

**విజయవాడ, ఏప్రిల్ 26,ప్రభాతవార్తప్రతినిధి:** విశాఖతిరుపతి తిరుమల ఎక్స్‌ప్రెస్‌లో ఏసీలు పనిచేడం లేదు. పలు బోగీల్లో ఏసీలు పనిచేయక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఫిర్యాదు చేసినా రైల్వేశాఖ అధికారులు పట్టించుకోలేదని ప్రయాణికులంతా ఆవేదన వ్యక్తం చేశారు. రైలు బయలుదేరిన విశాఖ నుంచే ఏసీలు పనిచేయడం లేదని ప్రయాణికులు తెలిపారు.




ఆదివారం బ్రిడ్జి కూలిన ప్రాంతాన్ని పరిశీలించి మీడియాతో మాట్లాడుతున్న టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా

# కూలిన ఆర్వోబి డెకింగ్

>> వద్ద రైల్వే ట్రాక్‌పై గత కొంతకాలంగా ఆర్వోబీ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మధ్యాహ్నం మూడు, నాలుగో పిల్లర్ల మధ్య డక్టింగ్ పనులు నిర్వహిస్తుండగా.. డెకింగ్ ఒక్కసారిగా కుప్పకూలి కిందపడిపోయింది. ఈ ధాటికి అక్కడ పనిచేస్తున్న కార్మికులు శిథిలాల మధ్య చిక్కుకున్నారు. ప్రమాద శబ్దాన్ని విన్న స్థానికులు భయాందోళనతో పరుగులు తీశారు. సాధారణంగా అక్కడ పదుల సంఖ్యలో కార్మికులు పనిచేస్తుంటారు. అయితే, ప్రమాదం జరిగిన సమయానికి కార్మికులు భోజన విరామానికి వెళ్లడం, అలాగే సెలవు దినం కావడంతో పనివారూ తక్కువగా ఉండటం ప్రాణనష్టాన్ని నివారించాయి. లేనిపక్షంలో మృతుల సంఖ్య భారీగా ఉండేదని ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారు. తీవ్ర గాయాలు పాలైన ఏడుగురు కార్మికులను సమీపంలోని కృషి ఆసుపత్రికి తరలించారు. వీరు ఛత్తీస్గఢ్, జార్ఖండ్ ప్రాంతాలకు చెందిన బుద్ధిస్వర్, బోస్, అజిత్, దినేశ్, తోసార్ ప్రతాప్, ఉదయ్ గా గుర్తించారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే గాజువాక పోలీసులు, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. శిథిలాల కింద ఎవరైనా వాహనదారులు లేదా పాదచారులు చిక్కుకున్నారా అనే అనుమానంతో గాలింపు చేపట్టారు. జేసీబీల సాయంతో శిథిలాలను తొలగిస్తున్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే కారణమా? సంఘటన స్థలాన్ని గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ ప్రమాదానికి కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే కారణమని ఆయన ప్రాథమికంగా అనుమానం వ్యక్తం చేశారు. అదృష్టవసత్తు ప్రాణ నష్టం జరగలేదని నిర్మాణ లోపాలపై విచారణ జరిపించి, బాధితులకు ప్రభుత్వం తరపున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. సమాచారాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని, ప్రమాద భాదితులకు తగిన వైద్యం అందించి, ప్రభుత్వం తరపున నష్ట పరిహారం వచ్చేలా తనవంతు కృషి చేస్తానని తెలిపారు. నిర్మాణ నాణ్యతపై అధికారులు పూర్తిస్థాయి విచారణకు పల్లా ఆదేశించారు. లోపాలు ఉంటే కాంట్రాక్టు రద్దు చేసే విషయాన్ని పరిశీలిస్తామని తెలిపారు.

# ఐరోపా పర్యటనకు మాజీ సిఎం జగన్

>> రంగు ప్యాంటు, సాధారణ చెప్పులతో అత్యంత నిరాడంబరంగా కనిపించే జగన్.. ఈసారి ట్రెండీ లుక్‌లో దర్శనమిచ్చారు. బెంగళూరు ఎయిర్‌పోర్టులో ఆయన జీన్ షర్ట్, జీన్ ప్యాంట్, షూస్, ఖరీదైన వాచీ ధరించి కనిపించారు. ఎయిర్‌పోర్టులోని ప్రయా ణికులు, అభిమానులు జగన్ సరికొత్త అవతారాన్ని చూసి ఆశ్చర్యపోయారు. ఆయనతో ఫోటోలు దిగేం దుకు, వీడియోలు తీసేందుకు పోటీ పడ్డారు. ప్రస్తుతం ఈ ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి.

## రాష్ట్ర ఉత్సవంగా రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు జయంతి

**విజయవాడ ఏప్రిల్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు జయంతిని రాష్ట్ర ఉత్సవంగా నిర్వహించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వం ముఖ్య కార్యదర్శి శ్యామలరావు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి అమరావతి కమిటీ ఛైర్మన్ జాస్తి వీరాంజనేయులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఉడుకుతున్న భారతం

>> ఐఎండి అంచనా వేస్తోంది, ఇది వడగాలుల పరిస్థితులను తగ్గించగలదు. అరేబియా సముద్రంపై బలపడుతున్న పశ్చిమ గాలుల సహాయంతో మే నెలాఖరు నాటికి కేరళ, తమిళనాడులో రుతుపవనాల తొలి సూచనలు కనిపిస్తాయని వాతావరణ శాస్త్రవేత్తలు కూడా పేర్కొంటున్నారు. సకాలంలో కురిసే వర్షాలు ఉష్ణోగ్రతలనుచల్లబరుస్తాయి. విత్తనాలు నాటేకాలానికి వ్యవసాయసన్నాహాలకు సహాయ పడతాయి. **ప్రయాగ్‌రాజ్‌లో అత్యధికంగా 45.2 డిగ్రీలు నమోదు:** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో దేశంలోనే అత్యధికంగా 45.2 ది ఉష్ణోగ్రత నమోదు కాగా, ఇతర నగరాల్లో 44 డిగ్రీలు దాటింది. ఢిల్లీలో, పాఠశాలల్లో 'వాటర్ బెల్స్', ప్రజల కోసం మట్టి కుండల నీటి కేంద్రాలు, ఆసుపత్రుల సన్నద్ధత వంటి చర్యలు అమలుచేస్తున్నారు. మధ్యాహ్నం తీవ్రమైన ఎండకు దూరంగా ఉండాలని, శరీరంలో నీటి శాతం తగ్గకుండా చూసుకోవాలని, తేలికపాటి దుస్తులు ధరించాలని ఐఎండి మార్గదర్శకాలు విడుదల చేసింది. ముందస్తు నివారణ చర్యలు వడదెబ్బ కేసులను తగ్గించగలవని నిపుణులు నొక్కి చెబుతున్నారు.

## ఆసియాకు గేట్‌వే విశాఖ

>> కంప్యూటింగ్ అవసరాల కోసం అనేక స్టార్టప్‌లు, ఏఐ ల్యాబ్‌లు, రీసెర్చ్ సెంటర్లు, ఇంక్యుబేటర్లు, టెస్టింగ్ సెంటర్లు, ఆర్ అండ్ డి ల్యాబ్‌లు కూడా విశాఖలో ఏర్పాటవుతాయని వారు 2019కి ముందే అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో విశాఖలో రూ.70 వేల కోట్ల పెట్టుబడితో డేటా సెంటర్ ఏర్పాటుకు అదానీ సంస్థ సిద్ధమైంది. 2019లో కాపులుప్పాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతులమీదుగా ఆ ప్రాజెక్టుకు శంకుస్థాపన కూడా జరిగింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం అదానీ గ్రూప్‌ని ముప్పుతిప్పలు పెట్టింది. ప్రాజెక్టును 30 వేల కోట్లకు కుదించేలా చేసింది. వైఎస్సార్సీపీ ప్రభుత్వ ఉదాసీనత వల్ల ఆ ప్రాజెక్ట్ కూడా ఆచరణ రూపం దాల్చలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక సీఎం చంద్రబాబు, ఐటీ మంత్రి లోకేశ్, అధికారులు చేసిన కృషి వల్ల వైఎస్సార్సీపీ హయాంలో దెబ్బతిన్న రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్‌ని కొద్ది కాలంలోనే పునరుద్ధరించింది. దీంతో ఏకంగా గూగుల్ విశాఖకు తరలివస్తోంది. డేటా సెంటర్‌తో వేలల్లో ఉద్యోగాలు రావు. అయితే విశాఖలో గూగుల్ ఏఐ సేవలు అందించే మెగా హబ్‌ను ఏర్పాటు చేస్తోంది. దీనికి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, డేటా సెంటిస్ట్‌లు, ఏఐ, మెషీన్ లెర్నింగ్ నిపుణులతో పాటు, విద్యుత్ సరఫరా, కూలింగ్, నెట్‌వర్కింగ్ వ్యవస్థల నిర్వహణకు అవసరమైన హార్డ్‌వేర్ నిపుణులూ పెద్ద సంఖ్యలో అవసరమవుతారు. డేటా సెంటర్‌కు సమీపంలో ఉంటే కలిగే ప్రయోజనాలను అందిపుచ్చుకునేందుకు ఏఐ ఆధారిత కంపెనీలన్నీ విశాఖకు తరలివస్తాయి. దానికి అవసరమైన ఏకోసిస్టమ్ ఏర్పాటవుతుంది.

## విజయవాడ బస్టాండులో అగ్నిప్రమాదం

**విజయవాడ,ఏప్రిల్ 26,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ బస్టాండులో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఏసీలో షార్ట్‌సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగాయి. డిపార్చర్ బ్లాక్ ప్లాట్‌ఫామ్‌పై అగ్నిప్రమాదం జరిగింది. విజయవాడ బస్టాండ్ మొదటి అంతస్తులో ఈ అగ్నిప్రమాదం జరగడం గమనార్హం. ఎగ్జాస్ట్ ఫ్యాన్ల సమీపంలో షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు సంభవించాయి. దాంతో హుటాహుటిన అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పాయి. మొదటి అంతస్తులో ఉంచిన పాత ఫర్నిచర్, పాత కంప్యూటర్లు, దగ్ధమయ్యాయి.

## వారం - వర్జ్యం

27-04-2026, సోమవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
వైశాఖమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, శుక్లపక్షం, భరణి కార్తె
ఏకాదశి సా.6.19
పూర్వఫల్గుణి రా.9.21
వర్జ్యం : తె.4.56-ఉ.6.37
దు.ము.12.30-మ.1.21,2)3.02-మ.3.53
శుభసమయం:ఉ.8.30-9.30
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** ఆర్థికంగా ఇబ్బంది లేకపోయినా రావలసిన ధనం పూర్తిగా చేతికందదు. ప్రయాణాలు లాభిస్తాయి.

**వృషభం:** కీలక నిర్ణయాలలో జీవిత భాగస్వామి సలహాలు తీసుకుంటారు. మీలోని ప్రతిభాపాటవాలు వెలుగు చూస్తాయి.

**మిథునం:** పై అధికారులతో మాట్లాడేటప్పుడు సంయమనం పాటించండి. కుటుంబ సమస్యలు తీరుతాయి.

**కర్కాటకం:** నిదానమే ప్రధానమన్న సూక్తి, పాటించడం అన్నివిధాలా క్షేమం. వ్యాపారాలలో ఊహించని మార్పులు వుంటాయి.

**సింహం:** ఆధ్యాత్మికత పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తారు. మానసికంగా ప్రశాంతతను కలిగిఉంటారు. వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**కన్య :** వృద్ధులు, శ్రేయోభిలాషులను కలిసి వారి సలహాలను తీసుకుంటారు. కాలం కలిసి వచ్చినట్లుగా వుంటుంది.

**తుల :** బంధువుల నుండి ముఖ్యమైన సమాచారం అందుకుంటారు. పెండింగ్ కేసుల నుండి బయట పడుతారు.

**వృశ్చికం:** విద్యార్థినీ, విద్యార్థులకు అవకాశాలు కలిసివస్తాయి. ఆరోగ్యం పట్ల శ్రద్ధవహించండి. బంధువుల కలయిక.

**ధనుస్సు:** అనాధశరణాలయాలకు మీ వంతు సహాయాన్ని అందిస్తారు, ఉద్యోగులకు స్థాన చలనం ఉంటుంది.

**మకరం:** సన్నిహితుల సహకారంతో నూతన కార్యక్రమాలకు చేపడతారు. వివాహయత్నాలు ముమ్మరం చేస్తారు.

**కుంభం:** ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు.

**మీనం :** భూముల క్రయవిక్రయాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. నూతన ఒప్పందాలు కుదుర్చుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

27-4Pg3exHMNWJQE.qxd:27-4Pg3exHMNWJQE.qxd 1/1/02 6:49 AM Page 1



# తిరుమల సమాచారం



## అశ్వవాహనంపై మలయప్పస్వామి

**తిరుమల, ఏప్రిల్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల నారాయణగిరి ఉద్యానవనాల్లోని పరిణయవేదికపై రెండోరోజు ఆదివారం సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత మలయప్పస్వామి వివాహఘట్టం వేడుకలను వైభవంగా జరిపించారు. రంగురంగుల పుష్పాలతో భూలోక వైకుంఠాన్ని తలపించే రీతిలో అలంకరించిన దశావతార- అష్టలక్ష్మి ్మ మండపంలో ఆదివారం సాయంత్రం పద్మావతి శ్రీనివాస పరిణయోత్సవాలు శోభాయమానంగా అర్చకులు నిర్వహించారు. సాయంత్రం ఆలయం నుండి మంగళవాయిద్యాల నడుమ మలయప్ప అశ్వవాహనాన్ని అధిరోహించి ఊరేగింపుగా పరిణయ మండపం చేరుకోగా అమ్మవార్లు పల్లకీలో విచ్చేశారు. పెండ్లి మండపంలో నిత్య నూతన వధూవరులైన స్వామివారికి, అమ్మవార్లకు ఎదుర్కోలు, మాల పరివర్తనం, పూలబంతులాట, నూతన వస్త్ర సమర్పణ కోలాహలంగా జరిగాయి. ఆ తరువాత స్వామివారికి కొలువు (ఆస్థానం) జరిగింది. ఆర్జిత భక్తులకు వస్త్ర బహుమానం, ప్రసాద వితరణ జరిగింది. ఆ తరువాత శ్రీదేవి భూదేవి సహితుడైన స్వామి అశేష భక్తజనం మధ్య ఊరేగుతూ ఆలయ ప్రవేశంచేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, ఉద్యానవన సూపరింటెండెంట్ శ్రీనివాసులు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.



## టిటిడి ట్రస్ట్‌లకు భూరి విరాళం

● రూ.1.20 కోట్లు అందించిన దాత

**తిరుమల, ఏప్రిల్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి నిర్వహిస్తున్న పథకాలు, ట్రస్ట్‌లకు దాతలు తమవంతుగా భారీ విరాళాలందిస్తున్నారు. ఆదివారం హైదరాబాద్‌కు చెందిన మాక్స్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ బివివిఎస్ఎన్ రాజు టిటిడి ట్రస్ట్‌లకు రూ.1.20 కోట్లు విరాళమిచ్చారు. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద కేంద్రంలో ఒక రోజు అన్న ప్రసాద వితరణకు రూ.44 లక్షలు, ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.76 లక్షలు విరాళం ఇచ్చారు. ఆలయంలోని రంగనాయకుల మండపంలో అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి దాత విరాళం డిడిలను అందజేశారు.



## మే 1 నుండి వేదనారాయణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

**తిరుమల, ఏప్రిల్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని నాగలాపురంలో వేదనారాయణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతోంది. ఆలయంలో మే నెల 1 నుండి 9వ తేదీ వరకు నిర్వహించనున్న వార్షిక బ్రహ్మోత్సవాల పోస్టర్లు, బుక్‌లెట్‌ను ఆదివారం ఉదయం టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర ఆవిష్కరించారు. బ్రహ్మోత్సవాలకు టిటిడి లోని అన్ని విభాగాలు సమన్వయంగా ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలిపారు. వేసవి తీవ్రత దృష్ట్యా భక్తుల సౌకర్యార్థం ఆలయ పరిసరాల్లో చలువ పందిళ్లు, మాడవీధుల్లో కూల్ పెయింట్, తాగునీటి సదుపాయాలు, ఎప్పటికప్పుడు నీటి పిచికారీ ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. భక్తులను ఆకట్టుకునేలా విద్యుత్ దీపాలంకరణలు, పుష్పాలంకరణలు, క్యూలైన్లు, ఫ్లెక్సీలు, ఆర్చీలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతిరోజు వాహన సేవల సందర్భంగా భజనలు, కోలాటాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అదనంగా మొబైల్ మరుగుదొడ్లు, పారిశుద్ధ్య కార్మికులు, ప్రథమ చికిత్స కేంద్రాలు, అంబులెన్సులు, అగ్నిమాపక సిబ్బంది, వాహన పార్కింగ్ సదుపాయాలు ఏర్పాటు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ నాగరత్న, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఆర్జిత కల్యాణోత్సవం మే 8వ తేదీ సాయంత్రం 4.30 నుండి 6.30 గంటల వరకు స్వామివారి ఆర్జిత కల్యాణోత్సవం వైభవంగా జరుగనుంది. రూ.750లు చెల్లించి ఇద్దరు గృహస్తులు పాల్గొనవచ్చు. పాల్గొనే వారికి ఒక ఉత్తరీయం, ఒక రవికె, ఒక లడ్డూ, ఒక వడ బహుమానంగా అందజేస్తారు.



## అంజనాద్రిలో మే 12న హనుమజ్జయంతి ఉత్సవాలు

● ఆకాశగంగలోని బాలాంజనేయునికి ప్రత్యేక అభిషేకం

**తిరుమల, ఏప్రిల్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** శేషాచలంకొండల్లోని తిరుమల ఆకాశగంగ ప్రాంతంలో మరో దివ్యపుణ్యక్షేత్రం బాలాంజనేయస్వామికి మేనెల 12వతేదీ హనుమజ్జయంతి ఉత్సవాలు జరగనున్నాయి. బాల ఆంజనేయ స్వామి పుట్టుక ఆకాశగంగ ప్రాంతంలోనే అని చారిత్రక ఆధారాలతో, పురాణాల్లో పేర్కొనబడింది. తిరుమల తిరుపతి దేవస్థానం కూడా బాల ఆంజనేయస్వామి జన్మస్థలం గుర్తించి నాలుగు సంవత్సరాలుగా ఇక్కడే జయంతి ఉత్సవాలు నిర్వహిస్తోంది. ఆరోజు పలు రకాల విశేష ఉత్సవాలు, ప్రత్యేక అభిషేకాలు జరిపించనున్నారు. అంజనాద్రిలోని ఆకాశగంగ ఆలయం, జపాలి తీర్థంలోని హనుమాన్ జయంతి వేడుకలు జరగనున్నాయి. ఆకాశగంగలోని అంజనాద్రి ఆలయంలో మే 12న హనుమజ్జయంతి సందర్భంగా అంజనాదేవి, బాలాంజనేయస్వామికి అభిషేకం చేయనున్నారు. ఇందుకుగాను అంజనాద్రిని టిటిడి సర్వాంగసుందరంగా ముస్తాబు చేస్తోంది.

# తిరుమలను తాకిన యుద్ధం సెగ!

## కొండపై పెట్రోల్ బంకులు మూత ● అవస్థలు పడుతున్న భక్తులు



**తిరుమల, ఏప్రిల్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** పశ్చిమాసియా దేశాల్లో కొనసాగుతున్న యుద్ధం ప్రభావంతో పరిస్థితులు దారుణంగా మారుతున్నాయి. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు విరుచుకుపడటంతో ప్రధాన చమురు సరఫరా జరిగే హార్మూజ్ జలసంధి మూసివేతతో ఇప్పటికే వంటగ్యాస్ కొరతతో సామాన్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాజాగా ఆ ప్రభావం పెట్రోల్, డీజిల్‌పై పడింది. ఇరాన్ నుండి పూర్తిగా చమురు నౌకలు మన దేశానికి రాకపోవడంతో ఇంధన కొరత కనిపిస్తోంది. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తిరుమల పుణ్యక్షేత్రంపై ఈ పెట్రోల్ బంకుల ప్రభావం చూపింది. శనివారం అర్ధరాత్రి నుండి తిరుమలకొండపై ఎఎన్‌సి కాటేజీల ప్రాంతంలో ఉన్న ఐఒసి పెట్రోల్ బంకు, బాలాజీనగర్ సమీపంలోని హెచ్‌పి పెట్రోల్ బంకులు పెట్రోలు, డీజిల్ లేక మూసివేశారు. ఒక్కసారిగా ఆదివారం ఉదయానికి ఈ రెండు బంకులు నోస్టాక్ బోర్డుపెట్టి బారికేడ్లు అడ్డుగా పెట్టేయడంతో యాత్రికులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. ఆదివారం ఉదయం నుండి సాయంత్రం వరకు తిరుమలలో పెట్రోల్ బంకులు తెరచుకోలేదు. దీంతో దూరప్రాంతాల నుండి వాహనాల్లో వచ్చిన యాత్రికులు తిరుగు ప్రయాణానికి ఇబ్బందులు తప్పడంలేదు. తిరుమలలో ఐఒసి, హెచ్‌పి సంస్థలు రెండు పెట్రోల్ బంకులు నడుపుతున్నాయి. యాత్రికుల సౌలభ్యం కోసంతోబాటు తిరుమల స్థానికుల వాహనాలకు ఇక్కడ ప్రధాన వనరుగా ఉన్నాయి. ప్రతిరోజూ సరాసరి హెచ్‌పి సంస్థ బంకులో 2,500వేల లీటర్ల నుండి మూడువేల లీటర్లు డీజిల్ అమ్మకాలు జరుగుతాయి. వారాంతంలో ఐదువేల లీటర్లు వరకు డీజిల్ అవసరం ఉంటుంది. వెయ్యిలీటర్ల వరకు పెట్రోల్ కూడా అమ్మకాలు జరుగుతుంటాయి. ఇక సిఎన్‌జి గ్యాస్ 650కిలోల వరకు వాహనదారులు వినియోగించు కుంటున్నారు.

ఇక ఐఒసి పెట్రోల్ బంకులో రోజుకు 500లీటర్లు పెట్రోల్ అమ్మకాలు జరుగుతుండగా 200లీటర్లు డీజిల్ అమ్ముడవుతున్నాయి. ఒక్కసారిగా ఆదివారం ఉదయం నుండి తిరుమలలో రెండు పెట్రోల్ బంకులు మూసివేయడంతో స్థానికులేగాక యాత్రికులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. యుద్ధం ప్రభావం ఇప్పుడు పెట్రోల్ డీజిల్‌పై చూపడంతో అమెరికాకు వ్యతిరేకంగా నినాదాలు చేసే పరిస్థితి ఉంది.

ఇక తిరుపతిలోనూ దాదాపు పదిహేనుకిపైగా పెట్రోల్ బంకులు మూడపడ్డాయి. ఆదివారం ఉదయం 11గంటలకే బంకుల ముందు త్రాళ్ళుకట్టి, ఇనుప బారికేడ్లు పెట్టేసి నో స్టాక్ బోర్డులు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా పెట్రోల్, డీజిల్ సరఫరాలో ఏర్పడిన అంతరాయం తీవ్ర ఇంధన సంక్షోభానికి దారితీస్తోంది. ఈ కొరత రానున్న రోజుల్లో మరింత జఠిలంగా మారే ప్రమాదం ఉందని బంకుల యజమానులు చెబుతున్నారు. తిరుపతి నగరంలో వరదరాజనగర్, తిరుమల బైపాస్‌రోడ్డు, తిలక్‌రోడ్డు, టిపి ఏరియా, ఏఐఆర్ బైపాస్ మార్గం, చంద్రగిరి, రేణిగుంట మార్గాల్లోని మెజారిటీ బంకులు నో స్టాక్ బోర్డులు పెట్టడం వాహనదారులను ఆందోళనకు గురిచేసింది. ఉదయం నుండి వాహనదారులు పనులన్నీ వదులుకుని పెట్రోల్, డీజిల్ కోసం క్యూ కట్టారు. చాలాచోట్ల పెట్రోల్ బంక్‌లు బంద్ అయ్యాయి.

విద్యాసంస్థలకు సెలవులు వచ్చినా ప్రభుత్వ ఉద్యోగులు, ఉద్యోగులు, కార్మికులు నిత్యావసరంగా మారిన వాహనాల వినియోగంతో పెట్రోల్‌కు అవస్థలు తప్పడంలేదు. తిరుపతి, పుత్తూరు, నగరి, శ్రీకాళహస్తి, చిత్తూరు, పలమనేరు పట్టణాల్లోని బంకుల ముందు ఆదివారం ఉదయం 10గంటల నుండే వాహనదారుల పడిగాపులు కాస్తున్నారు.

చిత్తూరు జిల్లాలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. చాలావరకు పెట్రోల్ బంకుల్లో నో స్టాక్ బోర్డులు కనిపిస్తున్నాయి. చిత్తూరు, పుత్తూరు ప్రాంతాల్లోని ఒకటి రెండు పెట్రోల్ బంకుల్లో ద్విచక్ర వాహనాలకు 2లీటర్లు పెట్రోల్, కార్లు, జీపులకు ఐదులీటర్ల వరకు డీజిల్ మాత్రమే కొడుతున్నారు. తిరుపతి జిల్లాలో చిత్తూరు జిల్లాలోనూ నో స్టాక్ బోర్డులతో రెవెన్యూ, జిల్లా సంయుక్త కలెక్టర్ తదితర అధికారులు అప్రమత్తమయ్యారు. నిజంగా కొరత ఉందా లేదా బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారా అని విచారణ జరుపుతున్నారు. కృత్రిమ కొరత సృష్టిస్తే కఠినచర్యలు తప్పవని జిల్లాల కలెక్టర్లు హెచ్చరిస్తున్నారు. అయితే పెట్రోల్, డీజిల్ కొరత ఉన్నమాట వాస్తవమే అంటున్నారు బంకుల యజమానులు. ఇరాన్- అమెరికా యుద్ధానికి ముందు పెట్రోల్, డీజిల్ సరఫరా కంపెనీలు డీలర్లకు అప్పుగా పెట్రోల్, డీజిల్ సప్లయ్ చేసేవని, ఇప్పుడు క్రెడిట్ నిలిపివేయటంతోనే కొరత ఏర్పడుతుందని చెబుతున్నారు. ఇప్పటికే ఈ వ్యవహారం పై సీఎం చంద్రబాబు అధికారులతో సమీక్ష నిర్వహించారు. పెట్రోల్ బంకుల్లో నో స్టాక్ బోర్డులపై చర్చించారు. సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని పౌరసరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు.

## టోల్‌గేట్ సిబ్బందిపై దాడి చంద్రబాబు ఆగ్రహం



**విజయవాడ, ఏప్రిల్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. అన్నమయ్య జిల్లా మదనపల్లె – తిరుపతి జాతీయ రహదారిపై గండబోయినపల్లె వద్ద ఉన్న టోల్‌ప్లాజా సిబ్బందిపై కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అనుచరులు దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు.

మదనపల్లె–తిరుపతి జాతీయ రహదారిపై గండబోయినపల్లె వద్ద ఉన్న టోల్‌ప్లాజా సిబ్బందిపై ఎమ్మెల్యే వాహనాలను ఆపుతారా అంటూ సరేంద్రబాబు అనుచరులు రెచ్చిపోయారు. ఎమ్మెల్యే తన అనుచరులతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకుని తిరుగు పయనమయ్యారు. మార్గం మధ్యలో వాల్మీకిపురం మండల పరిధిలోని గండబోయిన పల్లె టోల్‌గేట్ వద్దకు రాగానే సిబ్బంది టోల్‌ఫీజు చెల్లించాలని కోరారు.

ఎమ్మెల్యే వాహనాలను గుర్తించినా కూడా టోల్‌ఫీజు చెల్లించమంటారా అంటూ ఆయన అను చరులతో పాటు గన్‌మెన్ తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. వెంటనే కారులో నుంచి దిగిన గన్‌మెన్ టోల్ బ్యారియర్‌ను ధ్వంసం చేశారు. ఆ తర్వాత టోల్‌ప్లాజా మేనేజర్ రవి, మహిళా ఉద్యోగి శ్రీలతను దూషిస్తూ ఆమెపై దాడికి పాల్పడ్డారు. గన్‌మెన్ ఆమె జుట్టుపట్టుకుని కొట్టడం సీసీటీవీ దృశ్యాల్లో కనిపించింది. ఆ సమయంలో ఎమ్మెల్యే వాహనంలోనే ఉన్నారు.

## ఉమ్మడి అనంతపురం జిల్లాలో బంక్‌ల వద్ద జనాలు క్యూ



● పలు ప్రాంతాల్లో నోస్టాక్ బోర్డులు

● ఇది కృత్రిమ కొరతనా.. వినియోగదారుల్లో భయాందోళనలే కారణమా..?

● సరఫరాలో ఇబ్బంది లేదంటున్న అధికారులు

**అనంతపురం, ఏప్రిల్ 26 ప్రభాతవార్త బ్యూరో:** ఉమ్మడి అనంతపురం జిల్లాలో పలు చోట్ల పెట్రోల్, డీజిల్ బంక్‌ల వద్ద జనాలు, వాహన దారులు క్యూ కడుతున్నారు. వినియోగదారుల డిమాండ్ ఎక్కువ కావడంతో కొన్ని సందర్భాల్లో నోస్టాక్ బోర్డులు కూడా పెడుతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో దాదాపు 330 పెట్రోల్ బంక్‌లు ఉన్నాయి. గత రెండు మూడు రోజులుగా పెట్రోల్, డీజిల్ బంక్‌ల వద్ద వాహన దారులు క్యూ కడుతున్నారు. ద్విచక్ర వాహన దారులైతే క్యూలో వాహనాలు పెట్టడంతోపాటు బాటిల్స్ సైతం పట్టుకుని మరికొంత మంది క్యూ కడుతున్నారు. కార్లు, జీపులు, లారీలు లాంటి పెద్ద వాహన దారులు కూడా డీజిల్ దొరకక ఇబ్బంది పడుతున్నారు. అమెరికా, ఇరాన్ యుద్ధం నేపథ్యంలో రాబోయే రోజుల్లో డీజిల్, పెట్రోల్ ధరలు పెరుగుతాయన్న కారణంతో అవసరం లేకపోయినా ఎక్కువ మంది నిల్వలు ఉంచుకునేందుకు వాహన దారులు కొనుగోలు చేసేందుకు పెట్రోల్ బంక్‌ల వద్ద క్యూ కడుతున్నారన్న అభిప్రాయాలు ఉన్నాయి. ఇదే సమయంలో ద్విచక్ర వాహన దారులు కూడా అక్కడక్కడ పెట్రోల్ బంక్‌ల వద్ద నో స్టాక్ బోర్డులు పెట్టడంతో రాబోయే రోజుల్లో పెట్రోల్ దొరుకుతుందో లేదో అన్న కారణంతో ఎక్కువగా బంక్‌ల వద్ద క్యూ కడుతున్నారన్న అభిప్రాయం ఉంది. కొన్ని పెట్రోల్ బంక్‌ల యజమానులు కృత్రిమకొరత సృష్టిస్తున్నారన్న అభిప్రాయం ఉంది. అనంతపురం, కర్నూలు, కడప జిల్లాల్లోని పలు ప్రాంతాలకు గుంతకల్లు కేంద్రంగా ఆయిల్ సరఫరా అవుతుంది. ఈ పరిస్థితుల్లో అనంతపురం జిల్లాతోపాటు కర్నూలు, కడప జిల్లాల్లో కూడా పలు పెట్రోల్ బంక్‌ల వద్ద డీజిల్, పెట్రోల్ కొరత ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో నంద్యాల, ఆల్లగడ్డ లాంటి ప్రాంతాల నుంచి డీజిల్ కోసం అనంతపురంకు కూడా వస్తున్నట్లు తెలియవచ్చింది. ముఖ్యంగా వరి కోత మిషన్లకు సంబంధించిన వారు ఎక్కువగా వస్తున్నట్లు తెలియవచ్చింది. డీజిల్, పెట్రోల్, పై స్థాయి నుంచి పెద్దగా కొరత లేదని, జనవరి- ఫిబ్రవరి- మార్చి నెలల్లో సగటున ఏ మేరకు జిల్లాకు డీజిల్ పెట్రోల్ వచ్చేదో అదే విధంగా సరఫరా అవుతోందని కొందరు పెట్రోల్ బంక్ యజమానులు చెబుతున్నారు. గుంతకల్లు కేంద్రంగా ఉన్న ఆయిల్ సరఫరా కేంద్రం నుంచి ప్రతిరోజు 60 లోడ్‌లు డీజిల్ బంక్‌లకు వెళ్తోందని తెలియవచ్చింది. వినియోగదారుల్లో, వాహన దారుల్లో భయాందోళనవల్లే పెట్రోల్ బంక్‌ల వద్ద ఎక్కువ సమస్యలు ఏర్పడుతోందని, రాబోయే రోజుల్లో దొరుకుతుందో లేదో, రేట్లు పెంచుతారన్న ఆందోళన వల్లే ఈ సమస్య ఉత్పన్నం అవుతోందన్న అభిప్రాయం ఉంది. రాష్ట్రంలో ఐఒసి పెట్రోల్ బంక్‌లు దాదాపు 38 వేలు ఉంటే, బిపిసి పెట్రోల్ బంక్‌లు దాదాపు 22వేలు, మిగతా పెట్రోల్ బంక్‌లు 15వేల బంకులు ఉన్నట్లు తెలియవచ్చింది. రాష్ట్రంలో పలు చోట్ల అక్కడక్కడ ప్రైవేట్ బంకుల్లో పెట్రోల్, డీజిల్ ఉన్నప్పటికీ అక్కడ ధర ఎక్కువన్న కారణంతో అటువైపు వినియోగదారులు వెల్లడం లేదని అభిప్రాయాన్ని ఓ పెట్రోల్ బంక్ యజమాని వెల్లడించారు. ఏది ఏమైనా ఉమ్మడి అనంతపురంజిల్లాలో డీజిల్, పెట్రోల్ బంక్‌ల వద్ద జనం, వాహన దారులు క్యూ కడుతున్నారు. ఈ విషయంలో అధికారులు తగిన చర్యలు తీసుకుని రాబోయే రోజుల్లో సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలి

● ఎఐటియుసి 18వ రాష్ట్ర మహాసభలలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య




**తిరుపతి, ఏప్రిల్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశంలో సంపద సృష్టిస్తున్న కార్మికుల సమస్యలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న తీరుపై సమరశీల పోరాటాలకు కార్మికులు సిద్ధం కావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జీ ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ 18వ రాష్ట్ర మహాసభల సందర్భంగా తిరుపతిలో జరిగిన బహిరంగ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. దేశంలో, రాష్ట్రంలో కార్మికులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ సంపదను ఆదాని, అంబాని లాంటి కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్న ఈ ప్రభుత్వాలు కార్మికుల పట్ల మునలి కన్నీరు కారుస్తున్నారని అన్నారు.

కార్మికుల జీవన ప్రమాణాలు పెంచాలని కనీస వేతనాలు ఇవ్వాలని వివిధ రూపాల్లో ఆందోళన చేస్తున్న కార్మికుల పట్ల ప్రభుత్వాలు అణచివేత ధోరణితో వ్యవహరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ సంపద ఐదు శాతం మంది చేతుల్లోనే ఉందని, సంపద సృష్టించే శ్రమజీవులు కార్మికుల బ్రతుకులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు మారిందన్నారు. దేశంలో కార్మిక వర్గాల గుండెచప్పుడుగా ఏఐటీయూసీ జెండా ఉందని, కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటాలకు ఏఐటీయూసీ ముందుందన్నారు. గత రెండు సంవత్సరాల క్రితం అంగన్వాడీ, మునిసిపల్, ఆశ వర్కర్స్, ఎలక్ట్రిసిటి, పలు ప్రైవేటు కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులు సమ్మె చేస్తే మేము అధికారంలోకి వస్తే కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పిన చంద్రబాబు నాయుడు తాము అధికారంలోకి వచ్చిన తరువాత కార్మికుల సమస్యల పరిష్కారం చేయకపోగా వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ నష్టాల్లో ఉందని, ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తుందన్నారు. తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర లాంటి రాష్ట్రాల్లో నష్టం వస్తే ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకుంటున్నాయని, ఆంధ్రప్రదేశ్లో మాత్రం చంద్రబాబు నాయుడు దానికి భిన్నంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు.

పార్లమెంట్లో మహిళా రిజర్వేషన్ బిల్లును ఇండియా కూటమి అడ్డుకుందని మోది మునలి కన్నీరు కారుస్తున్నారని అన్నారు. మహిళా బిల్లు 2023 సెప్టెంబర్ 3వ తేదిన ఆమోదం పొందిన విషయాన్ని గుర్తు చేశారు. మహిళల పట్ల మోదికి ప్రేమ ఉంటే ప్రస్తుతం ఉన్న 543 ఎంపీ 1 స్థానాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. దేశంలో పెట్రోలు, డీజిల్ కొరత ఏర్పడిందని, రైతులకు గిట్టుబాటు ధర లేక ఆందోళన చేస్తుంటే ఆ సమస్యలపై పట్టించుకోని బిజెపి డీ లిమిటేషన్ బిల్లును మహిళా బిల్లుతో తీసుకొచ్చి దక్షణాధి రాష్ట్రాలకు అన్యాయం చేయాలని మోది అమితే నీచ రాజకీయాలకు దిగజారారని తెలిపారు. దీనికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, వైసిపి నేత జగన్‌మోహన్‌రెడ్డి, పవన్ కల్యాణ్ వత్తాసు పలుకుతున్నారని అన్నారు.

రాష్ట్రంలో ఎన్ని పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉద్యోగాలు కల్పించారో చెప్పాలని ప్రశ్నించారు. యువతీ యువకులకు ఉద్యోగాలు ఇవ్వకుండా నిరుద్యోగ భృతి ఇస్తామని మోసం చేసి రాష్ట్రంలో మట్టి, ఇసుక, మద్యం, ఖనిజ సంపదను దోచుకుంటున్నది తెలుగుదేశం పార్టీ నేతలు కాదా అని ప్రశ్నించారు. మూడు రోజుల పాటు తిరుపతి నగరంలో జరుగుతున్న ఎఐటియుసి 18వ రాష్ట్ర మహాసభలు విజయవంతం కావాలని ఆకాంక్షి ంచారు. సిపిఐ, ఏఐటియుసి నాయకులు పాల్గొన్నారు.

## శ్రీశైలం మల్లన్నను దర్శించుకున్న తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్



**శ్రీశైలం ప్రాజెక్టు ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** శ్రీశైల శ్రీభ్రమరాంబ మల్లిఖార్జున స్వామి అమ్మవార్లను తెలంగాణ రాష్ట్రం రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు మల్లన్న దర్శనార్థమై ఆలయం వద్దకు చేరుకున్నారు. వారికి ఆలయ రాజ గోపురం వద్ద ఏఇఓ వెంకటేశ్వరరావు, ప్రజాసంబంధాల అధికారి టి. శ్రీనివాస రావు, అర్చక స్వాములు సాదర స్వాగతం పలికారు. స్వామివారికి అభిషేకం అమ్మవారికి కుంకుమార్చన ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి అలంకార ఆశీర్వచన మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం వల్లించగా, అర్చక స్వాములు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం స్వామి వారి శేష వస్త్రాలతో సత్కరించి లడ్డు ప్రసాదాలను అందజేసి, స్వామి అమ్మ వార్ల చిత్రపటంను మంత్రికి అధికారులు బహుకరించారు.

## సింగపూర్‌లో మంత్రుల బృందం పర్యటన

### పట్టణ ప్రణాళిక, సుస్థిర అభివృద్ధిపై అధ్యయనం

**విజయవాడ, ఏప్రిల్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** సింగపూర్‌లో ప్రముఖ అంతర్జాతీయ కన్సల్టెన్సీ సంస్థ మారో ఆర్కిటెక్ట్స్‌ను సందర్శించిన ఏపీ మంత్రులు బృందం. మారో ఆర్కిటెక్ట్ ప్రతినిధులతో సమావేశమై, అత్యాధునిక నగర నిర్మాణ నమూనాలు, స్మార్ట్ సిటీలపై మంత్రుల బృందం చర్చించింది. ఏఐ డిజిటల్ టెక్నాలజీని ఉపయోగించి భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా "స్మార్ట్ సిటీ"ల కోసం ప్రణాళికలు రూపొందించే అంశాలను పరిశీలించిన మంత్రులు, సింగపూర్ అనుసరిస్తున్న "సినారియో ప్లానింగ్" (పట్టణ ప్రణాళికలో భవిష్యత్తు అవసరాలను ముందే ఊహించి సన్నద్ధం కావడం) అర్బన్ డిప్లొమసీ (ప్రపంచంలోని ప్రధాన నగరాలు తన ఆర్థిక, సామాజిక పర్యావరణ ప్రయోజనాల కోసం అంతర్జాతీయ స్థాయిలో ఇతర నగరాలు లేదా సంస్థలతో కలిసి పనిచేయడం) వంటి సింగపూర్ అవలంబిస్తున్న విధానాలను తెలుసుకున్న మంత్రులు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు అచ్చెన్నాయుడు, బి.సి. జనార్దన్ రెడ్డి, వంగలపూడి అనిత, సత్యకుమార్ యాదవ్, అనగాని సత్యప్రసాద్ తదితర మంత్రులు పాల్గొన్నారు.

# ఏకసభ్య కమిటీ నివేదికతో సంచలనమేనా!?

● నెయ్యి 'కల్తీ' ఎవరి మెడకు చుట్టుకోనుందో!?



**తిరుమల, ఏప్రిల్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలేశుని లడ్డూలకు కల్తీనెయ్యి వినియోగించిన పాపంలో దాదాపు 60రోజులుపాటు నిశితంగా లోతైన దర్యాప్తు కొనసాగించిన ఏకసభ్య కమిటీ విశ్రాంత ఐఎఎస్ అధికారి, విశ్రాంత సిఎస్ దినేశ్‌కుమార్ నివేదికలు సిద్దంచేశారు. ఈ నివేదికలను బుధవారం ప్రభుత్వానికి అందజేయనున్నారనేది తెలుస్తోంది. ఇప్పటికే ఆయన మరో ముగ్గురు సహాయకులతో కలసి సమగ్రంగా 2019-24 మధ్యకాలంలో వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదం తయారీలో కీలకమైన నెయ్యి కల్తీచేశారనే అంశంపై విచారణ చేపట్టారు. విచారణలో సేకరించిన విషయాలను లడ్డూ వ్యవహారంలో నివేదిక రూపొందించారు. తదుపరి ప్రభుత్వం తీసుకొనే చర్యలు కీలకంగా మారనున్నాయనేది టిటిడి వర్గాలను కుదిపేస్తోంది. ఏక సభ్య కమిటీ విచారణ క్షేత్ర స్థాయిలో ముగిసింది. విచారణలో భాగంగా దినేశ్‌కుమార్ గతంలో రెండు రోజులు తిరుమలలో పర్యటించారు. 30వ తేదీలోపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలసి కల్తీనెయ్యిపై నివేదిక సమర్పించనున్నట్లు తెలుస్తోంది. నెయ్యి కొనుగోలు సంబంధించి టెండర్ నిబంధనలు సడలింపుపై గతంలో కొనసాగిన పాలక మండలి పెద్దలు, గత ఇఒ తోబాటు టిటిడి ముఖ్య ఆర్థిక గణాంక సలహాదారుడో బాలాజీ నుంచి అవసరమైన రికార్డులను పట్టుకున్నారు. మార్కెటింగ్, ప్రొక్యూర్ మెంట్ విభాగా అధికారులతో పాటు నెయ్యి కొనుగోలు నిర్ధారణ, ఎక్స్‌పర్ట్ కమిటీలో సభ్యుడిగా ఉన్నవిజయ్ భాస్కర్ రెడ్డి నుండి కూడా కీలక సమాచారం రాబట్టారు. కమిషన్ నివేదిక ను ప్రభుత్వం పరిశీలిస్తే, ఆ తరువాత కమిటీ చేసిన సిఫార్సులకు, పేర్కొన్న అంశాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకొనే అవకాశం ఉందనది సమాచారం. కమిటీ ప్రతినిధి దినేశ్‌కుమార్ ఆ నివేదికలో ఏ అంశాలను వెల్లడించారు, పవిత్రమైన దేవుని లడ్డూల తయారీలో గత ఐదేళ్ళ వైసిపి ప్రభుత్వంలోని గత టిటిడి ధర్మకర్తల మండలి తక్కువ రేటుకు టెండర్ కేటాయించి నాణ్యత లేని, కల్తీనెయ్యి సరఫరా జరిగిందనే విషయం ఇప్పటికే తిరుమల పోటులోని వైష్ణవ బ్రాహ్మణులు గత ఏడాదే వెల్లడించారు. ఎవరిని బాధ్యుల్ని చేశారు, ప్రభుత్వం ఎవరి పైన ఎలాంటి చర్యలు తీసుకుంటుందనేది ఇప్పుడు ఉత్కంఠగా మారుతోంది. ఈ కల్తీనెయ్యి వివాదం ఎవరి మెడకు చుట్టుకోనుందనే విషయం టిటిడి ఉద్యోగుల్లో ఆందోళన కలిగిస్తోంది.

27-4pg4.qxd:27-4pg4.qxd 1/1/02 6:50 AM Page 1



వార్త

అందరిలోనూ శక్తిసామర్థ్యాలు ఎంతో కొంత ఉంటాయి. వాటిని వినియోగించుకోవడంలోనే అసలు సమస్య ఉంటుంది.

న- రామకృష్ణ పరమహంస

# ఆగని తుపాకి 'కల్చర్'

తన వాచాలతతో ఇంటా బయటా శత్రువులను పెంచుకున్న ట్రంప్‌కు మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. మరోసారి ఆయనపై హత్యాయత్నం జరిగింది. అమెరికా రాజధాని వాషింగ్టన్ హిల్టన్‌హోటల్లో జరిగిన వైట్‌హౌస్ కరస్పాండెంట్స్ అసోసియేషన్ డిన్నర్ కార్యక్రమంలో జరిగిన కాల్పుల ఘటన యావత్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. శనివారం రాత్రి జరిగిన ఈ కార్యక్రమానికి అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రథమ మహిళ మెలానియా ట్రంప్, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఇతర కీలక ఉన్నతాధికారులు హాజరయ్యారు. డొనాల్డ్ ట్రంప్ వేదికపై ప్రసంగించడానికి సిద్ధమవుతున్న తరుణంలో హోటల్ వెలుపల భద్రతా చెక్‌పాయింట్ వద్ద ఒక్కసారిగా తుపాకీ శబ్దాలు వినిపించాయి. దీంతో అప్రమత్తమైన సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు మెరుపు వేగంతో స్పందించి ట్రంప్ దంపతులను సురక్షి త ప్రాంతానికి తరలించారు. అమెరికా అధ్యక్ష పదవి అంటేనే అదొక ప్రమాదకరమైన వృత్తి అనే విషయం ముందే తెలిసి రెండోసారి ఎన్నికల బరిలోకి దిగిన ఆయనకు ఇదేమీ పూలబాట కాదని ముందే తెలుసు. అందుకే ఈ హంతాత్సంఘటనకు ఆయన అదరలేదు.బెదరలేదు. కాసేపటిలో తేరుకున్న ఆయన ఇరాన్‌పై యుద్ధంలో విజయం సాధించకుండా తనను ఇలాంటి సంఘటనలు ఏమాత్రం ఆపజాలవని ట్రంప్ స్పష్టం చేశారు. ఆయన పై దాడి ఇదే మొదటిసారి కాదు. మూడోసారి. రెండో సారి అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో ఇలాంటి సంఘటనే ఒకటి జరిగింది. 2024 జూలై 13న పెన్సిల్వేనియా ప్రచార ర్యాలీలో ట్రంప్‌పై హత్యాయత్నం జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో దుండగుడు జరిపిన కాల్పుల్లో ట్రంప్ చెవికి స్వల్ప గాయమైంది. అయినా ఆయన విజేతగా బయటకొచ్చాక ఆ విష యాలన్నీ మర్చిపోయారు. తాజా కాల్పుల ఘటనపై ట్రంప్ శ్వేతసౌధంలో మాట్లాడారు. దుండగుడు అనేక ఆయుధాలతో సెక్యూరిటీ చెక్‌పాయింట్ పైకి దూసుకొచ్చి నట్లు తెలిపారు. ఈ కాల్పులు ఘటన వైట్‌హౌస్ బాల్ రూమ్ ఆవశ్యకతను తెలియజేస్తోందన్నారు. తనకు అసాధారణ భద్రత కావాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పుడు పశ్చిమాసియా యుద్ధంలో ట్రంప్ ఎంతో దూకుడుగా వ్యవహరిస్తున్నారు. ఏదైనా సమస్య వస్తే ఇరాన్ వైపు నుంచే వస్తుందని ఎంతో జాగ్రత్తగా ఉన్న ట్రంప్ అంతర్గతంగా కూడా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందని తాజా సంఘటన నిరూపిస్తోంది. అంతర్గతంగానే అమెరికన్‌ల నుంచే తనపై దాడి జరగడం అందరినీ విస్మయం గొలిపింది. ఇప్పటికే అమెరికా చరిత్రలో నలుగురు అమెరికా అధ్యక్షులు ఇలాంటి దాడుల్లోనే ప్రాణాలు కోల్పోయారు. శనివారం ట్రంప్‌పై దాడి జరిగిన హిల్టన్ హోటల్‌కు ఒక చారిత్రక ప్రాధాన్యత కూడా ఉంది. 1981 మార్చిలో అప్పటి అధ్యక్షుడు రోనాల్డ్ రీగన్‌పై ఇదే హోటల్ బయట హత్యాయత్నం జరిగింది. ఈ దాడిలో ఆయన ఊపిరితిత్తులకు తీవ్ర గాయమైంది. మళ్ళీ అదే హోటల్ లో తాజా సంఘటన జరగటం కాకతాళీయమే. ఇలాంటి సంఘటనలకు 'తాను భయపడను గాక భయ పడను'. తన వార్ పాలసీలో తాను ఎన్నటికీ వెనక డుగు వేసేది లేదని ఆయన ఘంటాపదంగా చెబుతు న్నారు. తనపై దాడి చేసిన దుండగుడు డెమొక్రటిక్ పార్టీ అభిమాని అని కూడా చెప్ప చూసారు. ఇలాంటి దుశ్చర్యలను ఎవరైనా ఖండించాల్సిందే. ఈ ఘటనను ఖండిస్తూ, 'ప్రజాస్వామ్యంలో హింసకు స్థానం లేదని'భారత ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. అధ్యక్షుడు ట్రంప్, ఆయన కుటుంబ సభ్యులు క్షేమంగా ఉన్నారన్న వార్త తనకు ఉపశమనం కలిగించిందని ప్రధాని పేర్కొన్నారు. ఈ ఘటనపై ప్రధాని మోదీ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందించారు. సీక్రెట్ సర్వీస్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం నిందితుడు బుల్లెట్‌ప్రూఫ్ వెస్ట్ ధరించి, అత్యాధునిక ఆయుధాలతో భద్రతా వలయాన్ని ఛేదించి లోపలికి ప్రవేశించేందుకు ప్రయత్నించాడు. భద్రతా సిబ్బంది అతడిని అడ్డుకునే ప్రయత్నం చేయగా, నింది తుడు కాల్పులకు తెగబడ్డాడు. ఈ క్రమంలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఒక సీక్రెట్ సర్వీస్ అధికారికి ఛాతీపై బుల్లెట్ తగిలింది. అయితే అతను బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్ ధరించడంతో ప్రాణాపాయం నుంచి బయట పడ్డాడని అధికారులు తెలిపారు. దాడికి పాల్పడిన వ్యక్తిని కాలిఫోర్నియాలోని టోరెన్స్‌కు చెందిన కోల్ థామస్ అలెన్ (31)గా గుర్తించారు. ఇవన్నీ చూసాక అమెరికా అధ్యక్ష పదవిని చేపట్టడం కత్తిమీద సాములాంటిదని అర్థమవుతుంది. రాజకీయంగా తీవ్ర విభేదాలున్న దేశం కనుకనే ఎందరో అధ్యక్షులు ఇలాంటి దాడులను ఎదుర్కొన్నారు. వీరిలో నలుగురు ప్రాణాలు కూడా కోల్పోయారు. చరిత్రలో తొలిసారి హత్యకు గురైన అధ్యక్షుడు అబ్రహాం లింకన్. బానిసత్వ నిర్మూలన కోసం అంతర్యుద్ధ పరిస్థితుల్లోనూ దేశాన్ని నడిపించారు. ఆయన, 1865 ఏప్రిల్ 18న వాషింగ్టన్లోని ఒక థియేటర్లో కాల్పులకు బలయ్యారు. ఆయన తర్వాత జేమ్స్ గారిఫీల్డ్ (1881), విలియం మెకిన్లీ (1901) కూడా హత్యకు గురయ్యారు. అధ్యక్ష పదవిలో ఉండి హత్యకు గురైన వారిలో జాన్ ఎఫ్. కెన్నడీ ఉదంతం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. 1963 నవంబర్ 22న డల్లాస్‌లో కారులో వెళ్తున్నప్పుడు బహిరంగంగా కాల్పులు జరిపి ఆయన్ను హత్య చేశాడు. మరో ఐదేళ్లకే కెన్నడీ సోదరుడు రాబర్ట్ కెన్నడీ కూడా అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో ఉండగానే హత్యకు గురయ్యారు. అమెరికా చరిత్రను బట్టి చూస్తే అసలే దుందుడుకు స్వభావిగా పేరు పడిన ట్రంప్ మహాశయుడు చాలా అప్రమత్తంగా మెలగాల్సి ఉంది. ప్రమాదం నిరంతరం వెన్నాడుతూనే ఉంటుందని వేరే

విధి అంటూ ఎవరూ సృష్టించలేదు. మనకు మనమే సృష్టించుకున్నాం. మన మాట, ఆలోచన, ప్రవర్తన వల్ల మన జీవితానికి మనమే బాధ్యులం.



డబ్ల్యు ఎమర్సన్

శత్రువుని జయించినవాడు విజేతకాడు. శత్రుత్వాన్ని జయించినవాడే నిజమైన విజేత.



స్వామి వివేకానంద

# నారీ శక్తి ముసుగులో డీలిమిటేషన్ కుట్ర!

**కాంగ్రెస్ నుంచి ద్రవిడ, తెలుగు పార్టీల వరకు అందరూ ఒకే మాట 'మహిళా రిజర్వేషన్ కావాలి, కానీ దక్షి ణ రాష్ట్రాలను బలిపీఠం చేసే డీలిమిటేషన్ కాదు.' ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వంటి రాష్ట్రాలు జనాభా నియంత్రణలో జాతీయ నమూనాగా నిలిచాయి. వాటి సీట్లు తగ్గితే సమాఖ్య సమతుల్యం దెబ్బతింటుంది. ఇది కేవలం రాజకీయ లాభం కోసం రాష్ట్రాల మధ్య వైరం రెచ్చగొట్టడం. కేంద్రం ఇప్పుడు 'ప్రతిపక్షాలు మహిళల వ్యతి రేకులు' అని దేశవ్యాప్తంగా ప్రచారం చేస్తోంది. కానీ నిజం ఏమిటి? ప్రభుత్వం సొంత వ్యూహంవల్లే బిల్లు వీగిపోయింది. మహిళా సాధికారతను నిజంగా కావాలంటే 2023 బిల్లును వేరుగా అమలు చేసి, డీలిమిటేషన్‌ను సమగ్ర చర్చతో ముందుకు తీసుకెళ్లాలి. ఈ ఓటమి కేంద్రానికి మాత్రమే కాదు. దేశ రాజకీయ వ్యవస్థకు పాఠం. సమాఖ్య ధర్మం ఇంకా బలంగా ఉంది. దక్షి ణ రాష్ట్రాలు తమ హక్కులను కాపాడుకున్నాయి. మహిళల సాధికారత నిజమైన మార్గంలో ముందుకు సాగాలంటే ప్రభుత్వం ఇకపై ముసుగులు వేయకుండా, నిజాయితీతో చర్చించాలి.**



కాలగిరి శ్రీనివాస్ రెడ్డి

భారత రాజకీయ వేదికపై ఒక కీలక మలుపు తిరిగిన క్షణం ఇది. మహిళా సాధికారత అనే పవి త్రమైన లక్ష్యాన్ని ముం దుంచుకుని వచ్చిన ఒక చట్టం.కానీ దాని వెనుక దాగి ఉన్న రాజకీయ వ్యూహాలు, ప్రాంతీయసమతుల్యంపై పడే ప్రభావం దేశవ్యాప్తంగా చర్చకు దారితీ శాయి. 'నారీ శక్తి అనే ఆకర్ష ణీయ నినాదం కింద డీలిమిటేషన్ వంటి సున్నితమైన అంశాన్ని కలిపి ప్రవేశ పెట్టినప్పుడు, అది కేవలం ఒక శాసన ప్రక్రియగా మిగల లేదు.సమాఖ్య వ్యవస్థ, రాష్ట్రాల హక్కులు,రాజకీయ నైతికత అన్నీ ఒకే వేదికపై పరీక్షి ంచబడిన పరిస్థితి ఏర్ప డింది. ఈ నేపథ్యంలో లోక్‌సభలో జరిగిన ఓటింగ్ కేవలం సంఖ్యల పోటీకాదు. అది కేంద్రరాష్ట్ర సంబంధాల భవిష్య త్తును నిర్ణయించే ఘట్టంగా మారింది. ఒకవైపు మహిళా రిజర్వేషన్‌కు మద్దతు అనే నైతిక బాధ్యత, మరోవైపు రాష్ట్రాల న్యాయమైన వాటాను కాపాడాల్సిన అవసరం, ఈ రెండింటి మధ్య జరిగిన ఈ పోరు భారత రాజకీయాల్లో అరుదైన ఉదాహరణగా నిలిచింది. ఇదే సంఘటన 'నారీ శక్తి ముసుగులో రాజకీయ ప్రయోజనాలా? లేక సమాఖ్య ధర్మానికి రక్షణగా నిలిచిన ప్రజాస్వామ్యమా? అనే ప్రశ్నను దేశం ముందుంచింది. ఈ నేపథ్యంతో లోక్‌సభలో జరిగిన పరిణామాలు ఎలా మలుపుతిప్పాయో చూద్దాం. లోక్‌సభలో ఏప్రిల్ 17, 2026న జరిగిన ఓటింగ్‌లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు వీగిపోవడం ఒక సాధారణ శాసన వైఫల్యం కాదు. అది కేంద్ర ప్రభుత్వ వ్యూహాత్మక రాజకీయాలకు స్పష్టమైన చెంపపెట్టు. మహిళా రిజర్వేషన్‌ను 'నారీ శక్తి పేరుతో రాజకీయ ఆయుధంగా మలచి, దానిని డీలిమి టేషన్ (నియోజకవర్గాల పునర్విభ జన) తో కలిపి ఒకే ప్యాకేజీగా తీసుకురావడం ద్వారా దక్షి ణాది రాష్ట్రాల సమాఖ్య హక్కులను కుదించాలని చేసిన ప్రయత్నం పూర్తిగా విఫలమైంది. 298 ఓట్ల మద్దతు, 230 వ్యతిరేక ఓట్లతో రెండింతల మెజారిటీ (352) సాధించలేక పోవడంతో బిల్లు కూలిపోయింది. దీంతో అనుబంధ డీలిమిటేషన్ బిల్లు, కేంద్రపాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లులను ప్రభుత్వం స్వయంగా ఉపసంహరించుకోవాల్సి వచ్చింది. ఇది కేవలం ఓటు లెక్క కాదు.భారత రాజకీయ వ్యవస్థలో సమాఖ్య స్ఫూర్తి ఇంకా బలంగా ఉందని నిరూ పించిన చారిత్రక క్షణం. 2023లో నారీ శక్తి వందన అధి నియమం (106వ సవరణ) ఏకగ్రీవంగా ఆమోదం పొందిం ది. మహిళలకు లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీల్లో 33 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని



నిర్ణయం. కానీ అమలు? 2026 తర్వాత మొదటి జనాభా లెక్కలు (సెన్సస్) అనంతరం డీలిమిటేషన్ పూర్తయ్యే వరకు వాయిదా. అంటే 2034 వరకు ఆశించాల్సిన పరిస్థితి. ఇప్పుడు 2026లో ప్రభుత్వం హడావుడిగా స్పెషల్ సెషన్ పిలిచి మూడు బిల్లులు తెచ్చిం ది. 131వ సవరణ ద్వారా 2011 జనాభా లెక్కల ఆధా రంగా డీలిమిటేషన్ చేసి 2029 ఎన్నికల నుంచే మహిళా కోటా అమలు చేయాలని, లోక్‌సభ సీట్లు 543 నుంచి 850కి పెంచాలని, యూటీల్లో కూడా అమలు చేయాలని నిర్ణయించింది.ఉద్దేశ్యం ఒకటే మహిళా సాధికారతను ముసు గుగా ఉపయోగించి డీలిమిటేషన్‌ను త్వరగా ముగించడం. ఇది ఉత్తరాది రాష్ట్రాలకు (జనాభా ఎక్కువగా ఉన్నవి)మరిన్ని సీట్లు ఇచ్చి, దక్షి ణాది రాష్ట్రాలు (జనాభా నియంత్రణలో సాధించిన విజయం కారణంగా) సీట్లు తగ్గించే వ్యూహం. దీనిని ప్రతిపక్షాలు (ఇండియా కూటమి) స్పష్టంగా చెప్పా యి. మహిళలకు రిజర్వేషన్ మద్దతు ఉంది, కానీ డీలిమి టేషన్ ద్వారా దక్షి ణ రాష్ట్రాలను శిక్షి ంచే ప్రయత్నం సహిం చేది కాదు. ఇక్కడే కేంద్ర వ్యూహం బయటపడింది. 2023 లో బిల్లును వాయిదా వేసినప్పుడు ప్రభుత్వం సెన్సస్, డీలిమిటేషన్ తర్వాతే' అని చెప్పింది. ఇప్పుడు హడావుడిగా 2011 డేటాను ఉపయోగించి త్వరగా అమలు చేయాలన డం ఎందుకు? ఎందుకంటే 2026 సెన్సస్ పూర్తి కావాల్సి ఉంది. దాని ఆధారంగా డీలిమిటేషన్ జరిగితే దక్షి ణ రాష్ట్రా ల సమాఖ్య హక్కులు కాపాడబడతాయి. కేంద్రానికి అది అనుకూలం కాదు. ఉత్తర రాష్ట్రాల్లో తన బలం ఎక్కువగా ఉండటం వల్ల సీట్లు పెరిగితే ఎన్నికల లాభం. మహిళా రిజర్వేషన్‌ను ఇలా'ట్రోజన్ హార్స్'గా ఉపయోగించడం రాజ కీయ నైతికతకు ముఖ్యమైన ప్రశ్న. మహిళల సాధికారత నిజమైనదైతే డీలిమిటేషన్‌ను వేరుగా చర్చించి, సమాఖ్య సంప్రదింపులతో ముందుకెళ్లాలి. కానీ ప్రభుత్వం ఒకే ప్యాకే జీలో కట్టి, 'మహిళల వ్యతిరేకులు'అని లేబుల్ వేసి వ్యతిరే కతను అణచివేయాలని చూసింది. ఇది కేంద్ర ప్రభుత్వ రాజకీయ శైలి –జనాభా, మతం, ప్రాంతాలు వంటి వాటిని ఉపయోగించి అధికారాన్ని కాపాడుకోవడం.ప్రతిపక్షాలఐక్యత ఈ ఆటను ఆపేసింది. కాంగ్రెస్ నుంచి ద్రవిడ, తెలుగు పార్టీల వరకు అందరూ ఒకే మాట 'మహిళా రిజర్వేషన్ కావాలి, కానీ దక్షి ణ రాష్ట్రాలను బలిపీఠం చేసే డీలిమిటే షన్ కాదు.' ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వంటి రాష్ట్రాలు జనాభా నియంత్రణలో జాతీయ నమూనాగా నిలిచాయి. వాటి సీట్లు తగ్గితే సమాఖ్య సమతుల్యం దెబ్బతింటుంది. ఇది కేవలం రాజకీయ లాభం కోసం రాష్ట్రాల మధ్య వైరం రెచ్చగొట్టడం. కేంద్రం ఇప్పుడు 'ప్రతిపక్షాలు మహిళల వ్యతి రేకులు' అని దేశవ్యాప్తంగా ప్రచారం చేస్తోంది. కానీ నిజం ఏమిటి?ప్రభుత్వం సొంత వ్యూహంవల్లే బిల్లు వీగిపోయిం ది. మహిళా సాధికారతను నిజంగా కావా లంటే 2023 బిల్లును వేరుగా అమలు చేసి, డీలిమిటేషన్ ను సమగ్ర చర్చతో ముందుకు తీసుకెళ్లాలి. ఈ ఓటమి కేంద్రానికి మాత్రమే కాదు. దేశ రాజకీయ వ్యవస్థకు పాఠం. సమాఖ్య ధర్మం ఇంకా బలంగా ఉంది. దక్షి ణ రాష్ట్రాలు తమ హక్కులను కాపాడుకున్నాయి. మహిళల సాధికారత

# గంటలో తిరుమలేశుని దర్శనం సాధ్యమేనా?

అప్పన్న గొనప

తిరుమలలో భక్తులకు దర్శనం అనేది కేవలం ఒక సేవ మాత్రమే కాదు, అది విశ్వాసం, ఆధ్యాత్మిక అనుభూతి, సామూహిక భావోద్వేగాల సమ్మేళనం.ఈ నేపథ్యంలో సామాన్య భక్తులకు వేగవంతమైన దర్శనం కల్పించాలనే ఆలోచన ఎప్పటికప్పుడు ముందుకు వస్తూనే ఉంది. ముఖ్యంగా రెండు మూడు సంవత్సరాల క్రితం తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తల మండలి సమావేశాల అనంతరం భక్తుల వేచి ఉండే సమయాన్ని గణనీయంగా తగ్గించేందుకు చర్యలు తీసుకుంటామని, సర్వదర్శనం వ్యవస్థను మరింత సమర్థవంతంగా మార్చాలని సంకల్పం వ్యక్తమైంది. ఆ సమయంలో 'ఒక గంటలో దర్శనం లక్ష్యం' అనే దిశగా వ్యాఖ్యానాలు వినిపించాయి. ఇవి ఖచ్చితమైన అమలు గడువుతో కూడిన అధికారిక హామీగా కాకుండా, భక్తులకు మెరుగైన సేవ అందించాలనే లక్ష్య ప్రకటనగా చూడాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం తిరుమలలో పరి స్థితి చూస్తే, సర్వదర్శనం కోసం భక్తులు ఇంకా గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. ముఖ్యంగా సెలవులు, పండుగలు, వేసవి కాలంలో ఈ రద్దీ మరింత పెరుగుతోం ది. రోజుకు లక్షల సంఖ్యలో భక్తులు విచ్చేసే పరిస్థితుల్లో, దర్శన వ్యవస్థపై ఒత్తిడి సహజం. ఈ నేపథ్యంలో క్యూ లైన్లు తగ్గడం కంటే, రద్దీని సమర్థంగా నిర్వహించడం పెద్ద సవాలుగా మారింది. అయినప్పటికీ, భక్తుల అనుభ వం సులభతరం కావాలంటే వేచిఉండే సమయాన్ని తగ్గిం చడం తప్పనిసరి. ఆన్‌లైన్ టికెట్ వ్యవస్థను ప్రవేశపెట్టడం ద్వారా ముందస్తు ప్రణాళికకు అవకాశం కల్పించినప్పటికీ, డిమాండ్ ఎక్కువగా ఉండటంతో టికెట్లు కొద్ది నిమిషాల్లోనే పూర్తవుతున్నాయి. టిటిడి ఆఫిషియల్ వెబ్‌సైట్‌లో విడుదలయ్యే దర్శనం టికెట్లు, వసతి గదులు సాధారణ భక్తులకు అందుబాటులోకి రావడం కష్టమవుతోంది. ఇది వ్యవస్థలో లోపం కంటే, భక్తుల అధిక ప్రవాహాన్ని సూచించే అంశంగా చూడవచ్చు. అయినప్పటికీ, అందరికీ సమాన



అవకాశాలు కల్పించాలంటే విడుదల విధానంలో మరింత పారదర్శకత, విస్తరణ అవసరం. ఇప్పటి పరిస్థితిని పరిశీలిస్తే, తిరుమల దర్శన వ్యవస్థలో కొన్ని మెరుగుదలలు కనిపిస్తున్నాయి. టైమ్ స్లాట్ దర్శనం, టోకెన్ వ్యవస్థ, డిజిటల్ సమాచారం వంటి అంశాలు అందులో భాగం. అయితే ఇవి భక్తుల సంఖ్యకు సరిపడా విస్తరించబడకపోవడం వల్ల, సాధారణ భక్తులకు ఇంకా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా సర్వదర్శనం క్యూలలో ఉండే అనిశ్చితి ఎంత సమయం పడుతుందో తెలియకపోవడం భక్తుల అసౌకర్యానికి కారణమవుతోంది. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, దర్శన వ్యవస్థను మరింత సమర్థవంతంగా మార్చేందుకు కొన్ని స్పష్టమైన మార్పులు అవసరం. ముందుగా, సర్వదర్శనం క్యూలను పూర్తిగా డిజిటల్ ట్రాకింగ్‌లోకి తీసుకురావడం ద్వారా భక్తులకు రియల్‌టైమ్ సమాచారం అందించాలి. క్యూలో ప్రవేశించే సమయంలోనే అంచనా సమయాన్ని తెలియజేస్తే,భక్తులు తమసమయాన్ని సమర్థంగా వినియోగించుకోగలరు. అదేవిధంగా, రోజువారీ దర్శన స్లాట్లను సమతుల్యం చేసి, ప్రత్యేక దర్శనాల సంఖ్యను పునఃసమీక్షి ంచడం ద్వారా సాధారణ దర్శ నానికి మరింత ప్రాధాన్యం ఇవ్వవచ్చు. ఇంకా, ఆన్‌లైన్ టికెట్ విడుదల విధానాన్ని విస్తరించి, ఒకేసారి కాకుండా విడతల వారీగా విడుదల చేస్తే మరింత మందికి అవకాశం లభిస్తుంది. వసతి గదుల కేటాయింపులో పారదర్శకత పెంచడం, స్థానికంగా స్పాట్ బుకింగ్ అవకాశాలను పెంచ డం కూడా అవసరం. భక్తుల రద్దీని నియంత్రించేందుకు, ముందస్తు నమోదు విధానాలను ప్రోత్సహించడం ద్వారా అనవసరంగా వచ్చే ఒత్తిడిని తగ్గించవచ్చు. మొత్తానికి, తిరు మలలో 'ఒక గంటలో దర్శనం' అనే భావన ఒక లక్ష్యంగా నిలుస్తూనే ఉంది. ప్రస్తుతం ఉన్న పరిస్థితులు చూస్తే, అది పూర్తిగా అమలులోకి రాకపోయినా, దిశ మాత్రం సరైనదే. భక్తుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యం లో, వ్యవస్థను నిరంతరం అభివృద్ధి చేయడం తప్పనిసరి. మాటలకంటే చర్యలు ముఖ్యమని గుర్తిస్తూ, పారదర్శకత, సమర్థత, సమానత్వం అనే మూడు సూత్రాలపై దృష్టి

# ప్రపంచ శాంతికి మతాలు ప్రతీకలేనా?

దాడిశెట్టి శ్యామ్ కుమార్

ప్రపంచంలో విభిన్న మతాలలోని ఆధ్యాత్మికత చింతన మానవ జీవన విధానాల్లో ప్రతిబింబిస్తూ ఉంటుంది. సమాజంలో జీవిత సత్యాలు భక్తి భావం, దైవం లాంటి అనేక అంశాలు మత విశ్వాసాలతో ప్రజల్లో ముడిపడిన అంశంగా పూర్వకాలం నుండి కొనసాగుతూ వస్తూనే ఉన్నా యి. అంతర్గతంగా మానసిక ఆలోచనా ధోరణులు మానవ జీవన విధానాలను ప్రభావితం చేస్తూ ఉంటాయి. మత భావజాలం, ఆధునిక పోకడలు మానవ సమాజం చుట్టూ పరిభ్రమిస్తూ ఉంటాయి. ఆధ్యాత్మిక చింతనతో కూడిన ధర్మ ప్రవచనాలు ఆయా మత విశ్వాసాలకు అనుగుణంగా తరచుగా మానవ సమూహాల్లో సమ్మిళితమై ఉంటాయని అనిపిస్తుంది. మతోన్మాదాన్ని హింసాత్మక సంఘటనలను మతాలు ప్రోత్సహించవు, సహించవు. మనుషుల మధ్య వైషమ్యాలు,విద్వేషాలను, కలహాలను మతాలు పెంపొందించవు. సమాజంలో మానవ జీవన విధానాల్లో విధ్వంసాలను సృష్టించవు. మతం అనేది సారూప్యత కలిగిన జీవన విధానాలకు మంచి వారధిగా మనుషుల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించి అత్యున్నతమైన మానవతా విలువలకు ఆదర్శవంతంగా నిలుస్తున్నాయి. అయితే కొంతమంది మతం పేరిట మారణహోమం సృష్టిస్తూ యధేచ్ఛగా హింస మార్గాన్ని అవలంబిస్తూ అనవసరంగా మానవ సమూహాల మధ్య చిచ్చుపెట్టే రీతిలో హింస వాదాన్ని తెరపైకి తీసుకొచ్చే ప్రయత్నం చేయడం విచారకరం. మతాన్ని అడ్డు పెట్టుకొని మతోన్మాదానికి పాల్పడుతున్న కొంతమంది చేస్తున్న అరాచకాలు మానవ తప్పిదాలుగానే భావించవలసి ఉంటుందేమో. మతాల పేరు చెప్పుకొని కొంతమంది చేసే వినాశకర కార్యకలాపాలు మానవ నాగరికత సమాజాన్ని అవహేళన చేస్తున్నట్టుగా అనిపిస్తుంది. అలాంటి ఉన్మాద కార్యకలాపాలను అడ్డుకోవాల్సిన ఆవశ్యకత నేడు ప్రపంచ స్థాయిలో అన్ని దేశాల్లోని ప్రజలకు ఉందని చెప్పడంలో సంశయం లేదు. మానవులు సహజంగా జీవిత ప్రమాణ కాలాన్ని పెంచుకునేందుకు జీవితాంతంఅనుకూల ప్రతికూల పరిస్థితుల మధ్య జీవన పోరాటం కొనసాగిస్తున్న విధానంలో చాలా వరకు ఆధునిక జీవన విధానాల్లో సైతం ఆధ్యాత్మికతో కూడిన భక్తి విశ్వాసాలు సమాజంలో ఎక్కువగా గోచరిస్తూంటాయి. ప్రస్తుత ఆధునిక జీవన ప్రపంచంలో ఆకాశం అంతరిక్షంలోని విషయాలను ప్రత్యక్షంగా పరోక్షంగా వీక్షి స్తున్న మానవుని మేధాశక్తి మానవజాతి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఉపయోగకరమైన ఆచరణాత్మక ఆలో చన ధోరణి కలిగి ఉండాలి కానీ,మితిమీరిన చాందస్తవాదం బలోపేతం కాకుండా నవీన నాగరిక సమాజం పరిస్థితులకు అనుగుణంగా అన్నిమతాలను పరస్పరం గౌరవిస్తూ,సమైక్య వాదంతో మానవులంతా ఒకటే అనే భావం ముందు తరా లకు బలంగా పునాదులు వేసే విధంగా మతాల ఆధ్యాత్మిక బోధనలు సూటిగా చెప్పవలసిన ఆవశ్యకత మరింతగా



గోచరిస్తుంది. అప్పుడే ప్రపంచ శాంతి సౌభాగ్యం మానవ అభ్యున్నతికి సోపానాలుగా మిగిలిపోతాయి కావచ్చు. పురాతన కాలం నుండి మానవాళి ఏదో ఒక రూపంలో దైవత్వాన్ని కొలుస్తున్నారు. ఆది మానవుడు ప్రకృతి దేవతలను పూజించడం చరిత్ర చెబుతోంది. క్రమేపీ మతాలు మంచి మానసిక ఆలోచనాత్మక ధోరణికి, ఆత్మశక్తి కొరకై ఆధ్యాత్మిక భావనతో కూడిన జీవిత సత్యాలను విధానాలను విశ్లేషించే దిశగా ప్రజల్లోకి చొచ్చుకురావడంతో, ప్రపంచంలోని సనాతన ధర్మాలు నమ్మకాలు మత విశ్వాసాలకు ప్రాతిపదికన మానవత్వాన్ని చాటుకోవడానికి మనుషుల మధ్య పరస్పర సహకారం ఉండాలని కష్ట నష్టాల్లో సహకరించుకోవాలని, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం లాంటి అనేకమైనటు వంటి జీవితసత్యాలు ఆత్మబలానికి సంబంధించిన వ్యాఖ్యానాలు మత గ్రంథాల్లో తరచుగా వినిపిస్తుంటాయి, అందుకే ప్రపంచంలో అనేక మతాలు కాలాలకు అనుగుణంగా ప్రజల ఆదరాభిమానాలను విపరీతంగా చూరగొంటున్నాయేమో. కొందరు ఆయా మత విశ్వాసాలకు ఆకర్షితులై మత విధానాలను అవలంబిస్తూ ఉన్నప్పటికీ, మతాలు ఆధ్యాత్మిక చింతనతో మానవత్వం పరిమళించే విధంగా మానవ సంబంధాల ఆవశ్యకత అనుబంధాల అవసరం శాంతి , సామరస్యం కోసం సమాజంలో మానవులు సమైక్య జీవన విధానాలను శాంతియుతంగా గడపడానికి మనిషి జీవన విధానాలకు ప్రేరణగా నిలుస్తూ ఉండడం విశేషం.మతాల సారం మానవ మనుగడకు జీవం పోసేవిధంగా ఉంటాయి. శాంతి అహింస, జాలి, దయా,కరుణ లాంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని ఏ మతమైనా మానవతా వాదాన్ని బోధిస్తుంది. కానీ కొంతమంది స్వార్థపూరిత ప్రయోజనాలకు మతాన్ని అడ్డం పెట్టుకొని చేసే దుర్మార్గమైన పనులను ఏ మతానికి చెందిన వారినైనా ఎక్కువగా తిరస్కరిస్తారు. అందుకే ప్రపంచంలో చివరికి నీతి నిజాయితీతో కూడిన వాస్తవికతనే ప్రజల్లో ఆలోచన విధానాలకు కారణమై ఉండవచ్చు. అందుకే మానవ జీవన విధానాలలో మత గ్రంథాలు మత విశ్వాసాలు అందులోని మంచి సారాంశం ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయేమో అనిపిస్తుంటుంది.ఏది ఏమైనప్పటికీ ప్రపంచంలో ఎవరికి ఏదీ పూర్తిగా, శాశ్వతం కాదు అనే ధోరణి సమాజంలో లేకపోలేదు. ఈ క్రమంలో బ్రతికినంత కాలం జీవన విధానాల్లో సమ్మిళితమైన ఉత్తమ ఆధ్యాత్మిక మత విశ్వాసాలకు అనుగుణంగా సమస్త మానవాళి ఆధునిక భావనలతో ముందు తరాలకు ఆదర్శప్రాయంగా నిలవాల్సిన అవసరం మరింతగా ఉంటుందేమో. సూర్యుడి నుండి వచ్చే వెలుతురు, గాలి, నుండి లభించే ప్రాణవాయువు త్రాగడానికి కావలసిన నీరు ఇలాంటివి సర్వ మానవాళి మనుగడలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్న వనరులు మతాలకు అతీతమైనవి. అలాంటి ప్రకృతి వనరులను సమానంగా ఆస్వాదిస్తున్న మానవుల మధ్య మత సామరస్యం అత్యంత కీలకమైనది. మతాలు అనేక రకాలుగా గోచరిస్తున్నా మానవులలో విభిన్న ఆలోచనలు భౌతికపరమైన మౌలిక అవసరాలు ఇంద్రియాలు జీవన ప్రక్రియలు అన్నీ సారూప్యత కలిగినవే. మతం అనేది ప్రపంచవ్యాప్తంగా మానవ జీవన విధానాలను ప్రభావితం చేస్తూనే ఉంది. మారుతున్న కాలంతో పాటు మానవుడు అధునాతన పరిజ్ఞానాన్ని మేధాశక్తిని గణనీయంగా పెంచుకుంటున్న తరుణంలో మతం అనేది ఆధ్యాత్మిక మానసిక వికాసానికి ప్రపంచ శాంతి సుస్థిరతకు ప్రతీకగా మరింతగా పురోగ

# ప్రజావాక్కు

### క్వాంటం వ్యాలీ ఒక మైలురాయి

ఆంధ్రప్రదేశ్ రాజధానిఅమరావతిలో నిర్మిస్తున్న క్వాంటం వ్యాలీ ప్రాజెక్ట్ భారతదేశ సాంకేతిక చరిత్రలో ఒక మైలు రాయి. తుళ్లూరు మండలంలో ఏర్పాటు చేస్తున్న ఈ సెంటర్,దేశంలోనే తొలి133క్యూబిట్ క్వాంటం కంప్యూటర్ (సిస్టమ్2) కు నిలయం కానుంది. ఐబీఎం, టీసీఎస్ వంటి దిగ్గజసంస్థలభాగస్వామ్యంతో రూపుదిద్దుకుంటున్న ఈ టెక్ పార్క్, పరిశోధకులు స్టార్టప్‌లకు అత్యాధునిక వనరులనుఅందుబాటులోకి తెస్తుంది. క్వాంటం కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో శిక్షణ ద్వారా దాదాపు లక్షఉద్యోగాల కల్పన ఈప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యం. క్వాంటం టెక్నాలజీ వల్ల ఫార్మా, మెటీరియల్ సైన్స్, క్లైమేట్ మాడలింగ్ వంటిరంగాల్లో పరిశోధనలు వేగవం తం అవుతాయి. ముఖ్యంగా 'క్వాంటం క్రిప్టోగ్రఫీ ద్వారా బ్యాంకింగ్, ప్రభుత్వ లావాదేవీలకు పటిష్టమైన సైబర్ సెక్యూరిటీ లభిస్తుంది. అమెరికా, చైనా వంటి దేశాలతో పోటీపడుతూ అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్ర ఉనికిని చాటడానికి ఇది గొప్ప అవకాశం.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### నీటి నిల్వలను పెంచాలి

తెలంగాణలో కుంటలు చెరువులు ఎక్కువగా ఉంటాయి. అవి చారిత్రక వారసత్వంగా కాకతీయుల నుండి మనకు వచ్చాయి.వాటినిఆసఫ్‌జాహిలు,కుతుబ్‌షాహీలు కొనసాగించారు విస్తరించారు.అయితేతెలంగాణ వ్యవసాయం వర్షాధారితం. బోర్లు, చెరువులు కుంటల మీద ఆధార పడిఉంది.అయితే తెలంగాణలో వ్యవసాయం విధ్వంసం జరిగిన తరవాత ఇప్పుడు తెలంగాణలో పెరిగిన నీటి వసతి ఆధారంగా తెలంగాణలో ప్రతిగ్రామంలో కుంటలు ఉంటాయి. కాబట్టి వాటిని ఉపాధి హామీలో డిసెలటింగ్ చేస్తే ఆ సారవంతం అయినా మట్టి రైతుల పొలాలలో పోసుకోవడానికి ఉపయోగపడుతుంది.

- భారత అవినాష్, జనగామ

### ఉద్యోగాల కోత

ఇప్పటి వరకు ఇంజనీరింగ్ విద్య చదివిన వారందరూ అధిక జీతాలకు ఆశపడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు ఎగబడి దేశ విదేశాలలో ఉద్యోగాలు సంపాదించుకున్నారు. ఇంకా ఎంతో మంది ఎదురు చూస్తున్నారు.వీరందరికి ఉద్యోగాలు దొరకక ప్రయివేటు సంస్థలలోను చిన్నదో పెద్దదో ఎంతో కొంత జీతానికి పని చేస్తున్నారు.

### వేడిమి వైపరీత్యం

ఎల్‌నినో పుణ్యాన ఈ సంవత్సరం ఎండలు తీవ్రంగా ఉన్నాయి. రెండునెలలపాటు మండేలాఉన్నాయి.జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థఈవిషయమై హెచ్చరించింది. ఎప్పటికప్పుడు ప్రజల్ని అప్రమత్తం చేస్తూసూచనలు వస్తున్నాయి. ప్రభుత్వం తీసుకున్న చర్యలతో గతంలో కన్నా వడదెబ్బల మరణాలు తక్కువగా నమోదవుతున్నాయి కానీ అనారోగ్య సమస్య మాత్రం తీవ్రంగానే ఉంది. ఉదయం నుండే ఎండ తీవ్రత పెరిగి ఏ రోజూ 40డిగ్రీల సెంటిగ్రేడ్ కన్నా తక్కువ ఉండడం లేదు సరికదా మునుపటి కన్నా ఎక్కువప్రాంతాలు ఈ దారిన పడ్డాయి. ఈపరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానికసంస్థలు కొన్ని అదనపు చర్యలు తీసుకోవాల్సి ఉంది.అందులో ముఖ్యంగా ఈ రెండునెలలపాటు పెన్షన్లు,ప్రజాపంపిణీ ద్వారా అందించే నిత్యావసర సరుకులు లబ్ధిదారుల ఇంటికే పంపించే ఏర్పాట్లు చెయ్యాలి.ఎక్కువ వడదెబ్బకు గురయ్యేది పేదలు,చిన్నచిన్న తోపుడు బళ్ళ, డెలివరీ బాయ్స్, కార్మికులు,ఈ తరహా వీధి వర్తకులు,ఉపాధి హామీ వినియోగించుకునే వాళ్ళ,వ్యవసాయ కార్మికులు. సమగ్రమైన ప్రణాళిక, సమన్వయంతో కూడిన పనితీరుతోనే ఈ విపత్తును దాటగలం.

- డా. డి.వి.జి.శంకర రావు, విజయనగరం

### అక్రమ కట్టడాలను తొలగించాలి

విశాఖపట్నం జిల్లా భీమునిపట్నం పరిధిలో అనుమతులు లేకుండా ఏపీటూరిజం శాఖ నిర్మించిన కాంక్రీట్ నిర్మాణాలను తొలగించాలని ఏపీహైకోర్టు నిన్నఆదేశించటం అభినందనీయం. అయితే రాష్ట్రంలో దొంగస్వాములు ప్రభుత్వ భూములను అక్రమించి ఆశ్రమాల పేరుతో మోసంచేస్తున్నారు.హైకోర్టు వారు ఈ ఆక్రమణలను కూడా సుమోటోగా స్వీకరించి కూల్చివేసేందుకు ఆదేశాలుఇవ్వాలి.దాదాపు 25 సంవత్సరాలుగా ఈ తంతు జరుగుతుంది.పేదవాడు ప్రభుత్వ భూమీలో గుడిసె వేసుకుంటే ఎందుకు కూల్చివేస్తారు? వాళ్ళకు కూడా ఏదోక రేటుకు అమ్మేస్తే సరిపోతుంది. గదా!

- వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### రోడ్డు రవాణా సంస్థ పనితీరు

గతంలో ఉన్న ప్రభుత్వం ఓట్ బ్యాంకు రాజకీయం కోసం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసింది.వారికి ఓట్లు పడలేదు. వారి కంటే ఒక అడుగు ముందుకు వేసి వారి కంటే ఎక్కువే ప్రజాధనాన్ని ఉచిత పథకాలకు నేటి ప్రభుత్వం అందిస్తూ ఉన్నది.ఏపీఎస్ఆర్టీసీల్లోమహిళలకు ఉచితప్రయాణంతోపాటు, దివ్యాంగులు కూడా ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించినది.

-వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

27-4Pg5.qxd:27-4Pg5.qxd 1/1/02 7:05 AM Page 1



# భారత్-న్యూజిలాండ్ మధ్య స్వేచ్ఛావాణిజ్యం



## నేడు ప్రధాని మోడీ సమక్షంలో ఒప్పందం

### ఆగ్రాలో పీయూష్ గోయల్, న్యూజిలాండ్ మంత్రి కీలక భేటీ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 26:** భారత్- న్యూజిలాండ్ మధ్య ఏప్రిల్ 27 సోమవారం స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఎ) కుదరనుంది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ సమక్షంలో భారత్, న్యూజిలాండ్ దేశాలు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఎ)పై సంతకం చేయనున్నాయి. ఈ ఒప్పందం ప్రకారం, న్యూజిలాండ్‌కు భారత్ చేసే 100శాతం ఎగుమతులపై సుంకాలను తొలగించడంతో పాటు, న్యూజిలాండ్ నుండి ప్రస్తుతం జరుగుతున్న 95శాతం దిగుమతులపై సుంకాలను గణనీయంగా తగ్గించడం లేదా పూర్తిగా తొలగించడం జరుగుతుంది. ఈ ఒప్పందం ద్వారా 100 శాతం సుంకాల విభాగాలపై భారతదేశానికి తక్షణమే సుంకరహిత ప్రవేశం లభిస్తుంది. భారతదేశం ఎగుమతి చేసే వస్త్రాలు,దుస్తుల ఉత్పత్తులు, తోలు వస్తువులు, శిరోభూషణాలు, సిరామిక్స్, తివాచీలు, ఆటో మొబైల్స్, ఆటో విడిభాగాలతో సహా సుమారు 450సుంకాల విభాగాలపై న్యూజిలాండ్ ప్రస్తుతం విధిస్తున్న 10 శాతం సుంకంతో పోలిస్తే ఇది చాలా తక్కువ. పాలు, మీగడ, మజ్జిగ, పెరుగు, జున్ను వంటి అన్ని పాల ఉత్పత్తులతో పాటు వ్యవసాయ ఉత్పత్తులతో సహా పలు వస్తువులను స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఏ) నుండి మినహాయించడంలో భారతదేశం విజయం సాధించింది. ఈ ఎఫ్‌టిఎలో న్యూజిలాండ్ 15 సంవత్సరాల కాలంలో భారతదేశంలో 20 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టే నిబంధన కూడా ఉంది. భారతదేశంతో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఎ)లో యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్ (ఇఎఫ్‌టిఎ) చేసిన 100 బిలియన్ డాలర్ల పెట్టుబడి 'నిబద్ధత' తరహాలోనే ఇది కూడా ఉంది. అంతేకాకుండా, ఈ ఎఫ్‌టిఎలో వృత్తి నిపుణులు,విద్యార్థుల రాకపోకలకు సంబంధించిన అనేక నిబంధనలు కూడా ఉన్నాయి. విద్యార్థుల రాకపోకలు, చదువు తర్వాత పని చేసే వీసాలపై న్యూజిలాండ్ మొట్టమొదటిసారిగా ఏ దేశంతోనైనా ఒకఅనుబంధ ఒప్పందంపై సంతకం చేసింది. దీని ప్రకారం, భారతీయ విద్యార్థులు న్యూజిలాండ్‌లో చదువుతున్నప్పుడు, పొడిగించిన చదువు తర్వాత పని చేసే వీసాలతో వారానికి 20 గంటల వరకు పని చేయవచ్చు. ఇంకా, ఈ ఒప్పందంలో నైపుణ్యం కలిగిన భారతీయుల కోసం 5,000 వీసాల కోటాను చేర్చారు. ఈ వీసాలు భారతదేశానికి ఆసక్తి ఉన్న రంగాలలో, అంటే ఆయుష్ వైద్యులు, యోగా శిక్షకులు,చెఫ్‌లు, సంగీత ఉపాధ్యాయులతో పాటు ఐటీ, ఇంజనీరింగ్, ఆరోగ్య సంరక్షణ, విద్య, నిర్మాణం వంటి ఇతర కీలక రంగాలలో, మూడు సంవత్సరాల వరకు ఉండేందుకు ఉద్దేశించబడ్డాయి. ఈ ఒప్పందంలో చేర్చబడిన వర్కింగ్ హాలిడే వీసా కార్యక్రమం కింద, ఏటా 1,000 మంది యువ భారతీయులు 12 నెలల కాలానికి న్యూజిలాండ్‌లోకి పలుమార్లు ప్రవేశించవచ్చు.

**ఆగ్రాలో కీలక సమావేశం:** కేంద్ర వాణిజ్య, పరిశ్రమలశాఖ మంత్రి పీయూష్ గోయల్, న్యూజిలాండ్ వాణిజ్య, పెట్టుబడులశాఖ మంత్రి టాడ్ మెక్‌క్లే ఆదివారం ఆగ్రాలో తోలు, పాదరక్షలు, ఆయుష్, ఫార్మా, వైద్య పరికరాలు, తేలికపాటి ఇంజనీరింగ్, క్రీడా వస్తువుల రంగాల నాయకులతో సమావేశమయ్యారు. 'వ్యాపార నాయకులతో ఎంతో విజ్ఞానాన్ని అందించే సమావేశం జరిగింది. నా స్నేహితుడు, న్యూజిలాండ్ వాణిజ్య, పెట్టుబడుల శాఖ మంత్రి అయిన ఎంపీ టాడ్ మెక్‌క్లే కూడా నాతో పాటు పాల్గొన్నారు' అని గోయల్ ఎక్స్‌లో రాశారు. 'అంతే కాకుండా, మన కళాకారులు, మహిళా పారిశ్రామికవేత్తల నైపుణ్యాలను చాటిచెప్పే 'ఆగ్రా: వరల్డ్ క్యాపిటల్ ఆఫ్ ఫుట్‌వేర్' బ్రాండ్ ప్రచారాన్ని ప్రారంభించాము. ఇది ఆగ్రాను ప్రపంచవ్యాప్త సోర్సింగ్ గమ్యస్థానంగా, ఉపాధి కల్పన కేంద్రంగా, ఎగుమతుల శక్తి కేంద్రంగా నిలబెడుతుంది' అని మంత్రి తెలిపారు. భారత్-న్యూజిలాండ్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఎ) ఒక కీలకమైన మైలురాయి అని, ఇది మన రైతులు, మహిళలు, కళాకారులు, ఎంఎస్‌ఎంఈలు, వ్యాపారాలు, నైపుణ్యం కలిగిన నిపుణులకు కొత్త అవకాశాలను అందిస్తుందని గోయల్ ఇంకా పేర్కొన్నారు. "ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దార్శనికతకు అనుగుణంగా, ఈ ఒప్పందం మన రెండు దేశాల మధ్య మరింత లోతైన, సుస్థిరమైన, ప్రజల కేంద్రీకృత భాగస్వామ్యానికి ఒక ముఖ ద్వారం అవుతుంది" అని ఆయన అన్నారు. న్యూజిలాండ్‌కు భారతదేశం ఒక వ్యూహాత్మక ప్రాధాన్యత అని మెక్‌క్లే పునరుద్ఘాటించారు. భారతదేశంలో ఉమ్మడి వ్యాపారాలు, పెట్టుబడులను చురుకుగా చేపట్టాలని వ్యాపార సంస్థలను కోరారు.

# ఎరువుల ప్లాంట్‌పై ఉక్రెయిన్ దాడి



ఎరువుల ప్లాంట్ (ఫైల్)

**క్వీవ్, ఏప్రిల్ 26:** వాయవ్య రష్యాలో కీలకమైన ఎరువుల ప్లాంట్ 'ఫోస్ అగ్రో'పై ఉక్రెయిన్ డ్రోన్‌తో దాడి చేసింది. ఏప్రిల్ నెలలో ఈ ప్లాంట్‌పై జరిగిన రెండో దాడి ఇది. రష్యా కీలక ఎగుమతి కేంద్రాలపై ఇటీవల కాలంలో ఉక్రెయిన్ దాడులు తీవ్రమయ్యాయి. ఈ ప్లాంట్‌లోని సల్ఫ్యూరిక్ యాసిడ్ పంప్ చేసే హై ప్రెజర్ పైప్‌లైన్లను ఈ డ్రోన్లు ధ్వంసం చేశాయి. ఈ విషయాన్ని వోలోగ్డా గవర్నర్ జార్జి ఫిలిమోనోవ్ ధ్రువీకరించారు. కాకపోతే ఎటువంటి మంటలు లేదా లీకేజీకి ఈ దాడి కారణం కాలేదని వెల్లడించారు. పైప్‌లైన్‌కు వెంటనే మరమ్మతులు నిర్వహించినట్లు తెలిపారు. దీంతో ప్రమాదకర గ్యాస్‌లు కూడా ఏమీ లీక్ కాలేదని చెప్పారు. 'ఫోస్ అగ్రో' ప్రతినిధి మాత్రం ఈ దాడిపై స్పందించేందుకు నిరాకరించారు. ప్రస్తుతం ఇరాన్ యుద్ధం తీవ్ర స్థాయిలో ఉండటంతో నైట్రోజన్ ఫర్టిలైజర్స్ ధరలు గణనీయంగా పెరిగాయి. దీంతోపాటు రష్యా, చైనా దేశాలు వీటి ఎగుమతులపై ఆంక్షలు విధించాయి. రష్యా నుంచి ఫాస్ఫరస్ ఆధారిత ఎరువులను భారత్‌కు ఎగుమతి చేసే కంపెనీల్లో ఇది కూడా ఉంది.

## విమానం ఇంజిన్‌లో పొగలు..టేకాఫ్ రద్దుచేసిన స్విస్ ఎయిర్





**న్యూఢిల్లీ, ఏప్రిల్ 26:** ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో పెను ప్రమాదం తృటిలో తప్పింది. ఢిల్లీ నుంచి జ్యూరిచ్ వెళ్లాల్సిన స్విస్ ఎయిర్‌లైన్స్ విమానం ఇంజిన్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో టేకాఫ్ రద్దు చేసుకుంది. ఈ క్రమంలో విమానాన్ని అత్యవసరంగా ఖాళీ చేయిస్తుండగా ఆరుగురు ప్రయాణికులు గాయపడ్డారు. ఆదివారం తెల్లవారుజామున 1:08 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. ఎల్ఎక్స్147 విమానం రన్‌వేపై టేకాఫ్ కోసం వేగంగా వెళ్తుండగా ఇంజిన్‌లో సమస్యను సిబ్బంది గుర్తించారు. దీంతో వెంటనే టేకాఫ్‌ను నిలిపివేసి, ముందుజాగ్రత్త చర్యగా విమానాన్ని ఖాళీ చేయాలని నిర్ణయించారు. విమానంలో 232 మంది ప్రయాణికులు, నలుగురు చిన్నారులతో పాటు సిబ్బంది ఉన్నారు. ప్రయాణికులను ఎమర్జెన్సీ స్లైడ్ల ద్వారా కిందకు దించారు. ఈ తరలింపు ప్రక్రియలో ఆరుగురు ప్రయాణికులు గాయపడగా, వారిని చికిత్స కోసం మేదాంత ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై స్విస్ ఎయిర్‌లైన్స్ ఒక ప్రకటన విడుదల చేసింది. ఘటనకు గల కారణాలను పూర్తిగా అర్థం చేసుకోవడానికి ఒక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపింది. విమానాన్ని పరిశీలించేందుకు ఢిల్లీకి తమ సాంకేతిక నిపుణుల బృందాన్ని పంపుతున్నామని ఎయిర్‌లైన్ పేర్కొంది. ప్రయాణికులందరికీ ప్రత్యామ్నాయ ప్రయాణ ఏర్పాట్లు, హోటల్ వసతి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించింది.

# అధ్యక్షులపై కాల్పులు అమెరికాలో కొత్తేమీకాదు..







**వాషింగ్టన్, ఏప్రిల్ 26:** అధ్యక్షపదవి నిర్వహణ అనేది ఒక ప్రమాదకరమైన వృత్తి అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ వ్యాఖ్యానించారు. కాల్పులు ఘటనలు ఏవీ తనను బాధ్యతలనుంచి తప్పించలేవని, అమెరికన్లకోసం తాను ఎప్పటికీ కృషిచేస్తూనే ఉంటానన్నారు. శనివారం నాటి ఘటనతో కలిపి ట్రంప్‌పై ఇప్పటికి మూడుసార్లు హత్యాయత్నాలు జరిగాయి. అమెరికా చరిత్రను పరిశీలిస్తే, అధ్యక్ష పదవిని చేపట్టడం కత్తిమీద సాములాంటిదని అర్థమవుతుంది. ఎందరో అధ్యక్షులు ఇలాంటి దాడులను ఎదుర్కొన్నారు. వీరిలో నలుగురు ప్రాణాలు కూడా కోల్పోయారు. అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో ఉన్న ట్రంప్‌ను ప్రమాదం నిరంతరం వెన్నాడుతూనే ఉంది. 2024 జులై 13న పెన్సిల్వేనియాలో జరిగిన ప్రచార సభలో ఆయన ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. వేదికపై ఉన్న స్క్రీన్‌పై చార్ట్‌ను చూసేందుకు ఆయన తల తిప్పిన క్షణంలో, ఒక తూటా ఆయన చెవిని తాకుతూ దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఆయన వెనుక నిలబడిన ఒక వ్యక్తి మరణించారు. సమీప భవనం నుంచి కాల్పులు జరిపిన దుండగుడిని సీక్రెట్ సర్వీస్ అధికారులు హతమార్చారు. ఈ భద్రతా లోపంపై అప్పట్లో పెద్ద దుమారమే రేగింది. ఈ ఘటన జరిగిన రెండు నెలలకే, సెప్టెంబర్ 15న ఫ్లోరిడాలోని ట్రంప్ గోల్ఫ్ కోర్స్ సమీపంలోని పొదల్లో రైఫిల్‌తో నక్కి ఉన్న ఒక వ్యక్తిని గుర్తించారు. సీక్రెట్ సర్వీస్ ఏజెంట్ కాల్పులు జరపడంతో అతను పారిపోయినా, తర్వాత పట్టుబడ్డాడు. విచారణ అనంతరం కోర్టు అతనికి జీవిత ఖైదు విధించింది. శనివారం ట్రంప్‌పై దాడి జరిగిన హిల్టన్ హోటల్‌కు కూడా ఒక చారిత్రక ప్రాధాన్యం ఉంది. 1981 మార్చిలో అప్పటి అధ్యక్షుడు రోనాల్డ్ రీగన్‌పై ఇదే హోటల్ బయట హత్యాయత్నం జరిగింది. ఈ దాడిలో ఆయన ఊపిరితిత్తులకు తీవ్ర గాయమైంది. జోడీ ఫోస్టర్ అనే నటిని ఆకట్టుకోవడానికే రీగన్‌ను చంపాలనుకున్నానని నిందితుడు జాన్ హింక్లీ చెప్పడం అప్పట్లో సంచలనం సృష్టించింది. మానసిక స్థితి సరిగా లేదని నిర్ధారణ కావడంతో అతనికి శిక్ష పడలేదు. అధ్యక్ష పదవిలో ఉండి హత్యకు గురైన వారిలో జాన్ ఎఫ్. కెన్నడీ ఉదంతం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. 1963 నవంబర్ 22న డల్లాస్‌లో ఓపెన్ కారులో వెళ్తుండగా, లీ హార్వే ఓస్వాల్డ్ అనే వ్యక్తి భవనంపై నుంచి కాల్పులు జరిపి ఆయన్ను హత్య చేశాడు. ఆ తర్వాత ఓస్వాల్డ్‌ను జాక్ రూబీ అనే వ్యక్తి కాల్చి చంపడం జరిగింది. మరో ఐదేళ్లకే కెన్నడీ సోదరుడు రాబర్ట్ కెన్నడీ కూడా అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో ఉండగానే హత్యకు గురయ్యారు. చరిత్రలో తొలిసారి హత్యకు గురైన అధ్యక్షుడు అబ్రహం లింకన్. బానిసత్వ నిర్మూలన కోసం అంతర్యుద్ధంలో దేశాన్ని నడిపించిన ఆయన, 1865 ఏప్రిల్ 18న వాషింగ్టన్‌లోని ఒక థియేటర్‌లో కాల్పులకుబలయ్యారు. ఆయన తర్వాత 1881లో జేమ్స్ గారీఫీల్డ్ , 1901లో విలియం మెకిన్లీ కూడా హత్యకు గురయ్యారు. ఇటీవలి కాలంలో 2023 మేలో సాయి వర్షిత్ కందుల అనే భారత సంతతి వ్యక్తి, అధ్యక్షుడు జో బైడెన్‌ను చంపి దేశాన్ని స్వాధీనం చేసుకుంటానని చెబుతూ వైట్‌హౌస్ బారియర్లను ట్రక్కుతో ఢీకొట్టాడు. అతనికి కోర్టు ఎనిమిదేళ్ల జైలు శిక్ష విధించింది. ఈ ఘటనలన్నీ అమెరికా అధ్యక్ష పదవి ఎంతటి ప్రమాదకరమో స్పష్టం చేస్తున్నాయి.

**హిల్టన్ హోటల్‌వద్దనే మాజీ అధ్యక్షుడు రీగన్‌పై కాల్పులు:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌పై హత్యాయత్నం జరిగిన వాషింగ్టన్ హిల్టన్ హోటల్‌వద్దనే గతంలో అధ్యక్షుడు రొనాల్డ్ రీగన్‌పైనా కాల్పులుజరిపిన సంఘటనలున్నాయి. హిల్టన్ హోటల్‌కు హింక్లే హిల్టన్ అన్న పేరు కూడా ఉన్నది. 1981 మార్చి 30వ తేదీన ఈ హోటల్ వద్దే అప్పటి దేశాధ్యక్షుడు రోనాల్డ్ రీగన్‌పై హత్యాయత్నం జరిగింది. జాన్ హింక్లే జూనియర్ అనే వ్యక్తి ఆనాటి దేశాధ్యక్షుడు రోనాల్డ్ రీగన్‌పై కాల్పులు జరిపాడు. కొన్ని సెకన్ల వ్యవధిలోనే అతను రీగన్‌పై ఆరు రౌండ్లు ఫైర్ చేశాడు. డిన్నర్‌లో మాట్లాడి బయటకు వస్తున్న రీగన్‌పై షూట్ చేశారు. ప్రెసిడెంట్ రీగన్‌కు చెందిన లిమోసిన్ కారు నుంచి బుల్లెట్లు దూసుకెళ్లాయి. ఆ బుల్లెట్లు రీగన్ ఛాతిలో దిగాయి. ఆ కాల్పుల ఘటనలో రీగన్ తీవ్రంగా గాయపడ్డారు. ఆ ఘటనలో మరో ముగ్గురు కూడా తీవ్రంగా గాయపడ్డారు. అప్పటి ప్రెస్ సెక్రటరీ జేమ్స్ బ్రాడీ కూడా ఆగాయపడ్డ బృందంలో ఉన్నాడు. ఆయనతోపాటు ఓ పోలీసు ఆఫీసర్, సీక్రెట్ సర్వీస్ ఏజెంట్ కూడా గాయపడ్డారు. సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు అధ్యక్షుడు రీగన్‌ను తమ కారులో జార్జ్ వాషింగ్టన్ యూనివర్సిటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ఆయనకు సర్జరీ చేశారు. ప్రాణాపాయం తప్పించారు. కాల్పుల ఘటన జరిగిన ప్రదేశం నుంచి హింక్లేను కస్టడీలోకి తీసుకున్నారు.

**క్షణాల్లో కాల్పుల ప్రాంతం అధీనంలోకి తీసుకున్న సీక్రెట్ సర్వీస్:** కాల్పులఘటనతో వెనువెంటనే అప్రమత్తమైన సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు, ట్రంప్ దంపతులను వెంటనే తమ భద్రతా వలయంలోకి తీసుకుని అక్కడి నుంచి సురక్షిత ప్రాంతానికి తరలించారు. కిందకు వంగండి, కిందకు వంగండ అంటూ అరుపులు వినిపించాయి. వందలాది మంది జర్నలిస్టులు, ప్రముఖులు, రాజకీయ నాయకులు టేబుళ్ల కింద దాక్కున్నారు. కొద్ది క్షణాల్లోనే కంబాట్ గేర్‌తో సీక్రెట్ సర్వీస్ అధికారులు డైనింగ్ హాల్‌లోకి ప్రవేశించి పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. భద్రతా చర్యల్లో భాగంగా రాబర్ట్ ఎఫ్. కెన్నడీ జూనియర్, డగ్ బర్గమ్, మార్కో రూబియో వంటి పలువురు సీనియర్ అధికారులను కూడా సిబ్బంది నేలపైకి నెట్టారు. అనంతరం క్యాబినెట్ సభ్యులను ఒక్కొక్కరిగా బయటకు పంపించారు. ఈ ఘటనపై యూఎస్ సీక్రెట్ సర్వీస్ స్పందిస్తూ ట్రంప్, మెలనియా సురక్షితంగా ఉన్నారని ధ్రువీకరించింది.

### శాంతిచర్చలను రద్దుచేసిన ట్రంప్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాల్గొన్న ఓ కార్యక్రమంలో కాల్పులు జరగడం, ఆ వెంటనే ఇరాన్‌తో కీలకమైన శాంతి చర్చలను ఆయన రద్దు చేయడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. వాషింగ్టన్‌లోని హిల్టన్ హోటల్‌లో శనివారం జరిగిన వైట్‌హౌస్ కరెస్పాండెంట్స్ అసోసియేషన్ వార్షిక విందులో ఈ కాల్పుల ఘటన చోటుచేసుకుంది. ఈ దాడి నుంచి ట్రంప్ సురక్షితంగా బయటపడ్డారు. 31 ఏళ్ల కోల్ థామస్ అలెన్ అనే వ్యక్తి ఈ దాడికి పాల్పడినట్లు గుర్తించారని, నిందితుడు పలు ఆయుధాలతో భద్రతా పాయింట్ వైపు దూసుకొచ్చాడని ట్రంప్ వివరించారు. ఒక సీక్రెట్ సర్వీస్ ఏజెంట్‌పై కాల్పులు జరపగా, బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్ అతడిని కాపాడిందని తెలిపారు. ఈ ఘటనతో విందును రద్దు చేశారు. మరోవైపు ఇరాన్‌తో శాంతి చర్చల కోసం పాకిస్థాన్‌కు వెళ్లాల్సిన తన రాయబారుల పర్యటనను కూడా ట్రంప్ రద్దు చేశారు. ఇరాన్ చర్చల కోసం పంపిన ప్రతిపాదన తనను సంతృప్తిపరచలేదని, అందుకే రద్దుచేసానన్నారు. "పర్యటనను నేను రద్దు చేసిన పది నిమిషాలకే, ఇరాన్ నుంచి మెరుగైన ప్రతిపాదన వచ్చింది. ప్రయోజనం లేని విషయాల గురించి మాట్లాడటానికి 18 గంటలు విమాన ప్రయాణం చేయాల్సిన అవసరం లేదని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఈ పరిణామాల తర్వాత ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్రూత్ సోషల్‌లో స్పందిస్తూ ఇరాన్ నాయకత్వంలో తీవ్రమైన గందరగోళం, అంతర్గత పోరు నడుస్తోందని పేర్కొన్నారు. అక్కడ ఎవరి చేతిలో అధికారం ఉందో వారికే తెలియదు. అన్ని కార్డులు మా దగ్గరే ఉన్నాయి. వారి దగ్గర ఏమీ లేవు. మాట్లాడాలనుకుంటే వాళ్లే మాకు కాల్ చేయాలని పోస్ట్ చేశారు. ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ కలిసి ఇరాన్‌పై దాడి చేయడంతో ఈ యుద్ధం ప్రారంభమైంది. ప్రస్తుతం కాల్పుల విరమణ అమల్లో ఉన్నప్పటికీ, తాజా పరిణామాలతో మళ్లీ ఉద్రిక్తతలు పెరిగాయి.

# భవానీపూర్‌లో ఉద్రిక్తతలు

## 100 మీటర్లదూరంలోనే టిఎంసి,బిజెపి సభలు

### అవమానించారంటూ వేదిక దిగి వెళ్లిపోయిన మమతా బెనర్జీ



**భవానిపూర్, ఏప్రిల్ 26:** రెండో విడత ఎన్నికల ప్రచారంలోభాగంగా తృణమూల్‌కాంగ్రెస్, బిజెపిలు కేవలం 100 మీటర్ల దూరంలోనే ఎన్నికల సభలు నిర్వహించడం, ఆపై బిజెపి నేతలు బిగ్గరగా మైకుల్లో మమతకు వ్యతిరేకంగా నినాదాలుచేయడంతో ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. ఎన్నికల ప్రచారంలో ఆదివారం తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కార్యకర్తల మధ్య ఘర్షణలు చెలరేగాయి. ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ తన ప్రసంగాన్ని మధ్యలోనే ఆపేసి వేదిక దిగివెళ్లడంతో ఈ గొడవలు ప్రారంభమయ్యాయి. మమతా బెనర్జీ ప్రసంగిస్తుండగా, సమీపంలోని బీజేపీ సభ నుంచి లౌడ్ స్పీకర్ల ద్వారా శబ్దాలు చేస్తూ తన సభకు ఉద్దేశపూర్వకంగా ఆటంకం కలిగిస్తున్నారని ఆమె ఆరోపించారు. ఈ ఘటన అవమానకరంగా ఉందని పేర్కొంటూ ప్రజలకు క్షమాపణలు చెప్పి ప్రసంగాన్ని ముగించకుండానే వేదిక నుంచి నిష్క్రమించారు. ముఖ్యమంత్రి వెళ్లిపోయిన వెంటనే ఆగ్రహానికి గురైన టీఎంసీ కార్యకర్తలు నిరసనగా బీజేపీ సభా ప్రాంగణం వైపు దూసుకెళ్లారు. దీంతో ఇరువర్గాల మధ్య నినాదాల పర్వం మొదలై, అది కాస్తా ఘర్షణకు దారితీసింది. పశ్చిమ బెంగాల్ రెండో దశ అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న వేళ రాష్ట్ర రాజకీయాలకు గుండెకాయ లాంటి భవనీపూర్ నియోజకవర్గంలో శనివారం బీజేపీ లౌడ్‌స్పీకర్ల గోల వల్ల తన మాటలు ప్రజలకు వినబడటం లేదని, ఇది కావాలని చేస్తున్న కుట్ర అని మమత ఆగ్రహం వ్యక్తం చేశారు.

## అంబానీ ఇంట పాప్‌సింగర్ రిహానా సందడి



**ముంబయి, ఏప్రిల్ 26:** ప్రముఖ పాప్ సింగర్, గ్లోబల్ ఐకాన్ రిహానా ముంబైలోని అంబానీ నివాసంలో సందడి చేశారు. అంబానీ కుటుంబ సభ్యులు ఆమెకు ప్రత్యేక ఆతిథ్యం ఇచ్చి, మధ్యాహ్న విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భారతీయ కళ, సంస్కృతి, నృత్య రూపాల గురించి రిహానా ఆసక్తిగా తెలుసు కున్నారు. అనంత్ అంబానీ, రాధికా మర్చంట్, ఈషా అంబానీ, శ్లోకా మెహతా తదితరులు రిహానాకు సాదర స్వాగతం పలికారు. వారితో కలిసి రిహానా భోజనం చేస్తూ సరదాగా ముచ్చటించారు. ఈ విందు కార్యక్రమం కుటుంబ సభ్యుల మధ్య అత్యంత ఆత్మీయంగా జరిగింది. రిలయన్స్ రిటైల్ సంస్థ తన సౌందర్య ఉత్పత్తుల బ్రాండ్ ఫెంటి బ్యూటీ వేడుకల కోసం రిహానాను భారత్‌కు తీసుకువచ్చింది. ఈ బ్రాండ్ ఉత్పత్తులు భారత్‌లో ప్రత్యేకంగా టిరా, సెఫోరా స్టోర్లలో అందుబాటులో ఉన్నాయి. ఈ బిజినెస్ టూర్ లో భాగంగానే ఆమె అంబానీ కుటుంబాన్ని మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలుస్తోంది.





# ఈసారి వర్షాలు అంతంత మాత్రమే

## జూన్-సెప్టెంబర్‌లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం

### ఎల్‌నినో ప్రభావమే కారణం: ఐఎండి అంచనా

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 26:** ఈ ఏడాది భారతదేశంలో సాధారణం కంటే బలహీనమైన రుతుపవనాలు ఉండవచ్చని భారత వాతావరణ శాఖ (ఐఎండి) పేర్కొంది. ఇది వ్యవసాయం, నీటి సరఫరా, ఆర్థిక స్థిరత్వంపై ఆందోళనలను రేకెత్తిస్తోంది. వ్యవసాయ రంగానికి కీలకమైన జూన్-సెప్టెంబర్ నైరుతి రుతుపవన కాలంలో వర్షపాతం సాధారణ స్థాయిల కంటే తక్కువగా ఉండే అవకాశం ఉందని ఐఎండి తెలిపింది. "ఈ ఏడాది రుతుపవన వర్షపాతం దీర్ఘకాల సగటులో 92 శాతానికి చేరుకుంటుందని అంచనా" అని కేంద్ర భూ విజ్ఞాన మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఎం. రవిచంద్రన్ తెలిపారు. "2026 నైరుతి రుతుపవన కాలంలో (జూన్ నుండి సెప్టెంబర్ వరకు) దేశవ్యాప్తంగా కురిసే వర్షపాతం సాధారణం కంటే తక్కువగా (దీర్ఘకాలిక సగటు (ఎల్‌పిఏ)లో 95-90 శాతం) ఉండే అవకాశం ఉంది" అని ఆయన తెలిపారు. "ప్రస్తుతం, భూమధ్యరేఖ పసిఫిక్‌పై బలహీనమైన ఎల్‌నినో లాంటి పరిస్థితులు తటస్థ పరిస్థితులుగా మారుతున్నాయి. హిందూ మహాసముద్రంపై ప్రస్తుతం తటస్థ హిందూ మహాసముద్ర డయాపోల్ (ఐఓడి) పరిస్థితులు నెలకొని ఉన్నాయి. రుతుపవన కాలం ద్వితీయార్థంలో ఐఓడి అనుకూలంగా అభివృద్ధి చెందుతుందని మేము అంచనా వేస్తున్నాము" అని రవిచంద్రన్ అన్నారు. "నైరుతి రుతుపవన కాలంలో ఎల్‌నినో పరిస్థితులు ఏర్పడతాయని మాన్‌సూన్ మిషన్ క్లైమేట్ ఫోర్‌కాస్ట్ సిస్టమ్ (ఎంఎంసిఎఫ్‌ఎస్) సూచిస్తోంది" అని భారత వాతావరణ శాఖ (ఐఎండి) తెలిపింది.

భూమధ్య రేఖకు సమీపంలోని పసిఫిక్ మహాసముద్రంలో ఉపరితల ఉష్ణోగ్రతలు తీవ్రంగా, వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం తప్పదని ప్రపంచ వాతావరణ విభాగం (డబ్ల్యూఎంవో) సూచించింది. ఈ ఏడాది మే నుంచి జూలై నెల మధ్యలో భారత్‌లో ఎల్‌నినో ప్రభావం ఉంటుందని పేర్కొంది. దీంతో జులై నెలలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతుందని తెలిపింది. ఈ ఏడాది ప్రారంభంలో కొంతకాలం తటస్థ వాతావరణ పరిస్థితులు ఉన్నప్పటికీ ఇప్పుడు మార్పు బలంగా కనిపిస్తున్నదని డబ్ల్యూఎంవో చీఫ్ విల్‌ఫ్రాన్ మోఫూమా చెప్పారు. ఎల్‌నినో ఏర్పడటం అవశ్యమని, ఆ తరువాత అది మరింత తీవ్రతరమవుతుందని హెచ్చరించారు.

## కాల్పులఘటనతో సురక్షితప్రాంతానికి ట్రంప్ తరలింపు

**వాషింగ్టన్, ఏప్రిల్ 26:** వాషింగ్టన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో కాల్పులు కలకలం రేపడంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను భద్రతా సిబ్బంది హుటాహుటిన సురక్షిత ప్రాంతానికి తరలించారు. ఈ క్రమంలో ఆయన అదుపుతప్పి కిందపడిపోయారు. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌ను సైతం భద్రతా సిబ్బంది జాకెట్ పట్టుకుని లాక్కెళ్లారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అమెరికా కాలమానం ప్రకారం, శనివారం రాత్రి వైట్ హౌస్ ప్రెస్ కరస్పాండెంట్ల అసోసియేషన్ వార్షిక విందు సందర్భంగా ఈ ఘటన చోటుచేసుకుంది. అధ్యక్షుడు ట్రంప్, ప్రథమ మహిళ మెలానియా, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సహా పలువురు ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ట్రంప్ ప్రసంగం కోసం అందరూ ఎదురుచూస్తున్న వేళ, కోల్ అలెన్ అనే వ్యక్తి కాల్పులు జరిపాడు. అతని వద్ద షాట్‌గన్, హ్యాండ్‌గన్ ఉన్నట్లు అధికారులు గుర్తించారు. కాల్పుల శబ్దాలు వినిపించగానే సీక్రెట్ సర్వీస్ అధికారులు వెంటనే రంగంలోకి దిగి ట్రంప్, వాన్స్‌లను సురక్షిత ప్రాంతానికి తరలించే ప్రయత్నం చేశారు. ఈ తొక్కిసలాటలోనే ట్రంప్ కిందపడిపోయినట్లు వీడియోలో స్పష్టంగా కనిపిస్తోంది. నిందితుడిని సీక్రెట్ సర్వీస్ అధికారులు అరెస్టు చేశారు. ఈ ఘటనపై స్పందించిన ట్రంప్, తామంతా సురక్షితంగా ఉన్నామని తెలిపారు. ఒక భద్రతా అధికారికి గాయాలయ్యాయని, బుల్లెట్ ప్రూఫ్ వెస్ట్ కారణంగా ప్రాణాలతో బయటపడ్డారని చెప్పారు. కాల్పులకు పాల్పడిన వ్యక్తిని సిక్ పర్సన్ అని ఆయన అభివర్ణించారు. ప్రస్తుతం కాల్పుల ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది.

## కాల్పులఘటనపై ప్రధాని మోడీ దిగ్భ్రాంతి



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 26:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హాజరైన ఒక కార్యక్రమం వద్ద కాల్పుల ఘటన చోటుచేసుకోవడంపై భారత ప్రధాని నరేంద్ర మోడీ స్పందించి ఘటనను ఖండించారు. ప్రజాస్వామ్యంలో హింసకు స్థానం లేదని స్పష్టం చేశారు. అధ్యక్షుడు ట్రంప్, ఆయన కుటుంబ సభ్యులు క్షేమంగా ఉన్నారన్న వార్త తనకు ఉపశమనం కలిగించిందని ప్రధాని మోడీ పేర్కొన్నారు. ఈ ఘటనపై ప్రధాని మోడీ ఎక్స్ వేదికగా స్పందించారు. అధ్యక్షుడు ట్రంప్, ప్రథమ మహిళ, ఉపాధ్యక్షుడు క్షేమంగా, ఎలాంటి హాని జరగకుండా బయటపడ్డారని తెలిసి ఊరట చెందాను. వారి భద్రత, శ్రేయస్సు కోసం నా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. ప్రజాస్వామ్యంలో హింసకు చోటు లేదు. దానిని నిస్సందేహంగా ఖండించాలని పోస్ట్ చేశారు. అటు ఈ ఘటనపై వైట్ హౌస్‌లో ట్రంప్ మీడియాతో మాట్లాడారు. పలు ఆయుధాలు ధరించిన ఓ వ్యక్తి సెక్యూరిటీ చెక్‌పాయింట్ వైపు దూసుకొచ్చాడని తెలిపారు. సీక్రెట్ సర్వీస్ సభ్యులు అతడిని అడ్డుకున్నారని చెప్పారు. ఆ దుండగుడు ఒక సీక్రెట్ సర్వీస్ ఏజెంట్‌పై కాల్పులు జరిపాడని, అయితే బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్ ధరించడం వల్ల అతను సురక్షితంగా ఉన్నాడని వివరించారు. ఆ ఏజెంట్ ప్రస్తుతం మంచి ఆరోగ్యంతో ఉన్నారని ట్రంప్ పేర్కొన్నారు. దాదాపు 50 గజాల దూరం నుంచి ఆ వ్యక్తి పరిగెత్తుకుంటూ వచ్చాడని ట్రంప్ తెలిపారు.

# మంటల్లో పశ్చిమాసియా

## ఆర్థిక ఒత్తిడిలో ఇరాన్..

### ఓ కోడిగుడ్డు ధర రెండు లక్షల రియాల్స్



**టెహ్రాన్, ఏప్రిల్ 26:** యుద్ధంలో అమెరికాను గంభీరంగానే నిలువరిస్తున్నా అంతర్గతంగా మాత్రం ఆ దేశం అట్టుడుకుతోంది. ఆర్థికంగా తీవ్ర ఒత్తిళ్లను ఎదుర్కొంటోంది. అంతూపొంతూ లేని యుద్ధం, పెరుగుతున్న ధరలు, తరుగుతున్న ఆదాయం సామాన్యులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇరాన్‌లో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. బియ్యం, కోడిగుడ్లు తదితర ఆహార వస్తువుల ధరలు భారీగా పెరిగాయి. ఆహార ద్రవ్యోల్బణం 112 శాతానికి చేరుకుంది. వంటనూనెల ధరలైతే 200 శాతం పైగా పెరిగాయి. నిత్యావసరాలే కాదు, చివరికి అంత్యక్రియల ఖర్చులు కూడా 40 శాతం పెరిగాయి. అధికారిక లెక్కల ప్రకారం యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇరాన్‌లో 10 లక్షల మంది ఉద్యోగాలు కోల్పోయారు. అనధికారికంగా ఈ సంఖ్య 20 నుంచి 30 లక్షల వరకు ఉండొచ్చని ఓ అంచనా. 1.5 కోట్ల మంది ప్రజలు ఎలాంటి ఆదాయం లేక అల్లాడుతున్నారు. ఉద్యోగాలు కోల్పోయిన వారికి ప్రభుత్వం ఇచ్చే నెలవారీ సబ్సిడీ, ఫుడ్ వోచర్లతో కనీసం 10 కిలోల బియ్యం కూడా రాని పరిస్థితి నెలకొంది. ఇరాన్ రియాల్ విలువ ఎన్నడూ లేని స్థాయిలో పడిపోయింది. ఒక డాలర్ విలువ 16 లక్షల రియాల్స్‌కు దగ్గరలో ఉంది. దీంతో పౌరుల పొదుపు ఆవిరవుతోంది. ప్రజల దగ్గర డబ్బులు లేకపోవడంతో అమ్మకాలు తగ్గి, రెస్టారెంట్లు, చిన్న వ్యాపారాలు నష్టాల్లో నడుస్తూ మూతపడుతున్నాయి. యుద్ధ సమయంలో ప్రభుత్వం పన్నులు తగ్గించడం లేదు సరికదా, రుణాలు కట్టడం ఆలస్యమైతే జరిమానాలు విధిస్తోంది. చెక్కులు బౌన్స్ అవుతున్నాయి. దీంతో బ్యాంక్‌లు చాలా ఖాతాలను మూసివేస్తున్నాయి.

**ఆధునిక కరవు అంచున:** ఇరాన్ మార్కెట్‌లో వస్తువులు ఉన్నాయి కానీ, వాటిని కొనే సామర్థ్యం సామాన్యుడికి లేదు. దీన్ని 'ఆధునిక కరవు'గా ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు. ప్రస్తుత పరిస్థితి ఇలాగే కొనసాగితే యేడాదికి ద్రవ్యోల్బణం 80 శాతం నుంచి 500 శాతానికి పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. టెహ్రాన్ స్టాక్ ఎక్స్ఛేంజ్ వరుసగా 8 వారాలపాటు మూతపడింది. ఇది ఆ దేశ చరిత్రలో మొదటిసారి. మార్కెట్ తెరిచినా, ప్రధాన రంగాలైన పెట్రో కెమికల్స్, స్టీల్ పరిశ్రమలు దెబ్బతినడంతో స్టాక్ ధరలు భారీగా పతనమయ్యే అవకాశం ఉంది.

27-4Pg6exHMNWJQE.qxd:27-4Pg6exHMNWJQE.qxd 1/1/02 6:28 AM Page 1





## సంస్థాగతంగా బలోపేతం కావాలి

**• తిరుపతిలో బిజెపి తెలంగాణ అధ్యక్షుడు రామచంద్రరావు**

**తిరుపతి, ఏప్రిల్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో పార్టీ ప్రస్తుత పరిస్థితులు, భవిష్యత్ వ్యూహాలు, సంస్థాగత బలోపేతం వంటి కీలక అంశాలపై బిజెపి తెలంగాణ అధ్యక్షుడు రామచంద్రరావు విస్తృతంగా చర్చించారు. పార్టీని మరింత ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కూడా నాయకులకు మార్గనిర్దేశం చేశారు. ఆదివారం సాయంత్రం తిరుపతికి విచ్చేసిన బిజెపి తెలంగాణ అధ్యక్షుడు రామచంద్రరావుకు స్థానిక బిజెపి నాయకులు సామంచి శ్రీనివాస్, గుండాల గోపీనాథరెడ్డి, అజయ్‌కుమార్, చంద్రబాబు, నాగోతు రమేష్ నాయుడు, జల్లి మధుసూదన్, డాక్టర్ శ్రీహరిరావు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం శ్రీవారి చిత్రపటం బహూకరించారు. నాగోతు రమేష్ నాయుడు, అధికార ప్రతినిధి జల్లి మధుసూదన్, రాష్ట్ర మెడికల్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ శ్రీహరిరావు, డాక్టర్ యుగంధర్, డాక్టర్ జనార్దన్ పాల్గొన్నారు.



## నిబద్ధతకు గీటురాయి ఉమ్మడిశెట్టి అవార్డు

**• ప్రముఖ కవి, విమర్శకులు తూముచర్ల రాజారాం**

**అనంతపురం, ఏప్రిల్ 26 ప్రభాతవార్త బ్యూరో:** 38 ఏళ్ళు సుదీర్ఘకాలం నిజాయితీ, నిబద్ధతలు, సాహితీ విలువలు, పునాదులుగా ఏదైనా ఒక సాహితీ సేవాసంస్థ ఉందంటే అది ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డు అని ప్రముఖ కవి, విమర్శకులు తూముచర్ల రాజారాం అన్నారు. ఈ సందర్భంగా రాధేయ ఇటీవల వెలువరించిన కొత్త విమర్శ వ్యాసాల సంపుటి అలజడి మా జీవితం అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన ఉమ్మడిశెట్టి లిటరరీ ట్రస్ట్ అవార్డు పురస్కార సభలో ఉమ్మడిశెట్టి సత్యాదేవి పురస్కారాన్ని శ్రీకాకుళంకి చెందిన కంచరాన భుజంగరావుకి, ఉమ్మడిశెట్టి సతీ జాతీయ యువ పురస్కారాన్ని సిద్దిపేటకు చెందిన జాబేర్ పాషా, అలాగే ఒంగోలుకు చెందిన పరిమి చరణ్‌కి ఉమ్మడిశెట్టి ఆత్మీయ పురస్కారన్ని ప్రముఖ కవయిత్రి సుమన ప్రణవ్ అందుకున్నారు. ఈ అవార్డులను ఉమ్మడిశెట్టి రాధేయ ప్రదానం చేశారు. వారి శిష్యులు డాక్టర్ సుంకర గోపాల్ డాక్టర్ పెళ్లూరు సునీల్, దోర్నాధుల సిద్ధార్థ, అంకె శ్రీనివాస్ అవార్డు పొందిన కవుల పుస్తకాలను సమీక్షించారు. ఈ కార్యక్రమంలో కవులు సిరికి స్వామీనాయుడు, సాంబమూర్తి, టి.అమరనాథ్ రెడ్డి, టి.వి.రెడ్డి. రియాజుద్దీన్, జూటూరురీఫ్, జెట్టి జయరాం, ఏప నాగేంద్ర, పుప్పాల శ్రీరామ్, అనిల్ డ్యాని, మోహిత, చంశాస్త్రి, యమున, మీనాబాయ్ పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదం: ఇద్దరు మృతి

**అద్దంకి, ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** ప్రకాశం జిల్లా నార్కెట్‌పల్లి- మేదరమెట్ల రాష్ట్ర రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు వ్యక్తులు మృతి చెందారు. అందిన వివరాలు ప్రకారం నామ్ రోడ్డుపై అద్దంకి మండలం చక్రాయపాలెం - శాంతినగర్ మధ్య ఆగి వున్న లారీని ద్విచక్ర వాహనంపై వెళుతున్న దమ్ము చినబాబు(37), దమ్ము అర్జున్ సుశాంత్(14)లు అక్కడిక్కడే మృతిచెందారు. వీరు బ్రహ్మంగారి ఆదరాధన ఉత్సవంలో పాల్గొనేందుకు చక్రాయపాలెం ఎస్‌సి కాలనీ నుండి ద్విచక్ర వాహనంపై వెళుతూ ముందువైపు ఆగి వున్న లారీని ఢీకొట్టారు. ఈ సంఘటనలో వీరిరువురు తీవ్ర గాయాలతో అక్కడిక్కడే మృతిచెందారు. సంఘటనా స్థలం రక్తసిక్తమైయింది. ఈ ఘటనతో చక్రాయ పాలెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అర్జున్ సుశాంత్ 7వ తరగతి పూర్తి చేశారు. స్వామివారి ఆరాధన ఉత్సవం సందర్భంగా ఈ సంఘటన చోటు చేసుకోవడంతో ఆ ప్రాంతంలో విషాదం చోటుచేసుకుంది. ఈ సంఘటనపై అద్దంకి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# వైఎస్ జగన్‌తోనే బిసిల అభ్యున్నతి సాధ్యం

**• 'అనంత బిసి గళం' సమావేశంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి**

**అనంతపురం, ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన రెడ్డితో మాత్రమే బిసిల అభ్యున్నతి సాధ్యమవుతుందని వైసిపి రీజనల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. బిసిల పట్ల కూటమి ప్రభుత ్వం నిరంకుశ వైఖరిని నిరసిస్తూ వైఎస్ఆర్‌సిపి బిసి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ బిసి రమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో నగరంలోని లలిత కళాపరిషత్‌లో బిసి గళం బహిరంగ సభను నిర్వహిం చారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సిపి రాయలసీమ రీజనల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అనంతపురం జిల్లా వైసిపి అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, వైసిపి బిసి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, ఎమ్మెల్సీలు భరత్, మంగమ్మ, శివరామిరెడ్డి, పార్లమెంట్ పరిశీలకులు నరేష్‌కుమార్‌రెడ్డి, నియోజకవర్గాల సమన్వయ కర్తలు సాకే శైలజానాథ్, తలారి రంగయ్య, కేతిరెడ్డి పెద్దారెడ్డి, విశ్వేశ్వర్‌రెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఈరలక్కప్ప, జడ్పిచైర్మన్ బోయ గిరిజమ్మ, మాజీ మంత్రి శంకర్‌నారాయణ, మాజీ ఎంపి గోరంట్ల మాధవ్‌లతోపాటు పెద్ద ఎత్తున వైసిపి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా బిసిలకు ఏమి చేసిందని ఆయన ప్రశ్నించారు. ఐదేళ్ల వైసిపి పాలనలో బిసిలకు సరైన గౌరవం, సముచిత స్థానం కల్పించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. బిసిలు గెలిపించాలన్నా.. ఓడించాలన్నా.. శక్తి మీలోనే ఉందని, రానున్న ఎన్నికల్లో బిసిలంతా వైసిపికి అండగా నిలిచి బిసిలను గుర్తించే పార్టీని గెలిపించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ బిసిల సంక్షేమం కోసం వైసిపి పాలనలో 1.80 కోట్లు ఖర్చు చేసిన ఘనత వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డిది అన్నారు. అదే విధంగా బిసిలంటే బ్యాక్ బోన్ అని చాటిచెప్పిన ఏకైక నాయకుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. అంతేకాకుండా రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని రీతిలో 24 మంది మంత్రులకుగాను 11 మంది బిసిలను మంత్రులుగా చేసి గుర్తింపునిచ్చారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం బిసిలకు రెండేళ్ల పాలనలో ఏమీ చేయకపోగా డైవర్ట్ పాలిటిక్స్‌తో కాలం గడుపుతున్నారని ఆయన మండిపడ్డారు. బిసిలంతా ఐక్యతతో కూటమి ప్రభుత్వం పోరాడాలని



పిలుపునిచ్చారు. బిసి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ బిసి రమేష్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెడ్ బుక్ పేరితో బిసిలపై అక్రమ కేసులు పెడుతూ బిసిలకు అణచివేతకు గురిచేస్తోందని మండి పడ్డారు. గత ఎన్నికల్లో బిసిలకు అనేక హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏ హామీ అమలు చేయకపోగా బిసిల హక్కులను చంద్రబాబునాయుడు కాలరాస్తున్నారని మండిపడ్డారు. రానున్న రోజుల్లో బిసిలంతా ఏకమై మరోమారు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుని బిసిల పాలనను తెచ్చుకుందామని పిలుపునిచ్చారు.

బిసి విభాగం రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్ మాట్లాడుతూ.. సామాన్య కార్యకర్త అయిన నన్ను ఎమ్మెల్సీని చేసిన ఘనత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిది అన్నారు. బిసిలు అంటే జగన్, జగన్ అంటే బిసిలని కొనియాడారు. బిసి ఆడబిడ్డలకు 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తానన్న హామీ ఏమైందని కూటమి ప్రభుత్వాన్ని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు సాకే శైలజానాథ్, శంకర్‌నారాయణ, మాజీ ఎంపిలు తలారి రంగయ్య, గోరంట్ల మాదవ్, మాజీ ఎమ్మెల్యేలు విశ్వేశ్వర్‌రెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తదితరులు కూటమి పాలన వైఫల్యాలను ఎండ గడుతూ, బిసిలకు వైసిపి చేసిన మేలును గుర్తు చేశారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున వైసిపి శ్రేణులు, బిసి సంఘాల నాయకులు హాజరు కావడంతో సభ ప్రాంగణం కిక్కిర్సి పోయింది. పలువురు యువకులు భారీ బైకులతో సమావేశానికి హాజరై సంఘీభావం ప్రకటించారు.

# కాఫీ తోటల్లో 749కేజీల గంజాయి సీజ్

**• అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్ధర్**



**పాడేరు, ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** మాదకద్రవ్యాల స్మగ్లింగ్‌పై కొనసాగుతున్న "ఆపరేషన్ వజ్రప్రహార్"లో భాగంగా, జిల్లా ఎస్పీ అమిత్ బర్ధర్ నేరుగా ఇచ్చిన ఆదేశాలతో అల్లూరి జిల్లా పోలీసులు, ఈగిల్ టీమ్ సమన్వయంతో భారీ అక్రమ గంజాయి నిల్వ కేంద్రాన్ని విజయవంతంగా కనిపెట్టారు. ఇందుకు సంబంధించిన వివరాలను జిల్లా పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ అమిత్ బర్ధర్ వెల్లడించారు. ఈనెల 24 వ తేదీ శుక్రవారం రాత్రి 7.30 నిమిషాలు సమయంలో అక్రమ నిల్వలపై అందిన ఖచ్చితమైన సమాచారం మేరకు, పోలీసు బృందం అధికారిక మధ్యవర్తులతో కలిసి ముంచంగిపుట్టు మండలం పనసపుట్టు పంచాయతీ, సంగంవలస గ్రామం శివార్లలోని సదరు కాఫీ తోటలో శోధన ప్రారంభించగా కొండ ప్రాంతంలో ఉన్న కాఫీ తోటలో తనిఖీ చేయగా 39 తెల్లటి గన్నీ బ్యాగులలో ప్యాక్ చేసి పొదల మధ్య నిల్వ ఉంచిన రూ.37.45 లక్షల విలువగల 749 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ అమిత్ బర్ధర్ తెలిపారు. ఆ స్థలంలో గంజాయి అక్రమ వ్యాపారంలో ఉన్న వ్యక్తులు కాఫీ తోటను చాటుగా వాడుకున్నారని, పోలీసుల కదలికలను గమనించి వారు పారిపోయారని అనుమానిస్తున్నామణి ఎస్పీ పేర్కొన్నారు.. ఈ గంజాయి అక్రమ నిల్వలపై కేసు నమోదు చేసి కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఈ అక్రమ గంజాయి నిల్వలపై ఈ నెట్‌వర్క్ వెనుక ఉన్నవారిని గుర్తించేందుకు పోలీస్ శాఖ ప్రయత్నాలు జరుగుతున్నాయనీ అయన తెలిపారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణాను పూర్తిగా నిర్మూలించడానికి అల్లూరి జిల్లా పోలీసులు కట్టుబడి ఉన్నామన్నారు.



## శేషాచలం అడవుల్లో అగ్నిప్రమాదం

**తిరుమల, ఏప్రిల్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** వేసవి కాలం మొదలవడంతో శేషా చలం అడవికి నిప్పుపెట్టారు. గుర్తుతెలియని వ్యక్తులు మంగళం సమీపంలోని అడవికి అగ్గిరాజేయడంతో మంటలు వ్యాపించాయి. ఆదివారం సాయంత్రం నుండి ఈ మంటలు తిరుమలకొండకు అలిపిరి దిశగా వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ, అటవీశాఖ సిబ్బంది అడవిలోకి చేరుకుని మంటలు అదుపుచేసే ప్రయత్నం చేస్తున్నారు., రాత్రికి కూడా మంటలు వ్యాపిస్తున్నాయి. అడవికి నిప్పు పెట్టడం పరిపాటిగా మారింది. అడవిలో మంటలు వ్యాపించకుండా ఫైర్‌వాల్స్ ఏర్పాటుచేసినా ఫలితం మాత్రం శూన్యం.



## తిరుపతి టిడిపిపి కమిటీ సభ్యుల ప్రమాణస్వీకారం

**తిరుపతి, ఏప్రిల్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి పార్లమెంట్ టిడిపి నూతన కమిటీ సభ్యులతో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ప్రమాణం చేయించారు. ఆదివారం ఓ కల్యాణమండపంలో ఈ కార్యక్రమం జరిగింది. పార్లమెంట్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి, పార్లమెంట్ అధ్యక్షురాలుగా పనబాక లక్షి ్మ ప్రమాణస్వీకారం చేశారు. తిరుపతి పార్లమెంట్ పరిధిలో ప్రతి కార్యకర్తకు అండగా నిలబడతానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, నూతన కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొత్త జాతీయ రహదారికి భూసేకరణపై వివరాలు సమర్పించండి: హైకోర్టు

**విజయవాడ, ఏప్రిల్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎన్టీఆర్ జిల్లా పరిధిలో 65వ నెంబరు జాతీయ రహదారి విస్తరణకు సంబంధించిన వివరాలు కోర్టుకు సమర్పించాలని ఆర్‌అండ్‌బి, జలవనరులు, ఎన్‌హెచ్‌ఎఐ విభాగాలను హైకోర్టు ఆదేశించినట్లు రైతు పోరాట సమితి నాయకులు గంగిరెడ్డి రంగారావు తెలిపారు. జాతీయ రహదారిపై తమ భూములను సేకరించడాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు.ఈ క్రమంలో కొందరు రైతులు ఏపీ హైకోర్టును ఆశ్రయించారని వివరించారు.దీనిపై హైకోర్టు విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. 65వ నెంబరు జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ఎన్‌టిఆర్ జిల్లా పరిటాల నుండి ఇబ్రహీంపట్నం వరకూ కృష్ణానదికి సమీపంగా కొత్త జాతీయ రహదారి నిర్మించాలని నిర్ణయించింది. దీనిపై ఎన్‌హెచ్‌ఎఐ అధికారులు విజయవాడలో భూ యజమానులతో భాగస్వాముల సమావేశం నిర్వహించారు. వారి అభిప్రాయాలు తీసుకున్నారు. ఇప్పటికే మూడు సార్లు భూసేకరణ కింద భూమిని కోల్పోయామని, ఇంకా ఎన్నిసార్లు భూములు ఇవ్వాలని రైతులు అభ్యంతరం తెలిపారు. మరోవైపు కేంద్రం డిపిఆర్ కూడా సిద్ధం చేసింది. ప్రజా ప్రతినిధులు కూడా తొలుత కొత్తరోడ్డు వద్దని వాదించి తరువాత వేయాల్సిందేనని ప్రకటించారు. ఈ నేపథ్యంలో 71 మంది రైతులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిగింది. రైతుల తరపున సీనియర్ న్యాయవాది సత్యప్రసాద్ వాదించారు. కొత్తగా జాతీయ రహదారి వేయాలనుకున్న ప్రాంతం కృష్ణానది బఫర్‌జోన్‌లో ఉందని, గతంలో వరదలు వచ్చిన సమయంలో పెద్దయెత్తున ముంపునకు గురైందని, నీటి ఒత్తిడి కూడా ఎన్‌టిఆర్ జిల్లావైపు ఉంటోందని తెలిపారు. దీనిపై ఎంతమందిని తరలించాల్సి వచ్చిందో అప్పట్లో సేవలందించిన ఎన్‌డిఆర్‌ఎఫ్ నుండి కూడా సమాచారం తెప్పించుకోవచ్చని పేర్కొన్నారు. అలాగే డిపిఆర్ కూడా సిద్ధం చేశారని కోర్టుకు తెలిపారు. డిపిఆర్ విడుదల చేశారా? సిద్ధమైందని మీకు ఎలా తెలుసని న్యాయమూర్తి ప్రశ్నించగా భాగస్వామ్య సమావేశంలో ప్రదర్శించారని, రైతులకు సమాచారం ఇచ్చారని న్యాయవాది తెలిపారు. కొత్తగా రోడ్డును కృష్ణానది బఫర్‌జోన్‌ల నుండి వేస్తున్నారని, వరదలు వచ్చిన సమయంలో నష్టం ఎక్కువగా ఉండటం తోపాటు రోడ్డుకు దక్షిణ భాగంలో ఉండే గ్రామాలన్నీ మునిగిపోతాయని పేర్కొన్నారు. దీంతో ఆయా విభాగాల నుండి కౌన్సిళ్లు ఎవరు హాజరయ్యారని ప్రశ్నించారు. అక్కడే ఉన్న రెవెన్యూ, జలవనరులు, జాతీయ రహదారుల విభాగ కౌన్సిళ్లు న్యాయమూర్తి ముందు హాజరయ్యారు. వెంటనే రోడ్డుకు సంబంధించిన వివరాలను కోర్టుకు సమర్పించాలని ఆదేశించి మూడువారాల పాటు విచారణను వాయిదా వేశారు.

## గంజాయి విక్రయ ముఠా అరెస్ట్

**విజయవాడ, ఏప్రిల్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడ సిటీ పరిధిలో అజిత్ సింగ్ నగర్ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిలో యోగానంద సునీత, చేబ్రోలు నవీన్, బాల ప్రశాంత్ కుమార్, తాడేపల్లి నాగబాబు, భూదల విజయ్, పరిటాల జోజి బాబు, దాసరి వంశీ, మిందల రత్నకుమార్ ఉన్నారు. వీరితో పాటు మరో నలుగురిని కూడా అదుపులోకి తీసుకున్నారు. విజయవాడ తోటవారివీధి పరిసరాల్లో రహస్యంగా గంజాయి విక్రయిస్తున్నట్లు అజిత్ సింగ్ నగర్ పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో పోలీసులు ఆ ప్రాంతంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సుమారు 7 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మాదకద్రవ్యాల ముఠా నగరంలో గంజాయి సరఫరా చేస్తున్నట్లు పోలీసుల దృష్టికి వచ్చింది. అజిత్‌సింగ్ నగర్ సిఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా, మాదకద్రవ్యాల విక్రయాలు జరుగుతున్నట్లు గుర్తించిన ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. నగరంలో మాదకద్రవ్యాల వ్యాప్తిని అరికట్టేందుకు పోలీసు శాఖ పూర్తి శ్రద్ధతో పని చేస్తోందన్నారు.

## అక్రమ కేసులు ఎత్తివేయాలి

**• బిసివై అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్**



**విజయవాడ, ఏప్రిల్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** బిసిల హక్కుల సాధన కోసం మంగళగిరిలో తాను చేపట్టిన "బిసి ధర్మదీక్ష"లో పాల్గొన్న వారిపై ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించడాన్ని భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ తీవ్రంగా ఖండించారు. శాంతియుతంగా నిరసన తెలిపిన వారిపై కక్షపూరితంగా వ్యవహరించడం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని ఆయన ఆరోపించారు. "బిసిల హక్కుల కోసం నేను చేపట్టిన "బిసి ధర్మదీక్ష"కు పిలుపునిచ్చింది నేను, దానికి పూర్తి బాధ్యత నాది. కానీ, ప్రభుత్వం కక్షసాధింపు చర్యగా నాపై, నాతో పాటు దీక్షకు సంఘీభావం తెలిపిన అనేక మంది బిసి బిడ్డలపై అక్రమ కేసులు నమోదు చేసింది. అంతటితో ఆగకుండా, దీక్షతో ఏమాత్రం సంబంధం లేని అమాయక యువత, మహిళలు, చివరికి తమ ఆవేదన వ్యక్తం చేయడానికి తెలంగాణ నుంచి వచ్చిన ఒక బిసి నాయకుడిపై కూడా కేసు పెట్టడం అత్యంత దుర్మార్గం. ప్రభుత్వానికి దమ్ముంటే నాతో తేల్చుకోవాలి. అంతేగానీ, హక్కుల కోసం గొంతెత్తిన పాపానికి అమాయకులను పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిప్పడం పాలకుల అసమర్థతకు నిదర్శనం. ఇది బిసిల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసి, వారిని భయభ్రాంతులకు గురిచేసే కుట్ర తప్ప మరొకటి కాదు. ప్రభుత్వం తక్షణమే స్పందించి, 'బిసి ధర్మదీక్ష'కు సంబంధించి నమోదు చేసిన అక్రమ కేసులన్నింటినీ బేషరతుగా ఎత్తివేయాలి. ముఖ్యంగా, ఈ ఘటనతో సంబంధం లేని అమాయక యువత, మహిళలు, ఇతర వ్యక్తుల పేర్లను కేసుల నుంచి వెంటనే తొలగించాలి. ప్రభుత్వం ఎన్ని నిర్బంధాలు ప్రయోగించినా, ఎన్ని అక్రమ కేసులు పెట్టినా బిసిల హక్కుల సాధన పోరాటంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు" అని రామచంద్ర యాదవ్ హెచ్చరించారు.

## డీజిల్ సంక్షోభం బాధ్యత ప్రభుత్వానిదే: సిపిఎం

**విజయవాడ, ఏప్రిల్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** డీజిల్, పెట్రోల్ సంక్షోభం బాధ్యత ప్రభుత్వానిదేనని, నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని సిపిఐ(యం) డిమాండ్ చేసింది. దీనికి సంబంధించి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. "రాష్ట్రంలో పెట్రోలు బ్యాంకులన్నీ నిండుకున్నాయి. వాహనాల రవాణా ఆగిపోయింది. పనులు మానుకొని ప్రజలు గంటల తరబడి క్యూలైన్లలో ఆయిల్ కోసం పహారా కాస్తున్నారు. జన జీవనం స్తంభించే పరిస్థితి ఏర్పడింది. ముందు చూపులేని ప్రభుత్వ విధానాలు, నిరక్ష ్యం, అసమర్ధ పాలనే ఈ దుస్థితికి కారణం. తక్షణం ఈ సమస్యపై దృష్టి సారించి యుద్ధ ప్రాతిపదికపై ఆయిల్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని సిపిఎం డిమాండ్ చేస్తోంది. లేని యెడల అశాంతికి గురయ్యే ప్రజలు ఆందోళనకు దిగాల్సిన పరిస్థితి వస్తుందని హెచ్చరిస్తున్నాము" అని వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు.




# సేఫ్ తిరుపతి ప్రధాన లక్ష్యం

**• సామాన్యమైన ప్రజలకు, భక్తులకు రక్షణ**

**తిరుపతి, ఏప్రిల్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రసిద్ధ యాత్రాస్థలం, స్మార్ట్‌సిటీ ఆధ్యాత్మిక నగరం తిరుపతి ప్రజలకు భద్రత కల్పించడమే ధ్యేయంగా తిరుపతి జిల్లా పోలీసులు దృఢమైన చర్యలతో ముందుకు నడుస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా శివారు కాలనీలు, పలు ప్రాంతాల్లో తరచూ తెల్లవారుజామున నాకాబందీ తరహాలో తనిఖీలు చేస్తున్నారు. ఆదివారం వేకువజామున సాధారణ తనిఖీలే కాకుండా, నేరాలను అరికట్టే లక్ష్యంతో చేపట్టిన సమగ్ర కార్డన్ సెర్చ్ వజ్రప్రహార్ ఆపరేషన్ నిర్వహించారు. తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా శాంతి భద్రతలను కట్టుదిట్టం చేమడంలో పోలీసులు ఏకకాలంలో విస్తృతంగా కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. తిరుపతి, తిరుచానూరు, దామినేడు, రేణిగుంట పోలీస్ స్టేషన్ పరిధిలోని తారకరామ నగర్ తదితర ప్రాంతాలలో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు.

తిరుచానూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని దామినేడు ప్రాంతంలో ఉదయం 4 గంటల నుండి సుమారు మూడువేల గృహాలలో నివసిస్తున్న 8వేల మంది వివరాలను సేకరించారు. సరైన పత్రాలు లేని 55 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. 20 మంది అనుమానితులను అదుపులోకి తీసుకుని వారి గత నేర చరిత్రను పరిశీలించారు. రేణిగుంట పోలీస్ స్టేషన్ పరిధిలోని తారకరామ నగర్ ప్రాంతంలో దాదాపు పదివేల గృహాలలో 20వేల మంది నివసిస్తున్నట్లు గుర్తించారు. ఇక్కడ 169 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని వాటి రికార్డులను పరిశీలిస్తున్నారు. 18మంది అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణ కొనసాగిస్తున్నారు.

ఈ ఆపరేషన్‌లో భాగంగా అనుమానాస్పద వ్యక్తులు, అనాథ వాహనాలపై సమగ్ర తనిఖీలు నిర్వహించడంతో పాటు అద్దె ఇళ్లలో నివసిస్తున్న వారి వివరాలు సేకరించారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలపై కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేసి,అనుమానితులపైవిచారణ చేపడుతున్నారు. గంజాయి నిర్మూలన, రౌడీయిజం అరికట్టడం, ఇతర నేరాల నియంత్రణ లక్ష్యంగా ఈ తరహా ఆపరేషన్లు నిరంతరం కొనసాగిస్తామని ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. తిరుపతిని సురక్షిత నగరంగా మార్చడం మా ప్రధాన లక్ష్యమన్నారు.

# కోటియా వివాదంపై సిఎం స్పందించాలి

**• గిరిజనుల అక్రమ అరెస్టుపై ఆదివాసీ సంఘం నిరసన**





తాడంగి పిలుకు, తాడంగి చిరంజీవి

**పార్వతీపురం మన్యం (సాలూరు) ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** కోటియా ఆంధ్ర వివాదానికి ముగింపు పలికేది ఏ ప్రభుత్వమని కోటియా గ్రామ గిరిజనులు ఎదురు చూస్తున్నారు. ఏళ్ల తరబడి ఆంధ్ర కొటియ వివాదం నడుస్తున్న ప్రభుత్వాలు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నాయని ఈ వివాదంపై సరైన నిర్ణయం తీసుకోపోవడంతో తరచుగా అక్కడ నివసిస్తున్న గిరిజనులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చొరవ తీసుకొని కొట్టియా ఆంధ్ర వివాదాన్ని ఒడిశా సిఎంతో చర్చలు జరిపితే గాని పరిష్కారం కాదని గిరిజన సంఘాలు అంటున్నారు. సాలూరు మండలం ఎగువ సెంబి గ్రామానికి చెందిన తాడంగి పిలుకు, తాడంగి చిరంజీవిని తోణాం గ్రామంలో శనివారం సాయంత్రం అన్యాయంగా ఒడిశా పోలీసులు అరెస్టు చేసారు. ఈ మేరకు ఆదివారం ఎగువసెంబి గ్రామంలో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో గిరిజనులు నిరసన చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతు కొరాపుట్ కలెక్టర్‌ను కలవడానికి అని చెప్పి తాడంగి పిలుకు, తాడంగి. చిరంజీవిని ఒడిశా పోలీసులు కొరాపుట్ జైల్లో నిర్బంధించారన్నారు. అలాగే ఒడిశా ప్రభుత్వం దౌర్జన్యాన్ని ప్రశ్నించినందుకు ఇలా గిరిజనులను నిర్బంధించడం సరికాదన్నారు. అంతేకాకుండా దీనిపై మంత్రి సంధ్యారాణి స్పందించి ప్రకటన చేయడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. అలాగే ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి ఒడిశా ప్రభుత్వంతో చర్చలు జరిపి ఇద్దరు గిరిజనులను విడుదల చేయాలని కోరారు. ఈ నిరసనలో పెద్దఎత్తున గిరిజనులు పాల్గొన్నారు.

# స్వీయగణన ప్రతి పౌరుడు బాధ్యతగా రిజిస్టర్ చేసుకోవాలి

**• తిరుపతిలో అవగాహనతో 5కే రన్**



**తిరుపతి, ఏప్రిల్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** స్వీయగణనను ప్రతి పౌరుడు బాధ్యతగా భావించి రిజిస్టర్ చేసుకోవాలని తిరుపతి డిఆర్‌ఓ జి.నరసింహులు పేర్కొన్నారు. భారత జనగణన -2027లో భాగంగా రెండు దశల్లో జనగణన ప్రక్రియ జరుగుతుందన్నారు. మే 1వ తేదీ నుండి 30వరకు ఎన్యుమరేటర్ ద్వారా ఇంటింటికి వెళ్లి ఇళ్ల గణన చేపట్టడం జరుగుతుందని, 2027 ఫిబ్రవరిలో జనాభా గణన జరుగుతుందన్నారు. ఇళ్ల గణనలో భాగంగా, దేశంలో మొట్టమొదటి సారిగా "స్వీయ గణన" (సెల్ఫ్ ఎన్యుమరేషన్) అవకాశం ఇవ్వడం జరిగిందన్నారు. స్వీయగణనపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆదివారం తిరుపతి వైద్యకళాశాల వివేకానంద కూడలి నుండి ఎస్‌వి యూనివర్సిటీ వరకు 5కే రన్ నిర్వహించారు. టిటిడి బోర్డు సభ్యురాలు పనబాక లక్షి ్మతో కలసి డిఆర్‌ఓ జెండా ఊపి ప్రారంబించారు. తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్ ఆదేశాలతో స్వీయగణన ప్రాముఖ్యతపై ప్రజలందరికీ అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో 5కే రన్ నిర్వహించడం జరిగిందన్నారు. స్వీయ గణన డిజిటల్ విధానంలో మొబైల్ ద్వారా ఇంటి వివరాలను నమోదు చేసుకోవాలని, నమోదు అనంతరం రిజిస్ట్రేషన్ నంబర్ ఇవ్వబడుతుందన్నారు. ఎన్యుమరేటర్ ఇంటికి వచ్చినప్పుడు ఆ రిజిస్ట్రేషన్ నంబర్ చెబితే, వారు ఆ వివరాలను సరిచూసి అనుమతినిస్తారన్నారు. వివరాలను ఎడిట్ చేయాలన్నా ఎన్యుమరేటర్‌ల ద్వారా సరిచూసుకుని నవీకరణ చేసుకోవచ్చన్నారు.

పనబాకలక్ష్మి మాట్లాడుతూ స్వీయగణనపై అవగాహన కల్పించే విధంగా 5కె రన్ నిర్వహించడం జరిగిందన్నారు. స్వీయగణన ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ గుర్తించి డిజిటల్ విధానం లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. 5కే రన్‌లో మొదటి బహుమతి గెలుచుకున్న డి.సికిందర్‌కు రూ.5 వేలు, రెండవ బహుమతి గెలుచుకున్న భగవత్‌కు రూ.3 వేలు, మూడవ బహుమతి గెలుచుకున్న డి.సింధూర్‌కు రూ.2 వేలు నగదు బహుమతిని ముఖ్య అతిథుల చేతుల మీదుగా అందించారు.

## తుంగలంలో కూలిన రైల్వే ఓవర్ బ్రిడ్జ్

- డెకింగ్ ఏడుగురికి గాయాలు - తృటిలో తప్పిన భారీ ప్రాణనష్టం
- భోజన విరామమే ప్రాణం పోసింది!



**గాజువాక,ఏప్రిల్ 26,ప్రభాతవార్త**

నిర్మాణంలో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జ్ (ఆర్వోబీ) డెకింగ్ ఒక్కసారిగా కుప్పకూలడంతో ఏడుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమయంలో ఎక్కువ మంది కార్మికులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. గాజువాక సమీపంలోని తుంగలం వద్ద ఆదివారం జరిగిన ఈ ప్రమాదం తీవ్ర కలకలం సృష్టించింది.స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. గాజువాక పోలిస్టేషన్ పరిధి జీవీఎంసీ 69వ వార్డు తుంగలం వద్ద రైల్వే ట్రాక్ పై గత కొంతకాలంగా ఆర్వోబీ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మధ్యాహ్నం మూడు, నాలుగో పిల్లర్ల మధ్య డక్టింగ్ పనులు నిర్వహిస్తుండగా..డెకింగ్

మిగతా 8..లో

## ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ

**విశాఖపట్నం, ఏప్రిల్ 26, ప్రభాతవార్త**



39 వార్డు పరిధిలో లక్ష్మీ టాకీస్ వద్ద శెట్టిబలిజ సామాజిక భవనంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ వైద్యసేవలు ఉచితంగా అందించడం. ఆరోగ్యంపై అవగాహన కల్పించడం కొరకు శిబిరాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులు జనసేన డాక్టర్ సెల్ సెక్రటరీ సునీత, జనసేన నేత కొల్లి సింహాచలంని అభినందించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సాదిక్, కూటమి నేతలు దానేష్, రాజు, ఇల్లా రాజు, తాతారావు, సలీం, కోటమ్మ, ఇతర కూటమి నేతలు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

**విశాఖపట్నం, ఏప్రిల్ 26, ప్రభాతవార్త**



ఈ నెల 28న జిల్లాలో జరగనున్న ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ పరిశీలించారు.

మిగతా 8..లో

## నేడు, రేపు సీఎం చంద్రబాబు విశాఖ పర్యటన

**విశాఖపట్నం, ఏప్రిల్ 26, ప్రభాతవార్త**



రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 27, 28 తేదీలలో విశాఖపట్నంలో పర్యటించనున్నారు. 27వ తేదీ సాయంత్రం 3 గంటలకు వాయు మార్గం ద్వారా విశాఖపట్నం చేరుకోనున్న ముఖ్యమంత్రి, అక్కడి నుండి ఆంధ్ర యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీకి వెళ్లి భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ కి స్వాగతం పలుకుతారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు ఉపరాష్ట్రపతితో కలిసి ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొంటారు. తరువాత పోర్ట్ గెస్ట్ హౌస్‌కు చేరుకుని, అక్కడి నుండి నోవాటెల్ హోటల్‌లో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటారు. విశాఖపట్నంలో రాత్రి బస చేస్తారు. 28వ తేదీ ఉదయం విశాఖపట్నం నుంచి బయలుదేరి ఉదయం 9 గంటలకు ఆనందపురం మండలం తర్లువాడ చేరుకుని గూగుల్ డేటా సెంటర్ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం ఉండవల్లి చేరుకుంటారు.





విశాఖపట్నం
అనకాపల్లి
అల్లూరి సీతారామరాజు
26
వార్త

## గొడిచెర్ల గ్రామంలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయాలి..

- గ్రామంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి :హోం మంత్రి "అనిత"

**(నక్కపల్లి, ప్రభాతవార్త)**



పాయకరావుపేట నియోజకవర్గం, నక్కపల్లి మండలం గొడిచెర్ల గ్రామంలో స్థానికులు అస్వస్థతకు గురైన ఘటనపై హోంమంత్రి అనిత స్పందించారు. ప్రస్తుతం సింగపూర్‌లో అధ్యయన పర్యటనలో ఉన్నప్పటికీ, గ్రామంలోని పరిస్థితులపై ఆమె ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తున్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో ఫోన్‌లో మంత్రి అనిత మాట్లాడారు. బాధితుల ఆరోగ్య

మిగతా 8..లో

## భారత ఎఐ భవిష్యత్తుకు..
# విశాఖ నుంచి మహా ముందడుగు

- రూ. 87,520 కోట్లతో వెయ్యి మెగావాట్ల భారీ సమాచార కేంద్రం
- రేపు ఆనందపురం మండలం తర్లువాడలో గూగుల్ డేటా సెంటర్‌కి సీఎం చంద్రబాబు చేతులమీదుగా భూమి పూజ

**(ప్రభాతవార్త, విశాఖపట్నం)**

ఏపీని ప్రపంచ అంకెల మోలిక వసతుల పటంలో సగర్వంగా నిలబెట్టే చారిత్రాత్మక ప్రాజెక్టుకు తెరలేచింది. సాగర నగరం విశాఖపట్నం వేదికగా రూ. 87,520 కోట్ల భారీ పెట్టుబడితో 1,000 మెగావాట్ల సామర్థ్యం కలిగిన అతిపెద్ద కృత్రిమ మేధ(ఏఐ) సమాచార కేంద్రం ఏర్పాటు కానుంది. ఈ నెల 28వ తేదీన ఆనందపురం మండలం తర్లువాడలో గూగుల్ డేటా సెంటర్ కి సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్ తదితరులు భూమి పూజ చెయనున్నారు. ఈ ప్రాజెక్టుతో భారతదేశ కృత్రిమ మేధ భవిష్యత్తుకు విశాఖ కేంద్ర బిందువుగా మారనుంది. ప్రపంచ ప్రసిద్ధ సంస్థల భాగస్వామ్యంతో రూపుదిద్దుకుంటున్న ఈ మహా ప్రాజెక్టు, రాష్ట్రాన్ని ప్రపంచ అంకెల మోలిక వసతుల్లో అగ్రగామిగా నిలపనుంది. కేవలం సమాచార కేంద్రం మాత్రమే కాకుండా, ఇది పూర్తిస్థాయి కృత్రిమ మేధ(ఏఐ), నవకల్పనలు, రాబోయేతరం

మిగతా 8..లో




## విశాఖ భవితకు గూగుల్ ప్రాశస్త్యం

- ఏఐ హబ్‌గా నగరం..
- రూ.1.35 లక్షల కోట్లతో డేటా సెంటర్
- నేడు శంకుస్థాపన చేయనున్న సీఎం చంద్రబాబు
- యువతకు లక్షలాదిగా ఉపాధి
- ఎమ్మెల్యే పల్లాశ్రీనివాసరావు



**గాజువాక,ఏప్రిల్ 26,ప్రభాతవార్త**

విశాఖ నగరం ప్రపంచ ఐటీ పటంలో సరికొత్త చరిత్ర సృష్టించేందుకు సిద్ధమైంది. గ్లోబల్ టెక్ దిగ్గజం గూగుల్ సంస్థ ఇక్కడ భారీ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేస్తోందని, ఇది రాష్ట్ర పారిశ్రామిక రంగానికి చారిత్రాత్మక మలుపు అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు.

మిగతా 8..లో

## 794 కేజీలు విలువ గంజాయి స్వాధీనం

- రూ37 లక్షల 45 వేల రూపాయలు
- అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్

**పాడేరు, ఏప్రిల్ 26, ప్రభాతవార్త**



మాదకద్రవ్యాల స్మగ్లింగ్‌పై కొనసాగుతున్న "ఆపరేషన్ వజ్రప్రహార్"లో భాగంగా, జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ నేరుగా ఇచ్చిన ఆదేశాలతో అల్లూరి జిల్లా పోలీసులు,ఈగిల్ టీమ్ సమన్వయంతో భారీ అక్రమ గంజాయి నిల్వకేంద్రాన్ని విజయవంతంగా కనిపెట్టారు.

మిగతా 8..లో

## ఏయూ శతాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి..

- జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్

**విశాఖపట్నం, ఏప్రిల్ 26, ప్రభాతవార్త**



ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఆదేశించారు. వేడుకల ఏర్పాట్లపై విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ జి.పి. రాజశేఖర్‌తో కలిసి ఆదివారం సాయంత్రం కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సమీక్ష నిర్వహించారు.

మిగతా 8..లో

## వైభవంగా శ్రీనివాస కళ్యాణ మహోత్సవం

- పట్టువస్త్రాలు సమర్పించిన స్పీకర్ అయ్యన్న దంపతులు

**మాకవరపాలెం, ప్రభాతవార్త**



లోక కల్యాణం ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలం తామరం టీచర్స్ కాలనీ ప్రాంగణంలో ఆదివారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీశ్రీశ్రీ శ్రీనివాస కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. శ్రీ సుదర్శనం సీతారామాచార్యుల వారి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, వారి ధర్మపత్ని చింతకాయల పద్మావతి పాల్గొని స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు.

మిగతా 8..లో

## నాణ్యత లోపంతోనే వంతెన కూకటివేళ్లు కదిలాయి

- వైకాపా సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి ధ్వజం

**గాజువాక,ఏప్రిల్ 26,ప్రభాతవార్త**



తుంగ్లాం వద్ద నిర్మాణంలో ఉన్న వంతెన డెకింగ్ కుప్పకూలడానికి పూర్తిస్థాయిలో నాణ్యత లోపమే కారణమని వైకాపా గాజువాక సమన్వయకర్త తిప్పల శ్రీనివాస దేవన్‌రెడ్డి ధ్వజమెత్తారు.

మిగతా 8..లో




ong-8_ong-8.qxd 4/27/2026 12:20 AM Page 1



**మొదటిపేజీ తరువాయిలు**

## భారత ఎఐ భవిష్యత్తుకు.. విశాఖ నుంచి మహా ముందడుగు

సాంకేతికతకు శక్తి కేంద్రంగా విశాఖను తీర్చిదిద్దనుంది.కీలక ప్రాజెక్టు.. వెయ్యి మెగావాట్లు అంటే ఒక గిగావాట్. ఇది ప్రపంచంలోని అతిపెద్ద కృత్రిమ మేధ సమాచార కేంద్రాల సరసన నిలుస్తుంది. అమెరికా, చైనా తర్వాత కృత్రిమ మేధ మౌలిక వసతుల్లో భారత్‌ను మూడో స్థానంలో నిలిపే కీలక ప్రాజెక్టు ఇది. కాగా, ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది ఉద్యోగాలు లభించనున్నాయి. కృత్రిమ మేధ నిపుణులు, సమాచార శాస్త్రవేత్తలు, మేఘ గణన నిపుణులు, అంతర్జాల భద్రతా నిపుణులు, సౌకర్యాల నిర్వహణ విభాగాల్లో యువతకు విస్తృత అవకాశాలు రానున్నాయి. తీర ప్రాంతం కావడంతోనే ఈ ప్రాజెక్ట్ విశాఖకు..తీర ప్రాంతం కావడం వల్ల అంతర్జాతీయ సముద్రగర్భ వలయానికి నేరుగా అనుసంధానం, హరిత విద్యుత్ లభ్యత, విశాలమైన భూమి, ప్రభుత్వం నుంచి వేగవంతమైన అనుమతులు విశాఖను వరించేలా చేశాయి.మరిన్ని సంస్థలు విశాఖకు తరలివచ్చే అవకాశం..దూరదృష్టితో కూడిన నాయకత్వంలో రాష్ట్రం"అంకెలముందు ఆర్థిక వ్యవస్థ దిశగా వేగంగా అడుగులు వేస్తోంది. ఈ సమాచార కేంద్రం ఏర్పాటుతో పెద్ద భాషా నమూనాలను భారత్‌లోనే శిక్షణ ఇచ్చే సాంకేతిక సామర్థ్యం సొంతం కానుంది. దీంతో బహుళజాతి సంస్థలు, అంకుర సంస్థలు, పరిశోధనా సంస్థలు పెద్ద ఎత్తున విశాఖకు తరలివచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఆంధ్ర విశ్వవిద్యాలయం, గీతం విశ్వవిద్యాలయం, భారతీయ సాంకేతిక సంస్థ తిరుపతి వంటి విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు స్థానికంగానే ప్రపంచ స్థాయి కృత్రిమ మేధ ఉద్యోగాలు లభించనున్నాయి. తద్వారా"తూర్పు తీరపు సాంకేతిక లోయ్యగా విశాఖపట్నం అవతరించడం ఖాయంగా కనిపిస్తోంది.సరికొత్త అధ్యాయానికి నాంది..రాష్ట్ర ప్రగతి, యువతకు ఉపాధి కల్పన, సాంకేతిక రంగంలో సరికొత్త అధ్యాయానికి నాంది పలుకుతున్న ఈ ప్రాజెక్టు, ప్రతి ఆంధ్రుడూ గర్వపడే క్షణమని పారిశ్రామిక వర్గాలు అభివర్ణిస్తున్నాయి.

## తుంగలంలో కూలిన రైల్వే ఓవర్ బ్రిడ్జ్



ఒక్కసారిగా కుప్పకూలి కిందపడిపోయింది. ఈ ధాటికి అక్కడ పనిచేస్తున్న కార్మికులు శిథిలాల మధ్య చిక్కుకున్నారు. ప్రమాద శబ్దాన్ని విన్న స్థానికులు భయాందోళనతో పరుగులు తీశారు. సాధారణంగా అక్కడ పదుల సంఖ్యలో కార్మికులు పనిచేస్తుంటారు. అయితే, ప్రమాదం జరిగిన సమయానికి కార్మికులు భోజన విరామానికి వెళ్లడం, అలాగే సెలవు దినం కావడంతో పనివారూ తక్కువగా ఉండటం ప్రాణనష్టాన్ని నివారించాయి. లేనిపక్షంలో మృతుల సంఖ్య భారీగా ఉండేదని ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారు. తీవ్ర గాయాలు పాలైన ఏడుగురు కార్మికులను సమీపంలోని కృషి ఆసుపత్రికి తరలించారు. వీరు ఛత్తీస్గఢ్, జార్ఖండ్ ప్రాంతాలకు చెందిన బుద్ధిస్వర్, బోస్, అజీత్, దినేశ్, తోసార్ ప్రతాప్, ఉదయ్ గా గుర్తించారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే గాజువాక పోలీసులు, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. శిథిలాల కింద ఎవరైనా వాహనదారులు లేదా పాదచారులు చిక్కుకున్నారా అనే అనుమానంతో గాలింపు చేపట్టారు. జేసీబీల సాయంతో శిథిలాలను తొలగిస్తున్నారు.కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే కారణమా?…సంఘటన స్థలాన్ని గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ ప్రమాదానికి కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే కారణమని ఆయన ప్రాథమికంగా అనుమానం వ్యక్తం చేశారు. అదృష్టవసత్తు ప్రాణ నష్టం జరగలేదని నిర్మాణ లోపాలపై విచారణ జరిపించి, బాధితులకు ప్రభుత్వం తరపున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. సమాచారాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని,ప్రమాద భాదితులకు తగిన వైద్యం అందించి,ప్రభుత్వం తరపున నష్ట పరిహారం వచ్చేలా తనవంతు కృషి చేస్తానని తెలిపారు. నిర్మాణ నాణ్యతపై అధికారులు పూర్తిస్థాయి విచారణకు పల్లా ఆదేశించారు. లోపాలు ఉంటే కాంట్రాక్టు రద్దు చేసే విషయాన్ని పరిశీలిస్తామని తెలిపారు.

## విశాఖ భవితకు గూగుల్ ప్రాశస్త్యం

ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు.అభివృద్ధికి చిరునామా..సుమారు 15 బిలియన్ డాలర్ల (రూ.1.35 లక్షల కోట్లు) భారీ పెట్టుబడితో, 601 ఎకరాల విస్తీర్ణంలో ఈ మెగా ప్రాజెక్టు రూపుదిద్దుకోనుంది. 2028 జూలై నాటికి ఇది అందుబాటులోకి వస్తుందని, దీని ద్వారా లక్షలాది మంది యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని పల్లా ధీమా వ్యక్తం చేశారు.లోకేశ్ వ్యూహం.. బాబు విజన్….ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూరదృష్టి, మంత్రి నారా లోకేశ్ నిరంతర కృషితోనే ఇటువంటి అంతర్జాతీయ సంస్థలు రాష్ట్రానికి వస్తున్నాయని పల్లా కొనియాడారు. “గతంలో విజన్ 2020తో అభివృద్ధికి బాటలు వేసిన చంద్రబాబు , ఇప్పుడు విజన్ 2047తో నవ్యాంధ్రను దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టేందుకు కృషి చేస్తున్నారు. ఖీస్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ఖీ సూత్రంతో పెట్టుబడులను ఆకర్షించడంలో ప్రభుత్వం సఫలీకృతమైంది“ అని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు కేవలం డేటా సెంటర్ మాత్రమే కాదని, ఉత్తరాంధ్ర యువత భవిష్యత్తును మార్చే గేమ్ ఛేంజర్ అని ఆయన స్పష్టం చేశారు. ఎకనమిక్ టైమ్స్ అందించిన "బిజినెస్ రిఫార్మర్ అవార్డు” చంద్రబాబు పాలనా దక్షతకు నిదర్శనమని పల్లా గుర్తుచేశారు.

## వైభవంగా శ్రీనివాస కళ్యాణ మహోత్సవం

శ్రీవారి నగర సంకీర్తన బృందం (తామరం) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కళ్యాణ మహోత్సవానికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ అర్చకులు శాస్త్రోక్తంగా కళ్యాణ ఘట్టాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ.. భక్తిభావం పెంపొందించే ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల వల్ల సమాజంలో శాంతి, సౌభాగ్యాలు కలుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు, ప్రముఖులు మరియు పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తుల రాకతో తామరం ప్రాంతం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది.

## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్

ఆదివారం ఉదయం తర్లువాడ వద్ద జరుగుతున్న గూగుల్ డేటా సెంటర్ శంకుస్థాపన ఏర్పాట్ల పనులను పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, ముఖ్యమంత్రి సెక్యూరిటీ ఆఫీసర్, ఇతర అధికారులతో కలిసి ఆయన హెలిపాడ్ మరియు సభా వేదిక వద్ద జరుగుతున్న పనులను పరిశీలించారు, తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. గూగుల్, అదానీ సంస్థ ప్రతినిధులు, ఇతర అధికారులు వారితో పాటు పాల్గొన్నారు.

## నాణ్యత లోపంతోనే వంతెన కూకటివేళ్లు కదిలాయి

ఆదివారం ఆయన ప్రమాద స్థలాన్ని సందర్శించిన అనంతరం ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించి దిగ్భ్రాంతి ని వ్యక్తం చేసారు. అనంతరం విలేకరులతో మాట్లాడిన ఆయన.. యంత్రాంగం వైఫల్యా లపై విమర్శనాస్త్రాలు సంధించారు. వంతెన నిర్మాణ సమయంలో కనీస నాణ్యత తనిఖీ లు (క్వాలిటీ చెకింగ్), అధికారుల పర్యవేక్షణ కరువైందని దేవన్‌రెడ్డి మండిపడ్డారు. అధికారుల అవినీతి వల్లే ఈ దుర్ఘటన చోటుచేసు కుందని, సామాన్యుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. అధికారులు వివరణ ఇవ్వాలి ఈ భారీ ప్రమాదంపై జీవీఎంసీ,ఏపీఐఐసీ అధికారులు మౌనం వీడాలని ఆయన డిమాండ్ చేశారు. అస లేం జరిగిందో ప్రజలకు స్పష్టమైన వివరణ ఇవ్వాలని కోరారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని,నాణ్యత విషయంలో రాజీపడిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## 794 కేజీలు విలువ గంజాయి స్వాధీనం



ఇందుకు సంబంధించిన వివరాలను జిల్లా పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ అమిత్ బర్ధర్ వెల్లడించారు. ఈనెల 24 వ తేదీ శుక్రవారం రాత్రి 7.30 నిమిషాలు సమయంలో అక్రమ నిల్వలపై అందిన ఖచ్చితమైన సమాచారం మేరకు, పోలీసు బృందం అధికారిక మధ్యవర్తులతో కలిసి ముంచంగిపుట్టు మండలం పనసపుట్టు పంచాయతీ, సంగంవలస గ్రామం శివార్లలోని సదరు కాఫీ తోటలో శోధన ప్రారంభించగా కొండ ప్రాంతంలో ఉన్న కాఫీ తోటలో తనిఖీ చేయగా 39 తెల్లటి గన్నీ బ్యాగులలో ప్యాక్ చేసి పొదల మధ్య నిల్వ ఉంచిన రూ/37 లక్షల 45 వేల రూపాయలు విలువగల 749 కిలోల గంజాయి. స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ అమిత్ బర్ధర్ తెలిపారు.ఆ స్థలంలో గంజాయి అక్రమ వ్యాపారంలో ఉన్న వ్యక్తులు కాఫీ తోటను చాటుగా వాడుకున్నారని, పోలీసుల కదలికలను గమనించి వారు పారిపోయారని అనుమానిస్తున్నా మణి ఎస్పీ పేర్కొన్నారు. ఈ గంజాయి అక్రమ నిల్వలపై కేసు నమోదు చేసి కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నామన్నారు.ఈ అక్రమ గంజాయి నిల్వలపై ఈ నెట్‌వర్క్ వెనుక ఉన్నవారిని గుర్తించేం దుకు పోలీస్ శాఖ ప్రయత్నాలు జరుగుతున్నాయనీ అయన తెలిపారు. అధికారిక నిబద్ధత: మాదకద్రవ్యాల అక్రమ రవాణాను పూర్తిగా నిర్మూలిం చడానికి అల్లూరి జిల్లా పోలీసులు కట్టుబడి ఉన్నామన్నాడు.. ఎస్పీ అమిత్ బర్దార్ మార్గదర్శకత్వంలో అటవీ ప్రాంతాలు రవాణా మార్గాల్లో నిఘా పెంచారు. తమ భూముల్లో ఇలాంటి అక్రమ కార్యకలాపాలకు సహకరించే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ అమిత్ బర్దర్ హెచ్చరించారు.

## గొడిచెర్ల గ్రామంలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయాలి..

పరిస్థితి గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో తక్షణమే వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు అవసరమైన చికిత్స అందించాలని ఆమె ఆదేశించారు. గొడిచెర్ల గ్రామంలో పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని అధికారులకు సూచించారు. గ్రామంలో శానిటేషన్ చర్యలను మరింతగా పెంచాలని పేర్కొన్నారు. ప్రజలు కూడా స్వచ్ఛతపై శ్రద్ధ పెట్టి, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి అనిత సూచించారు. మంత్రి ఆదేశాలను అనుసరించి డీఎల్డీఓ మంజులవాణి, ఎంపీడీవో కే. చలపతిరావు, ఏవో దెందుకూరు సీతారామరాజు ,పంచాయతీ కార్యదర్శి తదితరులు గ్రామంలో పర్యటించి శానిటేషన్ పనులు చేపట్టి త్రాగునీటి విషయంలో ఎటువంటి ఇబ్బందులు లేదని వడ గాల్పులు కారణంగా కారణంగా తీసుకున్న ఆహారం వల్ల వాంతులు ,విరోచనాలు బారిన పడ్డారని ప్రస్తుతం అందరూ క్షేమంగా ఉన్నారని మంత్రికి వివరించారు.

## ఏయూ శతాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి..

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాట్లు పక్కాగా ఉండాలని, ఆర్ బి, ఫైర్, ఎలక్ట్రికల్, ఐ పీఆర్ విభాగాలు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని సూచించారు. మినిట్ టు మినిట్ ప్రోగ్రామ్ షెడ్యూల్‌కు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని, మెమెంటోస్ బహూకరణతో పాటు ఇతర కార్యక్రమాలు సజావుగా జరిగేలా చూడాలని పేర్కొన్నారు.సాంస్క ృతిక కార్యక్రమాలు మధ్యాహ్నం 2.00 గంటల నుండి 3.45 గంటల వరకు సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. గ్రీన్ రూమ్‌లలో అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించడంతో పాటు గ్యాలరీల్లో తాగునీటి సరఫరా నిరంతరంగా ఉండేలా చూడాలని సూచించారు. అర లీటర్ వాటర్ బాటిళ్లు, జీవీఎంసీ ద్వారా 25 లీటర్ల నీటి టిన్నులతో టేబుల్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. గ్యాలరీల్లో అందరికీ స్నాక్స్ అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పారిశుధ్య నిర్వహణ, పార్కింగ్ ఏర్పాట్లు కచ్చితంగా ఉండాలని, కమాండ్ కంట్రోల్ రూమ్‌లో అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఇంచార్జి అధికారులు సమన్వయంతో అన్ని విభాగాల పనితీరును పర్యవేక్షించాలని సూచించారు. విద్యార్థులు గ్యాలరీలకు సులభంగా చేరుకునేలా చర్యలు తీసుకోవాలని, పబ్లిసిటీ కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిం చాలని తెలిపారు.ఎం.ఓ.యూ లు, సత్కార కార్యక్రమాలు ప్రణాళికబద్ధంగా నిర్వహించడంతో పాటు వేదిక అందంగా అలంకరించాలని సూచించారు. వీవీఐపీల కోసం అత్యాధునిక సదుపాయాలు కలిగిన అంబులెన్సులు, కంటింజెంట్ ఆసుపత్రులు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, స్ట్రక్చరల్ పనులు సక్రమంగా ఉండాలని, ఫైర్ సేఫ్టీ చర్యలతో పాటు ఫైర్ టెండర్లు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. కాన్వాయ్ ఇంచార్జి అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించాలని, రైల్వే స్టేషన్, ఎయిర్పోర్ట్ వద్ద హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. పెవిలియన్ వద్ద ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రధాన విభాగాల అధికారులకు వైర్లెస్ సెట్స్ అందించాలని ఆదేశించారు. అందరూ సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, అప్పగించిన బాధ్యతలను అధికారులు కట్టుదిట్టంగా నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో అన్ని విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.ఏయూ, తర్లువాడ వద్ద జరిగే ఏర్పాట్ల పరిశీల27, 28వ తేదీల్లో విశాఖ వేదికగా జరిగే ఉప రాష్ట్రపతి, గవర్నర్, ముఖ్యమంత్రి ఏర్పాట్లను సీఎం కార్యక్రమాల నిర్వహణ సమన్వయకర్త పెం దుర్తి వెంకటేష్, జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి పరిశీలించారు. అలాగే జిల్లా కలెక్టర్ తర్లువాడ వద్ద జరుతున్న ఏర్పాట్లను పోలీస్ కమిషనర్, ఇతర అధికారులతో కలిసి పరిశీలించి తగిన సూచనలు చేశారు.

## నర్సీపట్నంలో అత్యాధునిక వైద్య సేవలు

**- సమ్యక్ ఎస్7 హాస్పిటల్‌ను ప్రారంభించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు**

**నర్సీపట్నం, ప్రభాతవార్త**



స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వెనుక నూతనంగా ఏర్పాటు చేసిన సమ్యక్ ఎస్7 మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆదివారం ఘనంగా ప్రారంభించారు. తన సతీమణి చింతకాయల పద్మావతితో గారు తో కలిసి ఆయన రిబ్బన్ కట్ చేసి ఆసుపత్రిలోని అత్యాధునిక వైద్య పరికరాలను, సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ నర్సీపట్నం నియోజకవర్గంతో పాటు అనకాపల్లి జిల్లాలోని ఏడు నియోజకవర్గాల ప్రజలకు ఈ హాస్పిటల్ అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మెరుగైన వైద్యం అందించాల్సిన అవసరం ఉందని, ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాలైన పాడేరు, చింతపల్లి, లంబసింగి నుండి వచ్చే రోగులకు ఈ ఆసుపత్రి ఒక వరమని పేర్కొన్నారు. వైద్యం కోసం గతంలో విశాఖపట్నం లేదా హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లాల్సి వచ్చేదని, కానీ ఇప్పుడు స్థానికంగానే నిపుణులైన డాక్టర్లు అందుబాటులోకి రావడం శుభపరిణామన్నారు. డాక్టర్ మహారాజ్ లాలం (లీడ్ జనరల్ మెడిసిన్), డాక్టర్ ఎల్.ఎస్. సద్మిమ (లీశిగి ఆర్థోపెడిక్స్) వంటి విద్యావంతులైన యువకులు తమ సొంత ఊరిపై మమకారంతో ఇక్కడే సేవలు అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమని కొనియాడారు. ఈ హాస్పిటల్‌లో బీపీ, షుగర్, థైరాయిడ్, గుండె జబ్బులు, కిడ్నీ సమస్యలతో పాటు ఫిజియోథెరపీ విభాగంలో అత్యాధునిక ఎక్విప్‌మెంట్ ఏర్పాటు చేయడం ద్వారా పక్షవాతం, మోకాళ్ల నొప్పులు, కీళ్ల నొప్పులతో బాధపడే వృద్ధులకు ఎంతో మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రోగులకు నాణ్యమైన వైద్యం అందించి, పేద ప్రజల నమ్మకాన్ని చూరగొనాలని నిర్వాహకులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, స్థానిక నేతలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## భూవివాదం బీభత్సం

**- కళ్లల్లో కారం చల్లి కత్తులు, కర్రలతో దాడి - 9మందిపై హత్యాయత్నం కేసు నమోదు**

**- స్టేషన్ బెయిల్‌తో నిందితులు విడుదల**

**విశాఖపట్నం, ఏప్రిల్ 25, ప్రభాతవార్త**



అనకాపల్లి జిల్లాలో భూవివాదం హింసాత్మకంగా మారి తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసిన ఘటన అచ్యుతాపురం మండలం దొసురు పంచాయతీ కొల్లి వానిపాలెం గ్రామంలో చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఫిర్యాదుదారుడైన రాజాన సత్యనారాయణ కళ్ళల్లో కారం చల్లి కత్తులు, కర్రలతో దాడి చేయడంతో పాటు అక్కడే వున్న ఆయన కుమారుడి చెయ్యి విరగ్గొట్టారు. దీంతో ఈ సంఘటనలో ప్రమేయమున్న 9మందిపై బిఎన్ఎస్ చట్టం 118(1), 118(2), ఆర్/డబ్ల్యు 3(5) కింద పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. అచ్యుతాపురం మండలం దొసురు పంచాయతీ కొల్లి వానిపాలెం గ్రామంలో ఈ నెల 22వ తేది సాయంత్రం 7 గంటలకు, ఫిర్యాదుదారుడు తన కొడుకుతో కలిసి సర్వే నం. 172 లోని తమ వ్యవసాయ భూమికి వెళ్లాడు. అక్కడ ఈ 9 మంది వ్యక్తులు(కొల్లి సతీష్, కొల్లి రమణ, కొల్లి అప్పన్నాయుడు, కొల్లి వెంకట్రావు, కొల్లి రమణ, పల్లా మహీంద్ర, పల్లా సింహాచలం నాయుడు, పల్లా రామారావు బాబు, కొల్లి నరసింగరావులు) ఎటువంటి అనుమతి లేకుండా ప్రభుత్వ భూమిని సదును చెయ్యడంతో పాటు ఆ భూమి మీదుగా ఎవరూ వెళ్లకుండా అడ్డంగా కాలువ మాదిరిగా తవ్వేశారు. భూమికి వెళ్లే దారిని ఎందుకు మూసేశారని అడిగినందుకు ఫిర్యాదుదారుడు, అతని కొడుకుపై కారం పొడి చల్లి, తర్వాత కర్రలు, కత్తులతో దాడి చేశారు. కొడుకు ఎడమ చెయ్యి విరిగింది, ఫిర్యాదుదారుడి తల పగిలింది. ఆయన శరీర భాగాలపై ఇష్టానుసారంగా కర్రలు, కత్తిలు, రాళ్ళతో కొట్టి తీవ్రంగా గాయపర్చడంతో ఫిర్యాదు దారుడు అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. రక్తపు మడుగుల్లో ఉన్న వాళ్లిద్దరినీ… నిందితులు తవ్విన కాలువలోకి తోసేశారు.ఇది ముందస్తు పథకంతో చేసిన హత్యాయత్నం అని ఫిర్యాదుదారుడు ఆరోపించాడు. నిందితులు చాలా కాలంగా శ్మశానం పక్కన ఉన్న ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్నారని స్థానికలు ఆరోపించారు. తీవ్ర గాయలతో వున్న ఫిర్యాదుదారుడు, ఆయన కుమారుడు ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా, ఆదివారం నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. స్టేషన్ బెయిల్ ఇచ్చి వదిలిపెట్టేశారు.

## నాణ్యమైన సైన్స్ విద్య బోధన సులభతరం

**- సెంచూరియన్ విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ డి.ఎన్.రావు, ఛాన్సలర్ ఆచార్య జి ఎస్ ఎన్ రాజు**

**విశాఖపట్నం, ప్రభాతవార్త**




దేశ వ్యాప్తంగా పాఠశాలల్లో నాణ్యమైన సైన్స్ విద్యను అందించేందుకు గ్రామ తరంగ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ (జిటి టెక్) సంస్థ రాష్ట్రంలోని బాట్‌క్లబ్ ప్రైవేట్ లిమిటెడ్ (బాట్ క్లబ్) అనే ఎడ్యుకేషన్ టెక్నాలజీ స్టార్టప్ సంస్థ తో వ్యూహాత్మక భాగస్వామ్యం చేసుకుందని సెంచూరియన్ విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు, గ్రామ్ తరంగ్ టెక్ ప్రమోటర్ ప్రొఫెసర్ డి.ఎన్.రావు వివరించారు. ఆదివారం పట్టణంలోని వి.జె.ఎఫ్. ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సులభంగా సైన్స్‌ను బోధన చేసేందుకు ఈ ఒప్పందం దోహదపడుతుందన్నారు. బాట్‌క్లబ్ అభివృద్ధి చేసిన ఎ వన్ ఆధారిత క్లాస్‌రూమ్, డిజిటల్ విజువలైజేషన్‌లతోపాటు పాఠశాలల అభ్యాస ఫలితాలపై కూడా విశ్లేషణలను అందిస్తుందన్నారు. తొలి దశ కింద మూడు నెలల్లో 45 పాఠశాలలకు ఈ కార్యక్రమాన్ని విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కాగా, దేశం ఎదుర్కొంటున్న తీవ్రమైన సవాళ్లకు పరిష్కారం చూపాలనే ఉద్దేశ్యంతో గ్రామ్ తరంగ్ టెక్నాలజీస్ స్థాపించామన్నారు. ఇందుకు సెంచూరియన్ విశ్వవిద్యాలయం నెట్‌వర్క్‌ను ఉపయోగించుకోనున్నట్లు తెలిపారు. సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో విద్య కేవలం బట్టీపట్టే పద్ధతికి అతీతంగా ఉండాలని, యువతలో పరిశోధనా స్ఫూర్తిని నిజంగా రగిలించాలని మేము కృషి చేస్తున్నామని సెంచూరియన్ విశ్వవిద్యాలయం ఛాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు అన్నారు. సాంకేతికత, బోధనా పద్ధతి ఒక లక్ష్యంతో కలిసినప్పుడు ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి అవకాశం ఉంటుందన్నారు. బాట్‌క్లబ్ తో ఒప్పందం ఇందుకు దోహదపడుతుందన్నారు.జిటి టెక్ అనేది కేవలం ఒక కంపెనీ మాత్రమే కాదని, తాము మానవ సామర్థ్యాన్ని పెంపొందించే ఒక సాధనంగా తీర్చిదిద్దామని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బాబు శంకర్ పేర్కొన్నారు. బాట్‌క్లబ్‌తో భాగస్వామ్యం అనేది వ్యూహాత్మక ఒప్పందమన్నారు. ఇది ఫిన్‌టెక్ నైపుణ్యం, ఇండస్ట్రీ 4.0 సామర్థ్యాలు విద్య పట్ల ఉన్న అభిరుచిని ఒక శక్తివంతమైన ప్రతిపాదనగా ఏకం చేస్తుందన్నారు. ప్రతివిద్యార్థికి సైన్స్‌ను అర్థవంతంగా అర్థమయ్యేలా అందించడమే బాట్‌క్లబ్ యొక్క లక్ష్యమని బాట్ క్లబ్ కోప్రమోటర్ కె.హర్షవర్ధన్ అన్నారు. మా వృద్ధిని వేగవంతం చేయడానికి సెంచూరియన్ విశ్వవిద్యాలయం దోహదపడుతుందన్నారు.

## ఘనంగా ఏయూ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల నిర్వహణ

**- కట్టమంచికి పూలమాల వేసి అంజలి ఘటించిన అధికారులు**

**- విశ్వవిద్యాలయంలో పండుగ వాతావరణం**

**ఆంధ్రవిశ్వవిద్యాలయం, ఏప్రియల్ 26, ప్రభాతవార్త**



ఆంధ్రవిశ్వవిద్యాలయం శతాబ్ది సంవత్సర వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం ఏయూ పరిపాలనా భవనం వద్ద విశ్వవిద్యాలయం ప్రథమ ఉపకులపతి సర్ కట్టమంచి రామలింగారెడ్డి విగ్రహానికి ఏయూ ఉపకులపతి ఆచార్య జి.పి రాజశేఖర్ పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం మెయిన్ గేట్ వద్దనున్న ఏయూ లోగో(చిహ్నం)కు పూలమాలలు వేసారు. అనంతరం తిగే 100 వద్ద శతాబ్ది వ్యవస్థాపక దినోత్స వేడుకలను ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.పి రాజశేఖర్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం ప్రగతి, వికాసానికి దోహదపడిని ప్రతీ వ్యక్తిని తలచుకోవడం, వారిసేవలను గుర్తుచేసుకోవడం ఎంతో అవసరమన్నారు. విశ్వవిద్యాల స్థాపన నుంచి నేటి వరకు అనేకమంది చేసిన కృషిని మరువరాదని, వారి సేవలను స్మరణ చేసుకోవాలన్నారు. అందరికీ శుభాకాంక్షలు తెలియజేసారు. సోమవారం జరిగే ప్రధాన వేడుకలో ప్రతీ వ్యక్తి భాగం కావాలని, కార్యక్రమాన్ని విజయవతం చేయడంలో భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం ఏయూ ఆచార్యులు వి.శ్రీమన్నారాయణ, ఆచార్య వి.గిరిజ శాస్త్రి, ఆచార్య టి.షారోన్ రాజు, ఆచార్య ఎం.వి.ఆర్ రాజు, ఆచార్య ఎం.శశి, ఆచార్య కె.సీతామాణిక్యం, ఆచార్య కె.రమా సుధ తదితరులు విశ్వవిద్యాలంతో తమ అనుభవాలను పంచుకున్నారు. కాల స్మృతి గుళిక ప్రారంభం…. ఆంధ్రవిశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలలో భాగంగా భవిష్యత్ తరాలకు నేటి చరిత్రను అందించే విధంగా పూర్వవిద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో కాల స్మృతి గుళిక (టైం కాప్సుల్) ను ఏర్పాటు చేశారు. వందేళ్ల వేడుక సందర్భంగా అనేక విషయాలను దీనిలో బధ్రపరచి 50 సంవత్సరాల తరువాత తెరిచి చూసే విధంగా ప్రణాళిక చేస్తున్నట్లు ఏయూ ఆలుమ్ని అసోసియేషన్ అధ్యక్షులు కె.వి.వి రావు తెలిపారు. దీనిలో విశ్వవిద్యాలయానికి చెందిన అనేక అంశాలను పొందుపరచి శతాబ్ది ఉద్యానవనంతో ప్రత్యేకంగా బధ్రపరచడం జరుగుతుందన్నారు.శతాబ్ది సంవత్సర వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఏయూలో పండుగ వాతావరణం నెలకొంది. ఉద్యోగులు ఉత్సాహంగా వేడుకలలో పాల్గొన్నారు. శతాబ్ది సందర్భంగా ఏయూ పరిపాలనా భవనం వద్ద, కట్టమంచి రామలింగారెడ్డి విగ్రహం వద్ద ఫోటోలు తీసుకున్నారు. పరిపాలనా భవనం వద్ద ఏర్పాటు చేసిన తిగే 100 వద్ద ఫోటోలు, సెల్ఫీలు తీసుకుంటూ సందడి చేసారు. అదే విధంగా పరిపాలనా భవనం ఎదురుగా ఏర్పాటు చేసిన చారిత్రక ఫోటోలతో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రాంగణాన్ని సందర్శించి, తిలకించారు.కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య పి.కింగ్, రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, ఏయూ క్యాంపస్ కళాశాలల ప్రిన్సిపాల్స్, డీన్‌లు, అధికారులు, వార్డెన్లు, ఆచార్యులు, ఉద్యోగులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## ఏయూ శతాబ్ది ఉత్సవ వేడుకలకు సర్వం సిద్ధం

**- ముఖ్య అతిథిగా ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్**

**- ఇంజనీరింగ్ కళాశాల మైదానం వేదికగా విస్తృత ఏర్పాట్లు**

**ఆంధ్రవిశ్వవిద్యాలయం, ప్రభాతవార్త**



ఆంధ్రవిశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసామని ఏయూ వీసీ ఆచార్య జి.పి రాజశేఖర్ తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం ప్లాటినం జూబ్లీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. సాయంత్రం 4 గంటల నుంచి ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానం వేదికగా ప్రధాన కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. మద్యాహ్నం 2 గంటల నుంచి వేదికపై సాంస్క ృతిక కార్యక్రమాలను ఏయూ విద్యార్థులు ప్రదర్శిస్తారన్నారు.శతాబ్ది ఉత్సవాల ప్రధాన ఘట్టానికి ముఖ్య అతిధిగా ఉపరాష్ట్రపతి శ్రీ సి.పి రాధాకృష్ణన్ గారు, ప్రత్యేక అతిధిగా భారత క్రికెట్ దిగ్గజం, మాజీ పార్లమెంట్ సభ్యులు శ్రీ సచిన్ రమేష్ టెండూల్కర్ గారు హాజరవుతున్నారని, కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ శ్రీ అబ్దుల్ నజీర్ గారు, ఒరిస్సా రాష్ట్ర గవర్నర్ కె.హరి బాబు గారు,రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు, మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు, రాష్ట్ర విద్య శాఖ మంత్రి నారా లోకేష్ గారు, కేంద్ర మంత్రులు కె.రామ మోహన రావు, కేంద్ర సహాయ మంత్రి బి.ఆర్ శ్రీనివాస వర్మ, ఎంపి ఎం.శ్రీభరత్, రాష్ట్ర మంత్రి శ్రీ బాల వీరాంజనేయ స్వామి, పలువురు రాష్ట్రమంత్రులు, ప్రజాప్రతినిధులు తదితరులు హాజరవుతారన్నారు. శతాబ్ది ఉత్సవాల కార్యక్రమానికి దాదాపు 25 వేల మందికిపైగా హాజరు కానున్నారు. దీనికి అనుగుణంగా అవసరమైన ఏర్పాట్లను చేయడం జరిగింది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మూడు జర్మన్ షెడ్‌లలో, 36 కంపార్ట్‌మెంట్‌లు విభజించి సీటింగ్ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రధాన వేదికకు రెండువైపులా రెండు వేదికలు, ఎల్.ఇ.డి స్క్రీన్‌ల ఏర్పాటు చేస్తున్నామన్నారు.కార్యక్రమంలో ముందుగా మైదానానికి చేరుకున్న ఉపరాష్ట్రపతి ఇతర అతిధులతో కలిసి ఏయూ వందేళ్ల వైభవాన్ని చాటే విధంగా ఏర్పాటు చేస్తున్న ఛాయాచిత్ర, చిత్రకళా విభాగ ప్రదర్శను ప్రత్యేక పెవిలియన్‌లో తిలకిస్తారు. విశ్వవిద్యాలయ వంద సందత్సరాల ప్రయాణంలో ముఖ్య ఘట్టాలను వివరిస్తూ ఈ ప్రత్యేక ప్రదర్శనను ఏర్పాటు చేసామన్నారు. అనంతరం జరిగే ప్రధాన కార్యక్రమంలో అతిధులు పాల్గొంటారు. కార్యక్రమంలో భాగంగా శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక తపాళా బిళ్ల, నాణెం, కాఫీ టేబుల్ బుక్ విడుదల చేస్తారు.అవగాహన ఒప్పందాలు చేసుకోవడం, విశిష్ట స్థానాలలో ఉన్న9 మంది పూర్వ విద్యార్థులను సత్కరించడం జరుగుతుందని, అతిధులు, ఆహ్వానితులు, పూర్వ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా సీటింగ్ ఏర్పాట్లు చేస్తున్నాము. ఇప్పటికే ప్రత్యేక రిజిస్ట్రేషన్ ప్రక్రియ, యాప్ సహాయంతో జరుపుతున్నాము. విద్యార్థులు నేరుగా తమ వివరాలతో ఎంట్రీ పాస్‌ను పొందవచ్చును.ప్రధాన వేదకకు పక్కనే ఏర్పాటు చేస్తున్న మరొక వేదికపై సాంస్క ృతిక కార్యక్రమాలను ప్రదర్శిస్తారు. కార్యక్రమ నిర్వహణకు జిల్లా కలెక్టర్, పోలీస్ కమీషనర్ ఇతర అధికారులు పూర్తి సహకారం అందిస్తున్నారని, అందరి సమన్వయంతో కార్యక్రమ ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, పార్కింగ్ స్థలం ఏర్పాటు తదితర పనులు పోలీసుల పర్యవేక్షణలో జరుగుతున్నాయని తెలిపారు. నగరవాసులు కోసం బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాము. అక్కడ ప్రత్యక్ష ప్రసారం ఏర్పాటుచేస్తున్నామన్నారు.

## పన్ను సమస్యలకు పరిష్కారం గ్రేటర్ వ్యాప్తంగా రెవెన్యూ మేళాలు

**- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్**

**విశాఖపట్నం, ఏప్రిల్ 26, ప్రభాతవార్త**



నగర ప్రజలకు ఆస్తి పన్ను, ఇతర రెవెన్యూ సేవలను వేగవంతంగా అందించేందుకు మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ (జీవీఎంసీ) ప్రత్యేకంగా"రెవెన్యూ (టాక్స్) మేళాలు” నిర్వహిస్తోంది. ఏప్రిల్ 25 నుంచి 30 వరకు అన్ని జోన్లలో ఈ మేళాలు జరుగుతున్నాయని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. ప్రతి రోజు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జోనల్ కార్యాలయాల్లో నిర్వహిస్తున్న ఈ మేళాల్లో ఇప్పటికే పలు జోన్లలో మంచి స్పందన లభించింది. తూర్పు, పశ్చిమ జోన్లతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో మేళాలు విజయవంతంగా పూర్తయ్యాయి. ఇప్పటివరకు 166 సేవలకు సంబంధించి ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీకరించి పరిష్కార చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ మేళాల్లో ఆస్తి పన్నుకు సంబంధించిన కొత్త అసెస్‌మెంట్‌లు, భవనాల తొలగింపు, మార్పులువిస్తరణలు, ఆస్తి విభజన, రివిజన్ పిటిషన్లు, పన్ను మినహాయింపులు, టైటిల్ ట్రాన్స్ఫర్, యజమాని పేరు మరియు డోర్ నెంబర్ సవరణ వంటి 11 ప్రధాన సేవలు అందుబాటులో ఉన్నాయి. ప్రజలు తమ సమస్యలు, దరఖాస్తులను నేరుగా సమర్పించుకోవడం ద్వారా వేగంగా పరిష్కారం పొందవచ్చని కమిషనర్ తెలిపారు. మేళాల్లో అందిన ప్రతి దరఖాస్తును అదే రోజు నమోదు చేసి, నిర్ణీత గడువులో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. మేళాలకు హాజరయ్యే ప్రజలకు త్రాగునీరు, హెల్ప్ డెస్క్‌లు, క్రమబద్ధమైన ఏర్పాట్లు కల్పించినట్లు పేర్కొన్నారు. అవసరమైన పత్రాలతో వచ్చి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ong-9_ong-9.qxd 4/27/2026 12:20 AM Page 1



## గ్రామంలో అన్ని రంగాల్లో అభివృద్ధిలోకి రావాలి

**విశాఖపట్నం ఏప్రిల్ 26 ప్రభాతవార్త**



బ్రాహ్మణ వ్యాపారుల ఆర్థికాభివృద్దే లక్ష్యంగా బిజినెస్ బై బ్రాహ్మణ్ పనిచేస్తోందని బ్రాహ్మణ వ్యాపారుల మధ్య సంబంధాలు వ్యాపార విస్తరణకు బిజినెస్ బై బ్రాహ్మణ్ ట్రస్ట్ పనిచేస్తుందని 5 రాష్ట్రాల్లో బిజినెస్ బై బ్రాహ్మణ్ ట్రస్టు విస్తరించి ఉందని ఫౌండర్ నేషనల్ ప్రెసిడెంట్ బుర్రా ఫణీ చంద్ర తెలియజేశారు. బిజినెస్ బై బ్రాహ్మణ్ ఫౌండర్ నేషనల్ సెక్రటరీ పరిమి గిరి మాట్లాడుతూ బిజినెస్ బై బ్రాహ్మణ్ 6 సంవత్సరాల క్రిందట ప్రారంభమైనదని నేటికి 6 సంవత్సరాలు పూర్తి చేసుకున్నదని కేవలం ఒక ఊరితో ప్రారంభమై నేడు 75 ఊర్లలో 80 వేల పై చిలుకు బ్రాహ్మణ వ్యాపారుల సభ్యులు గా కలిగిన అతి పెద్ద సంస్థ ఇది అని అలాగే మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన వ్యాపార అవకాశాలను బ్రాహ్మణులు అందిపుచ్చుకుంటూ అనేక వ్యాపార రంగాల్లో పెట్టుబడులు పెడుతూ ముందుకు వస్తున్నారని పరిమి గిరి తెలిపారు. ఆదివారం విశాఖపట్నం లో ఒక ప్రైవేట్ హోటల్లో నిర్వహించిన బిజినెస్ బై బ్రాహ్మణ్ ట్రస్ట్ విశాఖపట్నం చాప్టర్ 2026 సంవత్సరానికి నూతన ప్రమాణ స్వీకారోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్, గౌరవ అతిధులుగా ప్రభుత్వ సలహాదారు డాక్టర్ ఎంఎస్ఎస్ ప్రసాద్, ప్రముఖ గాయకుడు గజల్ శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బిజేపి ప్రతినిధి సుహాసిని ఆనంద్ హాజరయ్యారు. ముందుగా బిజినెస్ బై బ్రాహ్మణ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ చెరువు రామకోటయ్య విశాఖపట్నం చాప్టర్ అధ్యక్ష,కార్యదర్శులుగా నియమితులైన అయ్యగారి కామేష్,గుమ్ములూరి రామ్ కుమార్ శర్మ,ఇతర కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.ఈ సందర్భంగా బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్ మాట్లాడుతూ బ్రాహ్మణులకు ఆర్థిక స్వావలంబన, విద్య , ఉద్యోగ అవకాశాలను మెరుగుపరచడమే ప్రధాన లక్ష్యంగా బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా రాయితీ రుణాలు, ఉపకార వేతనాలు అందిస్తూ వారి అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఎన్నికలసమయంలో ప్రకటించిన విధంగా ప్రతీ దేవాలయ కమిటీలో బ్రాహణులకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. బ్రాహ్మణులకు స్వయం ఉపాధి పథకాలు, వ్యాపారాల స్థాపనకు రాయితీతో కూడిన రుణాలు అందచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ మహేంద్ర చినబాబు,అధిక సంఖ్యలో స్థానిక బ్రాహణ వ్యాపారవేత్తలు,మహిళా వ్యాపారవేత్తలు పాల్గొని బిజినెస్ బై బ్రాహ్మిణ్ విశాఖపట్నం చాప్టర్ సభ్యులను అభినందించారు.

## జలధార జలహారతి శిక్షణ కార్యక్రమం

**ఆనందపురం, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**




ఆనందపురం మండల పరిషత్ కార్యాలయంలో జలధార, జలహారతి శిక్షణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. జలధార, జలహారతి కార్యక్రమం డైరెక్టర్ షణ్ముఖ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల డ్వామా పీడి నిర్మల దేవి, అల్లూరి సీతారామరాజు జిల్లా పీడి విద్యాసాగర్ మూడు జిల్లాలకు సంబంధించిన ఏపీడీలు, ఏపీవోలు, ఈసీలు ,టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా పీడి, ఏ పి డి, ఉపాధి హామీ పథకం సిబ్బంది గొట్టిపల్లి చుక్కవాని చెరువును సందర్శించారు. అక్కడ పనిచేస్తున్న కూలీలకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జానకి తాఫితరులు పాల్గొన్నారు.

## అబ్బురపరిచిన చిన్నారుల సుధాగానం

**ఆనందపురం, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**




ఆనందపురం మండలం విజ్ఞాన విహార గుడిలోవ అనుబంధ సంస్థ భారతి కళా విహార సంగీత పాఠశాల 31వ వార్షికోత్సవ వేడుకలలో భాగంగా ఆదివారం నిర్వహించిన చిన్నారుల గానం, మృదంగ విన్యాసాలు అహుతులను తన్మయపరిచాయి. లింగాస్థకం, స్వర విన్యాసం సామూహిక ముగా వీణ మీద వాయించడం, గురుస్తుతి. మృదంగ లయ విన్యాసం అబ్బుర పరిచాయి. 5 నుంచి 10 వ తరగతలకు చెందిన 120 మంది విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు. సంగీత పాఠశాల పూర్వ విద్యార్థులు కూడా ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ముఖ్య అతిధి ఆర్ ఎస్ ఎస్ ఆనందపురం ఖండ కార్యవాహ బాలి రవి మాట్లాడుతూ సంగీతానికి రాళ్ళ కరిగించే సత్తా ఉందని మానసిక ప్రశాంతత, ఏకాగ్రతకు సంగీతం మంచి ఔషదమని చెప్పారు. విద్యార్థులందరు ఈ అవకాశం వినియోగించుకోవాలని కోరారు. పాఠశాలలో వివిధ వాయిద్యాలను నేర్పడానికి ఉపాధ్యాయులు వున్నారని వీణ, గాత్రం, హార్మోనియం, మృదంగం అందరూ నేర్చుకోవాలని కోరారు.

## పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి 333వ ఆరాధన మహోత్సవం

**విశాఖపట్నం, ఏప్రిల్ 26, ప్రభాతవార్త**



శ్రీ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి వారి 333వ ఆరాధన మహోత్సవం భక్తి పరవశంతో కంచరపాలెం ఇంద్రనగర్2 లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలు, హారతులు, భజనలు నిర్వహించి స్వామివారిని ఆరాధించారు. ప్రముఖంగా భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారి దర్శనం చేసుకుని ఆశీస్సులు పొందారు. కార్యక్రమం అంతటా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొని, భక్తి శ్రద్ధలు స్పష్టంగా కనిపించాయి. గ్రామస్తులు, స్థానిక యువకులు కలిసి ఏర్పాట్లు చేసి వేడుకలను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా ప్రసాదం సిద్ధం చేసి భక్తులందరికీ పంపిణీ చేశారు. భక్తులు భక్తి పరవశంతో కార్యక్రమంలో పాల్గొని ఆరాధన మహోత్సవాన్ని ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు.

## ఫ్యాన్‌కు ఉరివేసుకుని యువతి ఆత్మహత్య

**ఆరిలోవ, ఏప్రిల్ 25, ప్రభాతవార్త**



ఎండాడ రాజీవ్ నగర్ లో నివాసం ఉంటున్న పుత్రకాండ సంధ్య (22) అనే యువతి శనివారం రాత్రి తన నివాసంలో ఫ్యాన్ కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఆరిలోవ సీఐ హెచ్.మల్లేశ్వరరావు పేర్కొన్నారు. శ్రీకాకుళం దాసపురానికి చెందిన పుత్ర కాండ భాస్కర్ రావు చిన్న కుమార్తె సంధ్య పీఎం పాలెం పోస్ట్ ఆఫీస్ లో పోస్ట్ ఉమెన్ గా పనిచేస్తుంది. ఎండాడలో వీరి ఇంటి పక్కన నివసిస్తున్న ఒక అబ్బాయి తో ఎక్కువగా చనువుగా ఉన్నట్లు వీరి మధ్య ఏమైందో తెలియదు గానీ శనివారం రాత్రి సుమారు 8.45 గంటల ప్రాంతంలో ఉడివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. తండ్రి భాస్కరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్ కు తరలించినట్లు పేర్కొన్నారు.

## సౌభాగ్యప్రదాయిని శ్రీ వాసవి మాత జయంతి

**విశాఖపట్నం ఏప్రిల్ 26 ప్రభాతవార్త**



డాబాగార్డెన్స్ ప్రేమ సమాజం ఆడిటోరియంలో శ్రీ వాసవాంబిక ఆర్యవైశ్య సంఘం అక్కయ్యపాలెం శాఖ వారి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా శ్రీ వాసవి మాత జయంతిని నిర్వహించారు ముందుగా మంగళ ధ్వని వేద మంత్రములతో అర్చకులు ప్రత్యేక పూజలు, మహిళలచే సామూహిక అష్టోత్తర సహిత కుంకుమార్చనలు సాంప్రదాయ రీతిలో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్న ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం వి రాజశేఖర్ వాసవి మాత జయంతి ఉత్సవంలో పాల్గొన్న మహిళలను కమిటీ సభ్యులను ఉద్దేశించి ప్రసంగిస్తూ శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని ఎవరైతే భక్తిశ్రద్ధలతో పూజిస్తారో వారికి సకల శుభాలతో పాటు సర్వ సౌభాగ్యాలు కలుగుతాయని తెలిపి అమ్మవారి యొక్క అవతార విశిష్టతను తెలిపారు . సామూహిక కుంకుమార్చన లో పాల్గొన్న మహిళలందరికీ తీర్థ ప్రసాదములు అన్న ప్రసాదము అందజేశారు వేడుకగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొనగా ఉత్సవ చైర్మన్ పి సంజీవరావు , వైస్ చైర్మన్ జంగాల కృష్ణ మరియు యలమర్తి గణేష్ , కమిటీ అధ్యక్షులు ఎం సుబ్రహ్మణ్యం కార్యదర్శి ఎస్ నాగేశ్వరరావు కోశాధికారి కే నాగేశ్వరరావు ఉత్సవ కమిటీ సభ్యులు జనార్దనరావు , కమలాకర్ , తాతాజీ , చక్రధర్ , కృష్ణమూర్తి , నగేష్ , సత్య వర్మ , లక్ష్మీ , ఉమాదేవి , ధనలక్ష్మి , కుమారి , రాధాదేవి , లక్ష్మి , తదితరులు పాల్గొన్నారు .

## ప్రధాని మోడీ మనసులో మాట 133వ సంచి

**విశాఖపట్నం, ఏప్రిల్ 26, ప్రభాతవార్త**



ప్రకృతి చికిత్సలయము మహారాణిపేట ఆవరణలో బూత్ నెంబర్ 183లో ప్రధాని మోడీ మనసులో మాట 133వ సంచికను బీజేపీ వైద్య విభాగం కన్వీనర్ రూపాకుల రవికుమార్ వీక్షించారు. ప్రధాని మాట్లాడుతూ త్వరలో బుద్ధ పూర్ణిమ జరుపుకుంటున్నామని, బుద్ధుడి బోధనలు ముందుకు తీసుకెళ్తాయని, ధ్యానం, కరుణ ప్రజల జీవితాల్లో తోడ్పాటు అందించి ప్రకృతితో బౌద్ధ వారసత్వం ముడిపడి ఉన్నదని అన్నారు, సౌర, వాయు శక్తి దేశంలో విజయం సాధించడానికి విండ్ ఎనర్జీ సాధించిన సామూహిక విజయమన్నారు. ప్రకృతిని పరిరక్షించాలని, ప్రకృతి మానవుడు వేరు కాదని, వెదురు ఉత్పాదనలను ప్రోత్సహించాలని, త్వరలో జనాభా లెక్కల కార్యక్రమం ప్రారంభమవుతున్నదని కార్యకర్తలు ఇంటింటికి వచ్చి మీ వివరాలను, సమాచారాన్ని మొబైల్ యాప్‌లో భద్రపరుస్తారని అన్నారు. కార్యక్రమంలో చివుకుల పద్మజ, చివుకుల సాయి కిరణ్, గేదెల శ్రీహరి, ఎస్.శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా దళిత గళం.. 2029 లక్ష్యం

**- సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసిన ఎస్సీ సెల్ నేత మర్దపూడి పరదేశి**

**గాజువాక,ఏప్రిల్ 26,ప్రభాతవార్త**



రానున్న రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజక వర్గంలో దళిత గళ సమ్మేళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి మార్దుపూడి పరదేశి పేర్కొన్నారు. ఆదివారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన పార్టీ రాజకీయ వ్యవహారాల సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సజ్జలని శాలువాతో సత్కరించి, దళిత విభాగం ఆధ్వర్యంలో చేపట్టబోయే భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. అనంతరం పరదేశి విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం దళితుల పట్ల అవలంబిస్తున్న తీరును తప్పుపట్టారు. ప్రతి నియోజకవర్గంలో దళిత వర్గాలను చైతన్యపరిచి, వారి సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతామన్నారు. గత ప్రభుత్వ హయాంలో దళితులకు అందిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, 2029 ఎన్నికల్లో వైఎస్ జగన్మోహన్ రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేయడమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ములకలపల్లి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలు

**- అన్నసమరాధనలో పాల్గొన్న దేవన్‌రెడ్డి**

**గాజువాక, ఏప్రిల్ 26,ప్రభాతవార్త**



గాజువాక నియోజక వర్గ పరిధిలోని 87వ వార్డు కణితి విశ్వబ్రాహ్మణ వీధిలో శ్రీశ్రీశ్రీ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి 333వ ఆరాధన మహోత్సవాలను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వేడుకల్లో వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల శ్రీనివాస దేవన్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నసమరాధనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు దేవన్ రెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు బొడ్డ గోవింద్, దుగ్గపు దానప్పలు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా భావనాఋషీశ్వరుల కళ్యాణ మహోత్సవం

**గాజువాక, ఏప్రిల్ 26, ప్రభాతవార్త**



గాజువాక నియోజకవర్గ పరిధిలోని 85వ వార్డు అగనంపూడి పెద్దమడకలో శ్రీ భద్రావతి సమేత భావనాఋషీశ్వరుల కళ్యాణ మహోత్సవం ఆదివారం కనులపండువగా జరిగింది. శ్రీ పద్మ మార్కండేయ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల శ్రీనివాస దేవన్ రెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆధ్యాత్మిక వాతావరణంలో శాస్త్రోక్తంగా జరిగిన కళ్యాణ ఘట్టాన్ని ఆయన వీక్షించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు దేవన్ రెడ్డికి ఘన స్వాగతం పలికి, స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సేవా సంఘం ప్రతినిధులు, స్థానిక వైకాపా నాయకులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## జన గణనఖిపై అవగాహన కల్పిస్తూ ఘనంగా 5కె రన్

**- జెండా ఊపి ప్రారంభించిన జిల్లా రెవెన్యూ అధికారి ఎం. విశ్వేశ్వర నాయుడు**

**- సెల్ఫ్ ఎన్యుమరేషన్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపు**

**విశాఖపట్నం, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**



విశాఖపట్నం, ఏప్రిల్ 26 ప్రభాతవాజ్ఞాతీయ జనాభా గణనపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ఆర్.కె. బీచ్ రోడ్డులో 5కె రన్ కార్యక్రమాన్ని అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం ఆర్.కె.బీచ్‌లోని కాళీమాత దేవాలయం వద్ద జిల్లా రెవెన్యూ అధికారి ఎం.విశ్వేశ్వర నాయుడు జెండా ఊపి ఈ పరుగును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెన్సస్ అనేది దేశాభివృద్ధికి, ప్రణాళికా రచనకు అత్యంత కీలకమైన జాతీయ కార్యమని పేర్కొన్నారు. గతంలో బ్రిటిష్ కాలం నాటి సెన్సస్ రికార్డులు నేటికీ ఎలా ఉపయోగపడుతున్నాయో ఆయన ఉదాహరణలతో వివరించారు. పరుగు ప్రారంభానికి ముందు చిన్నారులు ప్రదర్శించిన ఖికర్రసాముఖి వంటి సాంప్రదాయ కళలు ఆహూతులను అలరించాయి. ఎన్యుమరేటర్లు వచ్చే వరకు వేచి చూడకుండా, ప్రజలు స్వయంగా డిజిటల్ పద్ధతిలో తమ వివరాలను నమోదు చేసుకునే ఖిసెల్ఫ్ ఎన్యుమరేషన్ఖి విధానంపై ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ రమణమూర్తి, ఇతర జోనల్ కమిషనర్లు, అధికారులు, పెద్దసంఖ్యలో యువత తదితరులు పాల్గొన్నారు.

## మంచాన పడ్డ రోగికి వైకాపా శ్రేణులు సాయం

**ఆరిలోవ, ఏప్రిల్ 26, ప్రభాతవార్త**



తూర్పు నియోజకవర్గం 12వ వార్డు సీనియర్ నాయకులు హుస్సేన్ సతీమణి రజియబాను గత కొంత కాలంగా అనారోగ్యంతో ఉంటూ,మంచానికే పరిమితం అవడంతో విషయం తెలుసుకున్న తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త మొల్లి అప్పారావు, వార్డు అధ్యక్షుడు మొల్లి హేమంత్ తో కలిసి వారి నివాసానికి వెళ్ళి,ఆమె ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని,వారి కుటుంబ సభ్యులను పరామర్శి పది వేలు రూపాయలు ఆర్థిక సహాయం చేశారు. వీరితో పాటు రాష్ట్ర ఎస్సీ విభాగం అధికార ప్రతినిధి అల్లంపల్లి రాజబాబు, బొర్ర సూర్యారావు, తూర్పు కళింగ విభాగం అధ్యక్షుడు మెట్ట సూర్యనారాయణ, మొల్లి కిరణ్, రామకృష్ణ, సంజీవ్, రమణ,చొల్లంగి నాగేశ్వరరావు,మీసాల ప్రదీప్, శ్రీను, జోగారావు పాల్గొన్నారు.

## శ్రీ అయ్యప్ప స్వామి ఆలయ ప్రారంభం, విగ్రహ ప్రతిష్ట

**ఆరిలోవ, ఏప్రిల్ 26, ప్రభాతవార్త**



ఎస్. రాయవరం లో ఈ రోజు శ్రీ అయ్యప్ప స్వామి ఆలయ ప్రారంభం, విగ్రహ ప్రతిష్ట జరిగింది. ఈ కార్యక్రమానికి నన్ను ఆలయ నిర్వాహక కమిటీ ప్రతినిధి జర్నలిస్ట్ రాజు ఆహ్వానించిన మేరకు శబరిమల మేల్ శాంతి శ్రీ రెజ్ కుమార్ గారిని తీసుకురావడానికి నేను.. నా వంతుగా చేసిన ప్రయత్నం ఫలించింది. ఉత్తరాంధ్రలో శ్రీ అయ్యప్ప స్వామి వారి ఆధ్యాత్మిక కార్యక్రమాలను ముమ్మరంగా నిర్వహిస్తూ గురుస్వామి గా పేరొందిన డా. పైల ఆదిమోహన్ రెడ్డి గారి సహకారం తో మిత్రుడు హరనాథ్ చొరవ తో..శ్రీ అయ్యప్ప స్వామి వారి కృప వలనే ఇది సాధ్యమైంది.శ్రీ రెజ్ కుమార్ గారితో పాటు 10 మంగళ వాయిద్య బృందం కూడా కేరళ నుండి వచ్చారు. ఈ నేపథ్యంలో ఇటువంటి పవిత్ర కార్యక్రమానికి అతిథిగా ఆహ్వానించిన ఎస్. రాయవరం ఆలయ కమిటీ బృందానికి, కేరళ నుండి మేల్ శాంతి తీసుకురావడానికి కృషిచేసిన డాక్టర్ ఆదిమోహన్ రెడ్డి స్వామి గారికి ధన్యవాదములు.స్వామియే శరణం అయ్యప్ప ఎస్.రాయవరం గ్రామం లో నిర్మాణం చేసిన "ఉత్తరాంధ్ర ఏకశిల పతినెట్టంపడి అయ్యప్ప స్వామి దేవాలయం" తేది 26.04.2026 (ఆదివారం) ఉదయం 7:42 నిమషాల కు ప్రారంభ మరియు విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమం జరిగింది..మరియు సాయంత్రం పడిపూజ కు శ్రీ ఎం.ఎన్.రిజి కుమార్ గారు, మేలు శాంతి, కేరళ రాష్ట్రం శబరిమల మాలికప్పురత్తమ్మ విశిష్ట అతిదిగా పాల్గొన్నారు. మన జీవిత కాలం లో ఒకసారి మాత్రం వచ్చే ఇటువంటి మహోన్నత కార్యక్రమాలకు హాజరై స్వామి కృపకు పాత్రులు అయ్యారు.

## విశ్వవ్యాప్తంగా సంత్ నిరంకారి మిషన్ రక్త దాన శిబిరాలు

**విశాఖపట్నం, ఏప్రిల్ 26, ప్రభాతవార్త**




"మానవ ఏకత్వ దినము" ను పురస్కరించుకొని నగరంలోని మహారాణి పేట రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో మానవ జాతి కోరకు వచ్చిన దివ్య శాంతి దూత బాబా గురు బచన్ సింగ్ జీ యొక్క పావన స్మృతితో ఆదివారం నగరంలోని పలు ప్రాంతాలలో రక్త దాన శిబిరాలు నిర్వహించారు. "రక్తం కలువల్లో కాదు, రక్తం నాడులలో ప్రవహించాలి." అనే నినాదంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. 40 సంవత్సరాలుగా నిర్విరామంగా ఈ కార్యక్రమం జరగడం వలన "లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్" వారు కుడా గుర్తించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎ.పి క్షేత్రీయ సంచాలకులు రవి వచ్చి ప్రారంభించారు. అదే విధంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 80 మంది పైగా రక్త దానం చేసారు. ఈ కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేయుటకు సహకరించిన డా.రవి కుమార్, పి.వి. రావు, సేవాదళ్ అధికారి రాజ్ వీర్గారు కృతజ్ఞతలు తెలిపారు.

## హోమియో వైద్య సృష్టికర్త డాక్టర్ శామ్యూల్ హానిమన్ జయంత్యుత్సవం

**విశాఖపట్నం, ఏప్రిల్ 26, ప్రభాతవార్త**



ఇండియన్ ఇన్స్టిట్యూట్ అఫ్ హోమియోపతిక్, విశాఖ జిల్లా శాఖ హోమియో వైద్యులు నగర ఒన్ టౌన్ యొక్క చిలకపేట నందలి, శెట్టిబలిజ ఫంక్షన్ హాల్ లో మెగా హోమియో ఉచిత వైద్య శిబిరం ఈ రోజు ఉదయం 8 నుండి మ..1గం వరకు నిర్వహించడం తోపాటు అక్కడ హోమియో వైద్య పితామహుడు డాక్టర్ శామ్యూల్ హానిమన్ జన్మదిన వేడుకలకు ముఖ్య అతిధిగా నగర దక్షిణ శాసనసభ్యులు శ్రీ వంశీ కృష్ణ శ్రీనివాస్ గారు విచ్చేసి జ్యోతి ప్రజ్వలన తో శిబిరాన్ని ప్రారంభించి మొదటగా హానిమన్ చిత్రపటానికి పూలమాలను అలంకరించారు. తర్వాత హోమియో వైద్యులు తమ వెద్యసృష్టి కర్తకు పూలతో నివాళులు అర్పించారు. తర్వాత డాక్టర్ సునీత వాకా, డాక్టర్ రమేష్, గౌరవ అతిథిగా విచ్చేసిన సంస్థ రాష్ట్ర కార్యదర్శి డా.పి బి కె. సతీష్, జాతీయ సభ్యులు డాక్టర్ జి.రాజేంద్ర ప్రసాద్, విశాఖ అధ్యక్షులు డాక్టర్ పి.రాఘవేంద్ర రావు తదితర వైద్య బృందం కలిసి శాసన సభ్యులైన శ్రీ వంశీ కృష్ణ శ్రీనివాస్ గారికి గౌరవంగా సన్మానించి మెమెంటోను అందజేశారు. ముఖ్య అతిథి శ్రీ వంశీ కృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రపంచ మానవాళికి అందించిన మహత్తరమైన హోమియో వైద్యం ఒక వరంగా భావించాలి. చిన్న జలుబు నుండి భయంకరమైన క్యాన్సర్ వ్యాదులను నయం చేయగల శక్తివంతమైనది హోమియో వైద్యం మరియు శస్త్ర చికిత్సలు అవసరం లేకుండా కొన్ని వ్యాదులను సంపూర్ణంగా నివారించే హోమియో వైద్యం అందరూ నిస్సంకోచంగా వాడవచ్చని తెలిపారు. తర్వాతి సభలో లక్ష్మీ గాయత్రీ హాస్పిటల్ అధినేత డాక్టర్ కె.వి.రాం కుమార్, కొల్లి సింహాచలం లకు సంస్థ కార్యనిర్వహక కార్యదర్శి డాక్టర్ సునీత వాక మెమెంటోలు అందజేశారు. ఉచిత హోమియో శిబిరంలో డాక్టర్ సీతల్ మధన్, డాక్టర్. యస్. సుధాకర్, డాక్టర్ యన్.శ్రీరామ మూర్తి, డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, డాక్టర్ రాఘవేంద్ర లు సుమారు 130 మంది రోగులకు చికిత్సలు జరిపి ఒక నెలకు సరిపడా హోమియో మందులు పంపిణీ చేసారని విశాఖ కార్యదర్శి డాక్టర్ రాజా శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు.

vsp10:vsp10.qxd 26-04-2026 22:58 Page 1






## నూకాంబిక ఆలయం కిటకిట





అనకాపల్లి, ఏప్రిల్ 26 : (ప్రభాత వార్త) : ఉత్తరాంధ్ర జిల్లాల ఇలవేల్పు అనకాపల్లి గవరపాలెంలో వెలిసిన శ్రీ నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో ఆదివారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా చుట్టుపక్కల నుండి పట్టణ గ్రామీణ ప్రాంతాలు నుండి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఆవరణలో వంటలు వండుకొని అమ్మవారికి ముక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు, కమిటీ సభ్యులు చర్యలు తీసుకున్నారు. దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్లబాబు), ఆలయ సహా కమిషనర్ యాళ్ళశ్రీధర్, ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్, దాడి రవికుమార్, పొలిమేర స్వాతి ఆనంద్, మారిశెట్టి శంకర్రావు, కాంద్రేగుల రాజారావు , మజ్జి జానకి శ్రీనివాసరావు, కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి పైడిరాజు, యర్రవరపు సంతోషి కుమారి నాగేష్, కోటమి నాయకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కన్యకాపరమేశ్వరి జన్మదిన మహోత్సవం



అనకాపల్లి రూరల్ , ఏప్రిల్ 26, (ప్రభాతవార్త) : 100 సంవత్సరాల చరిత్ర కలిగిన శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం సంఘం ఆధ్వర్యంలో వైశాఖ మాస శుద్ధ దశమి ఆదివారం ఆలయంలో శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జన్మదినం మహోత్సవాలు ఘనంగా జరిగాయి. తెల్లవారు జామున అమ్మవారి ఉత్సవ విగ్రహాని ప్రత్యేక అలంకరణ చేసి వెండి రథంపై పట్టణమంతా ఊరేగింపు నిర్వహించారు. శ్రీ అమ్మవారి నామ భజన సంకీర్తనలతో, మేళ తాళాములతో వైభవంగా తిరువీధి మహోత్సవం జరిగింది. నిత్య ప్రార్థనలు, గోపూజ, శ్రీ నగరేశ్వర స్వామి, శ్రీ జనార్ధన్ స్వామి వారికి అభిషేకాలు అర్చనలు నిర్వహించారు. ఆలయ ముఖ మండపంలో శ్రీ అమ్మవారి ఉత్సవమూర్తికి భక్తులచే బియ్యాభిషేకం, అమ్మవారి మూల విరాట్ కు లక్ష మల్లెపూలతో అర్చన చేశారు. సామూహిక మహిళలచే లలిత సహస్ర నామ స్తోత్ర పారాయణం, భారీ అన్న సమారాధన, ఆలయం చుట్టూ వెండి రథంపై అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని తో 102 రకాల స్వీట్లు తో ప్రదర్శన జరిగింది, అమ్మవారికి ఊంజల్ సేవ, కోలాటము నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు వుప్పల రవిరామ్ జవహర్, కార్యదర్శి, శ్రీధరాల సోమరాజు, కోశాధికారి కడిమిశెట్టి అచ్యుతరామయ్య, ఉత్సవ కమిటీ చైర్మన్ గ్రంధి వివిఎస్ మాణిక్యం, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## బాలికల వసతి గృహం ఆకస్మిక తనిఖీ



అనకాపల్లి , ఏప్రిల్ 26, (ప్రభాత వార్త): ప్రభుత్వ వసతి గృహాల్లో పరిశుభ్రత పాటించకపోతే ఉపేక్షించేది లేదని మాజీ మంత్రి, స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ వసతి గృహ నిర్వాహకులకు హెచ్చరించారు. గుండాల జంక్షన్‌లో గల బాలికల కళాశాల వసతిగృహాన్ని ఆయన ఆదివారం ఆకస్మిక సందర్శన చేశారు. ఈ సందర్భంగా బాలికల వసతి గృహాన్ని పూర్తిస్థాయిలో పరిశీలించి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ వసతి గృహంలో బాలికలు అధిక సంఖ్యలో ఉండటం వల్ల ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకొని అధికారులతో మాట్లాడి మెరుగైన వసతులు కల్పించడానికి ఎస్టిమేషన్ తయారు చేయమని ఆదేశించారు. పిల్లలు మళ్లీ వసతిగృహానికి వచ్చేసరికి మెరుగైన వసతి ఏర్పాటు చేస్తామని అన్నారు. తాగునీరు, పిల్లలకు పెట్టే భోజనం, మరుగుదొడ్లు పరిశుభ్రత పాటించాలని, నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించే లేదని హెచ్చరించారు.

## నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలి



అనకాపల్లి రూరల్, ఏప్రిల్ 26 (ప్రభాత వార్త): అనకాపల్లి గవరపాలెం అంబేద్కర్ నగర్ లో గల డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లతో అంబేద్కర్ కనుబొమ్మను పగలగొట్టారు. ఈ విషయం తెలుసుకున్న అనకాపల్లి జనసేన పార్టీ ఇంచార్జి భీమరశెట్టి రామ్కి సంఘటన స్థలానికి విచ్చేసి స్థానికుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీసులకు తెలియ పరచి నిందితులను కనిపెట్టి కఠినంగా శిక్షించాలని ఆదేశించారు.

## విద్యార్థుల ప్రతిభ వారి జీవిత లక్ష్యానికి మార్గదర్శకం : జనసేన



అనకాపల్లి, ఏప్రిల్ 26,(ప్రభాత వార్త): విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీస్తే వారి జీవిత లక్ష్యానికి మార్గదర్శకంగా నిలుస్తుందని అనకాపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జి భీమరశెట్టి రామ్ కి పేర్కొన్నారు. అనకాపల్లి లో ఐకాన్ ప్రీ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు ప్రఖ్యాత విద్యావేత్త, కరస్పాండెంట్ పి. వెంకటరావు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జనసేన పార్టీ అనకాపల్లి ఇంచార్జ్ భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ) హాజరై, విద్యార్థుల ప్రతిభను ప్రశంసించారు. అనకాపల్లిలో ఇటువంటి అద్భుతమైన ప్రీ స్కూల్ ఉండటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. మరొక ముఖ్య అతిథిగా హాజరైన విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.ఎం.ఎ. హుస్సేన్ విద్యార్థులందరికీ మెరిట్ సర్టిఫికెట్లు అందజేసి, తమ ప్రేరణాత్మక ప్రసంగంతో అందరినీ ఆకట్టుకున్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన కార్యక్రమంలో చిన్నారుల నృత్యాలు, క్లాసికల్ డాన్స్, మానవత్వంపై స్కిట్, రాష్ట్రాలు రాజధానుల ప్రదర్శన వంటి అంశాలు ప్రేక్షకులను ఎంతో అలరించాయి. ఈ సందర్భంగా కరస్పాండెంట్ పి. వెంకటరావు మాట్లాడుతూ విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంలో తమ కట్టుబాటును వివరించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సహకారాన్ని అభినందించారు.

## ఘనంగా వాసవీమాత పుట్టినరోజు వేడుకలు



( నక్కపల్లి, ప్రభాతవార్త) : వాసవి మాత పుట్టినరోజు సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కక్కిరాల సురేష్, కొత్త సందీప్, ఉపాధ్యక్షులు నున్నవాసు తదితరులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు అమ్మవారి చిత్రపటంతో నగరంలో నగర సంకీర్తన నిర్వహించారు. కార్యక్రమంలో నున్న గుప్తా, కొత్త భగవాన్, నరసింహమూర్తి ,కొత్త శ్రీనివాసరావు, గణేష్ ,భగవాన్, మామిడి తాతాజీ ,సుబ్రమణ్యం, సత్తి కొండ ,పచ్చిపులుసు నాగేశ్వరరావు, కిషోర్ ,సతీష్, తదితరులు ఉన్నారు.



## జనాభా గణనపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి : డీఎస్‌డీవో



అనకాపల్లి, ఏప్రిల్ 26, (ప్రభాత వార్త): దేశాభివృద్ధికి కీలకమైన జనాభా గణన ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించవలసిన అవసరం ఎంతైనా ఉందని డి ఎస్ డి ఓ ఆనందలక్ష్మి తెలిపారు. జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఆదేశాల మేరకు ఆదివారం ఉదయం జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ జంక్షన్ నుండి 5కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా డి ఎస్ డి ఓ ఆనందలక్ష్మి మాట్లాడుతూ, ముఖ్యంగా ప్రజలు తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకునే ఖిసెల్ఫ్ ఎన్యూమరేషన్‌ఖి విధానంపై అవగాహన కల్పించడమే ఈ ర్యాలీ ప్రధాన ఉద్దేశమన్నారు. జనాభా గణన ప్రక్రియను ఆన్‌లైన్ ద్వారా నిర్వహించడం జరుగుతోందని తెలిపారు. ప్రతి పౌరుడు ప్రభుత్వం అందించిన లింక్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకోవాలని, దేశ ప్రగతికి తోడ్పడాలని కోరారు. ప్రజలు తమ సమాచారాన్ని సులభంగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే సౌకర్యం కల్పించబడిందని తెలిపారు. జనాభా గణన అనేది కేవలం అంకెలు మాత్రమే కాదని, భవిష్యత్ ప్రణాళికలు, సంక్షేమ పథకాల రూపకల్పనకు ఇది పునాదని స్పష్టం చేశారు. 5కే రన్‌లో జనాభా గణన ప్రాముఖ్యతను చాటిచెప్పారు. జనాభా లెక్కల సేకరణలో ప్రతి ఒక్కరూ పారదర్శకంగా పాల్గొని, దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ జిల్లా యంత్రాంగం తరపున ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో ఏఎస్ఓ ఎన్.విజయ్ కుమార్, ఇతర జిల్లా అధికారులు, యువత, విద్యార్థులు , స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉమామహేశ్వరికి అభినందనలు



(ఎస్.రాయవరం, ఏప్రిల్ 26, ప్రభాతవార్త ) : పెద్ద ఉప్పలం గ్రామంకు చెందిన కనపర్తి ఉమా మహేశ్వరి ని గ్రామ పెద్దలు అభినందించారు. అడ్డరోడ్డు తిమ్మాపురంలో గాయత్రి జూనియర్ కళాశాలలో లో ద్వితీయ సంవత్సరంలో 1000/985మార్కులతో మొదటి స్థానంలో నిలిచింది.ఉమా మహేశ్వరి కి గ్రామ పెద్దలు, గ్రామస్తులు శాలువాతో సత్కరించి స్వీట్స్ తినిపించారు.గ్రామానికి మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆశీర్వదించారు. తల్లిదండ్రులు సూరిబాబు, చిట్టిమణి లను అభినందించారు. కార్యక్రమంలో పినపాత్రుని గణేష్,కందికొండ శ్రీను పినపాత్రునిసూర్యనారాయణ విత్తనాల వీర్రాజు,విత్తనాల గణేష్,అమలకంటి గోపి, బండారు బుజ్జి,పంపిన గణేష్ వి లోవరాజు,పెద్దలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రజాదర్బార్‌లో అర్జీలు సేకరణ



ఎలమంచిలి, ఏప్రిల్ 26, ప్రభాతవార్త: పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ పార్లమెంట్ సభ్యులు సీనియర్ తెలుగుదేశం నాయకులు పప్పల చలపతిరావు పాల్గొని అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా చలపతిరావు మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని మండలంలోని సమస్యలపై వచ్చిన వారి అర్జీలను స్వీకరించి వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గొర్లె శివన్నారాయణ మూర్తి, జిల్లా అధికార ప్రతినిధి దాడి రమేష్, క్లస్టర్ ఇంచార్జ్ కరణం రవికుమార్,వార్డు అధ్యక్షులు సురకాసుల రమణ, గుర్రాల రాము, తదితరులు పాల్గొన్నారు.

## గొడిచర్లలో డీఎంహెచ్‌వో పర్యటన



(నక్కపల్లి రూరల్, ప్రభాతవార్త): మండలంలోని గొడిచర్ల గ్రామంలో అతిసారం సోకి 40 మంది అస్వస్థత గురైన పరిస్థితులపై స్పందించిన జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ హైమావతి ఆదివారం గ్రామంలో పర్యటించారు. గ్రామానికి వచ్చిన ఆమె ముందుగా స్థానిక పీహెచ్సీ వైద్యులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. వివరాలు పరిశీలించిన ఆమె అతిసారం బారిన పడిన వారి ఇంటింటికి వెళ్లి పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. ఆదివారం ఒక్క కేసు కూడా నమోదు కాలేదని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. రోగు లను పరామర్శించిన డిఎంహెచ్వో హైమావతి ఇంటింటికి వెళ్లి తేలిక పాటి ఆహారం తీసుకోవాలని వేడి నీళ్ల త్రాగాలని ఆరోగ్యపరమైన సూత్రాలు పాటించాలని వేడివేడి ఆహారం తీసుకోవాలని సూచించారు. ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించి వారికి వైద్య సేవలు అందించాలని స్థానిక వైద్యులకు సూచించారు.

## పాయకరావు పేట సీఐగా శంకరరావు



(పాయకరావుపేట, ప్రభాతవార్త ): పాయకరావుపేట సర్కిల్ సిఐగా సాకేటి శంకర్రావు బాధ్యతలు చేపట్టనున్నారు. ఇప్పటివరకు ఇక్కడ సిఐగా బాధ్యతలు నిర్వహించిన జి అప్పన్న ను వి ఆర్‌కు పంపించారు. సోమవారం నూతన సిఐ గా సాకెట్ శంకర్రావు బాధ్యతలు చేపట్టనున్నారు.

## ఘనంగా వాసవీ కన్యకాపరమేశ్వరి జన్మదిన వేడుకలు





ఎలమంచిలి, ఏప్రిల్ 26, ప్రభాతవార్త: పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జన్మదిన వేడుకలు ఆదివారం నుండి ఐదు రోజులు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు బండారు సత్య బంగారు శెట్టి తెలిపారు. మొదటిరోజు ఆదివారం ఉదయం వాసవి మహిళలచే 108 కలిస ములతో పట్టణములోని పురవీధుల్లో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి పంచామృత అభిషేకం నిర్వహించారు. సాయంత్రం 7:00 నుండి అమ్మవారికి 11 రకాల పుష్పాలతో ఘనంగా పుష్పాభిషేకం నిర్వహించారు. నాలుగు రోజులు వివిధ రకాలైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు బండారు సత్య బంగారు శెట్టి తెలిపారు. కార్యక్రమంలో కట్టా సత్యనారాయణ, ఆర్యవైశ్య సంఘ సభ్యులు , మహిళలు పాల్గొన్నారు.

## దేవుడి భూమికే కన్నం... అర్ధరాత్రి జేసీబీలతో మట్టి దోపిడీ



బుచ్చయ్యపేట ఏప్రిల్ 26 ప్రభాతవార్త అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట మండలం వడ్డాది గ్రామంలోని కరస్పా శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన భూముల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని రైతులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రివేళల్లో జెసిబిల సహాయంతో మట్టిని తవ్వి లారీల ద్వారా తరలిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు.దేవస్థాన భూములను సాగు చేస్తున్న కొంతమంది రైతులే ఈ అక్రమ తవ్వకాల వెనుక ఉన్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దేవస్థానానికి చెందిన సర్వే నంబర్ 1765 పరిధిలోని భూముల్లో భారీగా మట్టి తవ్వకాలు జరుగుతున్నట్లు సమాచారం.ఈ విషయంపై స్పందించిన దేవస్థానం ఈవో టీ.ఎన్.ఎస్. శర్మ వెంటనే తన సిబ్బందిని సంఘటన స్థలానికి పంపించి తవ్వకాలను నిలిపివేయించారు. అలాగే ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని ఆయన స్పష్టం చేశారు.దేవస్థాన ఆస్తుల పరిరక్షణలో భాగంగా అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపుతోంది.

## అదుపులో డయేరియా... ఆందోళన అవసరం లేదు





(నక్కపల్లి, ప్రభాతవార్త): మండలంలోని గోడిచెర్ల , జి.కొత్తూరు గ్రామాలలో నమోదైన డయేరియా కేసులు పరిస్థితి ప్రస్తుతం పూర్తిగా అదుపులో ఉందని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా యంత్రాంగం ప్రకటించింది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డివిజనల్ అభివృద్ధి అధికారి (నర్సీపట్నం) మంజుల వాణి , నక్కపల్లి ఎం.పి.డి.ఓ కే. చలపతిరావు ఆదివారం క్షేత్రస్థాయిలో సంయుక్త పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ బాధితులందరూ గో డిచెర్ల పీహెచ్సీ లో చికిత్స పొంది, పూర్తిగా కోలుకుని ఆసుపత్రి నుంచి ఇంటికి చేరుకుని, వారందరూ క్షేమంగా ఉన్నారని అధికారులు స్వయంగా నిర్ధారించారు. పైప్‌లైన్లను పరిశీలించగా గ్రామీణ నీటిపారుదల శాఖ ద్వారా క్లోరినేషన్ ప్రక్రియ సక్రమంగా జరుగుతోందని, సేకరించిన నీటి నమూనాల రిపోర్టులు సాధారణంగా ఉన్నాయని, నీటి సరఫరాలో ఎలాంటి లోపాలు లేవని స్పష్టం చేశారు. యుద్ధ ప్రాతిపదిక శానిటేషన్ పనులు గ్రామంలో నిర్వహించారు. ఎంపీడీవో పంచాయతీ కార్యదర్శులు కాకర సత్యం, కిరణ్ లు గ్రామంలో బ్లీచింగ్, ఫెనైల్ చల్లడం వంటి శుచీకరణ పనులు ముమ్మరంగా చేపట్టారు. వీధిలో జరుగుతున్న పనులను కాలువల నిర్వహణను అధికారులు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు. 24 గంటలు



గ్రామాలు అందుబాటులో ఉంటున్నామ ని అవసరమైన ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు అందుబాటులో ఉన్నాయని మెడికల్ ఆఫీసర్ తెలిపారు. ప్రస్తుతం కొత్త కేసులు ఏవీ నమోదు కాలేదని, గ్రామాల్లో పరిస్థితి సాధారణంగా స్థిరంగా ఉందని అధికారులు తమ నివేదికలో పేర్కొన్నారు. తనిఖీలో మండల అధికారి గిరిజా జ్యోతి, మెడికల్ ఆఫీసర్ శ్రావణ సంధ్య పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

## పేకాట శిబిరంపై పోలీసుల దాడి .. ఐదు మంది అరెస్టు

(అచ్చుతాపురం ఏప్రిల్ 26 ప్రభాత వార్త) : అచ్చుతాపురం మండలంలోని చోడపల్లి గ్రామ పరిసరాల్లో పేకాట ఆడుతున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి నిర్వహించారు. ఆదివారం సాయంత్రం సుమారు నాలుగు గంటల సమయంలో ఎస్సై సుధాకర్ రావు ఆధ్వర్యంలో సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పేకాట శిబిరంపై ఆకస్మికంగా దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న పోలీసులు, వారి వద్ద నుంచి రూ. 740 నగదును స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఘటన స్థలంలో ఉన్న ఒక ఆటో, ఆరు బైకులను కూడా పోలీసులు సీజ్ చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## చిన్నదొడ్డిగల్లు కొత్తూరులో జలజీవన్ మిషన్ పనులకు శంకుస్థాపన




(నక్కపల్లి, ప్రభాతవార్త) : మండలం లోని చిన్న దొడ్డి గళ్ళు శివారు గ్రామమైన కొత్తూరులో జలజీవన్ మిషన్ పనులకు ఆదివారం టిడిపి పాయకరావుపేట నియోజకవర్గం కొప్పిశెట్టి వెంకటేష్ చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. అనాదిగా ఉన్న తాగునీటి సమస్య పరిష్కారానికి ముందుకొచ్చి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త పథకం జల్ జీవన్ మిషన్ ద్వారా 47 లక్షలు నిధులతో పనులు ప్రారంభించినట్లు వెంకటేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గింజల లక్ష్మణరావు, జనసేన పార్టీ నాయకులు సుధాకర్, వైస్ ఎంపీపీ వెలగ ఈశ్వరరావు, ఎంపీడీవో చలపతిరావు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ శివ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి పివిపి రాజశేఖర్ ఈ కార్యక్రమంలో పాల్గొని పనులను ప్రారంభించారు. రూ. 47 లక్షల అంచనా వ్యయంతో ఈ తాగునీటి మౌలిక సదుపాయాల పనులు చేపట్టనున్నారు. గ్రామ శివారు ప్రాంతాల్లో ఉన్న నీటి ఎద్దడిని నివారించి, ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన కుళాయి నీటిని అందించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశ్యం మనీ వెంకటేష్ అన్నారు. ఈ సందర్భంగా గ్రామీణ నీటిపారుదల శాఖ విభాగం ఆధ్వర్యంలో పనులు జరుగుతాయని, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. నాయకులు మాట్లాడుతూగ్రామంలో ప్రజల ఆరోగ్యానికి స్వచ్ఛమైన నీరు ఎంతో అవసరమని, గతంలో ఉన్న నీటి సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఈ నిధులను కేటాయించడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు తూము వెంకట్రావు, రాజబాబు, నాగేశ్వరరావు అప్పారావు (వైయస్ ),టీవీఎస్‌తోపాటు పలువురు స్థానికులు ఉన్నారు.

## 28 నుంచి వేసవి శిక్షణ శిబిరాలు




నర్సీపట్నం, ఏప్రిల్ 26, ప్రభాతవార్త నర్సీపట్నం గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి పీ.దమయంతి ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీ నుంచి ప్రారంభంకానున్న వేసవి శిక్షణ శిబిరం నిర్వహణకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం మండల విద్యాశాఖ అధికారులు తలుపులు, నాగేంద్ర ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా శిబిరం నిర్వహణ విధానం, విద్యార్థులకు కలిగే ప్రయోజనాలపై వివరంగా చర్చ జరిగింది. అనంతరం మండల విద్యాశాఖ అధికారులైన తలుపులు, నాగేంద్ర విద్యార్థుల్లో పఠనాభిరుచిని పెంపొందించే కార్యక్రమాలు, సృజనాత్మక కార్యకలాపాలు, కథా వినిపింపు, వ్యాసరచన వంటి అంశాలను శిబిరంలో భాగం చేయాలని సూచించారు. అలాగే గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కూడా ఎక్కువ సంఖ్యలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే గ్రంథాలయంలో చదవడం మాకిష్టం అనే కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి పి. దమయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల విద్యార్థులు, యువతి యువకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేసవి శిక్షణ శిబిరానికి సంబంధించిన కరపత్రాలను ప్రదర్శిస్తూ, అందరూ శిబిరంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ శిబిరం ద్వారా విద్యార్థుల్లో పఠన అలవాటు పెంపొందించడం, సృజనాత్మకతను వెలికితీయడం, వ్యక్తిత్వ వికాసానికి దోహదపడే అవకాశాలు కల్పించడం లక్ష్యంగా నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు పి.ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

## పాయకరావుపేట సీఐ అప్పన్నకు బదిలీ



పాయకరావుపేట రూరల్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త : పాయకరావుపేట సిఐ గంటలాన అప్పన్న బదిలీ అయ్యారు. ఈ మేరకు విశాఖపట్నం రేంజ్, డిఐజి కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. నక్కపల్లి సర్కిల్ కార్యాలయం నుంచి సెప్టెంబర్ 4, 2024 న పాయకరావుపేట స్టేషన్ కు బదిలీపై వచ్చిన సిఐ అప్పన్న ఇక్కడ సమర్థవంతమైన పోలీస్ అధికారిగా పేరు తెచ్చుకున్నారు. హోం మంత్రి వంగలపూడి అనిత సొంత నియోజకవర్గంలో సిఐగా విధులు నిర్వర్తించడం కత్తిమీద సామే అయినప్పటికీ మండలంలోని ప్రజలందరికీ నిత్యం అందుబాటులో వారి సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేశారు. ఇదిలా ఉండగా స్థానిక అధికార పార్టీ నాయకులకు సయితం ఎటువంటి సమాచారం లేకుండా సిఐ అప్పన్నను హఠాత్తుగా బదిలీ చేయడం పాయకరావుపేట నియోజకవర్గంలో చర్చనీయాంశం అయింది. ప్రస్తుతం పాయకరావుపేట సిఐగా సాకేటి శంకరరావును నియమించారు. సోమవారం శంకరరావు బాధ్యతలు చేపడుతున్నారు.

vsp11:vsp11.qxd 26-04-2026 23:07 Page 1






## మారుమూల గ్రామాల గిరిజనుల భద్రత, సంక్షేమమే ధ్యేయం



కొయ్యూరు, ఏప్రిల్ 26, (ప్రభాతవార్త : మారుమూల గ్రామాల ప్రజల భద్రత మరియు సంక్షేమమే ధ్యేయంగా వారపు సంతలను ఆకస్మికంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు మంప ఎస్సై సీదరి శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం ఆయన వారి సిబ్బందితో కలిసి మండల కేంద్ర రాజేంద్రపాలెం వారపు సంతలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంతకు వచ్చిన మారుమూల ప్రాంతాల ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వ్యాపారులకు కఠిన ఆదేశాలు ఇచ్చారు. సంతలో విక్రయించే వివిధ వినియోగ వస్తువుల నాణ్యతను మరియు మన్నికను ఎస్సై వ్యక్తిగతంగా పరిశీలించారు. గ్రామీణ ప్రజలను మోసగించే ఉద్దేశంతో తప్పుడు తూకాలు వాడినా, నాణ్యత లేని వస్తువులు విక్రయించినా సహించేది లేదని వ్యాపారులను ఖచ్చితంగా హెచ్చరించారు. తూకాల విషయంలో నిబంధనలు అతిక్రమిస్తే కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన: అనంతరం ప్రజల ప్రాణరక్షణే లక్ష్యంగా రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యంగా మైనర్ పిల్లలకు వాహనాలు ఇస్తున్న తల్లిదండ్రులపై చట్టరీత్యా చర్యలు ఉంటాయని, అది వారి ప్రాణాలకే ప్రమాదమని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనం నడపడం, అతివేగం ప్రాణాంతకమని వివరించారు. మద్యం మత్తులో వాహనాలు నడిపి కుటుంబాలను రోడ్డున పడేయవద్దని, అతివేగం ప్రాణాంతకమని వివరించారు. మారుమూల గిరిజన గ్రామాల ప్రజలు చైతన్యవంతులు కావాలని, పోలీసు యంత్రాంగం ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటుంది అని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఇలాంటి ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయన్నారు. అంతకుముందు బూదరాళ్ల గ్రామాన్ని సందర్శించి గ్రామ సమస్యలపై గ్రామస్తులతో చర్చించారు.

## గురుకులంలో ఖాళీల భర్తీకి దరఖాస్తులు



కొయ్యూరు, ఏప్రిల్ 26 ప్రభాతవార్త: మండల కేంద్రమైన కొయ్యూరు గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో 2026 27 విద్యా సంవత్సరానికి సంబంధించి వివిధ తరగతుల వారీగా ఉన్న ఖాళీల భర్తీకై అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ నరసింహమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6,8, మరియు 9 తరగతులలో ఖాళీల భర్తీకి 5,7, మరియు 8 తరగతులలో ఉత్తీర్ణులైన ఇంగ్లీషు మీడియం గిరిజన విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వివరించారు. కాగా ఆరవ తరగతిలో 31 ఖాళీలు, 8వ తరగతిలో ఏడు ఖాళీలు, 9వ తరగతిలో 13 ఖాళీలకు గాను దరఖాస్తులు కోరుతున్నట్లు వివరించారు. మే 31 లోగా దరఖాస్తులను అందించాలని, దరఖాస్తు ఫారాలు పాఠశాలలోనే తీసుకొని, అక్కడే పూరించి అందించాలన్నారు.

## ఏజెన్సీలో వైసీపీ దుకాణం మూసుకోవాల్సిందే

### టీడీపీ నేత సియ్యారి దొన్నుదొర... టీడీపీలో పలువురు చేరిక



హుకుంపేట, ఏప్రిల్ 26,ప్రభాత వార్త: కూటమి ప్రభుత్వం ఈ రెండేళ్లలో గిరిజన ప్రాంతంలో చేపడుతున్న అభివృద్ధిని, చంద్రబాబు నాయుడు పరిపాలన విధానాన్ని చూసి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి భారీ ఎత్తున తెలుగుదేశం పార్టీలో వలస వస్తున్నారని ఇక ఏజెన్సీలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ దుకాణం మూసుకోవాల్సిందేనని ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్, టిడిపి అరకు అసెంబ్లీ నియోజకవర్గం ఇన్చార్జి డా. సియ్యారి దొన్ను దొర అన్నారు. హుకుంపేట మండలం దుర్గం పంచాయతి గొడ్డిమామడి గ్రామంలో బూత్ నెంబర్ 120 లో వరబోయిన బొంజుబాబు ఆధ్వర్యంలో 20 కుటుంబాలు, 80 మంది వైస్సార్సీపీ నుండి ఆదివారం తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరందరికీ డా. సియ్యారి దొన్ను దొర తెలుగుదేశం పార్టీ కండువాలు వేసి సాధారణంగా పార్టీలో ఆహ్వానించారు. వైస్సార్సీపీ మాజీ ఎంపిటీసీ ఒరెబోయిని బొంజుబాబు ఆధ్వర్యంలో గ్రామస్తులు, యువత మహిళలు, తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా దొన్ను దొర మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు పరిపాలన దక్షత నుంచి పార్టీలోకి చేరిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. తెలుగుదేశం పార్టీ ఒకటే ఆంధ్ర ప్రదేశ్ లో క్రమశిక్షణ గల పార్టీ అన్నారు. కార్యకర్తకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చే ఏకైక పార్టీ అని చెప్పారు. ఈరోజు కూటమి ప్రభుత్వం గిరిజన ప్రాంతంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేస్తుందన్నారు. గత ఐదేళ్ల కాలంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పూర్తిగా గిరిజన గ్రామాల్లో అభివృద్ధి గాలికి వదిలేసిందన్నారు. గిరిజన ప్రాంతంలో వైస్సార్సీపీ గత అయిదెల కాలంలో ఎటువంటి అభివృద్ధి చెయ్యలేదని తాము అదే పార్టీ లో ఉండి మా ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోలేకపోయామని బాధ గ్రామస్తులను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులను కనిపించిందన్నారు. అందుకే ఈరోజు తెలుగుదేశం పార్టీలో చేరి పాలనా దక్షత గల నాయకుడు వెంట నడవాలని భావించడం శుభసూచకం అన్నారు. మాజీ వైసీపీ ఎంపిటీసీ బొంజుబాబు మాట్లాడుతూ వైస్సార్సీపీ పార్టీ గిరిజనులకు అభివృద్ధి చెయ్యటంలో మోసం చేసిందని అని అన్నారు. హుకుంపేట మండల అధ్యక్షులు శతక బొంజుబాబు ఆధ్వర్యంలో పార్టీ నీ బలోపేతం చేస్తామని గ్రామస్తులున్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ టిఎన్ యు సిఅధ్యక్షులు పట్టేబోయిని శంకర్ నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి బొడ్డ శ్యామ్, క్లస్టర్ ఇంచార్జిలు కుడేలి నూక రాజు, మత్స్యరాజు , క్లస్టర్ కో కన్వీనర్ పాడి సుమన్మాజీ ఎంపిటీసీ పాడి బాలన్న, బి తాడేపుట్టు మాజీ సర్పంచ్ పాడి అచ్చులమ్మ,, దీనేష్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి



పాడేరు, ఏప్రిల్ 26, ప్రభాతవార్త: పాడేరు ప్రముఖ శ్రీశ్రీశ్రీ పూర్ణపుష్కల అయ్యప్ప స్వామి దేవాలయంలో కొలు వుదీరి ఉన్న వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి పురస్కరించుకొని 516 పసుపు కొమ్ములతో అలంకరించి మరియు పసుపు కుంకుమ అర్చన ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కొట్టగుల్లి సుబ్బారావు, సెక్రెటరీ రొబ్బిరాము, ఇమ్మడిశెట్టి, కోశాధికారులు ఆదిత్య, దాము ప్రచార కార్యదర్శి వర్మ, పాల్ నాయుడు, సత్తిబాబు,కుసుమ ఆలయ కమిటీ సభ్యులు వాసవి క్లబ్ మెంబర్స్ మరియు భక్తులు , తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అమ్మవారి ఆలయంలో భక్తులకు అన్నదానం



పాడేరు, ఏప్రిల్ 26, ప్రభాతవార్త: పాడేరు గిరిజన ఆరోగ్య దైవం కోరికలు తీర్చే కొంగుబంగారం పాడేరు శ్రీశ్రీశ్రీ మోదకొండమ్మ అమ్మవారి ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్,పాడేరు శాసనసభ్యులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు ఆదేశాల మేరకు ఆదివారం అమ్మవారి సన్నిధిలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటి బాబు నాయుడు, కమిటీ సభ్యులు బోనంగి వెంకటరమణ, లకే రత్నబయి, పలాసి రమణమ్మ, జంపరంగి సత్తిబాబు, దిలీప్ కుమార్,సత్యవతి బండ సత్యవేణి, తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు : సీఐ



కొయ్యూరు, ఏప్రిల్ 26 ప్రభాతవార్త : వాహన చోదకులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, లేదంటే కఠిన చర్యలు తప్పవని కొయ్యూరు సీఐ శ్రీనివాసరావు, ఎస్సై కిషోర్ వర్మ హెచ్చరించారు. ఆదివారం మండలంలోని భీమవరం లో వాహనాల తనిఖీల సందర్భంగా ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించిన వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వాహనదారులతో రోడ్డు భద్రత ప్రమాణం చేయించారు. ప్రమాణంలో భాగంగా హెల్మెట్ మరియు సీటు బెల్ట్ వినియోగం తప్పనిసరిగా పాటించాలని, మద్యం సేవించి వాహనం నడపకూడదని, అతివేగం మరియు నిర్లక్ష్య డ్రైవింగ్ చేయరాదని, మొబైల్ ఫోన్ ఉపయోగించకుండా వాహనం నడపాలని వారికి సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించి తమ ప్రాణాలను, ఇతరుల ప్రాణాలను రక్షించుకోవాలని తెలిపారు.

## ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య



కొయ్యూరు, ఏప్రిల్ 26 ప్రభాతవార్త : భార్యాభర్తల మధ్య మనస్పర్థలతో ఓ వ్యక్తి మనస్థాపానికి గురై ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. కొయ్యూరు ఎస్సై కిషోర్ వర్మ తెలియజేసిన ప్రాథమిక వివరాలు ప్రకారం.. మండలంలోని ఆడాకుల పంచాయతీ కిష్టారం గ్రామానికి చెందిన కేరేపు రవిబాబు(25)కు సుమారు ఏడాది క్రితం వివాహం అయింది. అయితే ఇటీవల కాలంలో భార్యాభర్తల మధ్య తరచూ చోటు చేసుకుంటున్న మనస్పర్థలతో రవిబాబు మనస్థాపం చెంది, ఈనెల 21న గ్రామంలోని తన ఇంట్లో చీరతో ఉరేసుకున్నాడు. అయితే ఇది గుర్తించిన స్థానికులు, కుటుంబీకులు రవిబాబును హుటాహుటిన నర్సీపట్నం ఆసుపత్రికి తరలించారు. అయితే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రవిబాబు ఆదివారం ఉదయం మృతి చెందాడు. ఈ విషయమై కేసు నమోదు చేసి మరింత లోతుగా విచారణ నిర్వహించనున్నట్టు ఎస్సై కిశోర్ వర్మ వివరించారు.

## క్షేత్రస్థాయిలో గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి పర్యటన



పాడేరు,ఏప్రిల్ 26, ప్రభాతవార్త: గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి, జీసీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కలిసి క్షేత్ర స్థాయి సందర్శన, యూనిట్ పరిశీలనలు అనంతరం సమీక్ష సమావేశాలు నిర్వహించారు. గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఎం.ఎం. నాయక్,గిరిజన సహకార సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.ఎస్ శోభిక, ఇతర ఉన్నతాధికారులతో కలిసి విశాఖపట్నం , విజయనగరం జిల్లాలలో విస్తృతంగా ఫీల్డ్ సందర్శనలు నిర్వహించారు. ముందుగా విజయనగరం జిల్లాలోని జీసీసీ సబ్బు తయారీ యూనిట్ను కార్యదర్శి నాయక్తో కలిసి ఎండి శోభిక పరిశీలిం చారు. ఈ సందర్భంగా ముడి సరుకుల సమీకరణ, ఉత్పత్తి ప్రక్రియలు, నాణ్యత నియంత్రణ, ప్యాకేజింగ్ విధానం, నిల్వ మరియు సరఫరా వ్యవస్థలను సమగ్రంగా వీరిద్దరు సమీక్షించారు. యూనిట్ ఉత్పత్తుల నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలు, నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేసి ప్రశంసించారు. అదనంగా, ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించడం, ప్యాకేజింగ్ ప్రమాణాలను మెరుగుపరచడం, బ్రాండింగ్ను బలోపేతం చేయడం,మార్కెట్ విస్తరణ చర్యలు చేపట్టాలని జి సి సి అధికారులను కార్యదర్శి నాయక్ ఆదేశాలు జారీ చేశారు.అనంతరం జీసీసీ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించి కాఫీ మైనర్ ఫారెస్ట్ ప్రొడ్యూస్ కొనుగోలు కార్యకలాపాలపై సమగ్ర సమీక్ష కార్యదర్శితో కలిసి ఎండి సమీక్షించారు. గిరిజన రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొనుగోలు లక్ష్యాల ను పెంపొందించవ లసిందిగా ఎండి సూచించారు. సమయానుకూల చెల్లింపులు, సమర్థవంతమైన కొనుగోలు వ్యవస్థలు, విలువ ఆధారిత ఉత్పత్తుల ప్రోత్సాహం ద్వారా గిరిజనులకు అధిక ఆదాయం అందే విధంగా చర్యలు చేపట్టాలని ఆమె ఆదేశించారు. అదేవిధంగా, విశాఖపట్నంలోని లాసన్స్ బే కాలనీలో ఉన్న జీసీసీ ఖాళీ స్థలాన్ని పరిశీలించి, దాని వినియోగంపై తగిన సూచనలు చేశారు. అనంతరం, రిటైల్ మార్కెటింగ్ డివిజన్ పరిధిలోని ఔట్లెట్ల పనితీరును సమీక్షించి, అధిక రద్దీ గల ప్రాంతాలలో కొత్త ఔట్లెట్లు ఏర్పాటు చేయడం, ఉత్పత్తుల ప్రదర్శనను ఆధునీకరించడం, వినియోగదారులకు అనుకూల సదుపాయాలను కల్పించడం ద్వారా విక్రయాలను పెంపొందించవ లసిందిగా ఎండి శోభిక సూచించారు. ఈ పర్యటనలో జీసీసీ కార్యకలాపాల బలోపేతం, ఉత్పత్తి మరియు కొనుగోలు వ్యవస్థల అభివృద్ధి, రిటైల్ నెట్వర్క్ విస్తరణ మరియు మార్కెట్ అవకాశాల విస్తరణ ద్వారా గిరిజనులకు మెరుగైన ఆదాయం కల్పించుటకు అనేక కీలక సూచనలు కార్యదర్శి నాయక్ సూచించారు.

## కరాటే విద్యార్థులకు అరుదైన గౌరవం



గూడెంకొత్తవీధి, ఏప్రిల్ 26 (ప్రభాతవార్త): అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన కరాటే విద్యార్థులు, ఇన్స్ట్రక్టర్ లకు అరుదైన గౌరవం లభించింది. తెలంగాణలో జరిగిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్లో పాల్గొని మన్యం సత్తా చాటారు. తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఆదివారం జరిగిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ కరాటే భారీ ప్రదర్శనలో అల్లూరి జిల్లాకు చెందిన ఐదుగురు కరాటే విద్యార్థులు, శిక్షకులు పాల్గొన్నట్లు కరాటే ముఖ్య శిక్షకుడు బాకూరు పాండురాజు తెలిపారు. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో 2000 మందితో జరిగిన ఈ ప్రదర్శనలో పాండు అకాడమీ విద్యార్థులు పాడేరుకు చెందిన దీపిక, పాడేరు సెయింట్ ఆన్స్ పాఠశాలకు చెందిన హర్షిని, చింతపల్లి ఏకలవ్య పాఠశాలకు చెందిన మేరీ, జి. మాడుగుల మండలం గ్రామానికి చెందిన కరాటే శిక్షకుడు కామేశ్వరరావు, కోఫోకాన్ జిల్లా ముఖ్య శిక్షకుడు పాండురాజు పాల్గొన్నట్లు ఆయన పేర్కొన్నారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన గిన్నిస్ ప్రపంచ రికార్డు లో పాల్గొనడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ రికార్డు మరింత స్ఫూర్తినిస్తుందని అన్నారు. ఆత్మరక్షణ విద్యకు మరింత బలం చేకూరుతుందని అభిప్రాయపడ్డారు. ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన కరాటే విద్యార్థులు శిక్షకులలో అల్లూరి మన్యం విద్యార్థులు భాగస్వామ్యం కావడం పై అభినందించారు.

## వైభవంగా శ్రీనివాస కల్యాణమహోత్సవం

### పట్టు వస్త్రాలు సమర్పించిన స్పీకర్ అయ్యన్న దంపతులు



మాకవరపాలెం, (తామరం) ప్రభాత వార్త: లోక కల్యా ణం,ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ అనకాపల్లి జిల్లా మాకవర పాలెం మండలం తామరం టీచర్స్ కాలనీ ప్రాంగణంలో ఆదివారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీశ్రీశ్రీ శ్రీనివాస కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. శ్రీసుదర్శనం సీతారామాచా ర్యుల వారి ఆధ్వర్యంలో జరిగిన ఈవేడుకలో రాష్ట్ర శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు, సతీమణి పద్మావతి పాల్గొని స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. శ్రీవారి నగర సంకీర్తన బృందం (తామరం) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కళ్యాణ మహోత్సవానికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. వేద మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ అర్చకులు శాస్త్రోక్తంగా కళ్యాణ ఘట్టాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ.. భక్తిభావం పెంపొందించే ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల వల్ల సమాజంలో శాంతి, సౌభాగ్యాలు కలుగుతాయని అన్నారు. స్థానిక నేతలు, ప్రముఖులు, పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొని స్వామివారిని



దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తుల రాకతో తామరం ప్రాంతం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది. కార్యక్రమ నిర్వహుకులు వచ్చిన భక్తులకు అవసరమైన సదుపాయలు కల్పించారు. మాకవరపాలెం మండలంలోని పలు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## పురాతన బడిన కాపాడుకుందాం : కూడా



పాడేరు,ఏప్రిల్ 26 ప్రభాతవార్త: పాడేరు పురాతన బడిని కాపాడుకుందాం ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడా రాధాకృష్ణ, తల్లితండ్రులు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ: పాడేరు ప్రభుత్వ పాఠశాల 1905 సంవత్సరంలో పాఠశాల స్థాపించారు అక్కడ చదువుకున్న వాళ్ళందరూ ఐఏఎస్, ఐపీఎస్ టీచర్లు అనేక రంగాల్లో ఉన్నారు. అయితే ప్రస్తుతం ఆ పాఠశాలలో 360 మంది విద్యార్థిని విద్యార్థులు విద్యాభ్యసిస్తున్నారు అందులో బాలికలు 200 మంది బాలురు 160 మంది ఉన్నారు గతంలో పాడేరు ప్రభుత్వ పాఠశాల స్థలంలో ఆరు తరగతి గదుల సంబంధించి భవనం, విశాలమైన గ్రౌండ్ మరియు 24 టాయిలెట్స్ రూమ్స్, ఐదు మరుగుదొడ్లు ప్రభుత్వ పాఠశాలకు సంబంధించినవి ఉండేది. ఆ భవనం, టాయిలెట్స్ కూల్చివేసి, బీసీ హాస్టల్ అని కొత్త భవనం నిర్మాణం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు క్లాస్ రూమ్ లో సరిపోకపోవడంతో బీసీ హాస్టల్ భవనంలో ప్రస్తుతం తరగతి గదులు నిర్వహిస్తున్నారు, ఇప్పుడు టైపు 4 కేజీబీవీ హాస్టల్ వారి కేటాయిస్తున్నాం మీరు ఇప్పుడు ఖాళీ చేయాలని అధికారులు ఒత్తిడి తీసుకువచ్చి నోటీసులు అతికించారు. టైపు 4 కేజీబీవీ హాస్టల్ కేటాయించడం హాస్టల్ కి కేటాయించడం మేం వ్యతిరేకం కాదు, కానీ 360 మంది విద్యార్థులకు తరగతి గదులు, టాయిలెట్స్ లేదు, గతంలో నాడు నేడు సంబంధించిన గ్రాంట్స్ స్కూల్లో రాలేదు దానివల్ల విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అలాంటప్పుడు ప్రస్తుతం చదువు కొనసాగుతున్న భవనంలో రూములు ఖాళీ చేయమని ఒత్తిడి తేవడం గిరిజన విద్యార్థులు విద్యకు దూరమవుతారని, అదేవిధంగా జూనియర్ కాలే జ్ బాయ్స్ హాస్టల్ విద్యార్థుల భవనం, మరియు కాలేజ్ భవనాలు పది అడుగులు పక్కనే ఉన్నప్పటికీ టైపు 4 హాస్టల్ అక్కడ ఎలా పెడతారని , వారు ప్రశ్నించారు. విద్యార్థులకు పూర్తిస్థాయిలో తరగతి గదులు, కిచెన్, టాయిలెట్స్ కొత్తగా నిర్మాణం చేసి ఇచ్చిన తర్వాతనే బీసీ హాస్టల్ భవనం కాళీ చేయాలని, లేనిపక్షంలో విద్యార్థుల తల్లిదండ్రులతో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు. అదేవిధంగా పాడేరు ప్రభుత్వ పాఠశాలలో పూర్వం చదివిన మేధావులు పెద్దలు, పూర్వ పాఠశాల కాపాడేందుకు ముందు రావాలని వారు పిలుపునిచ్చారు.

## అల్లూరి జిల్లాను జోన్ వన్లోనే ఉంచాలి





పాడేరు, ఏప్రిల్ 26, ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్లో అమలులోకి వచ్చిన ఏపి పబ్లిక్ ఎంప్లాయిమెంట్ ఆర్డర్ 2025 మరియు మల్టీ జోన్ వ్యవస్థ కారణంగా విశాఖపట్నం మరియు అల్లూరి సీతారామ రాజు జిల్లాలకు చెందిన గిరిజనులు తీవ్రమైన అన్యాయాన్ని ఎదుర్కొంటు న్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాను జోన్–I నుండి వేరుచేసి జోన్–IIలోకి చేర్చడం వల్ల, ఆ ప్రాంత గిరిజన యువత విశాఖపట్నంలో ఉన్న అనేక ప్రభుత్వ మరియు పబ్లిక్ సెక్టార్ ఉద్యోగాలకు అర్హత కోల్పోయారనీ డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు ఎస్ గురుదొర,బి దేవుడు పేర్కొన్నారు. .ఈ నిర్ణయం వేలాది గిరిజన అభ్యర్థుల భవిష్యత్తును ప్రభావితం చేస్తోంది. విశాఖపట్నం నగరం రాష్ట్రంలోని ప్రధాన పారిశ్రామిక కేంద్రంగా ఉండి, పోర్ట్, స్టీల్ ప్లాంట్, ఫార్మా మరియు మెడికల్ రంగాల్లో విస్తృత ఉద్యోగ అవకాశాలను కల్పిస్తోంది. కానీ ప్రస్తుత మల్టీ జోన్ వ్యవస్థ వల్ల అల్లూరి జిల్లాకు చెందిన గిరిజనులు ఈ అవకాశాలకు దూరమవుతున్నారు. ఇది గిరిజనులకు వ్యతిరేక పరిస్థితిని సృష్టించింది.. ఉద్యోగాలు ఉన్న చోట గిరిజనులు అర్హులు కాదు.., గిరిజనులు ఉన్న చోట పెద్ద ఉద్యోగ అవకాశాలు లేవు... ఇంకా ముఖ్యంగా, అల్లూరి జిల్లా చారిత్రకంగా మరియు భౌగోళికంగా విశాఖపట్నం ప్రాంతంతో బలమైన అనుసంధానం కలిగి ఉంది. ఏజెన్సీ ప్రాంతాలు, పాడేరు, అరకు వంటి ప్రాంతాలు చాలా కాలంగా విశాఖ పరిపాలనా, ఆర్థిక మరియు సామాజిక వ్యవస్థలతో అనుసంధానమై ఉన్నాయి. ఈ ప్రాంతాల ప్రజలు విద్య, వైద్యం, ఉపాధి మరియు వాణిజ్య అవసరాల కోసం ప్రధానంగా విశాఖపట్నంపైనే ఆధారపడి ఉన్నారు. ఈ సహజ అనుసంధానాన్ని విభజించడం వలన గిరిజన ప్రాంతాల అభివృద్ధి ప్రక్రియకు ఆటంకం కలుగుతోంది. గిరిజనులు ఇప్పటికే విద్యా మరియు ఆర్థిక పరంగా వెనుకబడి ఉన్న వర్గం. ఈ పరిస్థితిలో మల్టీ జోన్ విధానం వారి అవకాశాలను మరింతగా తగ్గిస్తూ సామాజిక అసమానతను పెంచుతోంది. అందువల్ల, ప్రభుత్వం తక్షణమే క్రింది చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము: అల్లూరి సీతారామరాజు జిల్లాను జోన్–II నుండి మల్టీ జోన్–Iలో చేర్చాలి.విశాఖపట్నంలోని పబ్లిక్ సెక్టార్ సంస్థల్లో గిరిజనులకు ప్రత్యేక ప్రాధాన్యం కల్పించాలి.గిరిజన ప్రాంతాలకు ప్రత్యేక స్థానిక హక్కులు మరియు రక్షణ చర్యలు అమలు చేయాలి.మల్టీ జోన్ వ్యవస్థ వల్ల కలిగే ప్రభావాలను సమీక్షించేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలి. జోన్–II నుండి జోన్–Iలోకి అల్లూరి జిల్లాను మార్చడం వల్ల కలిగే ప్రయోజనాలు: విశాఖపట్నంలో ఉన్న ప్రభుత్వ మరియు పబ్లిక్ సెక్టార్ ఉద్యోగాలకు గిరిజనులకు తిరిగి అర్హత లభిస్తుంది.గిరిజన యువతకు విస్తృత ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి.చారిత్రక మరియు భౌగోళిక అనుసంధానం పునరుద్ధరించబడుతుంది.ప్రాంతీయ అసమానతలు తగ్గుతాయి.సామాజిక న్యాయం మరియు సమాన అవకాశాలు సాధ్యమవుతాయి.గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుంది. ఇది కేవలం ఉద్యోగాల సమస్య మాత్రమే కాదు.., ఇది గిరిజనుల భవిష్యత్తు, వారి గౌరవం మరియు వారి హక్కుల పరిరక్షణకు సంబంధించిన కీలక అంశం. కాబట్టి, ప్రభుత్వం వెంటనే స్పందించి తగిన నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

# బాలికపై వృద్ధుడి అసభ్య ప్రవర్తన

## నిందితునికి దేహశుద్ధి, పోలీసులకు అప్పగింత

● నిందితుడికి గుండు గీయించిన వైనం ● రుద్రంపేటలో ఉద్రిక్తత



నిందితుడికి గుండు చేయించి పోలీసులకు అప్పగించిన కాలనీవాసులు

**అనంతపురం క్రైమ్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** ఓ బాలిక పట్ల 60 ఏళ్ల వైసీపీకి చెందిన కార్యకర్త ఖాజా హుస్సేన్ అసభ్య ప్రవర్తించిన తీరు కలకలం రేపింది. ఈ ఘటన అనంతపురం రూరల్ మండలం రుద్రంపేట కాలనీలో చోటు చేసుకుంది. స్థానికంగా ఉన్న ఓ బాలికపై నిందితుడు అసభ్యంగా ప్రవర్తించడంతోపాటు తన ఇంటికి పిలిపించుకుపోయాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని పసిగట్టిన కాలనీవాసులు వెంటనే నిందితుడి ఇంట్లోకి చొరబడి బయటకు లాక్కొచ్చి దేహ శుద్ధి చేశారు. అంతటితో వదలకుండా గుండు గీయించి అవమానపరిచారు. నిందితున్ని పట్టుకొని నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్లో అప్పగించారు. దీంతో రుద్రంపేట కాలనీలో ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు. కాగా పోలీసులు మాత్రం నిందితుడికి మతిస్థిమితం సరిగా లేదంటూ బయటకు విడిచిపెట్టారని రుద్రంపేట కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా స్థానిక అంబేద్కర్ విగ్రహం ఎదుట దళిత సంఘాలు, మైనారిటీ మహిళలు ఆందోళన చేశారు. బాలికపై లైంగిక దాడికి పాల్పడిన దుర్మార్గుడిపై పోలీసులు చర్యలు తీసుకోవడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన దుర్మార్గుడికి వెంటనే ఉరిశిక్ష వేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో చర్యలు తీసుకోకపోతే దళిత మైనారిటీ సంఘాలు ఉద్యమిస్తాయని హెచ్చరించారు. కాలనీవాసులు వైసీపీ కార్యకర్త ఖాజా హుస్సేన్‌కు గుండు కొట్టించి పోలీసులకు అప్పగిస్తే.. నిందితున్ని వదిలేసారని ఆరోపించారు. బాలికకు అన్యాయం చేసే సహించేదే లేదని, పోలీసులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**నిందితుడు అరెస్టు... పోక్సో కేసు:** అనంతపురంలోని చంద్రబాబు కొట్టాలలో మైనర్ బాలిక పై అసభ్యంగా ప్రవర్తించిన ముద్దాయి ఖాజా హుస్సేన్ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు నాలుగో పట్టణ ఇంచార్జ్ సీఐ శ్రీకాంత్ తెలిపారు. మైనర్ బాలికను అడిగేంలో ఉన్న ఖాజా హుస్సేన్ తన ఇంట్లోకి పిలుచుకొని అసభ్యంగా ప్రవర్తించినాడని అని బాలిక పోలీస్ స్టేషన్‌కి వచ్చి మాకు కేస్ వద్దని, పెద్దమనుషులతో మాట్లాడుకొని వస్తామని చెప్పి వెళ్ళిపోయారు. కానీ ఆదివారం అతను రాకపోయేసరికి స్త్రీ శిశు సంక్షేమ శాఖ సహాయంతో సుమోటోగా కేస్ నమోదు చేశామన్నారు. పోక్సో చట్టం కింద ఖాజా హుస్సేన్ అరెస్టు చేశామన్నారు.

# దుర్గమ్మ ఆలయంలో ఇఓ ఆకస్మిక తనిఖీలు



హైకోర్టు న్యాయమూర్తి దంపతులకు దుర్గమ్మవారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

**ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** ఇంద్రకీలాద్రిపై ఇఓ వికె శీనా నాయక్ పారిశుధ్యం, భక్తులకు త్రాగునీటి సౌకర్యం, వ్యర్థాలు తొలగింపు క్యూలైన్లు నిర్వహణ, భక్తులకు మెరుగైన మౌలిక వసతులు కల్పన వగైరా పలు కీలక అంశములపై ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. దేవస్థాన పారిశుధ్య నిర్వహణను పర్యవేక్షించేందుకు ప్రధాన ఆలయ పరిసరములు, క్యూ లైన్లు, ఘాట్ రోడ్ పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య పరిస్థితులను, భక్తులకు కల్పించే మౌలిక వసతులను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఇఓ మాట్లాడుతూ, భక్తుల ఆరోగ్యానికి, ఆలయ పవిత్రతకు పారిశుధ్యమే కీలకమని పేర్కొన్నారు.

**లీజ్ దారులు నిబంధనలు పాటించకపోతే లైసెన్స్ రద్దు:** శ్రీ దుర్గమ్మ వారి ఆలయ ప్రాంగణంలో వ్యాపారాలు నిర్వహిస్తున్న లీజుదారులందరితో ఆదివారం ఇఓ వికె శీనా నాయక్ అత్యవసర సమావేశం నిర్వహించారు. సంబంధిత విభాగం అధికారులైన రమేష్ బాబు, అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

**దుకాణ నిర్వహణ సమయాలు:** ఆలయ అధికారులు నిర్ణయించిన ప్రారంభ, ముగింపు సమయాలను ఖచ్చితంగా లీజ్ దారులు పాటించాలి. ప్రతి దుకాణం తమ వద్ద ఉన్న వస్తువుల ధరల పట్టికను అందరికీ కనిపించేలా ప్రదర్శించాలి. అధిక ధరలకు విక్రయిస్తే సహించేది లేదు. భక్తులు నుండి ఫిర్యాదు అందితే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

**సిబ్బందికి ఐడెంటిటీ కార్డులు:** మహా మండపం, పార్కింగ్, శారీస్ కలెక్షన్, మొబైల్ డిపాజిట్, స్పాట్ ఫోటో, శారీస్ దుకాణంలో పనిచేసే సిబ్బంది (స్త్రీ/పురుషులు) అందరి ఆధార్ వివరాలు, ఫోటో కాపీలు, వారి పూర్వ చరిత్ర లీజ్ దారులు దేవస్థానం కార్యాలయంలో అందజేయాలి. వారి సిబ్బంది అందరికీ సరైన ఐడెంటిటీ కార్డులు జారీ చేయాలి. విధుల్లో ఉన్నప్పుడు వారు తప్పనిసరిగా వాటిని ధరించాలి. దుకాణదారుల మధ్య ఎటువంటి వివాదాలు, గొడవలు లేదా పోలీస్ ఫిర్యాదులు తలెత్తినా వాటిని తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు. అటువంటి సందర్భాల్లో, ఎటువంటి మినహాయింపు లేకుండా సంబంధిత రెండు దుకాణాల లీజులను రద్దు చేసి, సీల్ వేయడం జరుగుతుంది. లీజుదారులు అందరూ తమ లీజు/టెండర్ ఒప్పంద పత్రాల్లో పేర్కొన్న నియమ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలి. అద్దె బకాయిలు ఉన్న లీజ్ దారులు వెంటనే బకాయి చెల్లించాలి, భక్తులతో దురుసు ప్రవర్తన చేసిన వారి లీజ్ రద్దు చేయబడుతుంది. షాప్ లకు కేటాయించిన ప్రదేశం దాటి ఏమాత్రం ముందుకు వచ్చినా చర్యలు తీసుకొని, లైసెన్స్ రద్దు కు సిద్ధం. క్లోక్ రూమ్, చెప్పులు స్టాండ్ వద్ద నిర్ణయించిన కంటే ఎక్కువ రుసుము వసూల్,కొబ్బరికాయ కొట్టె చోట భక్తులు నుండి రుసుము డిమాండ్ పిర్యాదులు భక్తుల నుండి వస్తున్నందున తగు చర్యలకు ఆదేశాలు ఇచ్చారు. దేవస్థానంలో ఉన్న లీజుదారులందరూ ఈ నిబంధనలను ఖచ్చితంగా పాటించేలా దిగువ స్థాయి అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలని తదితర ఆదేశాలను ఇఓ ఇచ్చారు.

**దుర్గమ్మను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి:** శ్రీ కనకదుర్గమ్మ వారిని ఆంధ్రప్రదేశ్ నూతన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ తన కుటుంబ సభ్యులతో కలిసి హారతి దర్శనం చేసుకున్నారు. పాలకమండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఇఓ వి.కె. శీనానాయక్ దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమంటోలు అందించారు. ఆలయ స్థానాచార్యులు శివప్రసాద్, అర్చక బృందం వేదమంత్రోచ్చారణల మధ్య సి.జె కుటుంబానికి వేదాశీర్వచనాలు అందజేశారు.

**దుర్గమ్మవారి సేవలో విజయవాడ సిపి:** దుర్గమ్మ వారిని ఆదివారం విజయవాడ నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు తన పుట్టినరోజు సందర్భంగా దర్శించుకున్నారు. పోలీస్ కమిషనర్ దంపతులకు ఆలయ ఇఓ శీనా నాయక్ శ్రీ అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు ఆశీర్వచనాలు అందజేశారు.

**నిత్యాన్నదాన పథకానికి విరాళం:** విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో అన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన కమ్మిరి సునీల్, పావని దంపతులు తమ తండ్రి దివంగత వెంకట దుర్గా బాలాజీ రావు జ్ఞాపకార్థం రూ.1,00,516 విరాళంగా ఆదివారం అందజేశారు. అలాగే గుడివాడకు చెందిన జి.ఉమాదేవి, వారి కుటుంబ సభ్యులు అన్నదానం కోసం రూ.1,00,000/ విరాళంగా అందజేశారు. దాతకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు శ్రీ అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు ఆశీర్వచనాలు అందజేశారు.



ఆకస్మిక తనిఖీ చేస్తున్న ఇఓ శీనానాయక్

**శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానానికి భక్తుడి బంగారు హారం:** బెజవాడ దుర్గమ్మవారికి హైదరాబాద్‌కు చెందిన వేమూరి శివరామప్రసాద్ 23 గ్రాముల బరువున్న బంగారు బంగారు హారం సుమారు రూ.3,54,292 విలువైన బంగారు హారం మొక్కుబడిగా ఆదివారం చెల్లించుకున్నారు. దాతకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు శ్రీ అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు ఆశీర్వచనాలు అందజేశారు.

# నోవా గ్రూపు చైర్‌పర్సన్‌పై కేసు నమోదు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** నోవా గ్రూపు చైర్ పర్సన్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆర్‌టీఐ కమిషనర్‌పై జూబ్లీహిల్స్ ఠాణాలో కేసు నమోదైంది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. రాజేంద్ర నగర్‌లో నివసించే నోవా గ్రూపు చైర్‌పర్సన్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆర్‌టిఐ కమిషనర్ విజయ నిర్మల తన కుమార్తెకు పెండ్యాల కుటుంబంతో వివాహం కుదుర్చుకున్నారు. ఈ వ్యవహారంలో పెండ్యాల కుటుంబం ముందుగా కట్నం వద్దని చెప్పి, తర్వాత రూ.1 కోటి నగదు, బిఎండబ్ల్యు కారు, ఖరీదైన గిఫ్టులు, ఘనంగా వివాహ ఏర్పాట్లు కోరినట్లు ఆరోపించారు. వరుడి జీతం, భవిష్యత్ అవకాశాలపై తప్పుడు సమాచారం ఇచ్చి నమ్మబలికినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో నిశ్చితార్థం, వివాహ ఏర్పాట్లపై భారీ ఖర్చు చేసిన తర్వాత, ఏప్రిల్ 5న ఒక్కసారిగా వివాహాన్ని రద్దు చేసి డబ్బులు, బహుమతులు తిరిగి ఇవ్వలేదని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనతో తన కుమార్తె తీవ్ర మానసిక ఆందోళనకు గురైందని విజయనిర్మల తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో పెళ్లి కుమార్తె అక్షయ పెండ్యాలతోపాటు ఆమె తల్లి ఉష పెండ్యాల, తండ్రి సుధాకర్ పెండ్యాల, సోదరి క్రితి పెండ్యాలపై వరకట్న వేధింపుల కింద కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా ఇంటి వద్ద దాడి, ఆస్తి ధ్వంసం ఆరోపణలతో ఇదే వివాదానికి సంబంధించి జూబ్లీహిల్స్‌లో నివసించే అక్షయ తండ్రి సుధాకర్ ప్రతిగా జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఏప్రిల్ 24న విజయ నిర్మల తన కుమారుడు సహా సుమారు 70 మంది వ్యక్తులతో కలిసి తమ ఇంటికి వచ్చి గేటు పగులగొట్టి లోపలికి ప్రవేశించి వాచ్‌మన్‌పై దాడి చేసి, ఇంటి సామగ్రి, సీసీ కెమెరాలను ధ్వంసం చేశారని ఆరోపించారు. కుటుంబ సభ్యులను హత్య చేస్తామని బెదిరించారని, ఆయుధాలతో భయాందోళన సృష్టించారని పేర్కొన్నారు. సుధాకర్ ఫిర్యాదు మేరకు విజయనిర్మల, సుమేధ్ తదితరులపై జూబ్లీహిల్స్ పోలీసులు బీఎన్‌ఎస్ సెక్షన్ 324(4), 329(4) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# బెదిరింపు రాజకీయాలను బిజెపి ప్రభుత్వం మానుకోవాలి

## సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ

**విజయవాడ, ఏప్రిల్ 25 ప్రభాతవార్తప్రతినిధి:** దేశంలో బెదిరింపు రాజకీయాలను బిజెపి ప్రభుత్వం మానుకోవాలని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. దేశంలో రాజకీయ వ్యామోహంతో బిజెపి పాలన సాగిస్తోందని విమర్శించారు. స్వార్థ రాజకీయాలు చేస్తే చూస్తూ ఊరుకోమని, తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. బిజెపికి వ్యతిరేకంగా మాట్లాడే ప్రభుత్వాలపై కక్ష సాధింపునకు దిగుతోందని విమర్శించారు. బిజెపి విధానాలను ప్రశ్నించే వారిపై తప్పుడు కేసులు పెడుతోందని వివరించారు. బిజెపి కండువా పుచ్చుకుంటే ఆ దాడులు ఉండవని, ఆ నేతలపై ఉన్న కేసులు మాయం అవుతాయని ఎద్దేవా చేశారు. మన దేశ పౌరులను, మన దేశాన్ని కించపరిచేలా ట్రంప్ ప్రస్తావిస్తున్నారని, ఆ వ్యాఖ్యలపై మోదీ ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. దేశంలో మోదీ అసమర్థత ప్రధాన మంత్రిగా పాలన సాగిస్తున్నాడని విమర్శించారు. కేంద్రం ప్రవేశ పెట్టిన డీలిమిటేషన్ బిల్లును, ప్రతిపక్షం ఓడిం చిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలు రోజురోజుకు పెరిగిపోతున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకపోగా, పక్కదోవ పట్టించేలా పాలన సాగిస్తోందని విమర్శించారు. మొక్కజొన్న, వరి తదితర పంటలు సాగు చేస్తోన్న రైతులు సమస్యలతో తల్లడిల్లుతున్నారని తెలిపారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు.

# పిఎగా ట్రాన్స్‌జెండర్‌కు అవకాశమిచ్చిన ఎమ్మెల్యే గల్లా మాధవి

## గుంటూరు ఎమ్మెల్యేపై మంత్రి లోకేశ్ ప్రశంసలు

**విజయవాడ, ఏప్రిల్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే గల్లా మాధవి తీసుకున్న ఒక నిర్ణయంపై రాష్ట్రవ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఆమె తన వ్యక్తిగత సహాయకురాలిగా (పీఏ) ఒక ట్రాన్స్‌జెండర్‌ను నియమించి అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఈ నిర్ణయాన్ని రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేకంగా అభినందించారు. గల్లా మాధవి నాయకత్వ పటిమను చాటారని, అణగారిన వర్గాలకు సాధికారత కల్పించడమే నిజమైన నాయకత్వం అని ఆయన ట్విట్టర్ వేదికగా ప్రశంసించారు. వివరాల్లోకి వెళితే, బీకాం పూర్తి చేసిన ఒక ట్రాన్స్‌జెండర్ మహిళ ఉద్యోగం కోసం ఎమ్మెల్యే గల్లా మాధవి కార్యాలయాన్ని సంప్రదించారు. ఆమె విద్యార్హత, ఉపాధి అవసరాన్ని గుర్తించిన ఎమ్మెల్యే, వెంటనే తన పీఏగా నియమిస్తున్నట్లు ప్రకటించారు. ట్రాఫిక్ సిగ్నళ్లు, రైళ్లలో ట్రాన్స్‌జెండర్లు పడుతున్న ఇబ్బందులను చూసి చలించిపోయానని, వారికి గౌరవప్రదమైన జీవనోపాధి కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నానని గల్లా మాధవి వివరించారు. ట్రాన్స్‌జెండర్ల ఉపాధి సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి, వారి సంక్షేమానికి ప్రభుత్వం తరఫున మరిన్ని చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. గల్లా మాధవి తీసుకున్న ఈ నిర్ణయం సమాజంలో ఇతరులు అనుసరించ డానికి ఒక గోల్డెన్ స్టాండర్డ్ సెట్ చేసిందని లోకేశ్ తన పోస్టులో పేర్కొనడం విశేషం.

# ఫిరాయింపు ఎంపిలపై వేటు

## రాజ్యసభ చైర్మన్‌కు ఆప్ వినతిపత్రం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 26:** పార్టీ ఫిరాయింపులకు పాల్పడి బీజేపీలో చేరిన ఏడుగురు రాజ్యసభ ఎంపీలను అనర్హులుగా ప్రకటించాలని రాజ్యసభ చైర్మన్ సీపీ రాధాకృష్ణన్‌ను ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కోరింది. ఈ మేరకు సీపీ రాధాకృష్ణన్‌కు ఆప్ సీనియర్ నేత సంజయ్‌సింగ్ వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఎంపీల చర్యలు పార్టీ ఫిరాయిం పుల నిరోధక చట్టం లోని నిబంధనలకు విరుద్ధమని అన్నారు. ఎంపీల ఫిరా యింపులు ప్రజా తీర్పు నకు ద్రోహం చేయడమే కాకుండా రాజ్యాంగ విరుద్ధమని సంజయ్ సింగ్ తెలిపారు. ముఖ్యంగా ఫిరాయింపులకు పాల్ప డిన వారిలో ఆరుగురు పంజాబ్ నుంచి ఆప్ టిక్కెట్టుపై ఎన్నికయ్యారని చెప్పారు. ఇప్పుడు పార్టీ ఫిరాయించి బీజేపీలో చేరడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఆక్షేపణ తెలిపారు. ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించేందుకు వారి సభ్యత్వాన్ని రద్దు చేయాల్సిందిగా రాజ్యసభ చైర్మన్‌ను కోరినట్టు చెప్పారు. ఆమ్ ఆద్మీ పార్టీకి మూడురోజులక్రితం గట్టి దెబ్బ తగిలింది. పార్టీకి చెందిన ఏడుగురు రాజ్య సభ సభ్యులు బీజేపీలోకి ఫిరాయించారు. రాఘవ్ చద్దా, అశోక్ మిట్టల్, సందీప్ పాఠక్, హర్భజన్ సింగ్, రాజేంద్ర గుప్తా, విక్రమ్ సాహ్నీ, స్వాతి మలివాల్‌లు బీజేపీలో విలీనమైనట్టు ప్రకటించారు. కేజ్రీవాల్ పార్టీ ఏ సిద్ధాంతాలతో మొదలైందో ఆ సిద్ధాంతాలకు తిలోదకాలు ఇచ్చిందని వారు ఆరోపించారు. తమ విలీనాన్ని సమర్థించుకుంటా మూడింట రెండు వంతుల మంది మరో సంస్థలో విలీనమయ్యేందుకు రాజ్యాంగ నిబంధన అనుమతిస్తుందని రాఘవ్ చద్దా చెప్పారు. రాజ్యసభలో ఆమ్ ఆద్మీ పార్టీకి 10 మంది సభ్యులుండగా అవసరమైన దానికంటే ఎక్కువ మంది సభ్యు లు తమ గ్రూప్‌లో ఉన్నట్టు తెలిపారు. అయితే ఈ వాదనను సంజయ్ సింగ్ తోసిపుచ్చారు. సీనియర్ అడ్వకేట్ కపిల్ సిబల్, లోక్‌సభ మాజీ సెక్రటరీ జనరల్ సహా పలువురు రాజ్యాంగ నిపుణులను తాము సంప్రదిం చామని, చట్టప్రకారం ఆప్ నుంచి ఫిరాయించిన ఎంపీలు అనర్హతకు గురయ్యే అవకాశం ఉందని తెలిపారు.

# బిఆర్ఎస్ లేకపోతే తెలంగాణ వచ్చేది కాదు: మాజీమంత్రి హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 26:** రాష్ట్ర ప్రజలకు హరీశ్‌రావు బీఆర్ఎస్ రజతోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ ఏర్పడి 25 వసంతాలు పూర్తి చేసుకుందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఆవిర్భావంతోనే తెలంగాణ కల సాకారమైందని అన్నారు. కేసీఆర్ లేకపోతే బీఆర్ఎస్ లేదు.. బీఆర్ఎస్ లేకపోతే తెలంగాణ వచ్చేది కాదని అభిప్రాయ పడ్డారు. నాలుగు కోట్ల మంది ప్రజలకు ఏకతాటి మీదకు తెచ్చిన మహా నాయకుడు కేసీఆర్ అని హరీశ్‌రావు కొనియాడారు. బీఆర్ఎస్ పార్టీ ఏర్పా టుతో దశాబ్దాల తెలంగాణ కల సాకారమైందని అన్నారు. ఇవాళ రాష్ట్ర ప్రజలు ఆత్మగౌరవంతో సంతోషంగా బతుకుతున్నారని తెలిపారు. బీఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర ప్రజల్లో గొప్ప ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించిందని పేర్కొ న్నారు. రాష్ట్రం 33 జిల్లాలుగా ఏర్పడిందన్నా.. సిద్దిపేట జిల్లాగా మారిం దన్నా కేసీఆర్ కృషే కారణమని స్పష్టం చేశారు. బీడువారిన భూములను సస్యశ్యామలంగా మార్చిన ఘనత కాళేశ్వరం ప్రాజెక్టుదే అని హరీశ్‌రావు అన్నారు.

# ఇక డిజిటల్ రూపంలోనే జనగణన



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 26:** దేశవ్యాప్తంగా కొనసాగే జనగణన ప్రక్రియలో ప్రజలు తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకునే సౌలభ్యం ఉందని, ఇప్పటికే 12 మిలియన్ల కుటుంబాల ఇళ్ల జాబితా పూర్తయిందని తెలిపారు. ప్రజలనుంచి సేకరించిన సమాచారాన్ని పూర్తి సురక్షితంగా గోప్యంగా ఉంచుతామని అన్నారు. జనాభా గణన ప్రక్రియ ప్రపంచంలోనే అతిపెద్దదని, 2027 జనాభా లెక్కల వివరాలను డిజిటల్ రూపంలో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. సిబ్బంది మొబైల్‌యాప్‌ద్వారా ప్రజల వివరాలు నమోదుచేస్తారని, ప్రజలు స్వయంగా నమోదుచేసుకునేందుకు కూడా అవకాశం ఉందని మోడీ అన్నారు. ప్రధాని మోడీ తన 133వ మన్ కీ బాత్ ఎపిసోడ్‌లో ఆదివారం దేశాభివృద్ధి, పర్యావరణం, సంస్కృతి, విజ్ఞాన శాస్త్ర రంగాల్లో భారతదేశం సాధిస్తున్న విజయాలను వివరిస్తూ సందేశం ఇచ్చారు. సౌర, పవన శక్తి వినియోగం మన భవిష్యత్తుకు ముఖ్యమని పిలుపునిచ్చారు. తమిళనాడులోని కల్పక్కంలో ఉన్న ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ క్రిటికాలిటీని సాధించడం ద్వారా మన అణు శాస్త్రవేత్తలు చరిత్ర సృష్టించారని మోడీప్రశంసించారు. ఈ అణు రియాక్టర్ పూర్తిగా స్వదేశీ సాంకేతికతతో నిర్మించడం ఆత్మనిర్భర్ భారత్ కృషికి నిదర్శనమని ఆయన ప్రకటించారు. అణు ఇంధన ఉత్పత్తిలోకూడా మరో మైలురాయిని అధిగమించగలిగామని ప్రధాని పేర్కొన్నారు. పవన్ విద్యుత్‌లో కూడా భారత్ నాలుగో స్థానంలో ఉందని, ప్రస్తుతం 56 గిగావాట్లకుపైగా పవనవిద్యుత్ ఉత్పత్తిచేస్తున్నామని గత ఏడాదికంటే ఆరు గిగావాట్ల పవనశక్తి ఎక్కువ ఉత్పత్తి అవుతున్నదన్నారు. భారతదేశ వైవిధ్యం, సాంకేతిక ప్రగతి మరియు పర్యావరణ బాధ్యతలను ప్రతిబింబించింది. సామాన్యుల విజయగాథల నుంచి అణుశక్తి ప్రయోగాల వరకు అనేక అంశాలను ఈ సందర్భంగా స్పృశించారు. ప్రధాని మోడీ ప్రకృతి సమతుల్యత గురించి మాట్లాడుతూ, ఉత్తరప్రదేశ్‌లోని టెరాయ్ ప్రాంతంలో పంట కోత సమయంలో ఏనుగులు గ్రామాల దరికి చేరడం వల్ల తలెత్తే ఘర్షణలపై ఆందోళన వ్యక్తం చేశారు. అదే సమయంలో, ఛత్తీస్‌గఢ్‌లో కృష్ణజింకలు తిరిగి కనిపించడం శుభపరిణామమని కొనియాడారు. ఒకప్పుడు ఎడారి ప్రాంతాలకు చిహ్నంగా ఉండి, అంతరించిపోయే దశకు చేరుకున్న గ్రేట్ ఇండియన్ బస్టర్డ్ పక్షి సంరక్షణ ఆవశ్యకతను ఆయన గుర్తు చేశారు. సిలిగురికి చెందిన 9వ తరగతి విద్యార్థి చందన్ మాలిక్ గీసిన చిత్రాన్ని ప్రధాని ప్రత్యేకంగా ప్రశంసించారు. ఆ బాలుడికి వ్యక్తిగత లేఖ రాసి ప్రోత్సహించడం ద్వారా యువ కళాకారులలో ఆత్మవిశ్వాసాన్ని నింపారు. బ్రెజిల్‌లో జరిగిన అంతర్జాతీయ పోటీల్లో రెండు భారతీయ చీజ్ బ్రాండ్‌లు అవార్డులు గెలుచుకోవడంపై హర్షం వ్యక్తం చేస్తూ, భారతీయ పాల ఉత్పత్తుల వైవిధ్యాన్ని కొనియాడారు. గౌతమ బుద్ధుని బోధనలు నేటి సంఘర్షణల ప్రపంచానికి అత్యంత అవసరమని ప్రధాని పేర్కొన్నారు. శాంతి మనతోనే మొదలవుతుంది అన్న బుద్ధుని సందేశాన్ని చిలీ దేశంలో లడఖ్‌కు చెందిన ద్రుబ్‌పోన్ ఒట్జర్ రిన్‌పోచే ప్రచారం చేయడం గర్వకారణమన్నారు. 2017లో వెదురును చెట్టు కేటగిరీ నుండి తొలగించడం వల్ల ఈశాన్య రాష్ట్రాల్లో వెదురు రంగం విప్లవాత్మక మార్పులు సాధించిందని ప్రధాని అన్నారు. ఈశాన్య భారతాన్ని అష్టలక్ష్మిగా అభివర్ణిస్తూ అక్కడి అభివృద్ధిని ప్రశంసిం చారు. డిజిటల్ రంగంలో జాతీయ ఆర్కైవ్స్ 20 కోట్లకు పైగా పత్రాలను ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తెచ్చిందని వెల్లడించారు. ఫ్రాన్స్‌లో జరిగిన గణిత ఒలింపియాడ్‌లో భారతీయ బాలికలు కనబరిచిన ప్రతిభను అభినందించారు.

## కల్పాక్కం అణువిద్యుత్ కేంద్రంతో ఆత్మనిర్భర్ భారత్

## సౌర, పవన విద్యుత్‌లోనూ మరింత పునరుజ్జీవమే

# డిజిటల్ మార్కెటింగ్ పేరిట మోసం.. కంపెనీ మేనేజర్ అరెస్ట్

## నకిలీ మార్కెటింగ్, మనీ సర్క్యులేషన్ స్కీమ్‌లపై చాలా జాగ్రత్తగా ఉండాలి : డిసిపి కిరణ్‌ఖారే

**హైదరాబాద్ (చార్మినార్), ఏప్రిల్ 26 ప్రభాతవార్త :** డిజిటల్ మార్కెటింగ్ పేరుతో పాతబస్తీ మీర్‌చౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలోమల్టీ లెవెల్ మార్కెటింగ్ (ఎంఎల్ఎం),మనీ సర్క్యులేషన్ పేరుతో భారీ మోసానికి పాల్పడిన ఫరెవర్ లివింగ్ ఇంపోర్ట్స్ కంపెనీ కంట్రీ సేల్స్ మేనేజర్ హర్యానా రాష్ట్రం గురుగ్రామ్‌కు చెందిన హరీష్ కుమార్ సింగ్లా (61)ను మీర్‌చౌక్ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు.ఈ కేసుకు సంబంధించిన వివరాలను చార్మినార్ జోన్ డిసిపి కిరణ్ ఖారే ఆదివారం మీర్‌చౌక్ ఏసిపి శ్యామ్‌సుందర్, ఇన్‌స్పెక్టర్ కొండలరావుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు.హర్యానాకు చెందిన హరీష్‌కుమార్ సింగ్లా డిజిటల్ మార్కెటింగ్, ఫరెవర్ లివింగ్ ప్రొడక్ట్స పేరుతో అమాయక ప్రజలను మహి ళలను లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నాడు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ శిక్షణ తరగతుల పేరుతో 199 రూపాయల నుంచి 249 రూపాయలు వరకు రిజిస్ట్రేషన్ ఫీజులు వసూళ్లు చేశాడు. స్లో ట్రాక్, మీడియం ట్రాక్ వంటి కాంబో ప్యాకేజీల పేరుతో భారీ మొత్తం డబ్బులు వసూలుచేయటం జరి గింది. ఉత్పత్తులు అమ్మకం కంటే కొత్త సభ్యు లను చేర్పించటం ద్వారానే డబ్బు వస్తుందని నమ్మించి మనీ సర్క్యు లేషన్ స్కీమ్ నడపటం జరిగింది. ఇప్పటికే మీర్ చౌక్ పోలీసులు ఈ కేసులో పాతబస్తీకి చెందిన ఏజెంట్లు మహ్మద్ అక్రమ్, మొహమ్మద్ నౌమాన్ రజా, మొహ మ్మద్ అస్లాంలను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి మెర్సిడెస్ బెంజ్ కారు, ఒక మ్యాక్ బుక్, ఒక ఐ ప్యాడ్, మూడు స్మార్ట్‌ఫోన్లను స్వాధీనం చేసు కున్నారు. నిందితుల ఖాతాలో ఉన్న దాదాపు మూడు కోట్ల రూపాయలను ఫ్రీజ్ చేశారు. కంపెనీ మేనేజర్ హరీష కుమార్ సింగ్లాను ఆదివారం పోలీసులు అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భం గా చార్మినార్ జోన్ డిసిపి కిరణ్ ఖారే మాట్లా డుతూ తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించ వచ్చనే మల్టీలెవెల్ మార్కెటింగ్, మనీ సర్క్యులేషన్ వంటి స్కీమ్‌ల పట్ల ప్రజలు చాలా జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. మోస పూరిత ప్రకటలను నమ్మి డబ్బులు పోగొట్టు కోవద్దని, ఎవరైనా మిమ్మల్ని ఇటు వంటి స్కీమ్ లలో చేరమని ఒత్తిడి చేస్తే వెంటనే సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఆయన తెలియజేశారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న చార్మినార్ జోన్ డిసిపి కిరణ్ ఖారే

# మంత్రి సన్నిహితుడనని నమ్మించి రూ. 1.70 కోట్ల మోసం

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** మంత్రి సన్నిహితుడినని నమ్మించి ఓ సంస్థ డైరక్టర్‌ను రూ. 1.70 కోట్ల మోసానికి పాల్పడిన సంఘటన జూబ్లీహిల్స్ ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. జూబ్లీహిల్స్ పోలీ సుల కథనం ప్రకారం.. బంగారు యాదవ్ పురిమెట్ల అనే వ్యక్తి తాను మంత్రికి సన్నిహితుడినని, తనకు ప్రభుత్వ అధికారుల వద్ద మంచి పలుక బడి ఉందని గ్రీన్ మెట్రో ఇన్‌ఫ్రాటెక్ అండ్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరక్టర్ బోడ్డ అశోక్‌ను నమ్మించాడు. సంస్థకు సంబంధించిన ప్రభుత్వ అనుమతులు ఇప్పిస్తానని నమ్మించి అతని వద్ద నుంచి దశలవారీగా రూ.1.70 కోట్లు తీసుకున్నాడు. దీనికితోడు ఒక ఖరీదైన ఐఫోన్, కంపెనీ వాహనం సైతం తీసుకొన్నాడు. ఏడాదిన్నర గడిచినా ఎన్‌ఓసీ ఇవ్వకపోవడంతో ప్రశ్నించడంతో బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో సుధాకర్ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు బంగారు యాదవ్ పురిమెట్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# నేడు ఎరువుల షాప్‌లు బంద్

**హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సోమవారం ఎరువుల షాపులు బంద్ కానున్నాయి. కేంద్ర ప్రభుత్వం, ఎరువుల ఉత్పత్తి సంస్థలు అనుసరిస్తున్న మొండి వైఖరిని నిరసిస్తూ రాష్ట్ర ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్, సీడ్స్ డిలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ బంద్‌కు పిలుపునిచ్చింది. డిలర్ల సమస్యలను పరిష్కరించడంలో కంపెనీలు నిరక్ష్యం వహిస్తున్నందునే బంద్ పాటిస్తున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగూర్ల వెంకటేశ్వర్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వేలాది దుకాణాలను స్వచ్ఛందంగా మూసి వేసి నిరసన తెలపాలని పిలుపునిచ్చారు.

## ఉప రాష్ట్రపతి పర్యటన మార్గాల్లో భద్రతా తనిఖీలు



శ్రీకాకుళం, ఏప్రిల్ 26 ప్రభాతవార్త : ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్ జిల్లా పర్యటన ఖరారైన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం చేస్తున్నారు. సోమవారం ఉదయం 10.50 నిమిషాలకు ఉప రాష్ట్రపతి రానుండటంతో జిల్లా యంత్రాంగం, కేంద్ర భద్రతా విభాగం సంయుక్తంగా 'అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్'ని ఆదివారం ఉదయం నిర్వహించాయి. డచ్ బంగ్లా నుంచి పర్యటన సాగే మార్గాలను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, కేంద్ర హోంశాఖ, ఉప రాష్ట్రపతి సెక్రటేరియట్ అధికారులు సమీక్షించారు.

**కేంద్ర అధికారుల పర్యవేక్షణ**

ఈ పర్యటనలో ఉప రాష్ట్రపతి కార్యాలయానికి చెందిన కీలక అధికారులు పాల్గొన్నారు. ప్రోటోకాల్ ఆఫీసర్ అమిత్ శర్మ, అశుతోష్‌లతో పాటు సిఆర్పీఎఫ్ 2 ఇన్ కమాండ్ (2ఐసి) ధర్మబీర్ జాకర్ క్షేత్రస్థాయిలో భద్రతా ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. భద్రతా నిబంధనల ప్రకారం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా పోలీసు యంత్రాంగానికి కీలక సూచనలు చేశారు. నగరంలోని మిల్ జంక్షన్ మీదుగా నేరుగా శ్రీకూర్మం చేరుకున్న బృందం, ఆలయ పరిసరాలను పరిశీలించింది. ఆలయ ప్రవేశ ద్వారం, ప్రాంగణం, గర్భాలయ పరిసరాలను కేంద్ర అధికారులు తనిఖీ చేశారు. ఉప రాష్ట్రపతికి స్వాగతం పలికే పాయింట్ నుంచి దర్శనం ముగించుకుని తిరిగి వెళ్లే వరకు ప్రతి అడుగును భద్రతా కోణంలో విశ్లేషించారు. ఆలయ విశిష్టతను ఉప రాష్ట్రపతికి వివరించే తీరుపై ఈవోకు పలు సూచనలు చేశారు. అనంతరం అరసవల్లి క్షేత్రానికి చేరుకున్న అధికారులు, ప్రధాన రహదారి నుంచి ఆలయం వరకు ఉన్న మార్గాలను తనిఖీ చేశారు. ఆలయ ప్రాంగణంలో పుష్పాలంకరణ, పారిశుద్ధ్యం మెరుగుపరచాలని, వీవీఐపీ పర్యటన సమయంలో సాధారణ భక్తులకు ఇబ్బంది కలగకుండా రద్దీని నియంత్రించాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా వి.ఐ.పి.లు ఆలయానికి చేరుకునే మార్గంపై ప్రత్యేక నిఘా ఉండాలని స్పష్టం చేశారు. స్థానిక శాసనసభ్యులు గొండు శంకర్, ఆర్డీఓలు కె.సాయి ప్రత్యూష, కృష్ణమూర్తితో పాటు అరసవల్లి ఈవో ప్రసాదరావు, శ్రీకూర్మం ఈవో వాసుదేవరావు, అరసవెల్లి ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ, పలువురు జిల్లా అధికారులు, ఇంటెలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్ అధికారులు ఉన్నారు.

## జనగణనపై ర్యాలీ




ఇచ్ఛాపురం, ఏప్రిల్ 26 ప్రభాతవార్త : జిల్లా కలెక్టర్ ఆదేశాలను అనుసరించి ఇచ్చాపురం పురపాలక సంఘం ఆధ్వర్యంలో జనగణన 2027లో భాగంగా ఇళ్ల లెక్కింపు మే 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్న సందర్భంగా ప్రజలు స్వీయ ఇళ్ల గణనలో పాల్గొనాలని, ఇళ్ల గణన చేయుటకు వచ్చే ఉద్యోగులను సహకరించాలని కోరుతూ మున్సిపల్ కార్యాలయం నుంచి బస్టాండ్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ఆర్పిలు పాల్గొన్నారు.

## వీవోఏలకు 5 జీ స్మార్టు ఫోన్లతో సులభతరం కానున్న సేవలు



సీతంపేట, ఏప్రిల్ 26 ప్రభాతవార్త : గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సేవలు మరింత పెంపొందించడానికి ప్రభుత్వం వివో ఏలకు 5జి స్మార్ట్ ఫోన్లుల మంజూరు చేశారు. వీటిని స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయక్రిష్ణ ఆదివారం వివోఏలకు 5జి స్మార్ట్ ఫోన్లుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా సంఘాల ఆర్థిక పరిపుష్టికి మరింత సేవలు విస్తృతం చేయాలని అన్నారు. గ్రామీణ అభివృద్ధిలో వివోఏలు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. టెక్నాలజీ ఉపయోగంతో సేవలు మరింత వేగంగా, పారదర్శకంగా అందించవచ్చని పేర్కొన్నారు. 5జి స్మార్ట్ ఫోన్లు ద్వారా ప్రభుత్వ పథకాల అమలు సులభతరం అవుతుందని ప్రభుత్వం గ్రామీణ స్థాయిలో డిజిటల్ సేవలను బలోపేతం చేయడానికి కట్టుబడి ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఏపిఎం కమల కుమారి. ఇమారక పవన్, తదితరులు పాల్గొన్నారు.

## ట్యాక్స్ సిస్టం ఎక్కడైతే సక్రమంగా ఉంటుందో ఆర్థిక వ్యవస్థ బలంగా ఉంటుంది : ఎమ్మెల్యే కూన



ఆముదాలవలస, ఏప్రిల్ 26 (ప్రభాతవార్త) : టాక్స్ సిస్టం ఎక్కడైతే సక్రమంగా ఉంటుందో ఆ దేశ ఆర్థిక వ్యవస్థ బలముగా తయారవు తుందని ఎమ్మెల్యే, పియుసి కమిటీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. శ్రీకాకుళం ఒక హోటల్లో ఏపీ ట్యాక్స్ ప్రాక్టీషనర్ అండ్ కన్సల్టెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యుల పదవీ బాధ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ టాక్స ప్రాక్టీషనర్లు మరియు కన్సల్టెంట్లు సమాజంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ విధానాలను ప్రజలకు చేరవేయ డంలో వారి సేవలు ఎంతో కీలకమని అన్నారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన కార్యవర్గం సభ్యులు నిబద్ధతతో పని చేసే సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. కన్సల్టెన్సీ ప్రభుత్వానికి, వాణిజ్య వ్యక్తులకు, వ్యాపారస్తులకు వారధిగా నిలుస్తారని అన్నారు. కన్సల్టెన్సీలు ప్రభుత్వానికి ఆదాయ వనరులు సమకూరుస్తారని ఆ సంఘానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా టాక్స్ కన్సల్టెన్సీలు, ప్రాక్టీషనర్లు ఎమ్మెల్యే రవికుమార్‌కు ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి కన్సల్టెన్సీలు, టాక్స్ ప్రాక్టీషనర్స్ హాజరయ్యారు. కార్యక్రమానికి అధ్యక్షులు బుడుమూరు శ్రీనివాసరావు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్, కూన ఆంజనేయులు, కె.వి.రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీవాసవీ మాత జయంత్యుత్సవాలు



కవిటి, ఏప్రిల్ 26 ప్రభాతవార్త : శ్రీ వాసవి జయంతి ఉత్సవాలను కవిటి మండలం కవిటి పంచాయతీ ఎర్ర గోవిందపుట్టుగ గ్రామంలో ఆదివారం ఘనంగా వేదపండితుల మంత్రోచ్ఛ రణల మధ్య జరిగాయి. ముందుగా మహిళలంతా చిత్రపటంతో పాటు కలశాలతో పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించి అనంతరం సామూహిక కుంకుమ పూజలు, హోమాలు మహిళలు నిర్వహించారు. అనంతరం కళింగ వైశ్య సంఘ భవనంను కళింగ కోమటి జిల్లా అధ్యక్షులు సానా షణ్ముఖరావు ప్రారంభోత్సవం చేశారు. కళింగ కోమటి భవనాన్ని ఆర్థిక సహకారం అందించిన ఈపరి జగన్నాధంకు ఘనంగా సన్మానించే కార్యక్రమాన్ని సానా షన్ముఖరావులతో పాటు పలువురు జిల్లా సోంపేట పట్టణ ప్రతినిధులు చేపట్టారు. అంతేకాక జిల్లా అధ్యక్షులు సానా షణ్ముఖరావును ఘనంగా సన్మానించే కార్యక్రమాన్ని చేపట్టారు. రమణమూర్తి, ధర్మారావు రమేష్‌తో పాటు పలువురు వైశ్య సంఘ ప్రతినిధులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## మద్యం సీసాలతో పట్టుబడిన నలుగురి అరెస్టు



రాజాం, ఏప్రిల్ 26 ప్రభాతవార్త : అనధికార మద్యం అమ్మకాలను నియంత్రించే చర్యలలో భాగంగా, రాజాం ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అనధికార మద్యం అమ్మకాలపై చేసిన దాడుల్లో భాగంగా, రాజాం మండలం డోలపేట గ్రామానికి చెందిన గోకవలస శేఖర్‌ను, గురువాం గ్రామానికి చెందిన కెంబూరి జగదీశ్ అను వ్యక్తిని, పొగిరి గ్రామానికి చెందిన జద్దు హరిబాబు మరియు సీరం అప్పలనాయుడులను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశామని ఎక్సైజ్ సీఐ ఆర్.జైభీమ్ తెలియజేస్తూ వారి వద్ద నుండి 192 మద్యం సీసాలను సీజ్ చేశామని తెలిపారు. ఈ సందర్భంగా సీఐ జైభీమ్ మాట్లాడుతూ బెల్ట్ షాపులు నిర్వహించడం అనేది చట్టరీత్యా నేరమని భవిష్యత్తులో ఇలాంటి నేరాలకు పాల్పడిన వారిపై మరింత కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

## అమ్మవారి ఆలయంలో పూజలు



ఇచ్ఛాపురం, ఏప్రిల్ 26 ప్రభాతవార్త : కొలిగాం గ్రామ దేవత ఘగడసుని అమ్మవారి ఆలయ ప్రతిష్ఠ సందర్భంగా ఇచ్ఛాపురం శాసన సభ్యులు ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, చీకటి ఎమ్మెల్యే మనో రంజన్ ధ్యాన్ సంత్ రాయ్ పూజల్లో పాల్గొన్నారు. దక్కత ఢిల్లీరావు పద్మనాదం, దక్కత కామేశ్వరరావు, బాబ్జీ, ఎం.సూర్యనారాయణ, మండల నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## రాజాం వెళ్లే దారిలో జంగిల్ క్లియరెన్స్



సంతకవిటి, ఏప్రిల్ 26 ప్రభాతవార్త : మండలంలో ఆదివారం ఎస్ఐ ఆర్.గోపాలరావు సంతకవిటి నుండి రాజాం వెళ్లే రహదారి రోడ్డు ఇరుపక్కల ముళ్ళతొప్పులు, పిచ్చి మొక్కలు ఎక్కువగా పేరుకుపోవడంతో వెళ్లే వాహనాలు కనిపించక వాహనదారులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారని ఎస్సై దగ్గరుండి జెసిబితో ఆ ముళ్ళ తప్పులను తొలగించడం జరిగింది. ఇప్పుడు వాహనదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉంది ఇలా చేయడం వల్ల ప్రయాణికులు చాలా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## జనగణన ... స్వీయగణనపై అవగాహనపై ర్యాలీ



పలాస, ఏప్రిల్ 26 ప్రభాతవార్త : పలాస కాశీబుగ్గ జంట పట్టణాలలో స్వీయ గణన ఏప్రిల్ 16 నుండి 30 తేదీ వరకు, జనగణన మే 1 నుండి 30 తేదీ వరకు జరిగే కార్యక్రమానికి అందరూ భాగస్వామ్యం కావాలని కమిషనర్ పలాస కాశీబుగ్గ పురపాలకసంఘం తరపున కాశీబుగ్గ పాత బస్టాండ్ నుండి మూడు రోడ్ల జంక్షన్ వరకు ర్యాలీ మానవహారం మరియు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబురావు మాట్లాడుతూ జనగణన వలన ప్రజల స్థితిగతులు, విద్యా, వైద్యం మౌలిక వసతులు, సామాజిక న్యాయం, జనాభా పెరుగుదల విషయాలు జనగణన వలన మనకు తెలుస్తుందని తెలిపారు. తెలుగుదేశం పట్టణ అధ్యక్షులు బడ్డ నాగరాజు మాట్లాడుతూ జనగణన వలన జనాభా వివరాలతో పాటు ప్రభుత్వ పథకాల ప్రణాళిక ఆర్థిక అభివృద్ధి, సామాజిక సమస్యలు గుర్తించడం భవిష్యత్తు కార్యచరణ ప్రణాళికకు ఇది ఉపయోగపడుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ చైర్మన్ పీరుకట్ల విటల్, ఏపీ ఎన్జీవో మరియు గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు బోనేల గోపాల్, మున్సిపల్ మేనేజర్ వి.నరసింహారావు, పార్టీ ప్రముఖులు గాలి కృష్ణారెడ్డి, శానిటరీ ఎన్విరాన్మెంట్ ఇన్స్పెక్టర్ ఉదయ శంకర్ పాత్రో, ఇరిగేషన్ అధికారి పొట్నూరు శ్రీనివాసరావు, మహేష్, జి ఎస్ డబ్ల్యూ సూపర్వైజర్ త్రినాథ్, కృష్ణారావు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఆస్పన మధుబాబు, గేదెల జగదీశ్వర రావు, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది గ్రీన్ ఆర్మీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## విక్రమపురం గ్రామ అభివృద్ధికి సహకరించండి



వీరఘట్టం, ఏప్రిల్ 26 ప్రభాతవార్త : విక్రమపురం గ్రామ అభివృద్ధికి అన్ని విధాలా సహకరించాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణను ఆ గ్రామ మాజీ సర్పంచ్, బిజెపి నాయకులు మాచర్ల మహేష్ కోరారు. ఈ మేరకు ఆదివారం వీరఘట్టం లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయనతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. తమ గ్రామానికి తన హయాంలో 74 కాలనీ ఇళ్లను మంజూరు చేయించానని, అయితే ఈ కాలనీకి విద్యుత్ సౌకర్యం లేదని, దీనితో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అలాగే తమ గ్రామంలో క్యాన్సర్ రోగులు రోజురోజుకు పెరుగుతున్నారని చెబుతూ నీటి శాంపిల్స్ ను చేపట్టే విధంగా ఆదేశాలు ఇవ్వాలని ఆయన కోరారు. తమ గ్రామంలో ఉన్న చెరువును అభివృద్ధి చేయాలని కోరుతూ చెరువు చుట్టూ రహదారి, కంచె, విద్యుత్ లైట్లు ఏర్పాటు చేస్తే ప్రజలకు ఎంతో అనుకూలంగా, ఆరోగ్యంగా ఉంటుందని ఆయన తెలిపారు. అదే విధంగా పాత కాలనీకి రహదారి ఏర్పాటు, స్మశాన వాటిక, నీటి సదుపాయంతో పాటు షెడ్లు, కాంపౌండ్ వాల్ ఏర్పాటు చేస్తే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అలాగే ప్రతి ఇంటింటికి కుళాయిలను ఏర్పాటు చేయడంతో పాటు, నాగావళి నదికి వెళ్లే రహదారిని మెరుగుపరచాలని విక్రమపురం గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తయారు చేసేందుకు తమ వంతు కృషి చేయాలని మహేష్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఇందుకు ఎమ్మెల్యే జయకృష్ణ సానుకూలంగా స్పందించి విక్రమపురం గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని, మీరు ముందుండి నడపాలని ఆయన మహేష్‌కు భరోసా ఇచ్చారు. ఈయనతో పాటు ఎంపీటీసీ ప్రతినిధి మజ్జి నవీన్, మాచర్ల మురళీకృష్ణలు కూడా ఉన్నారు.

## శరవేగంగా రోడ్డు నిర్మాణ పనులు



కోటబొమ్మాళి, ఏప్రిల్ 26 ప్రభాతవార్త : మండలంలోని గరీబుల గెడ్డ జంక్షన్ నుంచి సారవకోట మండలం జమచక్రం గ్రామం వరకు రోడ్డు నిర్మాణం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. శనివారం రూ.1.50 కోట్లు సీఆర్ఐఎఫ్ అంచనాల విలువతో ఈ నిర్మాణం జరుగుతుందని ఈ నెల 15వ తేదీన రాష్ట్ర వ్యవసాయశాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు రోడ్డుకు సంబంధించిన శిలా ఫలాకాన్ని ఆవిష్కరించారు. ఆయన ఆదేశాలు మేరకు పనులు జరుగుతున్నాయి. గత వైకాపా ప్రభుత్వంలో దంత గరీబుల గెడ్డ జంక్షన్ నుంచి దంత గ్రామం వరకు రోడ్డును యంత్రాలతో తవ్వి వదిలి వేయటం జరిగింది. గత రెండు సంవత్సరాలుగా వాహనదారులు పాదచారులు తీవ్ర ఇబ్బందులు గురయ్యారు. ఈ నేపథ్యంలో దంత గ్రామ ప్రజలు, జమచక్రం గ్రామ ప్రజలు విజ్ఞప్తి మేరకు మంత్రి అచ్చెన్నాయుడు నిధులు కేటాయించి రహదారి నిర్మించేందుకు కృషి చేశారు. రెండు మండలాలకు కలిపే ఈ రోడ్డు నిర్మాణం జరిగితే అందరికి రవాణ సౌకర్యం బాగుంటుందని ప్రజలు తెలుపుతున్నారు. అలాగే దంత గ్రామానికి మంత్రి ఇచ్చిన పలు హామీలు కూడా ప్రారంభానికి నోచుకున్నాయి.

## 28 నుంచి వేసవి శిక్షణ తరగతులు



పాతపట్నం, ఏప్రిల్ 26 ప్రభాతవార్త : స్థానిక శాఖా గ్రంథాలయంలో ఏప్రిల్ 28వ తేదీ నుండి జూన్ 6వ తేదీ వరకు, మొత్తం 40 రోజుల పాటు విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారిని డి.సాయమ్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేసవి శిబి రంలో విద్యార్థుల కోసం విభిన్నమైన కార్యక్రమాలను రూపొందించినట్లు ఆమె పేర్కొన్నారు. ముఖ్యంగా నిరంతరం పుస్తక పఠనం వల్ల విద్యార్థుల్లో తెలివితేటలు, జ్ఞాపకశక్తి పెరుగుతాయని, పద్యాలు, గేయాలు చదవడం ద్వారా విద్యార్థులు నీతిమంతులుగా, క్రమశిక్షణ గల వ్యక్తులుగా తీర్చిదిద్దబడతారని పేర్కొన్నారు. కథలు, నవలలు చదవడం వల్ల సమాజంలోని వివిధ వ్యక్తుల మనస్తత్వాలను అర్థం చేసుకునే శక్తి లభిస్తుందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని వాడుకొని విజ్ఞానవంతులు కావాలని సాయమ్మ పిలుపునిచ్చారు.

## గ్రామ దేవత ఉత్సవాలకు రూ.10 వేలు విరాళం



పాతపట్నం, ఏప్రిల్ 26 ప్రభాత వార్త: మండలంలోని పెద్దసీదిలో అత్యంత వైభవంగా జరుగుతున్న గ్రామ దేవత ఉత్సవాల్లో చత్రపతి శివాజీ యూత్ మరియు ఆజాద్ అసోసియేషన్ యూత్ సభ్యుల ఆహ్వానం మేరకు స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవింద రావు తనయుడు డాక్టర్ సాయి గణేష్ ఆదివారం పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పది వేల రూపాయల నగదును ఉత్సవ కమిటీ సభ్యులకు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులతో పాటు నాయకులు, కార్యకర్తలు , భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## శ్రీరామ మందిర నిర్మాణానికి ఎమ్మెల్యే ఎన్ఈఆర్ శంకుస్థాపన



రణస్థలం, ఏప్రిల్ 26 ప్రభాత వార్త: మండల కేంద్రం జె.ఆర్.పురం వెంకటేశ్వర కాలనీలో రామమందిరం నిర్మాణానికి ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ఆదివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ, డీజీఎం ఆనంద రావు, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గురజాపు రాము, గురుస్వామి దర్భముళ్ల నారాయణమూర్తి, తిప్పాన సతీష్, జోగా ఆది, హరి, చిన్న తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిని చూసి వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు



పలాస, ఏప్రిల్ 26 ప్రభాత వార్త : శ్రీకాకుళం జిల్లా పలాస నియోజకవర్గం వజ్రపుకొత్తూరు మండలం కొత్తపేట గ్రామంలో వైసీపీకి చెందిన సుమారు 100 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన 100 కుటుంబాలకు చెందిన సభ్యులకు పలాస టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఆకర్షితులై నేడు 100 కుటుంబాలు చేరాయని ముమ్మందు నియోజకవర్గంలో మరింత మంది తమ పార్టీలో చేరబోతున్నట్లు గౌతు శిరీష జోష్యం చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# శ్రీకాకుళం వార్త



## తలవరంలో ఘనంగా ఆలయ ఉత్సవాలు ప్రారంభం



వీరఘట్టం, ఏప్రిల్ 26 ప్రభాతవార్త : తలవరంలో శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల జగన్నాథ స్వామి ఆలయ ఉత్సవాలు ఆదివారం నుండి ఘనంగా ప్రారంభమయ్యాయి. 300 సంవత్సరాల క్రితం నిర్మించి జీర్ణావస్థకు చేరుకున్న ఈ ఆలయాన్ని అందరి సహకారంతో నూతనంగా నిర్మించారు. ఆదివారం భద్రాది జిల్లా శ్రీవాన్ విద్వాన్ కందాళ సింహాద్రి ఆనంద్ కుమారా చార్యులు ఆధ్వర్యంలో నూతన విగ్రహాలను ఊరేగించారు. అనంతరం భగవదాజ్ఞ, స్వస్తివాచనం, విశ్వక్షేన పూజ, వాసుదేవ పుణ్యా వచనం, రక్షాబంధనం, మృత్స గవ్య ప్రార్ధన, వాస్తు హోమం, పద్మాగ్ని కరణం, తీర్థ ప్రసాద గోష్టి కార్యక్రమాలను అత్యంత ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాలు ఈనెల 29వ తేదీ వరకు కొనసాగనున్నాయి. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేత



కంచిలి, ఏప్రిల్ 26 ప్రభాతవార్త : ఇచ్ఛాపురం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ బాబు సహకారంతో మాదిన రామారావు ద్వారా ఎంఎస్ పల్లి గ్రామపంచాయతీలో గల రాగుపురం గ్రామనికి చెందిన బతకల గంగయ్య అనారోగ్యం వలన హాస్పిటల్‌లో చికిత్స తీసుకొని రావడం జరిగింది. అతని ఆర్థిక పరిస్థితిని మరియు ఆరోగ్యరీత్యా వారికి కూటమి ప్రభుత్వం ఆదివారం 35వేల 101 రూపాయలు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి అందించడం జరిగింది. కార్యక్రమంలో భాస్కర్ రెడ్డి, కిషోర్ కుమార్ పాడి, బుడ్డెపు శ్రీరాములు రెడ్డి, కొత్తకోట శ్రీకాంత్ పైల రామారావు (కంచిలి మండలం తెలుగుదేశం పార్టీ సెక్రెటరీ), సోమేశ్ తిరుమల రావు, ప్రసాద్ ధర్మ, మద్దిల భాస్కర్ మరియు రాగుపురం గ్రామానికి చెందిన లోహిదాస్ రెడ్డి, హరికృష్ణ గంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఈఆర్‌ను కలిసిన రెవెన్యూ సర్వీసుల సంఘం జిల్లా నూతన కమిటీ



రణస్థలం, ఏప్రిల్ 26 ప్రభాతవార్త : నూతనంగా ఏర్పాటు కాబడిన ఏపీ రెవెన్యూ సర్వీసుల సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఆదివారం ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావును తన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించి మెమెంటోను అందజేశారు. రెవెన్యూ ఉద్యోగులకు సంబంధించిన వివిధ రాయి తీలు, సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు తమ తరపున కృషి చేయాలని సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యే ఎన్ఇఆర్‌కు వారు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బి.వి.వి.ఎన్. రాజు, సహా అధ్యక్షులు ఎస్. గణపతిరావు, కార్యదర్శి డి.సోనీకిరణ్, ట్రెజరర్ మురళీధర్ నాయక్, జాయింట్ సెక్రటరీ కె.రాధిక, బి.సంతోష్ కుమార్, గౌరీ శంకర్, ఈసీ సభ్యులు శరత్‌బాబు, దామోదర్, ఉప తహసీల్దార్ దర్భముళ్ల నారాయణమూర్తి, వీఆర్వో సంఘం జిల్లా అధ్యక్షులు డి.రాజేష్, ట్రెజరర్ గంగు దిల్లేశ్వరరావు, గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా కార్యదర్శి యజ్జల రామారావు, ట్రెజరర్ త్రినాథ్, తిరుపతిపాలెం సర్పంచ్ ఆకుల రవికుమర్ పాల్గొన్నారు.

## విశ్రాంత ఉపాధ్యాయురాలు మృతి



కోటబొమ్మాళి, ఏప్రిల్ 26 ప్రభాతవార్త : మండలం చిన్న హరిచంద్రపురం గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయురాలు ఉప్పాడ విశాలాక్ష్మి (76) ఆదివారం మధ్యాహ్నం మృతి చెందారు. ఆమె ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ శ్రీకాకుళంలోని ఒక ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందారు. అయితే ఆరోగ్యం మెరుగుపడుతుందన్న తరుణంలో ఆదివారం మధ్యాహ్నం నరసన్నపేటలో తన పెద్ద కుమార్తె శశికళ ఇంట్లో మృతి చెందారు. తన భర్త బాల భాస్కరరావు ఉపాధ్యాయులుగా ఉద్యోగ విరమణ అనంతరం కొన్నేళ్ల క్రితమే మృతి చెందారు. వీరికి ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు రవి ప్రసాద్ ఒక రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. చిన్న కుమారుడు కనకరాజు తన స్వగ్రామంలో హరిచంద్రపురంలో శ్రీ పంచదామ క్షేత్ర ధర్మకర్తగా వ్యవహరిస్తున్నారు. ఈమె మృతి పట్ల పలువురు గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతురాలు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## మన ఊరి బడిని కాపాడుకుందాం




కంచిలి, ఏప్రిల్ 26 ప్రభాతవార్త: మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పురుషోత్తపురం నందు మన ఊరి బడిని కాపాడుకుందాం, విద్యార్థుల నమోదు మొదటి రోజు కార్యక్రమ నిర్వహణలో భాగంగా ఆదివారం ఎంఈఓ 1 సప్పటి శివరాం ప్రసాద్, ఎంఈఓ 2 చిట్టిబాబుల ఆధ్వర్యంలో పాఠశాల హెచ్ఎం శారద మరియు ఉపాధ్యాయ సిబ్బంది నల్లాన రవి, సిఆర్‌పి శ్రీలక్ష్మి, అంగన్వాడీ టీచర్ వంకల యశోద, ఆయా గస్య ఉమావతి, మాజీ ఉప సర్పంచ్ వంకల ఉమాపతి. యూత్ మెంబర్స్ బొట్ట వేణు, లండ ఢిల్లీ, బద్రి మాధవరావు,వినోద్ మరియు తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థుల నమోదు కార్యక్రమం కొనసాగింది. కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్నటువంటి విద్యార్థిని విద్యార్థులకు ఇంటికి వెళ్లి ఆయా తల్లిదండ్రులతో మాట్లాడుతూ వారి పిల్లల చదువు పట్ల భరోసా ఇస్తూ ప్రేరణ కల్పిస్తూ ప్రైవేట్ పాఠశాల పిల్లలను మా పాఠశాలలో చేర్పించిన మండల విద్యాశాఖ అధికారులకు ధన్యవాదములు తెలిపారు.

## హెల్మెట్లను పాత్రికేయులకు ఇవ్వాలి




కోటబొమ్మాళి, ఏప్రిల్ 26 ప్రభాతవార్త : తాజాగా జిల్లాలో పోలీస్ శాఖ ప్రారంభించిన హెల్మెట్ బ్యాంక్ ద్వారా జిల్లాలో గల గుర్తింపు కలిగిన పాత్రికేయులకు కూడా ఉచితంగా పంపిణీ చేయాలని పలువురు సీనియర్ పాత్రికేయులు అభిప్రాయం వ్యక్తం చేశారు. నిత్యం రోడ్డుపైనే జీవితం గడుపుతున్న పాత్రికేయులకు కూడా ఎంతో అవసరమైన ఈ హెల్మెట్‌లను ఈ బ్యాంకు ద్వారా ఉచితంగా అందజే యాలని, వాటిని పాత్రికేయులకు అందజేయడం ద్వారా ప్రచారంలో ఒక భాగం అవుతుందని వారు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. దీనిని పరిగణనలోకి తీసుకుని పోలీసు ఉన్నత అధికారులు స్పందించాలని కోరారు. ప్రమాదాలు ఎవరికీ చెప్పి రావని, మీతో సమానంగా ఎండా, వానల్లో మగ్గుతున్న మాకు కూడా రక్షణ ఎంతైనా అవసరమని వారు స్పష్టం చేశారు.

## టూరిస్టుల కోసం ప్రత్యేక ఎయిర్ రాయితీలు

ఆమదాలవలస, ఏప్రిల్ 26 (ప్రభాతవార్త): టూరిస్టుల కోసం ప్రత్యేక రాయితీలతో కూడిన ఎయిర్ ప్యాకేజ్ కార్యక్రమం చేపడుతున్నట్లు ఐఆర్సిటిసి అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ లిమిటెడ్ వారిచే ఐదు రాత్రులు ఆరు రోజులు టూర్ ప్యాకేజీతో ప్రత్యేక రాయితీతో శంకర దేవి శక్తిపీఠంతో శ్రీలంక రామాయణం కొలంబో, దంబుల్ల, క్యాండీ, నువర్రేలియా, తదితర పుణ్యక్షేత్రాలను వచ్చేనెల 14 నుండి 19వ తేదీ వరకు ఒక్కొక్కరికి రూ.85696లు ఖర్చవుతుందని, ఈ ఎయిర్ విశాఖపట్నం 14వ తేదీ బయలుదేరుతుందని తెలిపారు. అదేవిధంగా మరో ఎయిర్ ప్యాకేజీతో బద్రీనాథ్, బార్కోట్, గంగోత్రి, కాశి, హరిద్వార్, కేదార్నాథ్, యమునోత్రి, తదితర పుణ్యక్షేత్రాలు జూన్ 12 బయలుదేరుతుందని, 12 రోజులు 11 రాత్రులకు గాను ఒక్కొక్కరికి రూ.98765లు ఖర్చవుతుందని ఈ ప్యాకేజ్ యాత్రికులు అన్ని సౌకర్యాలు కల్పించబడునని,బయలుదేరి నుండి తిరుగు ఇంటికి వచ్చిన వరకు మొత్తం ఐఆర్సిటిసి అధికారులు చూసుకుంటురని తెలిపారు. యాత్రికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు. మరిన్ని వివరముల కోసం సాయి ప్రసాద్ 9281495847,9281030748. సంప్రదించాలని ఓ ప్రకటనలో తెలిపారు.

27-4-9th cheli.qxd:27-4-9th cheli.qxd 1/1/02 6:35 AM Page 1



## గర్భిణులు ప్రయాణంలో పదనిసలు

గర్భిణీలు ప్రయాణం చేయొచ్చా చేయకూడదా..అని తెలుసుకోవాలంటే వారికి హై రిస్క్ కలిగించే అంశాలలో జాగ్రత్తలు తీసుకుంటూ ఎంతదూరమైనా ప్రయాణించ వచ్చు అనే చెప్పే వారుంటారు. అందుకే ఎవరైనా తాము కేరీయింగ్ అని తెలుసుకోగానే కేరింగ్ మీద దృష్టి పెట్టాలి. ముందుగా రిస్క్ సంగతులు తెలుసుకుంటే జాగ్రత్తలు తీసుకోవ డం ఎంతో తేలిక. దూరప్రయాణాలు అలసటను కలిగిస్తాయి. కనుక వాటి జోలికి పోకుండా ఉంటేనే ఉత్తమం. గర్భిణులు ఏదైనా చేయకూడదు అని తెలిస్తే చేయకూడదు. అంతే. ఇలాంటి మహిళలు ప్రయాణ సమయంలో ఎన్నో జాగ్రత్తలు తీసుకోవడమే ముఖ్యం.



ఆరోగ్యానికి మంచిది. ఇలాంటి సమయంలో మిస్ క్యారేజ్ అయ్యే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని డాక్టర్లే సలహా ఇస్తుంటారు. ఈ సమయంలో తీసుకునే జాగ్రత్తలు అన్ని ప్రెగ్నెన్సీ కి రిస్కును తప్పిస్తాయి. కారులో ప్రయాణం చేసినప్పుడు సీట్ బెల్ట్ పెట్టుకోవాలను కుంటాం. పొట్ట పైన పెట్టుకుంటే ఇబ్బందిగా ఉంటుంది. అందుకే పొట్టకు కింద భాగంలో పెట్టుకో వచ్చు. లాంగ్ టూర్‌లో వెళ్తుంటే మీ డాక్టర్ సలహా మీదకే వెళ్లాలి. కూడా మినరల్ వాటర్ ఉంచుకోండి. ఇతర పానీయాలని తీసుకెళ్లొద్దు. కూర్చోడానికి వీలు కల్పించే చిన్నదిండు కూడా ఉంచుకోండి. మందులు డాక్టర్ చెప్పినట్లు వాడాలి. కొద్దిగా విరామంతో స్నాక్స్ తినొచ్చు. శరీరంలో ఎనర్జీ లెవెల్స్ నిలిచి ఉండేటట్లుగా వదులుగా ఉండే డ్రెస్ మాత్రం వేసుకోవాలి. శరీరంలో రక్తప్రసన్న సరిగా ఉండేటట్లు చూసుకోవడం మంచిది. ఇంట్లోనే కదా! అని పెద్ద పెద్ద బరువులెత్తడం చేయద్దు. ఐస్క్రీంలు తినరాదు.

అరటిపండు, బత్తాయి, ఆరెంజ్, సపోటా వంటివి తింటే పెద్దగా ఇబ్బంది ఏమి ఉండదు. స్కూటర్ మీద అసలు ప్రయాణం చేయకూడదు ఎందుకంటే మనకున్న రోడ్లు వాటి పరిస్థితిని బట్టి ఎత్తు పల్లాల్లో , స్పీడ్ బ్రేకర్లు వచ్చినప్పుడు కుదుపులు ఎక్కువవుతా యి, అవన్నీ మనం గుర్తు పెట్టుకోవాల్సిందే ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటే అంత ఆరోగ్య కరం లేకపోతే, చివర్లో ప్రసవ సమయంలో చాలా ఇబ్బంది పడతారు. ఆరోగ్యం కూడా ముఖ్యమే కదా !అందుకే గర్భిణులు ప్రయాణ సమయంలో కడుపులోని బిడ్డకు ఎలాంటి అసౌకర్యం కలుగ నీయద్దు.



**చిట్కా:** ధనియాలు వాడేటప్పుడు వండే ముందు వాటిని స్వల్పంగా వేయించుకుంటే మంచి సువాసన, రుచి వస్తాయి. తర్వాత వాటిని పొడి చేసుకుని కూరల్లో లేదా చట్నీల్లో వేస్తే రుచి మరింత పెరుగుతుంది.

## సౌందర్యానికి శతాయుష్షు

అందమే ఆనందం! ఆనందమే జీవన మకరందం..ఎంత హాయిగా ఉందో కదూ! అందుకేనేమో అకతివలందరూ అంతో ఇంతో సౌందర్య పోషణ వైపు దృష్టి సారిస్తారు. చర్మం రంగుతో పనిలేదు. పుట్టుకతో వచ్చిన శరీర ఛాయను ఎవరు మార్చగలరు! ఎలా మార్చగలరు. దాని కోసం ఎన్నిచర్మ సౌందర్య లోషన్ లు రాసినా, లేపనాలు పామినా అదంతా తాత్కాలిక మెరుపుల్ని ఇస్తాయని కానీ అసలు సిసలు సింగారాన్ని ఇవ్వవు.

మెరిసే చర్మాన్ని మరింత మెల్లకువలతో శ్రద్ధ చేస్తే అదే అద్దంలా మెరిసిపోతుంది. నిగారింపుతో కళకళలాడుతుంది. మార్కెట్లో సౌందర్య సాధనాలు ఎన్నైనా ఉండచ్చు. చర్మ సౌందర్యం కాపాడుకోవటానికి ఎన్నో రసాయనిక లేపనాలు ఉత్పత్తులు వినియోగిస్తుంటారు. అవన్నీ జిగేల్ మనిపించే చర్మ సౌందర్యాన్ని ఇవ్వనూవచ్చు. ఇవ్వక పోనూ వచ్చు. ఒక్కోసారి చర్మ కాంతులకు హాని కూడా కలిగించ వచ్చు.

కాంతివంత మైన చర్మ ఛాయ కోసం కుంకుమ పువ్వు, రోజ్ వాటర్, బాదం, చందనం తరచూ వాడటం మనకు తెలిసిందే. వీటి కన్నా నిగారింపు కలిగించే సాధనాలు ఇంకేవో ఉంటాయనే ఆలోచన పెట్టుకోరాదు. అలా అనుకుంటే బోలెడంత ఖర్చు చేసినా చర్మ సౌందర్యానికి మేలిమి కాంతులు మచ్చుకైనా కనిపించక పోవచ్చు.



**బాదం** : బాదంలో విటమిన్ ఇ, బి, వంటి సహజ పోషకాలు ఉంటాయి. చర్మానికి సహజ పోషకాలతో రక్షణ కల్పిస్తుంది. బాదంలో చర్మాన్ని పొడి బారకుండా ఉంచే యాంటీ ఆక్సిడెంట్లు మేలు చేస్తాయి. తగిన పోషకాలు అందుతాయి కానుక శరీర తత్వానికి బాదం రక్షణ కల్పిస్తాయి.

**రోజ్ వాటర్** : రోజ్ వాటర్‌లో తైల తత్వం ఉండదు. అంటే చమురు ఉండదు. కనుక అన్నిరకాల చర్మాలకు మేలు కలిగించే తత్వం ఉంటుంది. చర్మాన్ని క్లీన్సింగ్ తో పాటు మాయిశ్చరైజింగ్ చేసి తేమను ఉండే టట్లు చేస్తుంది. చల్లదనాన్ని కలిగిస్తుందన్న మాట. దీన్ని వాడిన చర్మానికి గులాబీల



ఘుమఘుమల సౌరభాలు వెదజల్లుతుంది.

**చందనం :** సుగంధాల మేళవింపు గంధం చర్మానికి చల్లదనాన్ని ఇవ్వడంతో పాటు మొటిమల్ని, మచ్చల్ని తొలగించే , చర్మానికి నిగారింపునిచ్చే గుణం ఉంటుంది. అందుకే ఇది యాంటీ సెప్టిక్ గా పని చేస్తుంది.

మరింత నిగారింపు కోసం ఆడవాళ్లు రెండు స్పూన్ ల చందనంలో ఒక చెంచాడు రోజ్



వాటర్ కలుపుకుని ఫేస్ క్రీమ్‌లా వాడుతుం టా రు. అది మంచి ఫలితాలనే ఇచ్చింది కనుక ఎక్కువ మంది మహిళలు ఈ చిట్కాలను వాడుతుంటారు. అలాంటి వారి ముఖచయను చూస్తే నిగారింపు ఎక్కువగానే ఉంటుంది.

**కుంకుమ పువ్వు:** ఇందులో బ్యాక్టీరియా ను తొలగించేతత్వం ఉంటుంది. ప్రాచీనకాలం నుంచే కుంకుమ పువ్వు వినియోగంలో ఉంది.



చర్మంలో కాంతిపెరగడానికి దీనిని వాడతారు. సహజ సిద్ధమైన యాంటీ బాక్టీరియా ఎక్స్ ఇటింగ్ పదార్థాలు ఇందులో ఉండడంతో చర్మంపై నుండే బ్యాక్టీరియాను తొలగించి చర్మంపైఏర్పడిన మలినాలను శుభ్రపరచి కాంతి వంతం చేస్తుంది. కనుమ పువ్వును పాలల్లో సమ్మిళితం చేసి ముఖానికి రాసుకుంటే వచ్చే నిగారింపును ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిందే!

## సత్యస్వరం

కౌరవసభకు రమ్మని పిలువనంపిన వారితో ఏకవస్త్రయైన ద్రౌపది 'తన్నోడి నన్నోడెనా! నన్నోడి తన్నోడినా' అని ధర్మానందనుడిని అడిగి చెప్పమంది. కానీ కురువృద్ధ బాంధవులనేకురు చెప్పలేని ప్రశ్నకు కౌరవ మధ్యముడు వికర్ణుడు మాత్రమే జవాబు చెప్పగలిగిన ధర్మ వాక్యమిది. మహాభారతంలో వికర్ణుడు కౌరవ మధ్యముడు. వికర్ణుడు చిన్నప్పటి నుంచే న్యాయం, నిజాయితీ పట్ల ఆకర్షితుడయ్యాడు. ఇతర కౌరవులలా అహంకారం, దుర్బుద్ధి అతనిలో ఎక్కువగా ఉండేది కాదు. భీష్మా, ద్రోణా వంటి గురువుల వద్ద విద్యాభ్యాసం చేస్తూ, యుద్ధకళల్లో నైపుణ్యం సంపాదించాడు. అయితే అతని గొప్పతనం కేవలం ఆయుధ విద్యలోకాక, ధర్మాన్ని గ్రహించే గుణంలో ఉండేది. అన్న దుర్యోధనుడు ప్రభావంలో పెరిగినా, అతని మనసులో ధర్మం పట్ల గౌరవం ఎప్పుడూ తగ్గలేదు. మహాభారతంలోని అత్యంత కీలక ఘట్టమైన పాశా క్రీడలో ధర్మవాక్యం సమయంలో వికర్ణుని నిజమైన స్వభావం వెలుగులోకి వచ్చింది. పాశా ఆటలో యుధిష్ఠిరుడు తన సర్వస్వాన్ని కోల్పోయి, చివరకు తన భార్య ద్రౌపదినుు కూడా పణంగా పెట్టాడు. ద్రౌపదిని సభకు లాగించి అవమానించగా, అందరూ మోనంగా ఉండిపోయారు. కర్ణ, దుర్యోధనుడు వంటి వారు ఆమెను అవమానించడానికి మాటలతో గుచ్చుతుండగా, వికర్ణుడు మాత్రం ఆ అన్యాయాన్ని తట్టుకోలేక లేచి ఇలా అన్నాడు. ధర్మానికి విరుద్ధంగా జరిగిన ఈ కార్యం సరికాదు. యుధిష్ఠిరుడు ముందుగా తనను తాను కోల్పోయాడు. ఆ తర్వాత ద్రౌపదిని ఎలా పణంగా పెట్టగలడు? ఆమెను ఈ విధంగా అవమానించడం మహాపాపం." అతని మాటలు సభలో ఒక సత్య స్వరంలా వినిపించాయి. కానీ అతని వాక్యాలను ఎవరూ పట్టించుకోలేదు. అయినప్పటికీ, వికర్ణుడు తన ధర్మాన్ని వదలకుండా నిలబడ్డాడు.

చివరకు కురుక్షేత్ర యుద్ధం ప్రారంభమైంది. వికర్ణుడు ధర్మం పాండవుల వైపునే ఉందని తెలిసినా, తన కుటుంబాన్ని విడిచి పెట్టలేక కౌరవుల పక్షాన యుద్ధంలో పాల్గొన్నాడు. యుద్ధంలో అతను ధైర్యంగా భీముడుతో పోరాడాడు. భీముడు వికర్ణుని ధర్మబుద్ధిని గౌరవిస్తూ వికర్ణా! నీవు నీ అన్నదమ్ములలో ధర్మవంతుడివి. నిన్ను సంహరించడం నాకు ఇష్టం లేదు. కానీ యుద్ధ ధర్మం వల్ల నేను ఇది చేయాల్సి వస్తోంది." వికర్ణుడు సమాధానంగా, "నేను కూడా నా కర్తవ్యాన్ని విడువలేను" అని చెప్పి వీరోచితంగా యుద్ధం చేశాడు. ధర్మం ఎప్పుడూ గెలుస్తుంది. కానీ ధర్మం కోసం నిలబడిన ప్రతి వ్యక్తి గెలవకపోవచ్చు. చివరకు భీముని చేతిలో వీరమరణం పొందాడు.

## జంక్ ఫుడ్‌లు మానేదెలా!

మా చిన్నోడు జంక్ ఫుడ్ అంటే పడి చస్తాడనుకోండి. వాడు చేత మాన్పించాలంటే నా వలన కావడం లేదన్న సునీతకు, 'మా వాడు మరీనండి, మాట వినడు గాక వినడు.... జంక్ ఫుడ్ ఆరోగ్యానికి ప్రమాదం తెచ్చి పెడుతుందన్నా ఖాతరు చేయడు అంటోంది ఎల్లార్మ. వీళ్లిద్దరూ ఇరుగు పొరుగమ్మలు... ఇదండీ వీళ్ళ ప్రియ భాషణం. ఇద్దరిదీ ఒకే గోడు. ఎవరికీ చెప్పుకోలేని వ్యవహారం. ఎందుకంటే అందరూ ఇళ్లలోనూ ఇదే గోల.



ఈ కాలపు పిల్లలంటే ..జంక్ ఫుడ్ అంటే పడి చస్తున్నారు. ఎవరికి చెబితే ఎవరు వింటారు. మరి. పైగా వాళ్ళకి ఎంత తినాలో ,ఎంత తినకూడదో తెలియడం లేదు. రోలు వెళ్ళి మద్దేలతో మొర పెట్టుకోవడం అంటే ఇదే మరి. ఇలాంటి సందర్భాల్లో వాళ్లను జంక్‌ఫుడ్ నుంచి బయట పడేసేం దుకు ఏవైనా ఆలోచనలుంటే చూద్దాం.

పిల్లలకు మంచి బాక్సులో పోషకాహారం ఇవ్వడం ముఖ్యం. వాటిలో తాజా పళ్ళు



ఉంటే మరీ మంచిది. కార్బోహైడేట్స్ , ప్రోటీన్స్ ఉన్న ఆహారం స్కూల్ కు తప్పనిసరిగా ఇవ్వాలి. బ్రెడ్ అన్నం లేదా పాస్తా వంటి వాటిని రొటీన్ ఆహారానికి ప్రత్యామ్నాయంగా ఇస్తుందని. తక్కువ ఫ్యాట్ ఉన్న యోగాట్ లేదా చీజ్ , కొవ్వు తీసిన పాలు ఇవ్వడమే మేలు. పచ్చి కూరగాయ ముక్కలు కూడా పెట్టొచ్చు. లంచ్‌కి ముందు సూపులు తాగితే ఆ తర్వాత తినే భోజనం పరిమాణంలో తగ్గుతుందని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి . కడుపులో ఖాళీ లేదనే మిషతో డైట్ బ్యాలెన్స్ చేసుకునే అవకాశం ఉండచ్చు. చిన్న వయసులో కూడా గ్రీన్ టీలు క్యాలరీలు కరిగించి శరీరంను అదుపులో ఉంచుతుంది.

కనుక వాటిని అలవాటు చేయవచ్చు. చిన్నప్పటినుంచి ఫ్యాట్ పెరగని ఆహార పదార్థాలను ఎంచుకుని మరీ ఇవ్వాలి. చిన్న పిల్లలకు సాఫ్ట్ డ్రింకు ,స్వీట్ లు, ఫాస్ట్ ఫుడ్, చిప్స్, పాన్ కేక్స్ , హై ఫ్యాట్ పాలు తప్పనిసరిగా తీసేయాలి. వాటిని దరికి రాకుండా ఎక్కువ రోజులు దూరం పెడితే సరి. కొవ్వు పదార్థాలు బాగా తగ్గించాలి ఊబకాయం వచ్చిందంటే తగ్గడం బహుకష్టం సుమండీ! తాజాగా పళ్ళు, కూరగాయలు మంచిది. మంచి నీళ్ల ఎక్కువగా తాగటం ప్రస్తుత కాలంలో చాలా మంచిది. ఇవన్నీ క్రమం తప్పకుండా ఆహార క్రమబద్ధం చేసుకుంటే మరీ మంచింది. అంతే కాదు ఆహార దినుసుల కారణంగా బెల్లీ ఫ్యాట్ పెరగ కుండా చూసుకోవడమూ ముఖ్యమే.

## వేడి నీటితో స్నానం.. జాగ్రత్త సుమీ..



పిల్లలు వేడి నీటితో స్నానం చేసేటప్పుడు ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాలి. వేడినీళ్లలో చేయి పెట్టినా, శరీరం మీద నీళ్ల పడ్డా బొబ్బలు ఎక్కడం ఖాయం. అందుకే జాగ్రత్తలు తీసుకోవాలి. రాము బకెట్లో వేడి నీటిని తీసుకొచ్చా డు. వేడి నీరు జాగ్రత్తగా ఉపయోగించా లని మొదట అతను బకెట్ను నెమ్మదిగా మోశాడు, ఎక్కడైనా చిందరబిందర కాకుండా చూసుకు న్నాడు. తర్వాత తన చేతిని కొంచెం నీటిలో ముంచి వేడి ఎక్కువగా ఉందో లేదో పరీక్షిం చాడు. నీరు చాలా వేడిగా ఉందని గమనించి, కొద్దిగా చల్లని నీటిని కలిపాడు. స్నానం చేసేటప్పుడు కూడా జాగ్రత్తగా నీటిని వాడాడు, ఒక్కసారిగా పోయ కుండా మెల్లగా పోశాడు. అలాగే బకెట్ను జారి పడకుండా ఒక మూలలో సరిగ్గా ఉంచాడు. స్నానం అయిన తర్వాత నేల తడిగా ఉందని గుర్తించి, జారి పడకుండా దాన్ని తుడిచాడు. వేడినీటితో ఎప్పుడూ జాగ్రత్తగా ఉండాలని మరింతగా గుర్తుపెట్టుకున్నాడు.

## బాలుగా బ్రహ్మాజీ సందడి

టాలీవుడ్ సెన్సేషనల్ డైరెక్టర్ అజయ్ భూపతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న లేటెస్ట్ మూవీ శ్రీనివాస మంగాపురం. ఈ చిత్రంతో సూపర్ స్టార్ కృష్ణ మనవడు, ఘట్టమనేని రమేష్ బాబు తనయుడు జయ కృష్ణ ఘట్టమనేని హీరోగా పరిచయమవుతున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ చిత్ర టీజర్, పోస్టర్లు సోషల్ మీడియాలో భారీ అంచనాలను పెంచేశాయి. తాజాగా ఈ మూవీ నుంచి మరో క్రేజీ అప్‌డేట్ వచ్చింది. ఈ చిత్రంలో



వెర్సటైల్ యాక్టర్ బ్రహ్మాజీ ఒక కీలక పాత్రను పోషిస్తున్నారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా చిత్ర బృందం బాలు పాత్రలో ఆయన ఫస్ట్ లుక్‌ను విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో బ్రహ్మాజీ మైక్ పట్టుకొని, ఎంతో ఉత్సాహంగా, హ్యాపీ వైబ్‌లో కనిపిస్తున్నారు. ఈ బాలు పాత్ర థియేటర్లలో ప్రేక్షకులకు ఫుల్ లెవల్ ఎంటర్‌టైన్‌మెంట్ అందించబోతుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేసింది. బాలీవుడ్ స్టార్ కిడ్, రవీనా టాండన్ కుమార్తె రాషా తడాని ఈ చిత్రంతో టాలీవుడ్ ఎంట్రీ ఇస్తుండగా, కలెక్షన్ కింగ్ మోహన్ బాబు ఒక పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. అగ్ర నిర్మాత అశ్విని దత్ సమర్పణలో, పి. కిరణ్ (జెమినీ కిరణ్) ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సంగీతం: జి.వి. ప్రకాశ్ కుమార్‌సినిమాటోగ్రఫీ: జయకృష్ణ బిఎడిటింగ్: మాధవ్ కుమార్ గుల్లపాటిప్రొడక్షన్ డిజైన్: సాహి సురేష్‌యాక్షన్: రియల్ సతీష్‌ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ చిత్రం, కమర్షియల్ ఎలిమెంట్స్‌తో పాటు అజయ్ భూపతి మార్క్ ఇంటెన్సిటీతో 2026లో ప్రేక్షకుల ముందుకు రానుంది.

## పోలీస్ ఆఫీసర్ ప్రతాపం

వైవిధ్యమైన కథాంశంతో, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో రూపొందుతున్న చిత్రం కామాఖ్య. అభినయ కృష్ణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా నుంచి తాజాగా ఒక క్రేజీ అప్‌డేట్ వచ్చింది. ఈ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్న వెర్సటైల్ యాక్టర్ సముద్రఖని ఫస్ట్ లుక్‌ను చిత్ర యూనిట్ ఆదివారం విడుదల చేసింది.



సముద్రఖని పుట్టినరోజును పురస్కరించుకుని ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ మేకర్స్ ఈ లుక్‌ను లాంచ్ చేశారు. ఇందులో ఆయన తిరుపతి అనే పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించబోతున్నారు. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో ఆయన ప్రెజెన్స్ చాలా ఇంపాక్ట్‌ఫుల్‌గా ఉంది. బాధ్యతాయుతమైన, గంభీరమైన పోలీస్ అధికారిగా ఆయన పాత్ర ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుందని తెలుస్తోంది. మై ఫిల్మ్ ప్రొడక్షన్స్ శిజుగి లిగిదీ బ్యానర్‌పై వడ్డేపల్లి శ్రీ వాణీనాథ్, యశ్వంత్ రాజ్ అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్, టీజర్ మరియు ఫస్ట్ సింగిల్ కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. ఇప్పుడు సముద్రఖని లుక్ కూడా సినిమాపై అంచనాలను మరింత పెంచింది. సమైరా, సముద్రఖని, అభిరామి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి గ్యాని సంగీతాన్ని అందిస్తున్నారు. రమేష్ కుశేందర్ రెడ్డి ఛాయాగ్రహణం బాధ్యతలు నిర్వహించగా, వరప్రసాద్ ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. ఆనంద్, శరణ్య ప్రదీప్, వైష్ణవ్, ధనరాజ్, రాఘవ, ఐశ్వర్య తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ పనులను జరుపుకుంటోంది.



## డైరెక్టర్‌కు చుక్కలు..

మాస్ యాక్షన్ హీరో విశాల్ తన కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకమైన 99వ చిత్రం మకుటంతో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతున్నారు. సూపర్ గుడ్ ఫిల్మ్స్ బ్యానర్‌లో ఆర్.బి. చౌదరి నిర్మాణంలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి విశాల్ స్వయంగా దర్శకత్వం వహిస్తుండటం విశేషం. తాజాగా ఈ సినిమా నుండి ఒక ఇంట్రెస్టింగ్ అప్డేట్ ఇచ్చింది చిత్ర యూనిట్. గతంలో సంగీతం, మదగజరాజా వంటి చిత్రాల్లో విశాల్‌తో జతకట్టిన సీనియర్ నటి అంజలి, ఇప్పుడు మకుటంలో హీరోయిన్‌గా ఫిక్స్ అయ్యారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ విడుదల చేసిన ఒక కాన్సెప్ట్ వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ఈ వీడియోలో దర్శకుడిగా మారిన విశాల్, అంజలికి కథ చెప్పే సన్నివేశం చాలా సరదాగా సాగింది. ముందు కథ చెప్పండి డైరెక్టర్ గారు.. అని అంజలి అడగడం, విశాల్ ఏదోటి చెప్పి తప్పించుకోవడం.. చివర్లో కథ అడుగుతోందని విశాల్ పారిపోవడం ప్రేక్షకులను కడుపుబ్బ నవ్విస్తోంది. ఈ సినిమా విశాల్ దర్శకత్వంలో వస్తున్న తొలి చిత్రం కావడంతో దీనిపై భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్లు, క్లైమాక్స్ షూటింగ్ అప్డేట్స్ చూస్తుంటే ఇదొక హైవోల్టేజ్ యాక్షన్ డ్రామా అని స్పష్టమవుతోంది. ముఖ్యంగా ఇటీవల పూర్తి చేసిన క్లైమాక్స్ షెడ్యూల్ కోసం సుమారు 800 మంది సిబ్బంది పాల్గొన్నట్లు సమాచారం. సూపర్ గుడ్ ఫిల్మ్స్ (99వ ప్రొడక్షన్) బ్యానర్‌పై ఆర్.బి. చౌదరి నిర్మిస్తున్న ఈ చిత్రంలో జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు దర్శకత్వ బాధ్యతలతోపాటు విశాల్ హీరోగా నటిస్తున్నారు. కథానాయికగా అంజలి నటిస్తుండగా.. ఈ మూవీని 2026 వేసవి కానుకగా విడుదల చేసేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తోంది.

## బిగ్‌బాస్ ఫేమ్ అషు రెడ్డిపై కేసు నమోదు

### పెళ్లి పేరుతో రూ. 9.35 కోట్ల మోసం చేశారని ఫిర్యాదు

ప్రముఖ రియాలిటీ షో బిగ్‌బాస్ ద్వారా గుర్తింపు పొందిన నటి అషు రెడ్డి చుట్టూ భారీ వివాదం ముసురుకుంది. పెళ్లి పేరుతో నమ్మించి సుమారు రూ. 9.35 కోట్లు మోసం చేసిందన్న ఆరోపణలపై హైదరాబాద్ సిటీ క్రైమ్ స్టేషన్‌లో ఆమెపై కేసు నమోదైంది. హైదరాబాద్‌లోని షేక్‌పేట్‌కు చెందిన యెనుముల సత్యనారాయణ ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. లండన్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న తన కుమారుడు వైవీ ధర్మేంద్రకు, అషు రెడ్డికి 2018లో పరిచయం ఏర్పడిందని ఆయన పేర్కొన్నారు. తమ మధ్య ఏర్పడిన స్నేహం ప్రేమగా మారిందని, పెళ్లి చేసుకుంటానని నమ్మించిన అషు రెడ్డి.. వివిధ అవసరాల పేరుతో 2018 నుంచి 2025 వరకు భారీగా డబ్బు తీసుకున్నట్లు ఫిర్యాదులో వివరించారు. సుమారు 5 కిలోల బంగారం, ఖరీదైన కార్లు, హైదరాబాద్‌లో పలు ఫ్లాట్లను ధర్మేంద్ర ఇచ్చిన డబ్బుతోనే అషు రెడ్డి కొనుగోలు చేసిందని, వాటన్నింటినీ తన పేరు మీద రిజిస్టర్ చేయించుకుందని బాధితుడి తండ్రి ఆరోపించారు. పెళ్లి విషయం అడిగితే ముఖం చాటేయడమే కాకుండా, తన సోదరి ద్వారా కూడా రూ. 50 లక్షలు వసూలు చేసిందని ఆయన తెలిపారు. సత్యనారాయణ ఫిర్యాదును స్వీకరించిన సీసీఎస్ పోలీసులు అషు రెడ్డితో పాటు ఆమె కుటుంబ సభ్యులపై కూడా కేసు నమోదు చేశారు. బ్యాంక్ స్టేట్‌మెంట్స్ మరియు ఆస్తుల రిజిస్ట్రేషన్ పత్రాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. ఇది కేవలం ఆర్థిక లావాదేవీల చిక్కా లేదా కావాలనే చేసిన మోసమా అనే కోణంలో విచారణ జరుగుతోంది. తనపై వస్తున్న ఆరోపణలను అషు రెడ్డి కొట్టిపారేశారు. సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.. నా అనుమతి లేకుండా నా గురించి తప్పుడు సమాచారం ప్రచారం చేసే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటాను అని హెచ్చరించారు. తన ప్రతిష్టను దెబ్బతీసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని ఆమె మండిపడ్డారు. పోలీసులు ప్రాథమిక విచారణలో భాగంగా బ్యాంక్ లావాదేవీలను నిశితంగా పరిశీలిస్తున్నారు. అషు రెడ్డిని త్వరలోనే విచారణకు పిలిచే అవకాశం ఉందని సమాచారం.





## సమంత కొత్త అవతారం

స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ మూవీ మా ఇంటి బంగారం బాక్సాఫీస్ వద్ద సందడి చేయడానికి సిద్ధమవుతోంది. ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ చిత్రం మే 15న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ కానుంది. ఈ వేసవిలో వస్తున్న మోస్ట్ అవైటెడ్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా విడుదల చేసిన తస్సాదియ్యా సాంగ్ ప్రస్తుతం సోషల్ మీడియాను ఊపేస్తోంది. సంతోష్ నారాయణన్ కంపోజ్ చేసిన ఈ వెడ్డింగ్ సెలబ్రేషన్ సాంగ్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోంది. ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్ రీల్స్‌లో 20 వేలకు పైగా వీడియోలతో ఈ పాట ట్రెండింగ్‌లో ఉండటం విశేషం. చిన్మయి శ్రీపాద, పుణ్య సెల్వ గానం, రెహమాన్ లిరిక్స్ ఈ పాటకు అదనపు ఆకర్షణగా నిలిచాయి. ఈ సినిమాతో సమంత కేవలం నటిగానే కాకుండా నిర్మాతగా కూడా తన అభిరుచిని చాటుకుంటున్నారు. ఒక సాధారణ గృహిణి తన గతాన్ని దాచుకుంటూనే తన కుటుంబాన్ని రక్షించుకోవడానికి చేసే పోరాటమే ఈ మా ఇంటి బంగారం కథాంశం.




వెర్సటైల్ యాక్టర్ సత్యదేవ్ కథానాయకుడిగా, విలక్షణ దర్శకుడు వెంకటేష్ మహా దర్శకత్వంలో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ సైకాలజికల్ థ్రిల్లర్ రావు బహదూర్ విడుదల తేదీ ఖరారైంది. సూపర్‌స్టార్ మహేష్ బాబు, నమ్రతా శిరోద్కర్ జిఎంబి ఎంటర్‌టైన్‌మెంట్ ఈ చిత్రాన్ని సగర్వంగా సమర్పిస్తుండగా.. ఏ+ఎస్ మూవీస్, శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా నిర్మించాయి. ఈ చిత్రం జూన్ 5న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. రిలీజ్ డేట్ పోస్టర్‌లో సత్యదేవ్ లుక్ చాలా పవర్‌ఫుల్‌గా ఉంది. సాంప్రదాయ దుస్తులు, గంభీరమైన మీసకట్టుతో ఆయన ఒక విభిన్నమైన అవతార్‌లో కనిపిస్తున్నారు. ఆయన పాగాలో కనిపిస్తున్న చిన్న పురుగు కథలోని లోతైన అర్థాలను, రహస్యాలను సూచిస్తోందని చిత్ర బృందం పేర్కొంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ గ్లింప్స్‌కు ప్రేక్షకుల్లో అద్భుతమైన రెస్పాన్స్ రాగా, ఈ మూవీపై భారీ అంచనాలు నెలకొన్నాయి. మెలోడీ సంగీత దర్శకుడు స్మరణ్ సాయి అందించిన మెలోడీ సాంగ్ ఓ సుందరి ఇప్పటికే చార్ట్‌బస్టర్‌గా నిలిచింది. సత్యదేవ్, దీప థామస్‌ల మధ్య కెమిస్ట్రీ, వింటేజ్ లవ్ ఫీల్ ప్రేక్షకులకు ఒక కొత్త అనుభూతిని అందించింది. కేరాఫ్ కంచరపాలెం వంటి క్లాసిక్ సినిమాను అందించిన వెంకటేష్ మహా, ఈ చిత్రానికి కథ, దర్శకత్వం, ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. యూనివర్సల్ ఎమోషన్స్‌తో పాటు సైకాలజికల్ డ్రామాగా ఈ సినిమాను ఆయన అద్భుతంగా తెరకెక్కించినట్లు తెలుస్తోంది. కార్తిక్ పరమార్ సినిమాటోగ్రఫీ, రోహన్ సింగ్ ప్రొడక్షన్ డిజైన్ ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. అకడమిక్ సీజన్ ప్రారంభానికి ముందే జూన్ 5న రాబోతున్న ఈ రావు బహదూర్ థియేటర్లలో ప్రేక్షకులకు సరికొత్త థ్రిల్‌ను పంచడం ఖాయంగా కనిపిస్తోంది.

27vzm15:27vzm15.qxd 27-04-2026 00:11 Page 1



విజయనగరం పార్వతీపురం మన్యం వార్త 25

## స్త్రీ సంక్షేమశాఖలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ప్రవేశాలు




గరివిడి, ఏప్రిల్ 26, ప్రభాతవార్త : శ్రీరామ్ నగర్ స్త్రీ శిశు సంక్షేమ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెవిటి,మూగ,అంద పాఠశాలలో ప్రవేశాలకు ప్రత్యేక అవసరాలు పిల్లల నుండి ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డబ్ల్యూ డబ్ల్యూ సి ఉపాధ్యక్షులు,ఫేకర్ జి.ఎం. జి వి ఎన్ రామకృష్ణ తెలిపారు. ఆరేళ్ళు నిండిన చెవిటి, మూగ,అంద చిన్నారులు స్త్రీ శిశు కేంద్రంలో ప్రవేశం పొంది ఉచిత విద్య, ఉచిత వసతి, భోజనం సౌకర్యం పొందాలని ఆయన తెలిపారు. వికలాంగ చిన్నారుల తల్లిదండ్రులు మరింత సమాచారం కోసం 9494777905 కి సంప్రదించాలని ఆయన కోరారు.

## అట్టహాసంగా వేసవి శిబిరం ప్రారంభం



గరివిడి, ఏప్రిల్ 26 , ప్రభాతవార్త : స్థానిక బ్రహ్మకుమారి కేంద్రంలో వేసవి ప్రత్యేక శిక్షణా శిబిరం అట్టహాసంగా ప్రారంభమైంది. 60 మంది చిన్నారులకు ఆట,పాట,జ్ఞానం, యోగా,వ్యాయామం తదితర అంశాలపై ప్రత్యేక శిక్షణ ను ఓం శాంతి ప్రతినిధులు బ్రహ్మ కుమారి లత, లక్ష్మీ బాయి వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షురాలు భోగాపురపు శ్రీదేవి ,విశ్రాంతి విద్యాశాఖాధికారి జమ్ము మహాలక్ష్మీ నాయుడు, వెంకటేష్, శ్రీను,వేణు,ప్రభృతులు అందిస్తున్నారు. గరివిడి బ్రహ్మ కుమారి కేంద్ర ఇంచార్జి లత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిబిరంలో విజ్ఞాన అంశాలు,వాతావరణ పరిరక్షణ, బంధాలు, అనుబంధాలు,నీరు,మొక్కలు తదితర అనేక అంశాలను చిన్నారులకు అందిస్తూ వారిలో ఆలోచన శక్తి ని పెంపొందించడం,నైతిక విలువలు, ఆధ్యాత్మిక చింతన కలిగించడం పై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రతీ రోజు సాయంత్రం5 గంటల నుండి7 గంటలకు వరకు తరగతులు నిర్వహిస్తున్నారు.

## ఘనంగా శ్రీలక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవం



శృంగవరపుకోట, ఏప్రిల్ 26, ప్రభాతవార్త : మండలంలోని బొడ్డవరలో శ్రీలక్ష్మీ గణపతి ఆలయ 20వ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆరు గంటల నుంచి స్వామి వారికి పంచామృత అభిషేకం, సహస్ర పూజా, హోమం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే మధ్యాహ్నం ఆలయం వద్ద అన్న భారీ ఎత్తున సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఇక స్వామి వారికి నిర్వహించిన పూజా కార్యక్రమాలన్ని ఆలయ అర్చకులు దొంతుకుర్తి సాయి కుమార్ శర్మ ఆధ్వర్యంలో జరిగాయి.అలాగే ఆలయం వద్ద వాసవీ మాత పూజా కార్యక్రమాలు కూడా ఘనంగా నిర్వహించారు.ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో గ్రామంతో పాటు చుట్టు పక్కల పలు గ్రామాల నుండి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ఒడిశా పోలీసులపై మంత్రి సంధ్యారాణి ఆగ్రహం



పార్వతీపురం మన్యం /సాలూరు ఏప్రిల్ 26, ప్రభాతవార్త : పార్వతిపురం మన్యం జిల్లా కోటియా గ్రామాల పోలీసులపై మంత్రి సంధ్యారాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. మా గిరిజన సోదరులను అన్యాయంగా ఒరిస్సా పోలీసులు అరెస్ట్ చేస్తే సాహించేది లేదని మంత్రి ఫైర్ అయ్యారు.ఆదివారం మంత్రి క్యాంప్ కార్యాలయంలో మీడియా ప్రెస్మీట్లో మాట్లాడుతు జనగణన లెక్కలకు సహకరించలేదని ఆరోపిస్తూ కోటియా గ్రూప్ ఆఫ్ విలేజ్‌లోని ఎగువసింబి గ్రామానికి చెందిన ఇద్దరు గిరిజనులను అన్యాయంగా ఒడిశా పోలీసులు అరెస్టు చేయడం చాలా దారుణమన్నారు.అలాగే ఈ ఘటనను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని క్లారిటీ ఇచ్చారు.అంతేకాకుండా గిరిజనులు భయభ్రాంతులకు గురికాకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని కోటియా సరిహద్దు గ్రామ గిరిజనులకు భరోసా కల్పించారు.అలాగే ఆంధ్రకు వచ్చి మీ దౌర్జన్యం ఏమిటని గిరిజనులకు ఇష్టం లేకుండా ఒరిస్సా ఓటర్లుగా ఎందుకు చేర్పించాలనుకుంటు న్నారని ఒరిస్సా గవర్నమెంట్ ను ప్రశ్నించారు.కోటియా గ్రామాల గిరిజనుల హక్కులను కాపాడటంలో మా ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని మంత్రి స్పష్టం చేసారు. గిరిజన నాయకులు పాల్గొన్నారు.

## మెట్లు వేశారు.. తారు మరిచారు

రామభద్రపురం, ఏప్రిల్ 26, ప్రభాతవార్త : జాతీయ రహదార నుండి నరసాపురం వెళ్లే రహదారి మెట్ల్ వేశారుతారు వెయ్యకపోవడంతో నిత్యము తిరిగే ప్రజలు నడవడానికి చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రహదారి నిర్మాణమునకు ఉపాధి హామీ పథకం నిధులు 50 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేశారు. అలాగే అక్కడక్కడ నీరు వెళ్లడానికి పైప్ లైన్ కలవర్టు లు పనులు కూడా సర్పంచ్ పూర్తి చేశారు. చిన్న చిన్న వాహనాలు రాకపోకలు చేయడంతో రాళ్లు తేలిపోయి దూళితో మనుషులు కనిపించకుండా ఏర్పడే పరిస్థితులు ఉన్నాయి. ఈ రహదారి నిర్మాణమునకు కాంట్రాక్టర్ బిల్లు అవుతుందా లేదా అని సందిగ్ధములో ఉన్నట్టు సమాచారం తెలిసింది. ప్రస్తుతరాష్ట్ర ప్రభుత్వం రహదారుల నిర్మాణానికి లక్షలాది రూపాయలు నిధులు కేటాయించినప్పటికీ, ఈ పనులు చేపట్టేందుకు కాంట్రాక్టులు ముందుగా రావడంలేదని గ్రామస్తులు అంటున్నారు. అలాగే కొండ కెంగువ నుండి జీలగవలస రహదారి పనులు రెండు మూడు రోజులు చేపట్టి ఆపు చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నరసాపురం రహదారి పనులు వేగవంతంగా చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## రైతు కంట కన్నీరు



గరుగుబిల్లి, ఏప్రిల్ 26, ప్రభాతవార్త: మండలంలోని తోటపల్లి పంచాయతీ పరిధిలోని నందివానివలస గ్రామంలో ఆదివారము నాడు ఏనుగులు గుంపు పంటలను నాశనం చేయడం జరిగినది. మజ్జి సింహాచలం ముకిరి(కొండ అరటి)అరటి తోటను ధ్వంసం చేయడం జరిగినది. సుమారు 50 వేల రూపాయల విలువ గల అరటి గెలలు నష్టం జరిగినది. అదేవిధంగా చౌడాడ శ్రీను సంబంధించిన భూముల్లో పాతుకున్న పైపులను బెండులను మొత్తం ఇరగదీయడం వలన పంట పొలాలకు నీరు వెళ్లకుండా వృధాగా పోవడం జరిగినది. అదేవిధంగా గోళ్ళు అన్నపూర్ణ మొక్క అరటి తోటలో ఏనుగులు పీకి వేయడం, కుమ్మి వేయడం వలన నష్టం జరిగినది. ఈ ప్రాంతానికి చెందిన సంవత్సరం పొడుగునా కష్టపడి పనిచేసే రైతులకు చేతికి పంట వచ్చే సమయంలో ఏనుగులు గుంపు ఇలా ధ్వంసం చేయడం వల్ల ఇటురైతులు మదుపులు పూర్తిగా పెట్టుబడులు పెట్టడం జరుగుతుందని చేతికి వచ్చే సమయానికి నష్టపోవడం జరుగుతుందని దీనివలన ఆర్థికంగా కృంగిపోవడం జరుగుతుందని రైతులు వాపోడం జరిగినది. ఇలా కొనసాగితే మాకు ఆత్మహత్యలు శరణమనీ రైతులు వాపోడం జరిగినది.ఇప్పటికైనా ప్రభుత్వాలు రైతులు యొక్క ఆర్థిక కష్టాలను గుర్తించి ఏనుగుల గుంపులను గుచ్చిమి ప్రాంతంలో తరలించి మా యొక్క పంటలను మా యొక్క భవిష్యత్తును కాపాడుకోవలసిన అవసరం ప్రభుత్వాలపై ఉందని సూచించడం జరిగినది. పొలాలకు ఉదయం పూట సాయంకాలం వెళ్లాలన్న ప్రజలు భయాందోళన వ్యక్తం చేయడం జరుగుతుంది. యటు నుంచి ఏనుగుల గుంపు దాడి చేస్తాయని భయంగా ఆందోళన వ్యక్తం చేయడం జరుగుతుంది.

## అక్రమంగా గ్రావెల్ తవ్వుతున్న వాహనాలకు జరిమానా



బొండపల్లి , ఏప్రిల్ 26( ప్రభాతవార్త ): మండలంలోని కనిమెరక పంచాయతీ పరిధిలో గల మంగళ చెరువులో అక్రమంగా గ్రావెల్ తరుగుతున్న వాహనాలకు జరిమాన విధించినట్లు ఎమ్మార్వో డోల రాజేశ్వరరావు తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా చెరువులో గ్రావెల్ తవ్వుతున్న జెసిబి, గుర్తించి పట్టుకోవడం జరిగిందన్నారు. ఈ మేరకు ఆయా వాహనాలకు 15 వేల రూపాయలు జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు. వాల్టా చట్టం ఉల్లంఘించి అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేపట్టినట్లయితే తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.

## రూ.5.95 కోట్లతో వంతెన పునర్నిర్మాణానికి శంకుస్థాపన



సాలూరు, ఏప్రిల్ 26 ప్రభాతవార్త : సాలూరు మండలం శివరాంపురం గ్రామ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న వంతెన ఇప్పటికి వారికల నిజం చేస్తూ మంత్రి సంధ్యారాణి చేతుల మీదుగా వంతెన పునర్నిర్మాణం శంకుస్థాపన చేశారు.ఆదివారం ఆ గ్రామానికి చేరుకున్న మంత్రి సంధ్యారాణికి ప్రజలు హారతులు పట్టి నీరాజనాలు పలికారు. ముందుగా దివంగత నేత ఎన్టీఆర్ విగ్రహానికి మంత్రి పూలదండ వేసి అంజలి గటించారు.అనంతరం 9.95 కోట్ల బియ్యంతో వంతెన పునర్నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేసారు.అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సంధ్యారాణి మాట్లాడుతు గత నాయకులు సాధించలేని శివరాంపురం బ్రిడ్జ్ నిర్మాణాన్ని మనం ప్రారంభించి మరో 6 నెలల్లో పూర్తి చేసి ప్రజలకు అందు బాటులోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు.అలాగే బ్రిడ్జ్ నిర్మాణంతో గ్రామప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడి,పక్క గ్రామాలతో అనుసంధానం సులభం అవుతుందన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తగ్గి,విద్యార్థులు,రైతులు,గ్రామ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారనుందని అన్నారు.అభివృద్ధి కార్యక్రమాలను గ్రామస్థాయిలో అమలు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేసారు.ఎంపీడీవో గొల్లపల్లి పార్వతి,డిఈ శర్మ,ఏఇ, మాజీ సర్పంచ్ భాస్కర రావు,ఆముదాల పరమేష్,నిమ్మాది చిట్టి,టీడీపీ మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉపాధి వేతనదారుల ఉసురు తీస్తున్న ఎన్ఎంఎంఎస్ యాప్



గరుగుబిల్లి, ఏప్రిల్ 26,ప్రభాతవార్త: గ్రామాల్లో ఉపాధి హామీ పనులు చేస్తున్న ఉపాధి హామీ కార్మికుల పరిస్థితి ప్రస్తుతం అగమ్యగోచరంగా మారింది. ప్రభుత్వం వారికి ఉపాధి హామీ పనులను కేటాయించడంతో, వారు ఎంతో ఉత్సాహంగా పనుల్లో పాల్గొంటున్నారు. అయితే, ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త సాంకేతికత "ఎన్ ఎం ఎం ఎస్" యాప్ ఇప్పుడు వారి పాలిట శాపంగా మారింది.సూర్యోదయానికే పనిలోకి కానీ ఫలితం సున్నా!ప్రభుత్వ నిబంధనల ప్రకారం, ఉపాధి హామీ కార్మికులు ప్రతిరోజూ ఉదయం 6గంటలకే చెరువుల వద్దకు చేరుకొని కఠినమైన శ్రమ చేస్తున్నారు. ఎండ తీవ్రత పెరగకముందే పని పూర్తి చేయాలనే లక్ష్యంతో వారు చెమట చిందిస్తున్నారు. అయితే, వారు చేసిన పనికి గుర్తింపు (మస్టర్లు) లభించాలంటే ఎన్ ఎం ఎం ఎస్ యాప్లో ఫోటోలు అప్లోడ్ కావడం తప్పనిసరి. కానీ,యాప్ కన్నీరు మున్నీరవుతున్న ఉపాధి హామీ కార్మికులుపని చేసినా దక్కని హాజరు... తక్షణమే ఇబ్బందికరంగా మారిన యాప్ను తొలగించాలనీ డిమాంమాన్యువల్ మస్టర్లు లేదా సులభతరమైన పద్ధతిలో హాజరు వేయాలి.సాంకేతిక కారణాలతో కార్మికుల వేతనాలకు కోత పడకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి ఉదయం 6 గంటలకే చెరువు వద్దకు వెళ్లినా తప్పని తిప్పలు.. పాత పద్ధతినే కొనసాగించాలని విన్నపసమస్యలు, సిగ్నల్ లోపం కారణంగా ఈ యాప్లో ఫోటోలు పడటంఫోటోలు పండు లేదని వేతనదారులు వాపోతున్నారు

## అనాథ ఆశ్రమంలో బొత్స జన్మదిన వేడుకలు



బొండపల్లి, ఏప్రిల్ 26 ( ప్రభాత వార్త): మాజీ ఎమ్మెల్యే ,నియోజకవర్గ సమన్వయకర్త బొత్స అప్పల నరసయ్య జన్మదిన వేడుకలను గజపతినగరం పట్టణానికి చెందిన యువకులు ఆదివారం వినూత్నంగా చేపట్టారు. అప్పల నరసయ్య పుట్టినరోజు నేపథ్యంలో మాజీ ఉపసర్పంచ్ కర్రీరాము నాయుడు, కర్రీ నానాజీ ఆధ్వర్యంలో గజపతినగరం పట్టణ యువకులు మండలంలోని బ్బపల్లి గ్రామంలో గల అనాథ ఆశ్రమంలో గల విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలు జరిపారు. అనాథ విద్యార్థుల కేరింతల నడుమ అప్పల నరసయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యార్థులకు కేకు, స్వీట్స్ పంచిపెట్టారు .అలాగే మధ్యాహ్నం అనాథ ఆశ్రమంలో గల వందమంది విద్యార్థులు, సిబ్బందికి భోజనాలు అందజేశారు. భోజనాలు అందరికీ దగ్గర ఉండి వడ్డించారు. జడ్పిటిసి గార తౌడు, మండల పార్టీ అధ్యక్షులు పల్లి సంజీవరావు, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ కో ఆర్డినేటర్ బూడి వెంకట్రావు, బెల్లాన త్రినాథ్ రావు ,మండల సురేష్, కె. పైడుపునాయుడు, లోగీస శ్రీను, రమణ, గేదెల వాసు, బూరెల కృష్ణ , పెద పెంకి గోపి, తదితరులు పాల్గొన్నారు.

## పొట్ట కోసం.. పుట్టెడు అవస్థలు



పాచిపెంట, ఏప్రిల్ 26: జానడు పొట్ట కోసం ఎండని లెక్కచేయకుండా మేదర్లు బుట్టల అల్లుకొని దుర్భర స్థితిలో జీవనం కొనసాగిస్తున్న పాచిపెంట మేదర్ల దుస్థితి. మండల కేంద్రమైన పాచిపెంటలో బతుకు తెరువు కోసం 5 దశాబ్దాల క్రితం ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఆచి పంటలో వెదురు కర్రతో బుట్టలు అల్లుకొని చాలీచాలని కూలి డబ్బులతో తమ కుటుంబాన్ని నెట్టుకు వస్తున్నామని ప్రభాతవార్త వద్ద వాపోయారు. గత 40 రోజులుగా ఉష్ణోగ్రతలు తీవ్రతరం అయినప్పటికీ తప్పని పరిస్థితిలో బుట్టలు మండుటెండలో బుట్టలో అల్లుతున్నట్లు వారు తెలిపారు. సొంతంగా స్థలము లేకపోవడం వలన పబ్లిక్ రహదారి ఆనుకొని ఉన్న ఇతరులు ఖాళీ స్థలంలో (తమ వృత్తి )మేదర బుట్టలు అల్లుకుంటు న్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ఎండలను లెక్కచేయకుండా ఉదయం ఎనిమిది గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ఎండకి ఎండుతూ ఒకవైపు చెమటలు కారుతూ బుట్టలో అల్లుతు న్న దృశ్యం వారి బాధలు వర్ణతీతం. దీని అంతటికి కారణం ఏ జీవనోపాధి లేక ఇంకొక వృత్తి చేయలేక ఆర్థికంగా వెనకబడి ఉండడం పూర్వీకుల నుంచి వచ్చిన ఈ మేదరి వృత్తి మానలేక వేరే పనులు చేతకాక బుట్టలు అల్లుకొని తమ తమ కుటుంబాల్ని పోషించుకుంటున్నామన్నట్లు మేదరులు సూర్యనారాయణ పైడ్రాజు శ్రీను వాపయ్యారు. అటవీ ప్రాంతం నుండి గిరిజన దగ్గర వెదురు కలలు కొనుగోలు చేసి వెదురు బుట్టలు ఆళ్లుతున్నట్లు తెలిపారు. మండుటెండలో అల్లిన బుట్టలకి గిరాకీ లేకపోవడం వలన ఇతర జిల్లాకు రవాణా నెలకు ఒకసారి లేదా రెండుసార్లు ఉమ్మడి జిల్లా విజయనగరా నికి తరలిస్తామని వారు తెలిపారు. ఇంట్లో ఆడ మగ కలిసి పని చేస్తే సుమారు 12 గంటలు కష్టపడితే ఒక వ్యక్తికి 200 లేదా 250 రూపాయలు కూలి డబ్బులు వస్తాయని వీరు తెలిపారు. ప్రభుత్వం మం డల కేంద్రంలో ఉన్న సుమారుగా 15 కుటుంబాలను (మేధర కుటుంబీకులను) ఆర్థికంగా ఆదుకోవాలని మేధర కులస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు ఆదుకోవాలని పలువురు కోరారు.

## చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపాలి



మక్కువ, ఏప్రిల్ 26, ప్రభాత వార్త: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి మక్కువ మండల కేంద్రంలో ప్రధాన రహదారి పనులు పరిశీలన చేస్తూ రోడ్డు పనులపై ఎవరైనా ప్రకటన చేసిన, ఏ కార్యక్రమం చేసిన వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేయడాన్ని ప్రజాసంఘాల ఐక్యవేదిక ఖండిస్తుందని విలేకరుల సమావేశంలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కొల్లి గంగు నాయుడు మాట్లాడుతూ మక్కువ ప్రధాన రహదారి వెడల్పు కార్యక్రమాన్ని ప్రజా సంఘాల స్వాగతిస్తున్నట్టు ఎప్పుడో ప్రకటించామని అదే సందర్భంలో ప్రధాన రహదారి కి ఆకొని గత 50,60 సంవత్సరముల నుండి చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న కుటుంబాలకు ప్రత్యామ్నాయం చూపించి జీవనోపాది కల్పించాలని డిమాండ్చేస్తున్నామన్నారు. చెముదు రోడ్డు సెంటర్ నుండి సువర్ణముఖి నది వరకు సుమారు 100 అడుగుల దాటి స్థలాన్ని కొనుగోలు చేసిందని ఈ స్థలం మొత్తం స్వాధీనం చేసుకొని రోడ్డు వెడల్పు ఇంకా బాగా చేయాలని, బాగా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తున్నామని చెప్పారు. మంత్రి చెప్పినట్టు కేవలం 70, 80 అడుగులు మాత్రమే రోడ్డు సరిపోద్దని ఎవరు అంగీకరించారని మిగిలిన 20 అడుగులు రోడ్డు స్థలం బడా వ్యాపారస్తులకు ఎందుకు ధారాదత్తం చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం అన్యాక్రాంతమైన ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకోవాలని స్పష్టంగా ఆదేశాలు జారీ చేసిందని మరి ఆదేశాలును మక్కువ మండల కేంద్రంలో ఎందుకు మంత్రి అమలు చేయడం లేదని అడిగారు. ఈ 20 అడుగుల స్థలం సుమారు 40 కోట్ల రూపాయలు విలువ చేస్తుందని అధికార పార్టీ నాయకులే 20 అడుగుల స్థలంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయొచ్చని మక్కువ ప్రధాన కూడలి వద్ద బోర్డు ఏర్పాటు చేశారని మరి ఆ బోర్డు ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్ .వై. నాయుడు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మర్రి శ్రీనివాసరావు, వృత్తిదారుల సంఘం నాయకులు కోరాడశ్వరరావు పాల్గొన్నారు.

## రెండోసారి ఏపీటీఫ్ జిల్లా ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసరావు ఎన్నిక




లక్క వరపు కోట, ఏప్రిల్ 26, ప్రభాత వార్త మండలంలోని కొట్యాడ జడ్పీ హై స్కూల్ లో ఇంగ్లీష్ ఉపాధ్యాయులు గా పని చేస్తున్న గుమ్మడి శ్రీనివాసరావు ఏ పి టీ ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు గా రెండో సారి ఎన్నిక అయినట్లు ఆదివారం విలేకరులకు తెలిపారు. విజయ నగరం జిల్లా కేంద్రం లో ఎ పి టీ ఎఫ్ యూనియన్ కార్యాలయంలో ఆదివారం జరిగిన కౌన్సిల్ సమావేశం లో తిరిగి ఏకగ్రీవంగా జిల్లా యూనిట్ ఉపాధ్యక్షులుగా ఎన్నుకున్నట్లు గుమ్మడి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా యూని యన్ బిల్డింగ్ నిర్మాణం కోసం సహచర ఉపాధ్యాయులు నుంచి సేకరించిన 20 వేల రూపాయల ఫండ్ ని రాష్ట్ర కమిటీకి అందజేసినట్లు అయన తెలిపారు మళ్ళీ తనకు ఉపాధ్యక్ష బాధ్యత ఇవ్వడం పట్ల అయన స్పందిస్తూ తనకు అప్పగించిన బాధ్యత ప్రకారం ఉపాధ్యాయుల సమస్య పై జిల్లా మరియు స్టేట్ కమిటీ సభ్యులతో కలిసి పని చేస్తాను అన్నారు. రెండో సారి సారి జిల్లా ఉపాధ్యక్ష పదవి రావడం పట్ల ఎల్ కోట మండల ఎ పి టీ ఎఫ్ టీం పెంటపల్లి వాసు, తదితరులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా అప్పలనర్సయ్య పుట్టినరోజు వేడుకలు



దత్తిరాజేరు, ఏప్రిల్ 26, ప్రభాతవార్త: మండలంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ శాసనసభ్యులు బొత్స అప్పల నరసయ్య జన్మదిన వేడుకలు దత్తరాజేరు మహదేవ్ ఫణీంద్ర ఇంటి వద్ద ఘనంగా నిర్వహించారు పార్టీ అధ్యక్షులు రాపాక కృష్ణార్జున సమక్షంలో వైసిపి నాయకులు పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్నారు ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు జడ్పిటిసి సభ్యురాలు రౌతు రాజేశ్వరి కేక్ కట్ చేసి అప్పల నరసయ్య కు వైసిపి నాయకులు అందరూ శుభాకాంక్షలు తెలుపుతూ ఒకరికొకరు కేక్ తినిపించుకున్నారు ఆయన మరెన్నో పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాలని ఉన్నత పదవులు పొందాలని మచ్చలేని నాయకుడిగా నియోజకవర్గంలో పేరు సంపాదించుకొని నిత్యం ప్రజల సేవలో నిమగ్నమై వ్యక్తిని అటువంటి నాయకుడు ఎల్లప్పుడూ ఉండాలని మనసారా కోరుకుంటూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి మంత్రి అప్పలనాయుడు మండల యువజన నాయకుడు దత్తి చిరంజీవి వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## డిగ్రీతో పాటు నైపుణ్యం అవసరం : సెంచూరియన్ ఉపాధ్యక్షుడు




నెల్లిమర్ల, ఏప్రిల్ 26, ప్రభాతవార్త : ఉపాధి కోసం ఎదురుచూస్తొన్న యువతకు, డ్రాప్ అవుట్ లకు వారికి నచ్చిన రంగాలలో నైపుణ్యంలో శిక్షణ కల్పించడం ద్వారా వారి కాళ్లమీద వారు బతకడానికి అవసరమైన చేయూతను సెంచూరియన్ అందించనుందని సెంచూరియన్ విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ డిఎన్ రావు అన్నారు. ఆదివారం సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో నిర్వహించిన నాల్గో కౌశల్ సాది కార్యక్రమానికి ఆయన వర్చువల్ సమావేశంలో ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత నిరాశ చెందకుండా ఏదో ఒక రంగంలో నైపుణ్య శిక్షణ పొందాలన్నారు. సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో పదో తరగతి నుంచి ఇంజనీరింగ్ వరకు, పదవ తరగతి ఫైల్ అయిన విద్యార్థులకు కూడా నైపుణ్య శిక్షణలు ఇవ్వడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. గ్రామీణ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే సెంచూరియన్ విశ్వవిద్యాలయం యొక్క ఉద్దేశ్యం అన్నారు. రానున్న కాలంలో కూడా పరిశ్రమలకు అనుగుణంగా అవసరమైన శిక్షణను అందించేందుకు తాము 160 రకాల నైపుణ్య శిక్షణలను గుర్తించామన్నారు. అనంతరం డీన్లు ప్రొఫెసర్ రవికుమార్, ప్రొఫెసర్ వర్మ, డాక్టర్ మోహన్ బాబు, డాక్టర్ వేద తదితరులు వివిధ కోర్సులు గురించి వివరించారు. వైస్ ఛాన్సర్ ప్రొఫెసర్ ప్రశాంత్ కుమార్ మహంతి చేతుల మీదుగా పలువురికి శాలువాలతో సత్కరించి కౌశల్ సాది ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా బొత్స జన్మదిన వేడుకలు

బొండపల్లి ఏప్రిల్ 26 ( ప్రభాతవార్త ): మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య జన్మదిన వేడుకలు మండలంలోని గొట్లాం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు చల్లం నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు చిన్నం నాయుడు కేక్ కట్ చేసి వేడుకలను నిర్వహించారు. కార్యకర్తలకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు ఆదినారాయణ, పైడుపునాయుడు లతో పాటు పలు గ్రామాల వైసీపీ సర్పంచులు, ఎంపీటీసీలు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంత్యుత్సవాలు

గరివిడి, ఏప్రిల్26( ప్రభాతవార్త ): స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం లో కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. నగర సంకీర్తన, సుప్రభాత సేవ,108 కలశాలతో అమ్మవారికి పంచామృత అభిషేకాలు,సహస్ర కుంకుమార్చన,1108 గాజులతో అమ్మవారికి ప్రత్యేక పూజలు భక్తులు భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. సారెతో ఊరేగింపు ,పవళింపు సేవ,పంచామృతాభిషేకాలు శాస్త్రోక్తంగా నిర్వహించి అమ్మవారి అనుగ్రహానికి ప్రాప్తు లయ్యారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ జిల్లా ఉపాధ్యక్షులు వి వి ఎస్ ఎస్ ఎన్ గుప్తా, స్థానిక ఆర్యవైశ్య సంఘ నాయకులు,మహిళలు పెక్కు సంఖ్యలో పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో 8 మందిరి గాయాలు



(భోగాపురం,ప్రభాత వార్త): భోగాపురం మండలంలోని నారుపేట సమీపంలో రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదం లో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. శ్రీకాకుళం నుంచి విశాఖ వైపు వెళ్తున్న ఆటో ను అదే మార్గంలో వెళ్తున్న కారు వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. క్షతగాత్రులను 108 అంబులెన్స్లో సుందర పేట సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## 6,7 వార్డులో తీరనున్న తాగునీటి కష్టాలు



నెల్లిమర్ల, ఏప్రిల్ 26, ప్రభాతవార్త : నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని 6,7 వార్డువాసులకు తాగునీటి కష్టాలు తీరనున్నాయి. స్థానిక మహిళల అభ్యర్థన మేరకు బిజెపి మండల కమిటీ అధ్యక్షులు మైపాడ ప్రసాద్ తన సొంత నిధులతో తాగునీటిని అందించడానికి శ్రీకారం చుట్టారు. ఈ మేరకు వార్డు లో ఉన్న పాత బోరును ఆదివారం క్లీన్ చేశారు. ఈ సందర్భంగా మైపాడ ప్రసాద్ మాట్లాడుతూ సొంత నిధులతో ఈ బోరుకి మోటారు ఏర్పాటు చేసి, ట్యాంక్ నిర్మాణం చేపట్టి త్వరలో స్థానికులకు తాగు నీరందించనున్నట్లు చెప్పారు. అలాగే తన సొంత నిధులతో ఏడో వార్డులో రెండు చోట్ల, 9వ వార్డులో ఒకచోట బోర్ వెల్స్, ట్యాంకులు నిర్మాణం చేపట్టి తాగునీరు అందిస్తున్నట్లు చెప్పారు. వేసవికాలం దృష్ట్యా స్థానికుల దాహార్తిని తీర్చడానికి తన వంతు సహకారమందిస్తున్నట్లు చెప్పారు. ఆదివారం 6,7 వార్డుల్లో తాగునీటి సమస్య గురించి స్థానికులు మూడు రోజుల కిందట తన దృష్టికి తీసుకువచ్చారని ప్రసాద్ వివరించారు. ఈ నేపథ్యంలో వార్డులో ఉన్న బోర్ క్లీనింగ్ చేయడం జరిగిందని, తన సొంత నిధులతో త్వరలో బోరు వేసి వాటర్ ట్యాంక్ కూడా నిర్మాణం జరుగుతుందని వివరించారు.

## రాష్ట్రస్థాయి కోలాటం పోటీలు

బొబ్బిలి ఏప్రిల్ 26 ప్రభాతవార్త : దాడితల్లి అమ్మవారు , సరేపోలమ్మ వారు పండుగ సందర్భంగా గౌరవ శాసనసభ్యులు ఆర్.వీ.ఎస్.కె.కె.రంగారావు (బేబీ నాయన)సౌజన్యంతో బొబ్బిలి మల్టీటాలెంటెడ్ గ్రూపు ఆధ్వర్యంలో ఈరోజు సాయంత్రం బొబ్బిలి రాజా కాలేజ్ గ్రౌండులో ..రాష్ట్ర స్థాయి కోలాటం పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బేబీనాయన హాజరై, దీపప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. డీఎస్పీ రాకోటి గోవిందరావు మున్సిపల్ కమిషనర్ ఎల్. రామలక్ష్మి ఎంపీడీవో రవి కుమార్ బొబ్బిలి పట్టణ టీడీపీ అధ్యక్షులు గెంబలి శ్రీనివాసరావు నంబియార్ వేణుగోపాలరావు చేశారు.

27-4pg10.qxd OK:27-4pg10.qxd 1/1/02 6:40 AM Page 1



## థామస్ ఉబెర్ బ్యాడ్మింటన్ కప్‌లో భారత్ ఘన విజయం

**న్యూఢిల్లీ:** థామస్ ఉబెర్ మహిళల బ్యాడ్మింటన్ కప్-2026లో ఉక్రెయిన్‌పై భారత్ మహిళలు ఘన విజయం సాధించారు. యువ భారత మహిళల జట్టు ఆదివారం డెన్మార్క్‌లోని హోర్సెన్స్‌లో జరిగిన గ్రూప్ ఎ రెండవ పోరులో యూరోపియన్ ఛాంపియన్‌షిప్స్ కాంస్య పతక విజేత ఉక్రెయిన్‌ను 4-1 తేడాతో ఓడించి, థామస్ ఉబెర్ కప్ లో తమ తొలి విజయాన్ని నమోదు చేసుకుంది. జట్టు సింగిల్స్‌లో మాజీ ప్రపంచ ఛాంపియన్ పీవీ సింధుకు విశ్రాంతినిచ్చి, మూడవ సింగిల్స్‌లో 2026 థాయ్‌లాండ్ మాస్టర్స్ ఛాంపియన్ దేవికా సిహాగ్ కు అవకాశం కల్పించింది. ఉన్నతి హుడా పోలినా బుహ్రోవాపై 21-19, 22-20 తేడాతో గెలిచి భారత్ తరపున శుభారంభం చేయగా, ఆ



తర్వాత జూనియర్ ప్రపంచ ఛాంపియన్ షిప్స్ రజత పతక విజేత తన్వి శర్మ యెవ్జెనియా కాంటెమిర్‌ను 21-12, 17-21, 21-10 తేడాతో ఓడించి ఆధిక్యాన్ని రెట్టింపు చేసింది. ఆ తర్వాత దేవిక, మరియా స్టోలియారెంకోను 23-21, 21-13 తేడాతో ఓడించి ఫలితాన్ని ఖరారు చేసింది. తొలి మహిళల డబుల్స్‌లో కవిప్రియ సెల్వం, సిమ్రాన్ సింఘీ జోడీ బుహ్రోవా, కాంటెమిర్ జోడీ చేతిలో 11-21, 17-21 తేడాతో ఓడిపోవడంతో భారత్‌కు ఏకైక ఎదురుదెబ్బ తగిలింది. ఆ తర్వాత స్టోలియారెంకో, సోఫియా లావ్రోవా జోడీపై సింధు, తనిషా క్రాస్టో జోడీ 21-18, 21-15 తేడాతో విజయం సాధించి స్కోరును పూర్తి చేసింది. భారత్ మహిళల జట్టు ఈ నెల 27న జరిగే తమ చివరి గ్రూప్ మ్యాచ్‌లో బలమైన చైనాతో తలపడనుంది. క్వార్టర్ ఫైనల్స్‌కు చేరాలంటే డిఫెండింగ్ ఛాంపియన్‌లను తప్పక ఓడించాల్సి ఉంటుంది.

## ప్రో బాక్సింగ్ సర్క్యూట్‌లో.. నిశాంత్ ఆరో విజయం



**న్యూఢిల్లీ:** భారత బాక్సింగ్‌లో ఎదుగుతున్న ప్రొఫెషనల్ యువ క్రీడాకారుడు నిశాంత్ దేవ్, లాస్ వెగాస్‌లో జరిగిన పోరులో జువాన్ కార్లోస్ గెర్రా జూనియర్‌పై రెండో రౌండ్‌లోనే నాకౌట్ విజయం సాధించి, మరో సంచలన ప్రదర్శన కనబరిచాడు. నిశాంత్ వరుసగా ఆరో విజయాన్ని నమోదు చేసి, ప్రొఫెషనల్ సర్క్యూట్-2026లో తన విజయ పరంపరను కొనసాగించాడు. జారెల్ మిల్లర్ వర్సెస్ లెనియర్ పెరో ప్రధాన పోరాటానికి అనుబంధంగా లాస్ వెగాస్‌లో ఆదివారం జరిగిన ఎనిమిది రౌండ్ల సూపర్ వెల్టర్‌వెయిట్ బౌట్‌లో, నిశాంత్ రెండవ రౌండ్‌లోనే జువాన్ కార్లోస్ గెర్రాను నాకౌట్ చేశాడు. నిశాంత్ 2024 ఒలింపియన్ తన అజేయ ప్రొఫెషనల్ రికార్డును 6-0కి పొడిగించుకున్నాడు, అందులో నాలుగు విజయాలు నాకౌట్ ద్వారా సాధించాడు. అనుభవజ్ఞుడైన ప్రత్యర్థిపై దేవ్ సంయమనాన్ని పరీక్షి స్తుందని భావించిన ఈ బౌట్, దానికి బదులుగా ప్రొఫెషనల్ రంగంలో అతని వేగవంతమైన పురోగతిని హైలైట్ చేసింది. 6-3-1 రికార్డుతో, నికో అలీ వాల్ష్‌పై సాధించిన ఒక ముఖ్యమైన విజయంతో సహా, ఉన్నత స్థాయి ఫైటర్లను ఓడించడంలో ఖ్యాతి గడించిన గెర్రా, దేవ్ యొక్క నియంత్రిత దూకుడు మరియు సాంకేతిక కచ్చితత్వాన్ని తట్టుకోలేకపోయాడు. ఆరంభ బెల్ మోగినప్పటి నుంచే నిశాంత్ దేవ్ తన ఉద్దేశాన్ని స్పష్టం చేశాడు. సౌత్‌పా స్టాన్స్‌లో ఆడుతూ, అతను దూరాన్ని నియంత్రించడానికి మరియు గెర్రా లయను దెబ్బతీయడానికి తన జాబ్‌ను సమర్థవంతంగా ఉపయోగించాడు. ఈ భారత బాక్సర్ ఓర్పుతో పాటు ఒత్తిడిని మిళితం చేస్తూ, రక్షణాత్మక క్రమశిక్షణను పాటిస్తూ క్రమంగా దూరాన్ని తగ్గించి విజయం వైపు దూసుకెళ్లాడు.




## కొత్త ఛాంపియన్స్

### వరల్డ్ 10కెలో సంజీవని, హార్మన్‌జోత్ హ్యాట్రిక్ విజయాలు

**న్యూఢిల్లీ:** వరల్డ్ అథ్లెటిక్స్ గోల్డ్ లేబుల్ రేస్ అయిన 18వ వరల్డ్ 10కేలో అంతర్జాతీయ ఎలైట్ అథ్లెట్ల మధ్య భారత్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఇద్దరు కొత్త ఛాంపియన్లుగా ఆవిర్భవించారు. ఆదివారం జరిగిన వరల్డ్ 10కేలో హార్మన్‌జోత్ సింగ్, సంజీవని జాదవ్ భారత ప్రదర్శనలకు నాయకత్వం వహించారు, అద్భుతమైన పరుగులతో వారి వారి విభాగాలలో అగ్రస్థానాలను కైవసం చేసుకున్నారు. మహిళల రేసులో సంజీవని జాదవ్ ఈ ఈవెంట్‌లో తన నిలకడను మరోసారి చాటుకుంటూ, వరుసగా మూడవ టైటిల్‌ను కైవసం చేసుకుంది. సంజీవని ఈ ఈవెంట్‌లో తన అద్భుతమైన పరుగును కొనసాగిస్తూ, 35:01 సమయంతో వరుసగా మూడవ టైటిల్‌ను మరియు మొత్తంగా తన ఐదవ టైటిల్‌ను కైవసం చేసుకుంది. రెండవ స్థానం కోసం జరిగిన ఉత్కంఠభరితమైన పోటీలో, సోనియా (35:31) గత సంవత్సరం సాధించిన ఆరవ స్థానాన్ని మెరుగుపరుచుకుంటూ, భాగీరథి (35:32)ని స్వల్ప తేడాతో అధిగమించింది. పురుషుల విభాగంలో హార్మన్‌జోత్ 29:13 సమయంతో అత్యంత వేగవంతమైన భారతీయుడిగా నిలిచాడు. ఈవెంట్ రికార్డుకు కేవలం ఒక సెకను దూరంలో నిలిచి, అదనంగా లభించే లక్ష రూపాయల బోనస్‌ను తృటిలో కోల్పోయాడు. ఇంతలో, కర్ణాటకకు చెందిన శైలేష్ కుష్వాహా (29:21) మరియు దీపక్ భట్ (29:52) ఆ తర్వాతి స్థానాల్లో నిలిచారు.

## టి20లో భారత్ హ్యాట్రిక్ విక్టరీ

### దక్షిణాఫ్రికాపై 14 రన్స్ తేడాతో విజయం

**న్యూఢిల్లీ:** నాలుగో మహిళల టీ20లో భారత్ 14 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాపై విజయం నమోదు చేసింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఆతిథ్య జట్టు 3-1తో తిరుగులేని ఆధిక్యంలో కొనసాగుతుండగా, భారతజట్టు వైట్‌వాష్‌ను తప్పించుకుంది. జోహన్నెస్‌బర్గ్‌లో ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి మొదట బౌలింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికా, ఎలిజ్‌మారి మార్క్స్ ద్వారా తొలి వికెట్లను కోల్పోయింది. ఆమె షఫాలీ వర్మను 9 పరుగులకే అవుట్ చేసింది. ఆ తర్వాత పవర్‌ప్లే చివరిలో తుమీ సెఖునే అనుష్క శర్మను (27) అవుట్ చేయడంతో, భారత్ 47/2 స్కోరుతో నిలిచింది. రోడ్రిగ్స్, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (22) కలిసి 55 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి, 11వ ఓవర్‌లో భారత్‌ను 100 పరుగుల మార్కు దాటించారు. చివరకు కైలా రేనెక్ బౌలింగ్‌లో రోడ్రిగ్స్ (43) ఔటై ఈ భాగస్వామ్యం విచ్ఛిన్నమైంది. ఆ తర్వాత మార్క్స్, భారతి ఫుల్మాలిని 2 పరుగులకే ఎల్బీడబ్ల్యూగా పెవిలియన్ చేర్చగా, కొద్దిసేపటికే రేనెక్ కౌర్‌ను కూడా ఔట్ చేసింది. దీంతో 14 ఓవర్లలో భారత్ స్కోరు 122/5కు పడిపోయింది. అయితే, దీప్తి మరియు రిచా ఘోష్ (34) ఆరో వికెట్ కు అజేయంగా 65 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి, భారత్ ను 185/5 స్కోరుకు చేర్చి, ఇన్నింగ్స్‌కు బలమైన ముగింపునిచ్చారు. 186 పరుగుల లక్ష్యాన్ని ఛేదిస్తున్న దక్షిణాఫ్రికా, లారా వోల్వార్డ్ (18) మరియు సునే లూస్ (40)ల ద్వారా కేవలం మూడు ఓవర్లలోనే వికెట్ నష్టపోకుండా 32 పరుగులు చేసింది. ప్రోటీస్ కెప్టెన్‌ను అవుట్ చేసి క్రాంతి గౌడ్ బ్రేక్‌త్రూ అందించడంతో, సందర్శక జట్టు ఊపిరి పీల్చుకుంది. తొమ్మిదో ఓవర్‌లో దీప్తి బౌలింగ్‌లో లూస్ అవుటవడానికి ముందు, లూస్, టాజ్మిన్ బ్రిట్స్ (30) రెండో వికెట్‌కు 44 పరుగులు జోడించారు. ఆ తర్వాత పరుగులు చేయడానికి దక్షిణాఫ్రికా ఇబ్బంది



పడటంతో, క్రమం తప్పకుండా వికెట్లు పడ్డాయి. దీప్తి బంతితో దూకుడుగా ఆడగా, శ్రీ చరణి, కాష్వీ గౌతమ్, షఫాలీ తలా వికెట్ తీసి ఆతిథ్య జట్టును 171/9 పరుగులకే పరిమితం చేశారు. మార్క్స్ అజేయంగా చేసిన 21 పరుగులు చివరిలో కొంత ప్రతిఘటన చూపినా అది సరిపోకపోవడంతో భారత్ విజయాన్ని కైవసం చేసుకుంది.



## ఐపిఎల్ నుండి ముంబయి, కోల్‌కత్తా ఔట్

### ప్లే ఆఫ్స్ చేరే జట్లు ఫైనల్

**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్‌లో సగం లీగ్ మ్యాచ్‌లు పూర్తయ్యాయి. ప్రతీ జట్టు ఏడేసి మ్యాచ్‌లు ఆడాయి. సెకండాఫ్ టోర్నీలో మ్యాచ్‌లు హోరీహోరీగా ఉండబోతున్నాయి. లీగ్ ఫార్మాట్ ప్రకారం పాయింట్స్ టేబుల్‌లో టాప్4లో నిలిచిన జట్లు ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధిస్తాయి. ప్రతీ జట్టు ఏడేసి మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న తర్వాత పంజాబ్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ టాప్4లో కొనసాగుతున్నాయి. ఇందులో రాజస్థాన్, సన్‌రైజర్స్ హైదరాబాద్ 8 మ్యాచ్‌లు ఆడి 5 విజయాలు సాధించాయి. పంజాబ్ కింగ్స్ మాత్రం ఓటమెరుగని జట్టుగా టాప్‌లో కొనసాగుతోంది. 265 పరుగుల రికార్డు లక్ష్యాన్ని కూడా ఛేదించి ఆ జట్టు తమకు తిరుగులేదని చాటుకుంది. టాప్4లో చోటు దక్కాలంటే ప్రతీ జట్టు కనీసం 8 మ్యాచ్‌ల్లో గెలవాలి. 6 మ్యాచ్‌లు గెలిచి టాప్‌లో కొనసాగుతున్న పంజాబ్ చివరి 7 మ్యాచ్‌ల్లో రెండు గెలిస్తే ప్లే ఆఫ్స్ బెర్త్ ఖరారు కానుంది. డిఫెండింగ్ ఛాంపియన్ ఆర్‌సీబీ, సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ మరో మూడు మ్యాచ్‌లు గెలవాల్సి ఉంది. చెన్నై సూపర్ కింగ్స్ తమ చివరి 7 మ్యాచ్‌ల్లో 5 గెలవాలి. ఢిల్లీ క్యాపిటల్స్, గుజరాత్ టైటాన్స్ కూడా సీఎస్‌కే తరహాలో మరో 5 మ్యాచ్‌లు గెలవాలి. భారీ అంచనాలతో బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్ పేలవ ప్రదర్శనతో అట్టడుగు స్థానంలో నిలిచింది. ముంబై ఇండియన్స్‌తో పాటు లక్నో సూపర్ జెయింట్స్ ప్లే ఆఫ్స్ చేరాలంటే చివరి 7 మ్యాచ్‌ల్లో 6 విజయాలు సాధించాలి. కోల్‌కతా నైట్‌రైడర్స్ అయితే ఏడు మ్యాచ్‌లకు ఏడు గెలవాలి. అద్భుతం జరిగితే తప్పా ఈ జట్లు ప్లే ఆఫ్స్ చేరే అవకాశాలు లేవు. టోర్నీ ఆరంభానికి ముందు ప్రతీ ఎక్స్‌పర్ట్, ఏఐ టూల్స్ ముంబై ఇండియన్స్ విజేతగా నిలుస్తాయని అంచనా వేసాయి. కానీ ఆ జట్టు చెత్త ఆటతో తీవ్రంగా నిరాశపర్చింది. 7 మ్యాచ్‌ల్లో కేవలం 2 మ్యాచ్‌ల్లోనే విజయం సాధించింది. ప్రస్తుత పరిస్థితి, టీమ్స్ ఫామ్ పరంగా పంజాబ్ కింగ్స్, ఆర్‌సీబీ, సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్‌కు ప్లే ఆఫ్స్ చేరే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. మిగతా జట్లు అద్వితీయమైన ప్రదర్శన చేస్తే తప్పా నాకౌట్ చేరే దాఖలాలు కనిపించడం లేదు.

## పసిడి, వెండిపై అమ్మకాల ఒత్తిళ్లు!

**ముంబయి, ఏప్రిల్ 26:** బంగారం,వెండి ధరలు ఈ వారంలో కొంత అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొనే అవకాశం ఉంది. ట్రేడర్లు అమెరికా-ఇరాన్ శాంతి చర్చలు, క్రూడ్ ఆయిల్ ధరలు, మరియు ఫెడరల్ రిజర్వ్ మీట్ అంశాలపైనే ఫోకస్‌పెంచారు. రాబోయే వారంలో ప్రధానంగా అమెరికా-ఇరాన్ శాంతి చర్చల పురోగతి, మరియు వాటి ప్రభావం ఆయిల్, బంగారం మరియు ఇతర ఆర్థిక మార్కెట్లపై ఎలా ఉంటుందనే దానిపై దృష్టి ఉంటుందని జేఎం ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్‌లో కమోడిటీ కరెన్సీ రీసెర్చ్ విభాగం ఉపాధ్యక్షుడు ప్రణవ్ మోరే తెలిపారు. మ్యాక్రో ఆర్థిక అంశాల పరంగా, ట్రేడర్లు అమెరికా ఫెడరల్ రిజర్వ్, జపాన్ బ్యాంక్, ఇంగ్లాండ్ బ్యాంక్, మరియు యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్‌ల మానిటరీ పాలసీ నిర్ణయాలను గమనిస్తారు. అమెరికా హౌసింగ్ డేటా, వ్యక్తిగత వ్యయ వినియోగం, ద్రవ్యోల్బణం, వినియోగదారుల నమ్మకం, ప్రధాన ఆర్థిక వ్యవస్థల ఫ్యాక్టరీ కార్యకలాపాల గణాంకాలు మార్కెట్ ధోరణులను ప్రభావితం చేస్తాయి. ఈనెల 29న జరగనున్న ఫెడరల్ ఓపెన్ మార్కెట్




కమిటీ (ఎఫ్ఓఎంసి) సమావేశం జెరోమ్ పావెల్ అధ్యక్షతన చివరిదవుతుంది. ఆ సమావేశంవివరాలు బంగారం, వెండి ధరలకు ముఖ్యమైనవి అవుతాయి. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో, బంగారం ఫ్యూచర్స్ రూ.1,910 (1.23 ) తగ్గి వారాంతంలో 10 గ్రాములకు రూ.1.54 లక్షలకు ముగిసింది. వెండి రూ.12,506 (4.9 ) తగ్గి కిలోకు రూ.2.44 లక్షలకు చేరింది. దేశీయ మార్కెట్లో బంగారం ధరలు తగ్గినా, రూపాయి విలువ గత వారం సుమారు 1.4 పడిపోవడం వల్ల ఈ తగ్గుదల పరిమితమైంది. అంతర్జాతీయ మార్కెట్లో, బంగారం 138.7 (2.8 ) తగ్గి ఔన్స్‌కు 4,740.9కి ముగిసింది. వెండి 5.4 (6.6 ) తగ్గి 76.41కి చేరింది. గత నాలుగు వారాల్లో 10-12 పెరిగిన తర్వాత లాభాల స్వీకరణతో, ఔన్స్‌కు ఐదువేల డాలర్లకు దాటలేకపోవడంతో బంగారం ధరలు కొంత తగ్గాయని మోరే తెలిపారు. అమెరికా-ఇరాన్ మధ్య హోర్ముజ్ జలసంధి సమస్య కారణంగా క్రూడ్ ఆయిల్ ధరలు బ్యారెల్‌కు 100 దాటాయి. అమెరికా డాలర్ డిమాండ్, ట్రెజరీ బాండ్ యీల్డ్స్ బలంగా కొనసాగుతున్నాయి. అంచనాలకంటే మెరుగైన రిటైల్ సేల్స్, ఉద్యోగ గణాంకాలు, వినియోగదారుల భావోద్వేగం డేటా డాలర్‌ను బలపరచి, బంగారం మరియు వెండి ధరలపై ఒత్తిడిని కలిగించాయి. ప్రపంచ కేంద్ర బ్యాంకుల కొనుగోలు-అమ్మకాల కార్యకలాపాలు మిశ్రమంగా కొనసాగుతున్నాయి. అధిక ద్రవ్యోల్బణం నేపథ్యంలో భవిష్యత్తులో వడ్డీ రేట్ల పెంపు లేదా తగ్గింపు పై అనిశ్చితి ఉండటం వల్ల బంగారం ధరలు అస్థిరంగా ఉండే అవకాశం ఉంది. బంగారం ధరలు దిగువ స్థాయిల వద్ద మద్దతు పొందే అవకాశం ఉన్నప్పటికీ, డాలర్ బలంగా కొనసాగితే మరియు భౌగోళిక ఉద్రిక్తతలు తగ్గితే మరింత తగ్గుదల ఉండవచ్చు. వెండి మాత్రం ప్రెషస్ మెటల్ మరియు ఇండస్ట్రియల్ మెటల్‌అనే ద్వంద్వ పాత్ర కారణంగా ఎక్కువ మార్పులకు లోనవుతుంది. పశ్చిమ ఆసియాలో ఉద్రిక్తతలు పెరిగితే లేదా ప్రధాన కేంద్ర బ్యాంకులు సడలింపు సంకేతాలు ఇస్తే, బంగారం కొనుగోలు మళ్లీ పెరగవచ్చు అని మార్కెట్‌నిపుణుల అంచనా.

## 8 నగరాల్లో 23% క్షీణించిన ఇళ్ల అమ్మకాలు!

**ముంబయి, ఏప్రిల్ 26:** దేశవ్యాప్తంగా రూ.50 లక్షలలోపు ఉన్న అందుబాటులో పక్కాగృహాలు 23శాతం క్షీణించాయి. జనవరి మార్చి మధ్యకాలంలో టాప్ ఎనిమిది నగరాల్లో కేవలం 16,273యూనిట్లు మాత్రమే అమ్ముడయినట్లు నైట్‌ఫ్రాంక్ సంస్థ ప్రకటించింది. ఈధరల కేటగిరీలో సరఫరా తక్కువగా ఉండటమే ఇందుకుకారణం. కొవిడ్ మహమ్మారి తర్వాత లగ్జరీ నివాసాలకు డిమాండ్‌పెరిగింది. బిల్డర్లు కూడా తక్కువరేట్ల పక్కాగృహాల నిర్మాణాన్ని అత్యంత తక్కువగానే చేపడుతున్నారు. ఎందుకంటే ముడివనరుల ధరలు కొంతమేర వ్యయభరితం కావడమేనని నైట్‌ఫ్రాంక్ విశ్లేషించింది. అందువల్లనే ఈ తక్కువధరల పక్కాగృహాలు ఈత్రైమాసికంలో 23శాతం తగ్గినట్లు తేలింది. ప్రత్యేకించి ముంబయి, ఢిల్లీ, ఎన్‌సిఆర్, పూణె, బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, అహ్మదాబాద్, కోల్‌కత్తా నగరాల్లోనే ఈపరిస్థితి నెలకొన్నట్లు కనిపిస్తోంది. ఇళ్లల్లో ఒకటినుంచి రెండుకోట్ల సెగ్మెంట్‌లో 10శాతంపెరిగి 24,657యూనిట్లకు



పెరిగాయి. రెండునుంచి ఐదుకోట్ల సెగ్మెంట్‌లో 17శాతంపెరిగి 16,075 యూనిట్లకు చేరాయి. ఇక ఐదునుంచి 10 కోట్ల ధరల్లో మూడుశాతం క్షీణించి 3338 యూనిట్లు మాత్రమే విక్రయాలుజరిగితే 10నుంచి 20 కోట్ల కేటగిరీలో 12శాతంపెరిగి 738 యూనిట్లు విక్రయించారు. అలాగే రూ.20-50 కోట్ల కేటగిరీలో 80శాతంపెరిగి 165యూనిట్లుకు చేరాయి. 50 కోట్లకుపైబడిన ఇళ్లు 93శాతం క్షీణించి కేవలం 12 యూనిట్లు మాత్రమే అమ్ముడయినట్లు తేలింది. అన్ని కేటగిరీల్లోను కలిపి ఇళ్ల అమ్మకాలు నాలుగుశాతం సగటున క్షీణించాయి. 84,827 కూనిట్లుగా ఉన్నాయి. దరలు పెరగడం, భౌగోళిక ఉద్రిక్తతలు వంటివికూడా ప్రభావంచూపించినట్లునైట్‌ఫ్రాంక్ విశ్లేషించింది.

## నిమిషానికి రూ.1.36కోట్లు మస్క్ సంపాదన!

**న్యూయార్కు, ఏప్రిల్ 26:** ప్రపంచ కుబేరుడు ఎలాన్‌మస్క్ నికర ఆదాయం వింటే షాక్ అవ్వాల్సిందే. గత ఏడాది నవంబరు నాటికి మస్క్ నికర ఆస్తి విలువ సుమారుగా రూ.39.6 లక్షల కోట్లుగా ఆయన సంపద మొత్తం టర్నోవర్. కేవలం 2025లోనే మస్క్ సంపద సుమారుగా రూ.6.4



లక్షల కోట్లు పెరిగింది. ఎలాన్ మస్క్ టెస్లా షేర్లు, స్పేస్‌ఎక్స్ విలువ ఆధారిత పెట్టుబడులు, క్రిప్టో, ఇతర వ్యాపారాల ద్వారా డబ్బు సంపాదిస్తాడు. మస్క్ కేవలం టెస్లాకే పరిమితం కాదు. న్యూరాలింక్, ది బోరింగ్ కంపెనీ, ఏఐ, ఇతర టెక్ ప్రాజెక్టులు అన్నీ అతని నికర విలువకు దోహదం చేస్తాయి. టెస్లామస్క్‌గా విస్తృత ప్రాధాన్యం పొందిన ఎలాన్ మస్క్ నిమిషానికి సుమారు రూ.1.36 కోట్లు సంపాదిస్తాడు. మస్క్ గంటకు సుమారుగా రూ.816 మిలియన్లు సంపాదిస్తాడు. అంటే కేవలం ఒక గంటలోనే మిలియనీర్ అవ్వడమే కాకుండా, బిలియనీర్ అయ్యే దిశగా పయనిస్తున్నాడు. ఎలాన్ మస్క్ రోజుకు సుమారు రూ.1,960 కోట్లు సంపాదిస్తాడు. ఆ మొత్తంతో ఒక చిన్న పట్టణంలోని స్థిరాస్తి మొత్తాన్ని కొనుగోలు చేయవచ్చు. మస్క్ నెలసరి ఆదాయం సుమారుగా రూ.58,800 కోట్లు. వార్షిక ఆదాయం సుమారుగా రూ.7.15 లక్షల కోట్లుగా అంచనా వేశారు. ఇది స్థిరమైన ఆదాయం కాదు ఇది మస్క్ షేర్ల విలువను బట్టి మారుతూ ఉంటుంది.

**వాణిజ్యం**




## ముడిచమురు ధరలపై ‘హార్ముజ్’ మంటలు!

### యూనియన్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా విశ్లేషణ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 26:** హార్ముజ్ జలసంధి పూర్తిగా నిలిపివేతకారణంగా మళ్లీ చమురు మార్కెట్‌లో మంటలు మండుతున్నాయి. పశ్చిమాసియాలో మళ్లీ ఏక్షణంలో అయినా ట్రంప్ దాడులకు ఆదేశాలివ్వవచ్చన్న సంకేతాలు వెలువడుతుండటం, హార్ముజ్‌జలసంధిలో మళ్లీ ఉద్రిక్తతలు చెలరేగడం వంటివి ముడిచమురు బ్యారెల్ ధరలు 100 డాలర్లకుపైబడి పెంచుతాయని యూనియన్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా అంచనావేసింది. హార్ముజ్‌నుంచి రూపాయి అన్న శీర్షికతో వెలువరించిన ఈ రీసెర్చి నివేదికలో బ్యాంకు ముడిచమురుధరలు పెరుగక తప్పదని హెచ్చరించింది. దీనివల్ల ద్రవ్యోల్బణం పెరిగి రూపాయి మరింత క్షీణిస్తుందని, భారత కరెంటుఖాతాలోటు మరింతపెరుగుతుందని అంచనావేసింది. ప్రస్తుత ముడిచమురుధరలు పెరుగుదల ద్రవ్యోల్బణ సమస్యతోపాటు కేంద్ర బ్యాంకు రెపోరేట్ సడలింపులు, కరెంటుఖాతాపై ఒత్తిడితోపాటు ఆర్థిక పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారుతుందని, ఇంధనం దిగుమతిచేసుకునే దేశాలకు మరింతగా ధరల భారం పెరుగుతుందని అంచనావేసింది. భారత్‌వరకూ చూస్తే 85శాతం ముడిచమురు డిమాండ్ దిగుమతులుద్వారానే తీర్చుకోగలుగుతున్నది. హార్ముజ్‌ప్రభావం ఇప్పటికే మనకు స్పష్టంగా తెలిసింది. ఇరాన్ ఇజ్రాయెల్ వివాదాలు మరింతగాపెరిగితే చమురు ట్యాంకర్ల రాకకు గండికొడుతుందని అంచనావేసింది. హార్ముజ్ మార్గం పూర్తిస్థాయిలో తెరుచుకుంటేనే నౌకల రాకను సులభతరంచేయడంతోపాటు ధరలను కొంతమేర కట్టడిచేసే వీలుంటుంది. చమురుధరలు పెరుగుదలకారణం వల్ల ఆర్థికవ్యవస్థపై చమురుపన్ను (ఆయిల్‌ట్యాక్స్) పడుతుందని అంచనావేసింది. దీనితోపాటు డాలర్ చెల్లింపుల కారణంగా డాలరుతో రూపాయి మారకం విలువలు కూడా 95వరకూ వెళతాయని దిగుమతులపరంగా ద్రవ్యోల్బణం, కరెంటుఖాతా లోటును మరింతగా పెంచే అవకాశం ఉంటుందని అంచనావేసింది. అనిశ్చితి పెరుగుతుండటంతో ఆర్థిక మార్కెట్లను క్రమబద్ధీకరించేందుకు రిజర్వుబ్యాంకు చర్యలు తీసుకోవడం కొంత ఆర్థికవ్యవస్థకు మేలుచేసినట్లు యూనియన్‌బ్యాంకు ప్రకటించింది.

## రికార్డుస్థాయిలో 90 బిలియన్ డాలర్ల ఎఫ్‌డిఐలు

### ప్రధాన ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్

**న్యూఢిల్లీ ఏప్రిల్ 26:** విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఈఏడాది మొత్తంగా 90 బిలియన్ డాలర్లవరకూ ఉంటాయని ప్రధాన ఆర్థిక సలహాదారు వి అనంతనాగేశ్వరన్ అంచనావేసారు. ఏప్రిల్‌నుంచి ఫిబ్రవరి కాలానికి 88 బిలియన్ డాలర్లు అధిగమించాయని, మరికొద్దిరోజుల్లోనే ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున మొత్తంగా 90 బిలియన్ డాలర్లకు చేరుకోవచ్చని అంచనావేసారు. అంతకుముందు ఏడాది ఉన్న 70నుంచి 80 బిలియన్ డాలర్లను బ్రేక్‌చేయగలమని కూడా ఆయన చెప్పారు. 2025 కంటే ఈ



ఏడాది 10శాతం అదనంగా ఎఫ్‌డిఐలు వస్తాయన్నారు. ఎఫ్‌డిఐలు మరిన్ని సాధించేందుకు భారత్‌కు ఉన్న సాధ్యాసాధ్యాలపై ప్రశ్నించేవారికి ఇదే సమాధానం అవుతుందని ఆయన పేర్కొన్నారు. మొట్టమొదటిసారిగా ఎఫ్‌డిఐలు పూర్తి ఆర్థికసంవత్సరానికి వచ్చే పెట్టుబడులు స్థూల దేశీయోత్పత్తిలో రెండుశాతం వరకూ ఉన్నాయని, ఇది శుభసూచకమని అన్నారు. ఇప్పటికే ఆర్బీఐ కూడా ఎఫ్‌డిఐలు మెరుగుపడినట్లుప్రకటించింది. గత ఏడాది కంటే ఈ ఏడాది ఇప్పటివరకూ ఎఫ్‌డిఐలు మరింతగా ఎక్కువ వచ్చాయని ఆర్బీఐ కూడా ధృవీకరించింది. ఈ ఏడాది ఏప్రిల్ ఫిబ్రవరి మధ్యకాలంలోనే 18.1శాతంపెరిగి 88.3 బిలియన్ డాలర్లు అందాయి. నికరంగా ఎఫ్‌డిఐలు 6.3బిలియన్ డాలర్లుపెరిగాయని అంచనావేసారు.

## టాప్ 7 కంపెనీల్లో రూ.2 లక్షలకోట్ల ఎంక్యాప్ లాస్!

**ముంబయి, ఏప్రిల్ 26:** దేశంలోని టాప్ పది మార్కెట్ విలువలున్న కంపెనీల్లో ఏడు కంపెనీల మార్కెట్ విలువల్లో రెండు లక్షలకోట్లు పతనం అయ్యాయి. టిసిఎస్, రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎక్కువ నష్టపోయాయి. ఈక్విటీ మార్కెట్లలో నెలకొన్న ప్రతికూలతలు, పశ్చిమాసియా యుద్ధప్రభావాలు కూడా ఇందుకు తోడయినట్లు తెలుస్తోంది. ఏడు కంపెనీలలో మొత్తం రూ.2,05,343.06 కోట్లు ఆవిరి అయ్యాయి. టిసిఎస్ విలువలు 66,699.44 కోట్లు



క్షీణించి రూ.8,67,364.12కోట్లకు చేరితే రిలయన్స్ 50,67న0.12కోట్లు క్షీణించి రూ.17,96,647.50 కోట్లకు చేరింది. ఇక హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 23,090.05 కోట్లు క్షీణించి రూ.12,08,22.48 కోట్లకు చేరితే ప్రభుత్వ రంగంలోన ఎల్‌ఐసి 19,670.75 కోట్లు క్షీణించి రూ.5,13,020.56కోట్లకు చేరింది. భారతి ఎయిర్‌టెల్ ఎంక్యాప్ 19,406.59 కోట్లు క్షీణించి రూ.11,05,718.62 కోట్లకు చేరింది. ఐసిఐసిఐబ్యాంకు ఎంక్యాప్ రూ.14,663.27 కోట్లు క్షీణించి రూ.9,50,345.40 కోట్లకు చేరితే ఎల్‌అండ్ కూడా రూ.11,142.64 కోట్లు తగ్గి రూ.5,52,171.88 కోట్లుగా ఉంది. అయితే స్టేట్‌బ్యాంకు ఎంక్యాప్ మాత్రం రూ.19,522.76 కోట్లు పెరిగి రూ.10,16,752.53 కోట్లకు చేరింది. బజాజ్‌ఫైనాన్స్ రూ.8253.64 కోట్లు పెరిగి రూ.5,73,690.81 కోట్లకు చేరింది. ర్యాంకింగ్‌లో వరుసగా రిలయన్స్ టాప్‌లో ఉంటే హెచ్‌డిఎఫ్‌సి, భారతి ఎయిర్‌టెల్, ఎస్‌బిఐ, ఐసిఐసిఐబ్యాంకు, టిసిఎస్ బజాజ్‌ఫైనాన్స్,ఎల్‌అండ్‌టి, హిందూస్థాన్ యూనిలీవర్, ఎల్‌ఐసిలు తర్వాత స్థానాల్లో నిలిచాయి. గతవారంలో బిఎస్‌ఇ సెన్సెక్స్ 1829.33.ఆయింట్లు క్షీణిస్తే ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీకూడా 455.6 పాయింట్లు క్షీణించింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942–271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.